అనుదినం... జనస్వరం

www.navatelangana.com

నవతెలంగాణ

సోమవారం 25-3-2024

సమగ్ర తెలుగు దినపత్రిక

సంపుటి : 10 సంచిక : 84 | Published from Hyderabad, Rangareddy, Khammam, Karimnagar | 14 పేజీలు వెల : 6.50



జేఎన్‌యూలో ఎస్ఎఫ్ఐ కూటమి
ఘన విజయం
సెంట్రల్ ప్యానెల్ క్లీన్‌స్వీప్

- 42 కౌన్సిలర్లలో 30 స్థానాలు కైవసం
- మట్టికరిచిన ఏబీవీపీ


నవతెలంగాణ-న్యూఢిల్లీ బ్యూరో

దేశంలోనే ప్రతిష్టాత్మక జవహర్‌లాల్ నెహ్రూ యూనివర్సిటీ (జేఎన్‌యూ)లో నిర్వహించిన విద్యార్థి సంఘ ఎన్నికల్లో ఎస్ఎఫ్ఐ కూటమి ఘన విజయం సాధించింది. అధ్యక్షుడు, ఉపాధ్యక్షుడు, ప్రధాన కార్యదర్శి, సహాయ కార్యదర్శి పోస్టులతో సెంట్రల్ ప్యానెల్‌ను ఎస్ఎఫ్ఐ క్లీన్‌స్వీప్ చేసింది. బీజేపీ అనుబంధ ఏబీవీపీ మట్టికరించింది. ఎన్ని కుయుక్తులకు పాల్పడినప్పటికీ ఏబీవీపీ ఓటమి చెందింది. ఏబీవీపీని, దాని మతోన్మాద సిద్ధాంతాన్ని జెఎన్‌యు విద్యార్థులు తిరస్కరించారు. అధికారులతో కుమ్మక్కైన ఏబీవీపీ విధ్వంసక ప్రయత్నాలను ఎస్ఎఫ్ఐ కూటమి సమర్థవంతంగా ఎదుర్కొంది.

అధ్యక్ష పదవికి ఏబీవీపీ తరపున పోటీ చేసిన ఉమేష్ చంద్ర అజ్మీరా (2,118 ఓట్లు)పై ఎస్ఎఫ్ఐ కూటమి అభ్యర్థి ధనుంజయ్ (3,100 ఓట్లు) విజయం సాధించారు. బాప్సా తరపున పోటీ చేసిన బిస్వజిత్ మింజికి కేవలం 282 ఓట్లు మాత్రమే వచ్చాయి. ఉపాధ్య పదవికి ఏబీవీపీ తరపున పోటీ చేసిన దీపికా శర్మ (1,848 ఓట్లు)పై ఎస్ఎఫ్ఐ కూటమి అభ్యర్థి అవిజిత్ ఘోష్ (2,762 ఓట్లు) భారీ మెజార్టీతో విజయం సాధించారు. బాప్సా తరపున పోటీ చేసిన మొహమ్మద్ అనాస్‌కు కేవలం 463 ఓట్లు మాత్రమే వచ్చాయి. ప్రధాన కార్యదర్శి పదవికి ఎఐఎస్ఎఫ్ అభ్యర్థి నామినేషన్‌ను తిరస్కరించడంతో ఇండిపెండెంట్‌గా పోటీ చేసిన ప్రియాంషి ఆర్యను ఎస్ఎఫ్ఐ కూటమి బలపర్చింది. ఏబీవీపీ అభ్యర్థి అర్జున్ ఆనంద్ (2,412 ఓట్లు)పై ఆమె (3,440 ఓట్లు) అత్యధిక మెజార్టీతో గెలుపొందారు. సహాయ కార్యదర్శి పదవికి ఏబీవీపీ తరపున పోటీ చేసిన గోవింద్ డాంగి (2,591 ఓట్లు)పై కుటమి అభ్యర్థి మో సాజిద్ (3,035 ఓట్లు) ఘన విజయం సాధించారు. 42 మంది కౌన్సిలర్లలో 30 మంది ఎస్ఎఫ్ఐ కూటమికి చెందినవారే కావడం విశేషం.



బాండ్ల కావడి ముడుపులు
దాడి చెయ్... దోచెయ్...



- 41 సంస్థలపై కేంద్ర ఏజెన్సీల దాడులు...ఆ తర్వాత బాండ్ల రూపంలో మోడీ సర్కార్‌కు ముడుపులు
- ఆ సంస్థల నుంచి వచ్చిన సొమ్ము రూ.2,471 కోట్లు
- చందా ఇస్తేనే ...కాంట్రాక్టులు
- అక్రమమార్గంలో రూ.3.7 లక్షల కోట్ల ప్రాజెక్టులు, కాంట్రాక్టులు
- 30 డొల్ల కంపెనీల ద్వారా అందిన సొమ్ము రూ.143 కోట్లు
- నిఫ్టీ, సెన్సెక్స్ లిస్టెడ్ కంపెనీలు కొనుగోలు చేసిన 81 శాతం ఎలక్టోరల్ బాండ్లు బీజేపీకే...

దేశ చరిత్రలోనే అతి పెద్ద స్కామ్‌గా పేరొందిన ఎలక్టోరల్ బాండ్ల డేటా తవ్వే కొద్దీ అవినీతి గుట్టలుగుట్టలుగా బయటకొస్తోంది. ఈ అవినీతి పరంపరలో తాజాగా మరో కోణం వెలుగుచూసింది. బీజేపీకి రూ.2,471 కోట్లు బాండ్ల రూపంలో ముడపులు ముట్ట జెప్పిన 41 కంపెనీలు సెంట్రల్ బ్యూరో ఆఫ్ ఇన్వెస్టిగేషన్ (సీబీఐ), ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ), ఆదాయపు పన్ను (ఐటీ) వంటి కేంద్ర ప్రభుత్వ ఎజెన్సీల దాడులను ఎదుర్కొన్నవే. ఈ దాడుల తరువాత దాదాపు రూ.1,698 కోట్లు బీజేపీకి ఈ కంపెనీలు విరాళంగా ఇచ్చాయి. రాజ్యాంగ విరుద్ధమైన ఎలక్టోరల్ బాండ్ల పథకం కింద, కనీసం 30 షెల్ (డొల్ల) కంపెనీలు రూ.143 కోట్ల విలువైన ఎలక్టోరల్ బాండ్లను కొనుగోలు చేశాయి.

నవతెలంగాణ-న్యూఢిల్లీ బ్యూరో

ఎలక్టోరల్ బాండ్లు కొనుగోలు చేసి బీజేపీకి విరాళం ఇచ్చిన 33 కంపెనీలు 172 మేజర్ కాంట్రాక్టులు, ప్రభుత్వం నుంచి ప్రాజెక్ట్ అనుమతులు పొందాయి. బీజేపీకి రూ.1,751 కోట్ల ఎలక్టోరల్ బాండ్ విరాళాలు ఇచ్చినందుకు, వారు మొత్తం రూ.3.7 లక్షల కోట్ల ప్రాజెక్టులు, కాంట్రాక్టులు పొందారు. పోస్ట్‌పెయిడ్ కాంట్రాక్టులు, ప్రాజెక్ట్ అనుమతులలో కేంద్రం లేదా బీజేపీ నేతృత్వంలోని రాష్ట్ర ప్రభుత్వాలు రూ.62,000 కోట్లు ఇచ్చాయి. ఆమోదానికి బదులుగా, మూడు నెలల్లోనే ఎలక్టోరల్ బాండ్ల రూపంలో పార్టీకి రూ.580 కోట్ల "ముడుపులు " లభించాయి.

గత ఏడాది ఆగస్టులో ఐటీ శాఖ దాడులు జరిపిన మూడు నెలల్లోనే కల్పతరు గ్రూప్ బీజేపీకి రూ.5.5 కోట్లు ఇచ్చింది.

2023 నవంబర్ 12, 2021 డిసెంబర్ 1లో ఐటీ, ఈడీ దాడులు జరిగిన మూడు నెలల్లో ఫ్యూచర్ గేమింగ్ బీజేపీకి రూ.60 కోట్లు ఇచ్చింది. 2022 నవంబర్ 10న ఈడీ రైడ్ జరిగిన మూడు నెలల్లో అరబిందో ఫార్మా బీజేపీకి రూ. 5 కోట్లు ఇచ్చింది.

నిఫ్టీ, సెన్సెక్స్ లిస్టెడ్ కంపెనీలు కొనుగోలు చేసిన 81 శాతం ఎలక్టోరల్ బాండ్లు బీజేపీ కే వెళ్లాయి.

15 నిఫ్టీ లిస్టెడ్ కంపెనీలు రూ.646 కోట్లు, ఎనిమిది సెన్సెక్స్ లిస్టెడ్ కంపెనీలు రూ.337 కోట్ల విలువ చేసే ఎలక్టోరల్ బాండ్లను కొనుగోలు చేశాయి. నిఫ్టీ లిస్టెడ్ కంపెనీలు కొనుగోలు చేసిన రూ.646 కోట్లలో ఒక్క బీజేపీ కే రూ. 521 కోట్లు (81 శాతం) ముట్టాయి.. సెన్సెక్స్ లిస్టెడ్ కంపెనీలలో కొనుగోలు చేసిన రూ.337 కోట్లు బీజేపీ కే అందాయి. . సెన్సెక్స్‌లోని ఎనిమిది కంపెనీలు భారతీ ఎయిర్‌టెల్, అల్ట్రా టెక్ సిమెంట్, బజాజ్ ఫైనాన్స్, ఐటీసీ, మహీంద్రా అండ్ మహీంద్రా, మారుతీ సుజుకీ, సన్ ఫార్మా, టెక్ మహీంద్రా ఉన్నాయి.ఈ కంపెనీలన్నీ కూడా నిఫ్టీ జాబితాలో ఉన్నాయి. ఇందులో మరో ఏడు డాక్టర్ రెడ్డీస్ లాబొరేటరీస్, దివీస్ లాబొరేటరీస్, సిప్లా, గ్రాసిమ్, హీరో మోటోకార్ప్, బజాజ్ ఆటో, యూపీఎల్ లిమిటెడ్ ఉన్నాయి.

చందా దే, దందా కరో



ఎలక్టోరల్ బాండ్ల పథకం స్వతంత్ర దేశంలో అతిపెద్ద స్కామ్‌లలో ఒకటి. ఈ బాండ్ల పథకంతో నాలుగు రకాల అవినీతి జరిగింది. "మొదటిది చందా దే, దందా కరో (విరాళం ఇచ్చి వ్యాపారం చేసుకోండి), రెండోది హఫ్తా-వసూలి (దోపిడీ), మూడోది ది లో రిష్వత్ దో (బ్యాగ్ కాంట్రాక్ట్, లంచం ఇవ్వండి)".

\- సీనియర్ న్యాయవాది ప్రశాంత్ భూషణ్

కలిసికట్టుగా పనిచేయండి
పార్లమెంటు స్థానాలు గెలిపించండి
ఉమ్మడి మహబూబ్ నగర్ జిల్లా నేతలతో సీఎం రేవంత్ రెడ్డి



నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా నేతలంతా కలిసికట్టుగా పనిచేసి మహబూబ్‌నగర్, నాగర్ కర్నూల్ పార్లమెంటు స్థానాలను గెలిపించాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అన్నారు. ఉమ్మడి మహబూబ్ నగర్ జిల్లా ఎమ్మెల్యేలు, ఎంపీ అభ్యర్థులు, ఎమ్మెల్సీ అభ్యర్థి,ముఖ్యనేతలతో ఆదివారం హైదరాబాద్‌లోని తన నివాసంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సమావేశం నిర్వహించారు. దాదాపు రెండు గంటలపాటు జరిగిన ఈ సమావేశంలో జిల్లాలో ప్రస్తుత రాజకీయ పరిస్థితులు, ఇతర అంశాలపై నేతలతో చర్చించారు. లోక్‌సభ ఎన్నికల్లో అనుసరించాల్సిన వ్యూహాలపై నేతలకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి దిశానిర్దేశం చేశారు. పోలింగ్ బూత్‌ల వారీగా నేతలు బాధ్యతలు తీసుకుని సమన్వయంతో పని చేయాలన్నారు. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలనీ, ప్రజా సమస్యల పరిష్కారంలో కాంగ్రెస్ ప్రభుత్వం చొరవను ప్రజలకు వివరించాలన్నారు. వంద రోజుల ప్రజా పాలనలో కాంగ్రెస్ అమలు చేసిన గ్యారంటీలను ప్రజలకు తెలియజేయాలని సూచించారు. నేతలంతా సమన్వయంతో పనిచేసి ఉమ్మడి జిల్లాలో రెండు పార్లమెంటు స్థానాలతో పాటు ఎమ్మెల్సీని గెలిపించుకోవాలని కోరారు.

జైలు నుంచే కేజ్రీవాల్ పాలన
నీటి సమస్యల పరిష్కారం కోసం తొలి ఉత్తర్వులు



న్యూఢిల్లీ : ప్రస్తుతం ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) కస్టడీలో ఉన్న ఢిల్లీ ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్ జైలు నుంచే పరిపాలన ప్రారంభించారు. నగరంలో కొన్ని ప్రాంతాల్లో ఎదురవుతున్న నీటి, మురుగు నీటి సంబంధిత సమస్యలను పరిష్కరించాలని నీటి పారుదల శాఖ మంత్రి అతిషిని ఆదేశిస్తూ ఆయన ఉత్తర్వులు జారీ చేశారు. జైలు ...13లో



31న ఇండియా ఫోరం మెగా ర్యాలీ
రాంలీలా మైదాన్‌లో జరిగే ర్యాలీకి హాజరుకానున్న వివిధ పార్టీల నేతలు : మీడియా సమావేశంలో ఢిల్లీ ఇండియా ఫోరం నేతలు

వివరాలు 13లో..

అంతా ఆయనే..
ప్రధాన నిందితుడు ప్రభాకర్‌రావును ఎఫ్ఐఆర్‌లో చేర్చిన దర్యాప్తు అధికారులు

- ఆయనతో పాటు రాధాకిషన్‌రావు, శ్రవణ్‌ల కోసం లుకౌట్ నోటీసులు జారీ
- ప్రభాకర్‌రావు ఆదేశాల మేరకే ఫోన్ ట్యాపింగ్ చేశాం
- పరికరాలను ధ్వంసం చేశాం
- ఒప్పుకున్న నిందితుడు ప్రణీత్‌రావు
- రిమాండ్‌కు ఆయనతో పాటు ఇద్దరు అదనపు ఎస్పీలు



నవతెలంగాణ-ప్రత్యేక ప్రతినిధి

రాష్ట్రంలో సంచలనం రేపిన రాజకీయ ప్రముఖల ఫోన్ ట్యాపింగ్ కేసులో ఏ1 ప్రధాన నిందితుడిగా స్పెషల్ ఇంటెలిజెన్స్ బ్యూరో (ఎస్ఐబీ) మాజీ ఐజీ ప్రభాకర్‌రావు పేరును ఎఫ్ఐఆర్‌లో చేర్చారు. రెండో నిందితుడిగా డీఎస్పీ ప్రణీత్‌రావు, మూడో నిందితుడిగా హైదరాబాద్ టాస్క్‌ఫోర్స్ మాజీ డీసీపీ రాధాకిషన్‌రావు, నాలుగు, ఐదో నిందితుడిగా మహబూబాబాద్ అదనపు ఎస్పీ బుజంగరావు, ఎస్ఐబీ అదనపు ఎస్పీ తిరుపతన్న లను చేర్చిన అధికారులు.. ఆరో నిందితుడిగా ప్రయివేటు వ్యక్తి పేరును పేర్కొన్నారు. ఇప్పటికే ఈ కేసులో ప్రణీత్‌రావును అరెస్టు చేసిన పంజాగుట్ట పోలీసులు అతనిచ్చిన వాంగ్మూలం మేరకు శనివారం రాత్రి బుజంగరావు, తిరుపతన్నలను కూడా అరెస్ట్ చేశారు. ఈ ముగ్గురు నిందితులను ఆదివారం ఉదయం కొంపల్లిలో గల నాంపల్లి కోర్టు 14వ మేజిస్ట్రేట్ నివాసంలో దర్యాప్తు అధికారులు హాజరుపర్చారు. ఇందులో పోలీస్ కస్టడీ ముగిసిన ప్రణీత్‌రావుకుఈనెల 28 వరకు, బుజంగరావు, తిరుపతన్నలకు ఏప్రిల్ 6 వరకు జ్యుడీషియల్ రిమాండ్‌ను న్యాయమూర్తి విధించారు. దీంతో, ఈ ముగ్గురు అధికారులను చంచల్‌గూడ జైలుకు దర్యాప్తు అధికారులు తరలించారు.

రెండ్రోజుల ముందే అమెరికాకు ప్రభాకర్‌రావు, శ్రవణ్

ప్రముఖుల ఫోన్ ట్యాపింగ్ కేసు నమోదు కావటానికి ...13లో

నేటి సమాజానికి భగత్‌సింగ్‌లే అవసరం
భగత్‌సింగ్ భావజాలాన్ని యువత పాటిస్తూనే సమాజంలోకి తీసుకెళ్లాలి
ఎస్ఎఫ్ఐ-డీవైఎఫ్ఐ యువజన ఉత్సవాల ముగింపు సభలో పలువురు వక్తలు



నవతెలంగాణ-సుల్తాన్‌బజార్

భగత్‌సింగ్ వర్ధంతి సందర్భంగా ఎస్ఎఫ్ఐ, డీవైఎఫ్ఐ హైదరాబాద్ జిల్లా కమిటీల ఆధ్వర్యంలో మార్చి 1 నుంచి 24వ తేదీ వరకు నిర్వహించిన భగత్‌సింగ్ స్మారక యువజన ఉత్సవాలు ఆదివారం ముగిశాయి.ఈ సందర్భంగా పొట్టి శ్రీరాములు విశ్వవిద్యాలయంలోని ఎన్టీఆర్ కళామందిర్‌లో భారత విద్యార్థి ఫెడరేషన్ (ఎస్ఎఫ్ఐ), భారత ప్రజాతంత్ర యువజన సమైఖ్య (డీవైఎఫ్ఐ) హైదరాబాద్ జిల్లా కార్యదర్శులు అశోక్ రెడ్డి, ఎండీ జావిద్ అధ్యక్షతన జరిగిన సభలో ఎమ్మెల్సీ బల్మూరి వెంకట్, ప్రముఖ సినీ నటులు, మిమిక్రీ ఆర్టిస్ట్ శివారెడ్డి ముఖ్య అతిధులుగా పాల్గొన్నారు. ఈ ...13లో



మాట్లాడుతున్న ఎమ్మెల్సీ బల్మూరి వెంకట్

సికింద్రాబాద్ పార్లమెంట్ పరిధిలో రాజకీయం రసవత్తరంగా మారింది. రానున్న పార్లమెంట్ ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా కాంగ్రెస్, బీఆర్ఎస్, బీజేపీ తలపడుతున్నాయి. పక్కా కార్యాచరణతో విజయం సాధించాలని తమ వ్యూహాలకు పదునుపెడుతున్నాయి. అభ్యర్థులు ఎవరనేది తేలిపోవడంతో మూడు పార్టీలు యుద్ధానికి సై అంటున్నాయి. గెలుపుపై ఎవరికి వారే ధీమా వ్యక్తం చేస్తున్నారు. ఇందులో బీజేపీ అభ్యర్థి కిషన్ రెడ్డి ఇప్పటికే బస్తీబాట పేరుతో ప్రజాక్షేత్రంలోకి వెళ్లిపోగా.. దానం నాగేందర్ గ్రేటర్‌లోని క్యాడర్‌తో సంప్రదింపులు జరుపుతున్నారు. బీఆర్ఎస్ అభ్యర్థి పద్మారావు గౌడ్ నియోజవర్గంలోని బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు, ముఖ్యనాయకులతో భేటీ అవుతున్నారు.

లష్కర్‌లో పోరు రసవత్తరం..!
గెలుపే లక్ష్యంగా కాంగ్రెస్, బీఆర్ఎస్, బీజేపీ | సరికొత్త వ్యూహాలతో ప్రజల్లోకి వెళ్లేలా కార్యచరణ

- ఎన్నికల్లో విజయంపై ఎవరి ధీమా వారిదే..

నవతెలంగాణ-సిటీబ్యూరో

వచ్చే పార్లమెంట్ ఎన్నికల్లో సికింద్రాబాద్ పార్లమెంట్ స్థానంలో కాంగ్రెస్ జెండా ఎగురువేయాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రత్యేక దృష్టిసారించారు. ఇప్పటికే ప్రత్యర్థి పార్టీల్లోని కీలక నేతలను చేర్చుకుంటూ.. ఆ పార్టీలను బలహీనపర్చే పనిలో నిమగ్నమయ్యారు. అంతేగాక ఎలాగైనా ఇక్కడ ప్రస్తుత ఎంపీ, కేంద్రమంత్రి, బీజేపీ రాష్ట్ర అధ్యక్షులు కిషన్ రెడ్డి ఓటమే లక్ష్యంగా పనిచేయాలని క్యాడర్‌కు దిశానిర్దేశం చేస్తున్నారు. ఆ నేపథ్యంలోనే ఖైరతాబాద్ నుంచి మూడు సార్లు ఎమ్మెల్యేగా గెలిచిన దానం నాగేందర్‌ను ఇక్కడి నుంచి బరిలోకి దింపారు. కాంగ్రెస్ హయాంలో దానం నాగేందర్ రెండుసార్లు మంత్రిగా, ఆ పార్టీ గ్రేటర్ హైదరాబాద్ అధ్యక్షునిగా సేవలందించిన అనుభవం ఎన్నికల్లో పార్టీ విజయానికి కలిసిసోచ్చే అంశంగా భావిస్తున్నారు. ఇదిలావుంటే ఇప్పటికే దానం అన్ని నియోజవర్గాల్లోని పాత, కొత్త క్యాడర్‌తో మాట్లాడే ప్రయత్నాలు చేస్తున్నారు. ఎంఐఎంతో కూడా మంచి సంబంధాలు కలిగివుండటం ఆయనకు మరో అడ్వాంటేజ్ అని చెబుతున్నారు. అంతేగాక ప్రస్తుత బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు కూడా ఆయనకు రానున్న ఎన్నికల్లో సహకారమందించినా ఆశ్చర్యపో నక్కర్లేదు. మాస్ లీడర్‌గా పేరున్న దానం నాగేందర్‌కు ప్రజల్లో మంచి గుర్తింపు ఉండటంతో పాటు అదేస్థాయిలో వ్యతిరేకత కూడా ఉంది. ఈ నేపథ్యంలో ఆయన ఎంపిక కాంగ్రెస్ పార్టీకి ఏ మేరకు లాభం చేస్తుందనేది వేచిచూడాలి.



కార్పొరేటర్ నుంచి ఎమ్మెల్యేగా ఎదిగిన పద్మారావు..

సికింద్రాబాద్ పార్లమెంట్ బీఆర్ఎస్ అభ్యర్థిగా ఎట్టకేలకు సికింద్రాబాద్ ఎమ్మెల్యే పద్మారావు గౌడ్‌ను ఆ పార్టీ అధినేత కేసీఆర్ తాజాగా ప్రకటించారు. సికింద్రాబాద్ నుంచి నాలుగు సార్లు ఎమ్మెల్యేగా గెలిచిన పద్మారావు గౌడ్.. కార్పొరేటర్‌గా, ఎమ్మెల్యేగా, మంత్రిగా ప్రజలకు సేవలందించారు. సికింద్రాబాద్ ప్రజలకు ఆయన 'పజ్జన్న'గా సుపరిచితులు. ఇదిలావుంటే సికింద్రాబాద్ లోక్‌సభ నియోజకవర్గంలో అంబర్‌పేట, ముషీరాబాద్, సనత్‌నగర్, జూబ్లీహిల్స్, ఖైరతాబాద్, నాంపల్లి, సికింద్రాబాద్ అసెంబ్లీ సెగ్మెంట్లుండగా, గత అసెంబ్లీ ఎన్నికల్లో నాంపల్లి మినహా.. మిగతా ఆరు నియోజకవర్గాల్లో బీఆర్ఎస్ అభ్యర్థులే ...13లో

మెరుగైన భారత నిర్మాణ సంకల్పాన్ని బలోపేతం చేయాలి

సీపీఐ(ఎం) ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి

భగత్ సింగ్‌కు ఘన నివాళి



నవతెలంగాణ-న్యూఢిల్లీ బ్యూరో

మెరుగైన భారత నిర్మాణ సంకల్పాన్ని బలోపేతం చేయాలని సీపీఐ(ఎం) ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి పిలుపు ఇచ్చారు. స్వాతంత్ర్య సమరయోధుతు, అమరవీరులు షహీద్ భగత్ సింగ్, రాజ్‌గురు, సుఖ్‌దేవ్ వర్థంతి సందర్భంగా సీపీఐ(ఎం) ఘనంగా నివాళి అర్పించింది. ఈమేరకు సీపీఐ(ఎం) కేంద్ర కార్యాలయం (ఎకె గోపాలన్ భవన్)లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో సీపీఐ(ఎం) ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి భగత్ సింగ్ చిత్రపటానికి పూలమాలలేని నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశ గణతంత్ర, లౌకిక, ప్రజాస్వామ్య లక్షణాన్ని కాపాడుకునేందుకు, దేశ ప్రజలందరూ సమానమైన, దోపిడీ రహిత సమాజంలో గౌరవప్రదమైన జీవితాన్ని గడపడానికి భగత్ సింగ్ ఊహించిన విధంగా మెరుగైన భారతదేశాన్ని నిర్మించాలనే సంకల్పాన్ని బలోపేతం చేయాలని పిలుపు ఇచ్చారు. ఈ కార్యక్రమంలో సీపీఐ(ఎం) పొలిట్ బ్యూరో సభ్యులు బివి రాఘవులు, తపన్ సేన్, నిలోత్పల్ బసు, కేంద్ర కమిటీ సభ్యులు ఆర్. అరుణ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.



ఐసిస్‌లో చేరిక అనుమానాలతో

• ఐఐటి విద్యార్థి అరెస్టు

గౌహతి : ఉగ్రవాద సంస్థ ఐఎస్ఐఎస్ (ఐసిస్)లో చేరనున్నాడనే అనుమానాలతో ఐఐటి గౌహతికి చెందిన విద్యార్థిని ఒకరిని అస్సాం పోలీసులు అరెస్టు చేశారు. ఢిల్లీలోని ఓఖ్లా ప్రాంతానికి చెందిన సదరు విద్యార్థి గౌహతిలోని ఐఐటిలో నాలుగో సంవత్సరం చదువుతున్నారు. ఐఎస్ఐఎస్‌కు మద్దతుగా సోషల్ మీడియాలో పోస్టులతో పాటు అందులో చేరతానని ప్రతిజ్ఞ కూడా చేసినట్లు పోలీసులు ఆరోపిస్తున్నారు. కొద్ది రోజుల కిందట నుంచి అయన క్యాంపస్‌కు బయటే ఉన్నట్లు తెలిపారు. ఈ నేపథ్యంలో శనివారం సాయంత్రం గౌహతికి 30 కిలోమీటర్ల దూరంలోని హజో వద్ద పోలీసులు అతన్ని అరెస్టు చేశారు. ఈ విషయాన్ని అస్సాం డిజిపి జ్ఞానేంద్ర ప్రతాప్ సింగ్ తెలిపారు. విద్యార్థిపై విచారణ సాగుతోందని పోలీసులు తెలిపారు. ఈ నెల 19న ఐఎస్ఐఎస్ ఇండియా చీఫ్ హరీస్ ఫారూఖీ, అతని సహచరుడు అనురాగ్ సింగ్‌ను ఇప్పటికే అరెస్టు చేసిన సంగతి తెలిసిందే. వారిద్దరూ ప్రస్తుతం ఎన్ఐఎ కస్టడీలో ఉన్నారు.

జులై నుంచి హెల్త్ ప్రొఫైల్ కార్డులు



నవతెలంగాణ-హైదరాబాద్

రాష్ట్ర ప్రజలకు వచ్చే జులై నుంచి హెల్త్ ప్రొఫైల్ కార్డులను అందజేయనున్నట్లు రాష్ట్ర ఐటీ, శాసనసభ వ్యవహారాల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు వెల్లడించారు. హైదరాబాద్ ఆర్టీసీ కళాభవన్‌లో మంథని వైదిక సంస్థ ఆధ్వర్యంలో మంత్రి శ్రీధర్‌బాబుకు ఆదివారం సత్కార సభ జరిగింది. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. ప్రజా సంక్షేమం, అభివృద్ధి కోసం ఎలాంటి భేషజాలకు పోకుండా ప్రజలు గర్వించేలా పనిచేస్తామన్నారు. ఆధార్ కార్డు సంఖ్య తరహాలో ఒక్కో పౌరుడికీ స్మార్ట్‌కార్డు వంటి హెల్త్ ప్రొఫైల్ సంఖ్యతో గుర్తింపు కల్పిస్తామన్నారు. పేరు టైప్ చేస్తే సమగ్ర వైద్య సేవల వివరాలు తెలుసుకునేలా చర్యలు చేపట్టామన్నారు. ఏ వైద్యుడిని సంప్రదించినా వారి ఆరోగ్య స్థితిగతులను వెంటనే తెలుసుకుని మెరుగైన వైద్యసేవలు అందించేందుకు ఇది దోహదపడుతుందన్నారు. మాజీ ఎమ్మెల్యేలకు ఎమ్మెల్యేల క్వార్టర్లలోని డిస్పెన్సరీలతోపాటు అన్ని ఆసుపత్రుల్లో చికిత్సకు అనుగుణంగా ఔషధాలను సరఫరా చేయాలని శాసనసభ వ్యవహారాల శాఖ మంత్రి శ్రీధర్‌బాబు అధికారులను ఆదేశించారు. మాజీ ఎమ్మెల్యేలు రాజేశంగౌడ్, ఆంజనేయులు, సత్యనారాయణగౌడ్ తదితరులు ఆదివారం మంత్రిని ఆయన కార్యాలయంలో కలిసి ఔషధాల సరఫరాలో కొరతను తీర్చాలని వివరించారు. ఔషధాల సరఫరాలో ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూస్తామని మంత్రి హామీ ఇవ్వడంతో వారు కృతజ్ఞతలు తెలిపారు.

ఆరు గ్యారంటీల అమలు ఎక్కడ..?

తెలంగాణలో మోడీ హవా లేదు బీఆర్ఎస్ సికింద్రాబాద్ ఎంపీ అభ్యర్థి పద్మారావుగౌడ్

- కాంగ్రెస్ పార్టీ 420 హామీలు ఇచ్చి నెరవేర్చడంలో విఫలమైంది : మాజీ మంత్రులు తలసాని, మహమూద్ అలీ



నవతెలంగాణ-ఓయూ

అసెంబ్లీ ఎన్నికల సమయంలో కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన ఆరు గ్యారంటీలు ఇంత వరకు అమలుకాలేదని సికింద్రాబాద్ పార్లమెంట్ నియోజకవర్గం బీఆర్ఎస్ పార్టీ అభ్యర్థి పద్మారావు గౌడ్ అన్నారు. మాజీ మంత్రులు తలసాని శ్రీనివాస్ యాదవ్, మహమూద్ అలీతో పాటు బీఆర్ఎస్ పార్టీ ఎమ్మెల్యేలు, ముఖ్య నేతలతో ఎన్నికల ప్రచార కార్యాచరణపై ఆదివారం అయన నివాసంలో చర్చించారు. ఈ సందర్భంగా వారంతా పద్మారావుగౌడ్‌కు అభినందనలు తెలిపారు. అనంతరం జరిగిన సభలో పద్మారావు గౌడ్ మాట్లాడుతూ.. పార్లమెంట్ అభ్యర్థిగా తనపై నమ్మకంతో తన అభ్యర్థిత్వాన్ని ప్రకటించిన బీఆర్ఎస్ అధినేత కేసీఆర్‌కు కృతజ్ఞతలు తెలిపారు. శ్రీనివాస్ యాదవ్, పద్మారావుగౌడ్ అంటే గ్రేటర్‌లో గుర్తుపట్టని వారు ఉండరని, స్వయం కృషితో పైకి రావడం, ప్రజలకు సేవ చేయడంతో ఆ పేరు వచ్చిందన్నారు. తాము ప్రజలే తమ కుటుంబంగా భావించామని, ఎప్పుడూ ప్రజలనే నమ్ముకున్నామని తెలిపారు. సికింద్రాబాద్ అంతా అద్భుతమైన అభివృద్ధి జరిగిందని, కొన్ని సార్లు గెలుపు-ఓటములు తప్పవని, మళ్ళీ రాబోయేది బీఆర్ఎస్ ప్రభుత్వమేనన్నారు. గల్లీలీడర్లు లేనిది ఢిల్లీ ఎక్కడిదని ప్రశ్నించారు. తెలంగాణలో మోడీ హవా లేదని తెలిపారు. మాజీ మంత్రులు తలసాని, మహమూద్ అలీ మాట్లాడుతూ.. కాంగ్రెస్ పార్టీ 420హామీలు ఇచ్చి అమలు చేయడంలో విఫలమయ్యిందని విమర్శించారు. మరో రెండు రోజుల్లో తెలంగాణ భవన్‌లో పూర్తి స్థాయి సమావేశం నిర్వహించి ఎన్నికల ప్రచార కార్యక్రమాలను ప్రకటిస్తామన్నారు. కార్యక్రమంలో జూబ్లీహిల్స్, అంబర్‌పేట ఎమ్మెల్యేలు మాగంటి గోపినాథ్, కాలేరు వెంకటేష్, ముషీరాబాద్ యువనేత ముఠా జైసింహ, యువ నేత రామేశ్వర్ గౌడ్, కార్పొరేటర్లు సామల హేమ, కంది శైలజ, రాసూరి సునీత రమేష్, సుంకు రాం చందర్, కరాటే రాజు, నేతలు కార్యకర్తలు పాల్గొన్నారు. పలువురు కార్యకర్తలు పద్మారావును కలిసి ఘనంగా సన్మానించారు.

గాజా 'పీడకల'కు ముగింపు పలకాలి

• ఐరాస చీఫ్ విజ్ఞప్తి

రఫా: ఐక్యరాజ్యసమితి ప్రధాన కార్యదర్శి ఆంటోనియో గుటెరస్ విధ్వంసానికి గురైన గాజా గుమ్మం వద్దకు వెళ్లి, రక్తపాతాన్ని ఆపాలని, భయానక క్షామం వైపు నెట్టబడుతున్న గాజాకు మానవతా సహాయాన్ని అందించేందుకు వీలుగా తక్షణమే కాల్పుల విరమణ ప్రకటించాలని కోరారు. రఫా పట్టణం ఈజిప్షియన్ వైపు క్రాసింగ్ వద్ద ఆయన శనివారం మట్లాడుతూ రఫా పై భూతల దాడులకు ఇజ్రాయిల్ చేస్తున్న యత్నాలపై తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు. పాలస్తీనీయులు ఎక్కువ మంది రఫాలో ఆశ్రయం పొందుతున్నారు. గుటెరస్,, ఇతర ప్రపంచ నాయకుల విజ్ఞప్తిని బేఖాతరు చేస్తూ గాజాను నామరూపాల్లేకుండా చేయాలని ఇజ్రాయిల్ చూస్తున్నది. 'గాజాలోని పాలస్తీనియన్లు ముఖ్యంగా పిల్లలు, మహిళలు, వృద్ధులు అత్యంత దారుణమైన స్థితిని ఎదుర్కొంటున్నారని గుటెరెస్ పేర్కొన్నారు. "ఏదైనా తదుపరి దాడి పరిస్థితిని మరింత దిగజార్చుతుంది."దాదాపు ఆరు నెలలుగా ఇజ్రాయిల్ సాగిస్తున్న బాంబు దాడుల్లో 32 వేల మందికిపైగా మరణించారు. గాజ నేడు తీవ్ర మానవీయ సంక్షోభాన్ని ఎదుర్కొంటోందని గుటెరస్ హెచ్చరించినప్పటికీ, ఇజ్రాయిల్ ప్రధాని బెంజమిన్ నెతన్యాహు మాత్రం దాడులతో ముందుకెళ్తామని హూంకరిస్తున్నారు. .

ప్రకాశ్ అంబేద్కర్ నిర్ణయం ఏకపక్షం, దురదృష్టకరం

ముంబయి : వంచిత్ బహుజన్ అఘాడి పార్టీ (విబిఎ) అధ్యక్షుడు ప్రకాశ్ అంబేద్కర్ నిర్ణయం ఏకపక్షమని, దురదృష్టకరమని యుటిబి శివసేన నేత సంజయ్ రౌత్ పేర్కొన్నారు. ఉద్ధవ్ థాకరే నేతృత్వంలోని శివసేన పార్టీ (యుబిసి)తో ఇకపై పొత్తు ఉండదని విబిఎ అధ్యక్షుడు ప్రకాశ్ అంబేద్కర్ ప్రకటించిన సంగతి తెలిసిందే. ఈ ప్రకటనపై యుటిబి శివసేన నేత సంజయ్ రౌత్ ఆదివారం మీడియాతో మాట్లాడారు. ప్రకాశ్ అంబేద్కర్ నిర్ణయం ఏకపక్షమని, దురదష్టకరమని, ఆయన మరోసారి పునరాలోచించాలని కోరారు. మహావికాస్ అఘాడీ (ఎంవిఎ)లో ప్రకాశ్ అంబేద్కర్ పార్టీకి మహారాష్ట్రలో నాలుగు సీట్ల ఆఫర్ ఇప్పటికీ అలాగే ఉందని అన్నారు.

లోక్‌సభ ఎన్నికల కోసం ప్రకాశ్ అంబేద్కర్ శివసేన (యుటిబి), కాంగ్రెస్, ఎన్‌సిపి (శరద్ పవార్) పార్టీలతో కలిసి మహా వికాస్ అఘాడీ కూటమిలో చేరాలని భావించారు. అయితే, సీట్ల పంపకానికి సంబంధించి ఇప్పటి వరకు నిర్ణయం వెల్లడించలేదు. సీట్ల ఒప్పందం కుదరకపోవడంతో ప్రకాశ్ అంబేద్కర్ ఒంటరిగానే బరిలోకి దిగాలని నిర్ణయించినట్లు సమాచారం. యుటిబి శివసేన, విబిఎ గతేడాది జనవరిలో పొత్తును ప్రకటించాయి.

కాగా, పార్టీల మధ్య అంతర్గత కలహాలు అంతం కావడం లేదని ప్రకాశ్ అంబేద్కర్ పేర్కొన్నారు. ఈ నెల 26న తదుపరి కార్యాచరణ ప్రకటించనున్నట్లు తెలిపారు.

మహారాష్ట్రలోని 48 లోక్‌సభ స్థానాల్లో శివసేన (యుటిబి)కి అత్యధికంగా 19, కాంగ్రెస్‌కి 16, ఎన్‌సిపి (శరద్ పవార్)కి 9 సీట్లు కేటాయించారు. అయితే, సాంగ్లీ, భీవండి, ముంబయి నార్త్ వెస్ట్, ముంబయి సౌత్ సెంట్రల్ లోక్‌సభ స్థానాల కోసం కాంగ్రెస్, శివసేన (యుబిటి)లు పోటీ పడుతున్నాయి. ఈ స్థానాలపై నిర్ణయం వెలువడాల్సి వుంది.

యూపీ మదర్సా చట్టం రద్దుతో పదివేల మందికి పైగా టీచర్లపై ఎఫెక్ట్

- 26 లక్షల మందికి పైగా విద్యార్థుల భవిష్యత్తు అగమ్యగోచరం
- మదర్సా అసోసియేషన్ వెల్లడి
- హైకోర్టు నిర్ణయాన్ని 'సుప్రీం'లో సవాలు చేస్తాం

లక్నో : యూపీ మదర్సా యాక్ట్, 2004 రద్దు రాష్ట్రంలోని ఆయా మదర్సాలకు చెందిన టీచర్లు, విద్యార్థులపై ప్రభావం చూపుతున్నది. చట్టం రద్దుతో యూపీలోని మదర్సాలు మూతపడనున్నాయి. దీని ప్రభావం ఈ మదర్సాలలో బోధించే టీచర్లు, అభ్యసించే విద్యార్థులపై పడనున్నది. పదివేల మందికి పైగా టీచర్లు, 26 లక్షల మందికి పైగా విద్యార్థుల భవిష్యత్తు అగమ్యగోచరంగా మారనున్నది. చట్టం రద్దుతో ప్రభావితమైన టీచర్లు, విద్యార్థులు, వారి తల్లిదండ్రులు ఆందోళనను వ్యక్తం చేస్తున్నారు. యూపీ మదర్సా యాక్ట్ రాజ్యాంగ విరుద్ధమనీ, ఇది సెక్యులరిజం సూత్రాన్ని ఉల్లంఘిస్తున్నదని అలహాబాద్ హైకోర్టు ఇటీవల కొట్టివేసిన విషయం విదితమే. కాగా, హైకోర్టు నిర్ణయాన్ని సుప్రీంకోర్టులో సవాలు చేయనున్నట్టు మదర్సా అసోసియేషన్ వెల్లడించింది. యూపీలో మొత్తం 16,513 గుర్తింపు పొందిన మదర్సాలు ఉన్నాయి. హైకోర్టు నిర్ణయం 26 లక్షల మందికి పైగా విద్యార్థులపై ప్రభావం చూపనున్నదని ఉత్తరప్రదేశ్ బోర్డ్ ఆఫ్ మదర్సా ఎడ్యుకేషన్ చైర్మెన్ ఇఫ్తిఖార్ అహ్మద్ జావెద్ ఆందోళన వ్యక్తం చేశారు.



కాముని దహనం

బస్తీవాసులంతా కలిసి వేడుకగా..

హైదరాబాద్. స్వామి దయానంద యంగ్ మెన్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జరిగిన కాముని దహన కార్యక్రమంలో బస్తీ వాసులంతా పాల్గొని, జయప్రదం చేశారు.ఈ దహనం చేసే కార్యక్రమంలో పంజల మహేందర్ గౌడ్, క్రాంతి,అరవింద్ గౌడ్, శివ, కరుణాకర్, శిరీషగౌడ్, దినేష్ యాదవ్,సురేష్ గౌడ్,పాల్గొన్నారు.

కేజ్రీవాల్ అరెస్టుతో నియంతృత్వ పాలనలోకి భారత్..

- కేంద్ర ఏజెన్సీలతో అక్రమ అరెస్టులు
- మేధావులు, సామాజికవేత్తల ఆందోళన

న్యూఢిల్లీ : భారత్‌లో ఢిల్లీ సీఎం, ఆప్ అధినేత కేజ్రీవాల్ అరెస్ట్ తీవ్ర చర్చనీయాంశంగా మారింది. ఢిల్లీ లిక్కర్ పాలసీలో స్కామ్ జరిగిందంటూ ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) ఆయనను ఇటీవల అదుపులోకి తీసుకున్న విషయం తెలిసిందే. దీంతో, ఆయన అరెస్టుపై కాంగ్రెస్, డీఎంకే, శివసేన, బీఆర్ఎస్ వంటి రాజకీయ పార్టీల నుంచే కాకుండా మేధావులు, సామాజిక కార్యకర్తల నుంచి తీవ్ర వ్యతిరేకత వ్యక్తమైంది. ఈడీ, ఐటీ, సీబీఐ వంటి కేంద్ర దర్యాప్తు ఏజెన్సీల సాయంతో అక్రమ అరెస్టుల ద్వారా ప్రతిపక్ష నాయకులను మోడీ సర్కారు అణగదొక్కుతున్నదని విమర్శలు వెల్లువెత్తాయి. ఒకవేళ ప్రతిపక్ష నాయకులు తమపై ఉన్న కేసులు కానీ, విచారణలు కానీ మాఫీ కావాలంటే ఉన్న ఏకైక మార్గం వారు బీజేపీలో చేరటమేననీ, రాబోయే ఎన్నికల్లో ఈ విధంగా లబ్ది పొందాలనే లక్ష్యంతోనే మోడీ సర్కారు ముందుకు వెళ్తున్నదని రాజకీయ విశ్లేషకులు అంటున్నారు. ఇప్పుడు, కేజ్రీవాల్ వంటి ఒక కీలక నాయకుడి అరెస్టుతో దేశం నియంతృత్వ పాలనలోకి వెళ్లిందని మేధావులు ఆరోపిస్తున్నారు.

2015లో ఢిల్లీ అసెంబ్లీలో 70 స్థానాలకు గానూ 68 సీట్లను గెలుచుకొని చరిత్ర సృష్టించిన కేజ్రీవాల్.. అప్పటి నుంచి ప్రజాభిమానాన్ని చూరగొన్న ఆయన పార్టీ.. ఢిల్లీలో ఇప్పటి వరకూ అధికారాన్ని నిలబెట్టుకున్నదనీ, పంజాబ్‌లోనూ ప్రభుత్వాన్ని ఏర్పర్చిందనీ, ఇతర రాష్ట్రాల్లోనూ కొన్ని సీట్లను గెలుచుకొని తన పట్టు నిలబెట్టుకున్నదని చెప్పారు. 2019లో ప్రధాని మోడీపై వారణాసి నుంచి పోటీ చేసిన కేజ్రీవాల్ ఓటమి చెందినా.. తన పోరాటం వెనక గల కారణాన్ని ప్రజలకు తెలియజేయటంలో సఫలమయ్యారని విశ్లేషకులు అంటున్నారు. కేంద్రంలో బీజేపీ ఓటమే లక్ష్యంగా పలు ప్రతిపక్ష పార్టీల కలయికతో ఏర్పడిన 'ఇండియా' కూటమిలో కాంగ్రెస్, ఆప్ కీలకంగా ఉన్నాయి. ఈ రెండు పార్టీలూ రాబోయే లోక్‌సభ ఎన్నికల్లో పోటీ చేయటానికి సీట్లనూ పంచుకున్నాయి. దీంతో కూటమిని బలహీనపర్చే చర్యలో భాగంగానే ఆప్‌ను బలహీనపర్చే ప్రయత్నాన్ని మోడీ సర్కారు చేస్తున్నదనీ, ఇందులో భాగమే కేజ్రీవాల్ అరెస్టని రాజకీయ నిపుణులు విశ్లేషిస్తున్నారు.

2014లో కేంద్రంలో తొలిసారి అధికారంలోకి వచ్చినప్పటి నుంచి ఇప్పటి వరకూ మోడీ సర్కారు తన పరిధిని దాటి వ్యవహరించిందని వారు చెప్తున్నారు. ప్రస్తుతం లోక్‌సభ ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో, 400కు పైగా సీట్లను సాధించాని కాషాయపార్టీ లక్ష్యంగా పెట్టుకున్న నేపథ్యంలో ప్రత్యర్థి పార్టీలను అణచివేయటమే టార్గెట్‌గా మోడీ సర్కారు పని చేస్తున్నదని అంటున్నారు.

దేశంలో ప్రజాస్వామ్యాన్ని నశింపజేయటానికి.. అదే ప్రజాస్వామ్యాన్ని ఉపయోగించుకొని ఆయన అధికారంలోకి వచ్చారని ఆరోపిస్తున్నారు. మొదటిసారి, కేంద్రంలో అధికారంలోకి వచ్చిన మోడీ.. ఆరెస్సెస్ సిద్ధాంతాలను అమలు చేసే చర్యకు పూనుకున్నారని మేధావులు, సామాజిక కార్యకర్తలు చెప్తున్నారు. 2019లో, కేంద్రంలో రెండోసారి అధికారంలోకి వచ్చిన తర్వాత ఆయన వివాదాస్పద పౌరసత్వ సవరణ చట్టం(సీఏఏ) అమలు, ఆర్టికల్ 370 రద్దు, సాగు చట్టాలు, లేబర్‌కోడ్‌లు వంటి నిర్ణయాలతో చిచ్చు రేపారని గుర్తు చేస్తున్నారు.



తెరవాల్సింది కాంగ్రెస్ పార్టీ గేట్లు కాదు...

ప్రాజెక్టుల గేట్లు

రైతులను ఆదుకోవాలి : మాజీ మంత్రి, ఎమ్మెల్యే తన్నీరు హరీశ్ రావు

నవతెలంగాణ-దేవరుప్పుల

ప్రస్తుత పరిస్థితుల్లో తెరవాల్సింది కాంగ్రెస్ పార్టీ గేట్లు కాదని, రైతుల పొలాలకు నీరందించే రిజర్వాయర్ల గేట్లని మాజీ మంత్రి హరీశ్‌రావు అన్నారు. ప్రాజెక్టుల గేట్లు తెరిచి కాలువల ద్వారా చెరువులు నింపి, పొలాలు ఎండకుండా నీరందించి రైతాంగాన్ని ఆదుకోవాలని రాష్ట్రప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆదివారం జనగామ జిల్లా దేవరుప్పుల మండలంలోని ధరావత్ తండా గ్రామపంచాయతీ పరిధిలో నీళ్ళు లేక ఎండిపోయిన రైతుల పంట పొలాలను మాజీ మంత్రులు ఎర్రబెల్లి దయాకర్ రావు, సత్యవతి రాథోడ్, ఎమ్మెల్యే కడియం శ్రీహరి, మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్ రెడ్డితో కలిసి ఆయన పరిశీలించారు. అనంతరం హరీశ్‌రావు మాట్లాడుతూ.. మూడు నెలల నుండి నీళ్ళు లేక పండించిన పంటలు ఎండిపోతున్నాయని, నీళ్లకోసం బోర్లు వేసి లక్షల రూపాయలు రైతులు నష్టపోతున్నారని అన్నారు. రాష్ట్రంలో వేలాది ఎకరాల్లో పంటలు ఎండిపోయాయని, ఈ ఊరిలోనే వందకు పైగా బోర్లు వేసి అప్పుల పాలయ్యామని రైతులు చెబుతుంటే తనకే కన్నీళ్లు వస్తున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. గోదావరి నదిలో నీళ్ళు ఉండి కూడా దేవాదుల ప్రాజెక్టుల నుండి రైతులకు నీళ్ళు ఇవ్వడంలో కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తిగా విఫలం అయిందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వస్తే రైతులకు రెండు లక్షల రుణమాఫీ చేస్తామని చెప్పి ప్రభుత్వం ఏర్పడి వంద రోజులు దాటినా ఒక్క రూపాయి కూడా మాఫీ చేయకుండా ప్రజలను మోసం చేసిందని విమర్శించారు. రూ.15000 రైతుబంధు, వ్యవసాయ కూలీలకు, కౌలు రైతులకూ ఇస్తామని వాళ్ళను కూడా మోసం చేశారన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన 100 రోజుల్లో 185 మంది రైతులు ఆత్మహత్యలు చేసుకున్నారని ఆరోపించారు. కేసీఆర్ హయాంలో రైతులు సుఖ సంతోషాలతో ఉన్నారని, కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చినంక రైతులకు కష్టాలు పెరిగాయన్నారు. తక్షణమే ప్రభుత్వం స్పందించి ఎకరానికి 25 వేల రూపాయలు నష్టపరిహారం ఇచ్చి, ఉన్న వడ్లను కొని రూ.500ల బోనస్ ఇచ్చి రైతులను ఆదుకోవాలని డిమాండ్ చేశారు. అవసరమైతే రాబోయే రోజుల్లో ప్రజా ఉద్యమానికి బీఆర్ఎస్ శ్రీకారం చుడుతుందని, రైతులతో కలిసి సచివాలయాన్ని ముట్టడి చేస్తామని హెచ్చరించారు.

ఈడీకి డైరెక్టర్ ఏడీ?



తాత్కాలిక నియామకంతో నెట్టుకొస్తున్న కేంద్రం

- ఈడీకి అపరిమిత అధికారాలున్నాయంటూ కోర్టు తీర్పు
- పదవీ విరమణ చేస్తూ తీర్పు చెప్పిన న్యాయమూర్తికి లోక్‌పాల్ పదవితో సత్కారం
- ప్రతిపక్ష నేతలే లక్ష్యంగా దర్యాప్తు సంస్థ దూకుడు
- పాలకపార్టీ కీలుబొమ్మగా మారిందని విమర్శలు



న్యూఢిల్లీ : ఇప్పుడు దేశంలో ఎక్కడ చూసినా వినిపిస్తున్న పేరు ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ). ఈ దర్యాప్తు సంస్థ మున్నెన్నడూ లేని విధంగా విశేషాధికారాలు చెలాయిస్తోంది. ప్రతిపక్ష పార్టీలకు చెందిన నేతలపై దూకుడుగా వ్యవహరిస్తూ దాడులు చేస్తోంది. బీజేపీలో చేరితే సరేసరి. లేకుంటే దాడులు, సోదాలు, శ్రీకృష్ణ జన్మస్థానం...అదే కారాగారవాసం తప్పవు. ఈడీ దాడులు ఎదుర్కొన్న పలు కంపెనీలు కాళ్ల బేరానికి వచ్చి ఎన్నికల బాండ్ల కొనుగోలు ద్వారా అధికార పార్టీకి నజరానాలు సమర్పించుకున్నాయి. ముఖ్యంగా గత రెండు సంవత్సరాల కాలంలో ఈడీ ఎంతో 'క్రియాశీలకం'గా వ్యవహరిస్తూ పాలక పక్షానికి ఎనలేని మేలు చేకూరుస్తోంది.

కుంటిసాకులతో మిశ్రా పదవీకాలం పొడిగింపు

ఈడీకి చిట్టచివరి డైరెక్టర్‌గా వ్యవహరించిన సంజయ్ కె. మిశ్రా పదవీకాలం గత సంవత్సరం సెప్టెంబర్ 15తో ముగిసింది. అంతకుముందు ఆయన పదవీకాలాన్ని మోడీ ప్రభుత్వం పలుసార్లు పొడిగించింది. అందుకోసం అనేక సాకులు చెప్పింది. ఈ విషయంలో సుప్రీంకోర్టు ఆగ్రహాన్ని కూడా చవిచూసింది. ఆయనను పదవిలో కొనసాగించేందుకు కేంద్ర ప్రభుత్వం చేయని ప్రయత్నం అంటూ లేదు. ప్రజా ప్రయోజనాల దృష్ట్యా మిశ్రాను పదవిలో కొనసాగించడం అవసరమని న్యాయస్థానంలో వాదించింది. ఐరాస ఫైనాన్షియల్ యాక్షన్ టాస్క్‌ఫోర్స్ సమీక్ష జరుగుతున్నందున ఆయన కొనసాగడం ముఖ్యమని తెలిపింది. అయినా సుప్రీంకోర్టు ససేమిరా అనడంతో మిశ్రా పదవి నుండి వైదొలగక తప్పలేదు. ఆ తర్వాత ఇప్పటి వరకూ అత్యంత 'శక్తివంతమైన' దర్యాప్తు సంస్థకు పూర్తి స్థాయి డైరెక్టర్‌ను ప్రభుత్వం నియమించలేదు. తాత్కాలిక డైరెక్టర్ రాహుల్ నవీన్‌తోనే కాలం గడుపుతోంది. నవీన్‌కు ఈడీ ప్రత్యేక డైరెక్టర్‌గా అదనపు కార్యదర్శి హోదాలో పదోన్నతి కల్పించడాన్ని క్యాబినెట్ నియామకాల కమిటీ జనవరిలో ఆమోదించింది.

ప్రతిపక్ష నేతలే లక్ష్యంగా...

ప్రతిపక్ష నేతలను లక్ష్యంగా చేసుకొని ఈడీ దూకుడుగా వ్యవహరించడాన్ని 2022లో 'స్క్రోల్' పోర్టల్ ఎత్తిచూపింది. 'ప్రతిపక్ష నాయకులే లక్ష్యంగా ఈడీ వేగవంతంగా దర్యాప్తులు చేపడుతోంది. అయితే బీజేపీ నేతల ప్రమేయం ఉన్న కేసుల్లో మాత్రం అదే వేగం కన్పించడం లేదు' అని తెలిపింది. 2014లో కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత మనీ లాండరింగ్ నిరోధక చట్టం కింద ఈడీ పెట్టిన కేసుల్లో 95 శాతం ప్రతిపక్ష నేతలపై నమోదు చేసినవే. 2014, 2022 సెప్టెంబర్ మధ్యకాలంలో 121 మంది ప్రముఖ నేతలపై ఈడీ నిఘా పెట్టింది. వీరిలో 115 మంది ప్రతిపక్ష నాయకులే. ఆ తర్వాత కూడా ఈ జాబితా చాంతాడంత పెరిగిపోయింది.

ఖాళీల భర్తీలో అలసత్వం

రాజ్యాంగ పదవుల్లో ఉన్న వారి పదవీకాలాన్ని పదేపదే పొడిగించడం, వారు వైదొలిగిన తర్వాత తాత్కాలిక నియామకాలతో కాలక్షేపం చేయడం మోడీ ప్రభుత్వ హయాంలో పరిపాటిగా మారింది. మూడు సంవత్సరాల పదవీకాలం కలిగిన లా కమిషన్‌లో రెండున్నర ఏండ్లుగా పదవులు ఖాళీగా ఉన్నాయి. సమాచార కమిషనర్ పదవులను కూడా సంవత్సరాల తరబడి భర్తీ చేయడం లేదు.

ఈడి అపరిమిత అధికారాలు

మనీ లాండరింగ్ నిరోధక చట్టానికి చేసిన సవరణలకు గత సంవత్సరం సుప్రీంకోర్టు ఓకే చెప్పింది. సమన్లు జారీ చేయడానికి, స్టేట్‌మెంట్లు నమోదు చేయడానికి, అరెస్టులు చేయడానికి, సోదాలు చేయడానికి, ఆస్తులు జప్తు చేయడానికి ఈడీకి విస్తృత అధికారాలు ఉన్నాయని న్యాయస్థానం స్పష్టం చేసింది. రెండు రోజుల్లో పదవీ విరమణ చేయనున్న జస్టిస్ ఏఎం ఖన్విల్కర్ నేతృత్వంలోని బెంచ్ ఈ తీర్పు ఇచ్చింది. ఆ తర్వాత సార్వత్రిక ఎన్నికల ప్రవర్తనా నియమావళి అమలులోకి రావడానికి కొద్ది రోజుల ముందు అంటే ఈ నెల 10న ఖన్విల్కర్‌ను ప్రభుత్వం లోక్‌పాల్‌గా నియమించింది. కాగా తనపై వచ్చిన ఆరోపణలను ఈడీ తోసిపుచ్చింది.



మోడీని

28 పైసల ప్రధాని అని పిలుద్దాం

- తమిళనాడు మంత్రి ఉదయనిధి స్టాలిన్

చెన్నై: ప్రధాని మోడీపై తమిళనాడు మంత్రి, డీఎంకే నాయకుడు ఉదయనిధి స్టాలిన్ విరుచుకుపడ్డారు. అభివృద్ధి విషయంలో రాష్ట్రంపై ఆయన నేతృత్వంలోని బీజేపీ ప్రభుత్వం వివక్ష చూపుతున్నదని విమర్శించారు. ఇకపై మోడీని 28 పైసల ప్రధాని అని పిలవాలని ప్రజలకు పిలుపునిచ్చారు. ఎందుకంటే పన్ను రూపంలో రాష్ట్రం చెల్లించే ప్రతి రూపాయిలో కేంద్రం 28 పైసలు మాత్రమే తిరిగి మనకు వస్తున్నాయని ఆరోపించారు. బీజేపీ పాలిత రాష్ట్రాలకే రాష్ట్రాలకే అత్యధిక నిధులు కేటాయిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. అందుకే మనం మోడీని 28 పైసల ప్రధాని అని పిలుద్దామని చెప్పారు.

లోక్‌సభ ఎన్నికల ప్రచారంలో భాగంగా రామనాథపురం, థేనిలో ఉదయనిధి ర్యాలీలు నిర్వహించారు. ఈ సందర్భంగా తమిళనాడు చిన్నారుల భవిష్యత్తును దెబ్బతీయడానికే కేంద్రం జాతీయ విద్యా విధానాన్ని (ఎన్‌ఈపీ) తీసుకొచ్చిందని ఆరోపించారు. అదేవిధంగా నిధుల పంపిణీ, అభివృద్ధి కార్యక్రమాలు, నీట్ నిషేధం వంటి అంశాల్లో తమిళనాడుపై కేంద్రం వివక్ష చూపిందని విమర్శించారు. మధురైలో నిర్మిస్తున్న ఎయిమ్స్ హాస్పిటల్‌కు సంబంధించి శంకుస్థాపనకు ఉపయోగించిన ఇటుకను ప్రదర్శించారు. నీట్ నిర్మాణం ముందుకు సాగడం లేదనడానికి ఇదే నిదర్శమన్నారు. ఎన్నికలు సమీపిస్తున్న సమయంలోనే ప్రధాని తమిళనాడు పర్యటనకు వస్తున్నారని ఆరోపించారు. రాష్ట్రంలోని 39 లోక్‌సభ స్థానాలకు ఏప్రిల్ 19న ఒకే విడతలో ఎన్నికలు జరుగనున్నాయి. జూన్ 4న ఫలితాలు వెలువడుతాయి.

మహిళా వికలాంగులపై వేధింపులు అరికట్టాలి



- రక్షణ కోసం ప్రత్యేక చట్టం చేయాలి
- సమస్యల పరిష్కారం కోసం ఉద్యమం : ఎన్‌పీఆర్‌డీ మహిళా వికలాంగుల రాష్ట్ర సదస్సులో టి జ్యోతి

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

మహిళా వికలాంగులపై వేధింపులు అరికట్టాలనీ, వారికి ప్రత్యేక రక్షణ తీసుకురావాలని ఐద్వా సీనియర్ నాయకురాలు టి జ్యోతి డిమాండ్ చేశారు. ఆదివారం హైదరాబాద్‌లోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో మహిళా వికలాంగుల సాధికారత.. సంక్షేమంపై రాష్ట్ర సదస్సులో రెండో రోజు నిర్వహిస్తున్న 'మహిళా ఉద్యమం సాధించిన విజయాలు' అనే అంశంపై ఆమె మాట్లాడారు. ప్రభుత్వం అమలు చేస్తున్న గృహ లక్ష్మి పథకంతో పాటు అన్ని ప్రభుత్వ సంక్షేమ పథకాల్లో మహిళా వికలాంగులకు మొదటి ప్రాధాన్యత ఇవ్వాలని డిమాండ్ చేశారు. మహిళా వికలాంగుల హక్కుల పరిరక్షణ కోసం పోరాటాలకు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. మహిళా రిజర్వేషన్ల అమలులో 5శాతం మహిళా వికలాంగులకు అమలు చేయాలని డిమాండ్ చేశారు. మహిళలు అనే కారణంతో వారిని సామాజిక కార్యక్రమాలకు దూరం పెట్టటమేంటని ప్రశ్నించారు. పెండ్లితో సంబంధం లేకుండా ప్రభుత్వ పథకాలు మహిళా వికలాంగులకు ఇవ్వాలన్నారు. గృహ హింస చట్టం మహిళా వికలాంగులు వినియోగించుకునే విధంగా అవసరమైన మార్పులు చేయాలని డిమాండ్ చేశారు. పని ప్రదేశాల్లో మహిళలకు ఎందుకు రక్షణ కల్పించడం లేదని ప్రశ్నించారు. కేంద్రంలో బీజేపీ అధికారంలోకొచ్చిన పదేండ్ల కాలంలో హింస పెరిగిందని చెప్పారు. సంఘం రాష్ట్ర అధ్యక్ష ,కార్యదర్శులు కె వెంకట్, ఎం అడివయ్య, మహిళా విభాగం కన్వీనర్ సాయమ్మ, రాష్ట్ర కోశాధికారి ఆర్ వెంకటేష్,ఉపాధ్యక్షులు వరమ్మ, స్వామి, రాజు, యశోద, అరిఫా, సహాయ కార్యదర్శులు దశరథ్, కాషప్ప, లక్ష్మి, , రాష్ట్ర నాయకులు రాధమ్మ, జయలక్ష్మి, షాహినా బేగం, లలిత, సావిత్రి, లింగన్న, గౌతమ్,ప్రకాష్, ప్రభు స్వామిలతో పాటు వివిధ జిల్లాల నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.



దేశం చూసిన అతిపెద్ద కుంభకోణం

ఎన్నికల బాండ్లపై కేరళ సీఎం విమర్శ

కన్నూర్: ఎన్నికల బాండ్లు దేశం చూసిన అతిపెద్ద కుంభకోణమని కేరళ ముఖ్యమంత్రి పినరయి విజయన్ విమర్శించారు. కన్నూర్‌లో సీఏఏకు వ్యతిరేకంగా ఆదివారం నిర్వహించిన ర్యాలీని ప్రారంభించిన అనంతరం ఆయన మాట్లాడారు. ఈ బాండ్లు రాజ్యాంగ విరుద్ధమని సుప్రీంకోర్టులో సీపీఐ(ఎం) పిటిషన్ వేసిందని, దీంతోనే సుప్రీంకోర్టు జోక్యం చేసుకున్నారు. సుప్రీంకోర్టు తీర్పు తర్వాత కూడా ఆ సమాచారాన్ని దాచిపెట్టేందుకు కేంద్రం చాలా ప్రయత్నాలు చేసిందని, ఇందులో భాగంగానే దేశ దృష్టిని మరల్చిందేకు ఢిల్లీ ముఖ్యమంత్రి కేజ్రీవాల్‌ను అరెస్టు చేశారని అన్నారు. 'మన దేశం ఎటు పోతోంది. ఒక ముఖ్యమంత్రి ఇప్పుడు నిర్బంధంలో ఉన్నారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం ఏమైనా చేస్తామనే వైఖరిలో ఉంది' అని విమర్శించారు.

ఎనిమిదో రోజు ఈడీ కస్టడీలో కవిత

నవతెలంగాణ-న్యూఢిల్లీ బ్యూరో



ఢిల్లీ లిక్కర్ స్కామ్ మనీలాండరింగ్ వ్యవహారంలో ఎనిమిదో రోజు ఈడీ అధికారులు కవితను విచారించారు. తాజాగా కస్టడీ పొడగింపు అప్లికేషన్ లో మెన్షన్ చేసిన అంశాలపై ఆరా తీసారు. సౌత్ గ్రూప్ లో నగదు బదిలీ/వినియోగంలో కీలక పాత్ర పోశించిన కవిత మేనల్లుడు మేక శ్రీ శరణ్ టార్గెట్ గా కవితను విచారించినట్లు తెలిసింది. ఇందులో భాగంగా శరణ్ బిజినెస్, లావాదేవీల అంశంపై మరోసారి కవితను ప్రశ్నించారు. దీంతో పాటు ఐటీఆర్, కుటుంబ వ్యాపారాలు, ఆర్థిక లావాదేవీలకు సంబంధించిన పలు సమాచారాన్ని కోరినట్లు తెలిసింది. ఇప్పటికే ఈ అంశాలపై కవితను ప్రశ్నించిన ఈడీ...ఆమె నుంచి ఎలాంటి సమాచారాన్ని రాబట్టలేకపోయామని తాజాగా కోర్టుకు వెల్లడించిన విషయం విధితమే. పైగా కవిత తమ ప్రశ్నల నుంచి తప్పించుకునేందుకు కుంటి సాకులు చెబుతోన్నారని, విచారణకు సహకరించడంలేదని ఆరోపించింది. దీంతో కవిత నుంచే కాకుండా... లిక్కర్ వ్యాపారీ సమీర్ మహేంద్రు వైపు నుంచి మేక శరణ్ పాత్రపై ఆరా తీస్తున్నట్లు తెలిసింది. తమ ముందు విచారణకు హాజరుకావాలని ఇప్పటికే సమీర్ మహేంద్రుకు ఈడీ సమన్లు జారీ చేసింది. అయితే ఏ రోజు సమీర్ ను విచారిస్తారనే అంశంపై తెలిపేందుకు ఈడీ అధికారులు నిరాకరించారు. కేవలం సమీర్ ను ఒక్కడినే విచారిస్తారా... లేక ఇప్పటికే ఈ కేసులో అప్రూవర్లుగా మారిన సౌత్ గ్రూప్ లోని కవిత మాజీ సీఏ బుచ్చిబాబు, మాగుంట రాఘవ్, మాగుంట శ్రీనివాస్ లుతో కలిపి విచారిస్తారా? అనే విషయం తెలియాల్సి ఉంది.

ఇతరులతో కలిపి కవిత విచారణ...?

తొలి ఏడు రోజులు కస్టడీలో భాగంగా కేవలం ఐదు రోజులు మాత్రమే కవితను ఈడీ అధికారులు విచారించారు. ఇదే టైంలో మరో నలుగురు వ్యక్తులను కూడా ఈడీ అధికారులు ప్రత్యేకంగా విచారించారు. ఈ సందర్భంగా వీరు ఇచ్చిన స్టేట్మెంట్ ల ఆధారంగా కవితను క్రాస్ ఎగ్జామిన్ (కన్ఫ్రంటేషన్) చేసినట్లు ఈడీ కోర్టుకు తెలిపింది. వంద కోట్ల ముడుపులు, మరో రూ.192.8 కోట్ల అక్రమార్జనతో కలిపి మొత్తం రూ. 292.8 కోట్ల వ్యవహారంపై కవిత భాగస్వామ్యం ఉన్నట్లు ఈడీ చెబుతోంది. దీనికి సంబంధించి కవిత పాత్ర, ఆమె మేనల్లుడు శరణ్ కీ రోల్ పై మరికొందరిని విచారించాల్సి ఉందని పేర్కొంది. ఈ విచారించాల్సిన జాబితాలో ఉన్న వ్యక్తులతో కవితను కలిపి ప్రశ్నించే అవకాశం ఉందని ఈడీ అధికారులు చెబుతున్నారు. ముఖ్యంగా ఇండో స్పిరిట్ లో కవిత కు డమ్మీ పర్సన్ గా వ్యవహరించిన అరుణ్ రామ చంద్ర పిళ్లై, అరబిందో కంపెనీ డైరెక్టర్ శరత్ చంద్ర ల పేర్లు వినిపిస్తున్నాయి. అలాగే, ఆప్ తరఫున స్కాంలో ప్రధాన పాత్ర పోశించిన విజయ్ నాయర్ ను విచారించనున్నట్లు తెలిపింది. కాగా, ఎనిమిదో రోజు సైతం ఆమె కుటుంబ సభ్యులు కవితను కలిశారు.



అందరికీ హోలీ శుభాకాంక్షలు

ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి

నవతెలంగాణబ్యూరో-హైదరాబాద్

రాష్ట్ర ప్రజలందరికీ ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్‌రెడ్డి హోలీ పండుగ శుభాకాంక్షలు తెలిపారు. ప్రేమ, ఆప్యాయత సంతోషాల హరివిల్లుగా, శాంతి సౌభ్రాతృత్వానికి ప్రతీకగా నిలిచే రంగుల పండుగ హోలీని అందరూ ఆనందంగా జరుపుకోవాలని ఒక ప్రకటనలో పేర్కొన్నారు. సహజ సిద్ధమైన రంగులతో సాంప్రదాయ పద్ధతులతో ఈ రంగుల పండుగను సంతోషంగా జరుపుకోవాలని కోరారు. కొత్త ప్రభుత్వం రాష్ట్రంలో అనుసరిస్తున్న ప్రజా పాలనలో అటు సంక్షేమం, ఇటు అభివృద్ధి ఫలాలు అందరి కుటుంబాల్లో సప్తవర్ణ రంగుల శోభను నింపుతాయని అభిప్రాయపడ్డారు. కుల, మతాలకు అతీతంగా అన్ని వర్గాల ప్రజల సమైక్యతను చాటి చెప్పే ఈ పండుగ దేశమంతటా కొత్త మార్పుకు శ్రీకారం చుట్టబోతున్నదని ఆశాభావం వ్యక్తం చేశారు. ప్రజల ఆశలు, ఆకాంక్షలకనుగుణంగా త్వరలోనే దేశంలో అన్ని వర్గాలకు న్యాయం చేకూర్చే కొత్త ప్రజాస్వామ్య వాతావరణం వెల్లివిరిస్తుందనే ఆశాభావం వ్యక్తం చేశారు.

బీజేపీ ఎంపీ అభ్యర్థుల జాబితా విడుదల

- ఆరు స్థానాలకు అభ్యర్థుల ప్రకటన
- రఘురామ కృష్ణరాజుకు లేనట్లే...

నవతెలంగాణ-న్యూఢిల్లీ బ్యూరో

బీజేపీ ఏపీలో పోటీ చేసే ఆరు లోక్‌సభ స్థానాలకు అభ్యర్థులను ప్రకటించింది. ఈ మేరకు ఆదివారం బీజేపీ విడుదల చేసిన ఐదో జాబితాలో ఆరు పార్లమెంట్ స్థానాలకు అభ్యర్థులను ప్రకటించింది. అయితే ఇటీవలి వైసీపీ రాజీనామా చేసి, టీడీపీ బీజేపీ, జనసేన కూటమి తరఫున పోటీ చేస్తానని ప్రకటించిన నర్సాపురం ఎంపీ రఘురామ కృష్ణరాజుకు మొండిచెయ్యి మిగిలింది. నర్సాపురం నుంచి ఆయన బీజేపీ తరపున పోటీ చేస్తారని అందరూ అనుకున్నారు. కానీ నర్సాపురం అభ్యర్థిగా శ్రీనివాస వర్మను బీజేపీ బరిలోకి దింపింది. రాజమండ్రి నుంచి పురందేశ్వరి, రాజంపేట నుంచి నల్లారి కిరణ్‌కుమార్‌రెడ్డి, అరకు నుంచి కొత్తపల్లి గీత, తిరుపతి నుంచి వర ప్రసాద్, అనకాపల్లి నుంచి సీఎం రమేష్ బరిలోకి దింపింది. అయితే తిరుపతి నుంచి వరప్రసాద్ ఆదివారమే బీజేపీ లో చేరారు. చేరిన రోజే టిక్కెట్టు దక్కించుకున్నారు.

తెలంగాణలో రెండు స్థానాలకు అభ్యర్థులు

బీజేపీ తెలంగాణలో మరో రెండు స్థానాలకు అభ్యర్థులను ప్రకటించింది. వరంగల్ (ఎస్సీ) నుంచి ఆరూరి రమేష్, ఖమ్మం నుంచి తాండ్ర వినోద్‌రావులను బరిలోకి దింపింది.

ఎస్ఈసీసీ వెబ్‌సైట్ డౌన్

- రెండు నెలలకు పైగా పని చేయని వైనం
- సాంకేతిక కారణాలతోనే ఈ సమస్య
- కేంద్ర గ్రామీణాభివృద్ధి మంత్రిత్వ శాఖ వెల్లడి

న్యూఢిల్లీ : భారత్‌కు చెందిన సామాజిక ఆర్థిక, కుల గణన (ఎస్ఈసీసీ) వెబ్‌సైట్ రెండు నెలలకు పైగా పని చేయటం లేదు. అయితే, సాంకేతిక కారణాలతోనే ఎస్ఈసీసీ వెబ్‌సైట్ డౌన్ అయిందని ఈ వెబ్‌సైట్‌ను నిర్వహించే కేంద్ర గ్రామీణాభివృద్ధి మంత్రిత్వ శాఖ వెల్లడించింది. వెబ్‌సైట్‌ను తిరిగి యాక్టివ్‌గా ఉంచేందుకు అన్ని ప్రయత్నాలనూ చేసినట్టు తెలిపింది. 1931 తర్వాత 2011లో భారత్ ఎస్ఈసీసీని నిర్వహించింది. ఇది పేపర్‌లేకుండా నిర్వహించిన తొలి కుల గణన ఇది. దేశవ్యాప్తంగా 640 జిల్లాల్లో ఎలక్ట్రానిక్ పరికరాల ద్వారా ఈ గణన జరిగింది. గ్రామాల్లో ప్రతి మూడు కుటుంబాల్లో ఒకటి భూమి కలిగి లేదనీ, జీవనోపాధికి మ్యాన్యువల్ లేబర్ పైనే ఆధారపడుతున్నాయని తేలింది. అలాగే, గ్రామీణ భారత్‌లోని పేద విద్య స్థితి గురించి కూడా ఇందులో వెల్లడైంది.



దేశవ్యాప్తంగా ఎస్సీ, ఎస్టీ, ఓబీసీలతో పాటు ఆర్థికంగా వెనుకబడిన వర్గాలకు ఆయుష్మాన్ భారత్, ప్రధాన మంత్రి జన ఆరోగ్య యోజన, ప్రధాన మంత్రి ఆవాస్ యోజన-గ్రామీణ వంటి వివిధ సామాజిక సంక్షేమ పథకాలను మెరుగుపర్చటమే ఈ గణన లక్ష్యం. అయితే, ఇలాంటి కీలక సమాచారం పబ్లిక్ డొమైన్‌లో ఇప్పుడు అందుబాటులో లేకపోవటం గమనార్హం. ప్రభుత్వ సంక్షేమ పథకాలను అందించే విషయంలో మోడీ సర్కారుకు ఎలాంటి చిత్తశుద్ధి లేదనీ, ఇందుకు ఎస్ఈసీసీ వెబ్‌సైట్ పని చేయకపోవటమే ఒక ఉదాహరణ అంటూ సామాజిక కార్యకర్తలు, ప్రజా సంఘాల నాయకులు ఆరోపిస్తున్నారు.

ప్రస్తుతం దేశంలో కులగణన అంశం తీవ్ర ప్రాధాన్యతను సంతరించుకున్న విషయం విదితమే. కుల గణనను నిర్వహించిన బీహార్ రాష్ట్రం.. ఇతర రాష్ట్రాలకు ఆదర్శప్రాయంగా నిలిచింది. ఇప్పుడు ఇదే దారిలో ఏపీ చేరింది. తాము కూడా కులగణను నిర్వహించనున్నట్టు ఆ రాష్ట్ర ప్రభుత్వం ఇటీవలే ప్రకటించింది. ఈ ఏడాది జనవరి 19న ఈ సర్వే ఇప్పటికే మొదలైంది. 2024 లోక్‌సభ ఎన్నికల్లో అధికారంలోకి వస్తే దేశవ్యాప్తంగా కులగణను నిర్వహిస్తామని కాంగ్రెస్ వంటి రాజకీయ పార్టీలు సైతం ఇప్పటికే ప్రకటించిన విషయం విదితమే. కాగా, భారత్‌లో పదేండ్లకోసారి నిర్వహించే జనగణన 2021లో కోవిడ్-19 మహమ్మారి కారణంగా నిరవధికంగా వాయిదా పడిన విషయం తెలిసిందే. 150 ఏండ్ల దేశ చరిత్రలో ఇలా జనగణన ఆలస్యం కావటం ఇదే తొలిసారవటం గమనార్హం.

దేశం ఇప్పుడు చెరబడ్డ పక్షి



అహంకారం తలకెత్తుకున్నాక
ఈ దేశం మాసొత్తు అనే పొగరు
ఎవరి కాలును నేల మీద
నిలవనీయడం లేదు
చూస్తుండగానే దేశం
మధ్యయుగం బాటపట్టింది
ఓట్లు రాల్చే ఈవీఎంకు
తనను అంబాసిడర్ చేసిన తీరుకు
అయోధ్యలో నిలబెట్టిన నల్లనిరాయి

నిలువెల్లా వణికిపోతున్నది
ఏది ఏమైనా... పాచికలు పారుతున్నాయి
పాదుకలు కొందరి గుండెల మీద...
బలవంతంగా వాలుతున్నాయి
మూర్ఖత్వం అధికార పీఠం మీద

పగలబడి నవ్వుతోంది...
దగాపడడం కొత్తకాదు
దేవుడి రూపంలో మరోసారి దండెత్తడమే
ఈసారి అసలు విషాదం...
డిజిటల్ యుగంలో మెదళ్లను వాడు
వేదకాలానికి తరలిస్తున్నాడు
సనాతనం ముసుగులో
వాడు సన్యాసులను పెంచనున్నాడు
ఒకే ఒక్కటనేవాడి
కోటిన్నొక్క చీలికల ఎత్తుల నడుమ
దేశం ఇప్పుడు చెరబడ్డ పక్షి వేటగాడు స్పష్టం
వెన్నుపోటుదారులు స్పష్టం
అన్నీ అందరికి తెలిసిన పాత్రలే
మౌనం మాత్రమే ఇప్పుడు అతిపెద్ద జబ్బు

తగలబెట్టేవాడు తగలబెడుతున్నాడు
చోద్యం చూసే వాళ్లు చూస్తున్నారు...
పక్కవాడి ఇల్లుకాలుతుంటే
చేతులు కాల్చుకుంటున్న
వానరసేనలారా...
రేపు తగలబెట్టేది ఇక నీ యిల్లేనని గుర్తించండి!
ఈ దేశమ్మిదే కదా స్వేచ్ఛను ప్రబోధించిన
శాంతికాముకుడు నడయాడింది...
ఈ మట్టి మీదనే కదా సమానత్వం కోసం
సరికొత్త బోధనలు చేసింది...
ఈ భూమ్మిదే కదా
అందరం ఒక్కతల్లి బిడ్డలమే అని
చేతిలో చెయ్యేసి చెప్పింది...
మరిప్పుడు ఈ చరిత్ర ఏమవుతోంది

ఏ గోముఖ వ్యాఘ్రాలు
మన మధ్యలో మంటపెడుతున్నాయి
ఏ కబంధ హస్తాలు
మన బంధాలను కబళిస్తున్నాయి...
బత్కొచ్చినోడి బరితెగింపే
ఇప్పుడు రాజకీయమై ఊరేగుతోంది
భక్తిపూసిన కత్తిని నూరుతున్నాడువాడు
నీ మెడ మీదో...
నా మెడ మీదో అది వేళాడుతోందని
గుర్తించకపోవడమే అసలు విషాదం...
ఈ ఆర్యన్ దేవుళ్లకు నువ్వు తలాడించినప్పుడే
వాడికి సంపుడు పంజెం దొరికింది
నెమ్మదిగా వాడు
నీ పోశమ్మను, మైసమ్మను అంతం చేసేశాడు...

మన బీరప్పను, కాటమయ్యను
ఎప్పుడో కాటగలిపిండు
నిన్ను మాయచేసి టూరిస్టు బస్సులో నిన్ను
అయోధ్యలో దింపుతాడు
నీకు దైవదర్శనం అయ్యేలోపు
నీ ఓట్లను జేబు దొంగై కొట్టేస్తాడు
నిన్న బంధువులం అన్నాడు
నేడు ఒక్కటే జీఎస్టీ అంటున్నాడు
రేపు మేము మాత్రమే పాలకులమంటూ
తరాల బానిసత్వాన్ని
నీకు బహుమానంగా ఇస్తాడు!

- డా.పసునూరి రవీందర్
7702648825

ఏడు పదుల భాషా సాహిత్యాల కేతనం 'సాహిత్య అకాడమి'



- డా॥ పత్తిపాక మోహన్
9966229548

సాహిత్య అకాడమి... అకాడమి ఆఫ్ లెటర్స్‌ను భారత ప్రభుత్వం భాషా సాహిత్యాల స్వతంత్ర సంస్థగా ఏర్పాటు చేసి ఈ మార్చి పన్నెండుకు అక్షరాల ఏడు దశాబ్దాలు. ఆ మైలురాయి స్వర్ణపుటలతో లిఖించుకునేందుకు మార్చి పదకొండు నుండి పదిహేడు వరకు ఏడురోజులపాటు అతి పెద్ద సాహిత్యోత్సవాన్ని నిర్వహించింది.

స్వాతంత్ర్యానంతరం దేశ సాహిత్య సాంస్కృతిక సాంకేతిక విద్య వికాసం అభివృద్ధి కొరకు భారత ప్రభుత్వం సాహిత్య అకాడమి, నేషనల్ బుక్ ట్రస్ట్, ఇండియా, సంగీత నాటక అకాడమి, లలితా కళా అకాడమి, సెంట్రల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఇండియన్ లాంగ్వేజస్, ఇండియన్ కౌన్సిల్ ఫర్ కల్చరల్ రిసెర్చ్, నేషనల్ ట్రాన్స్‌లేషన్ మిషన్, ఇందిరా గాంధీ నేషనల్ సెంటర్ ఫర్ ఆర్ట్స్ వంటి అనేక సంస్థలను స్థాపించింది. ఆనాటి దార్శనికత కేవలం పై రంగాల్లోనే కాకుండా ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ, ఆల్ ఇండియా ఇనిస్టిట్యూట్ మెడికల్ సైన్సెస్ వంటి అనేక సంస్థలు ఏర్పడేందుకు దోహదం చేసింది. వాటి ఫలితాలను నేడు మనం అనుభవిస్తున్నాం. 1954 మార్చి 12న సాహిత్య అకాడమి పురుడుపోసుకుంది. సాహిత్యంతో సంబంధమున్న ప్రతి ఒక్కరికి భారతీయ భాషా సాహిత్యాల వికాస విస్తారాల కోసం ఏర్పాటు చేయబడ్డ సాహిత్య అకాడమి పేరు వినగానే అత్యంత ప్రతిష్టాత్మకంగా భావించే సాహిత్య అకాడమి పురస్కారం తొలుత మదిలో మెదులుతుంది.

1955లో తొలి పురస్కారం సురవరం ప్రతాపరెడ్డి తన ప్రఖ్యాత రచన 'ఆంధ్రుల సాంఘిక చరిత్ర' గ్రంథానికి ఈ పురస్కారం అందుకున్నారు. అప్పటి నుండి నిన్న 2023వ సంవత్సరం పురస్కారం స్వీకరించిన తల్లావఝ్ఝల పతంజలిశాస్త్రి వరకు వారివారి భాషాసాహిత్యాల్లో విశేషకృషి చేసిన వందల మంది ప్రఖ్యాత రచయితలు ఈ పురస్కారం గెలుచుకున్నారు. ఈ పురస్కారాన్ని భారత రాజ్యంగంలో పేర్కొన ఇరవై రెండు భారతీయ భాషల్లో ప్రతియేడు అందిస్తారు. అటు తరువాత ఈ పురస్కారానికి తోడుగా అనువాద సాహిత్యంలో విశేష రచనకు 'అనువాద సాహిత్య పురస్కారం' ప్రారంభించింది. తరువాత బాల సాహిత్యంలో విశేషరచనను 'బాల సాహిత్య పురస్కారం'తో, ముప్పైఅయిదేండ్ల లోపు యువతరానికి స్ఫూర్తిని కలిగించేందుకు 'యువ పురస్కారం' అకాడమి అవార్డుల పరంపరలో చేరాయి. వీటికి తోడు 'భాషా సమ్మాన్' వంటి భాషా సాహిత్యాల్లో కృషిచేసిన వారికిచ్చే పురస్కారంతో పాటు అత్యంత ప్రతిష్టాత్మకంగా భావించే అకాడమి 'ఫెలోషిప్' కూడా సాహిత్య అకాడమి ప్రదానం చేస్తుంది.

నేను పైన పేర్కొన్న సాహిత్య అకాడమి డెబ్బైయేండ్ల పండుగ సందర్భంగా నిర్వహించిన 'సాహిత్యోత్సవ్' గురించి ఆకాడమి అధ్యక్ష, ఉపాధ్యక్షులు మాధవ్ కౌశిక్, ఆచార్య కుముద్ శర్మ, కార్యదర్శి డా.కృత్తివెంటి శ్రీనివాసరావుల పత్రికా ప్రకటన ప్రకారం దేశ విదేశాల నుండి పదకొండు వందల మంది కవులు, రచయితలు, భాషావేత్తలు, విమర్శకులు పాల్గొనగా, ఆంగ్లంతో పాటు దాదాపు నూటా డైబ్బై ఐదు భాషల్లో నూటా డెబ్బై అయిదు వరకు సాహిత్య కార్యక్రమాలు ఈ ఉత్సవంలో నిర్వహించబడ్డాయి.

పదకొండవ తేదిన అకాడమి కార్యాలయమున్న రవీంద్ర భవన్ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన ప్రత్యేక వేదికలపై సాహిత్యోత్సవం జరగగా ఈ ఉత్సవాన్ని కేంద్ర సాంస్కృతిక శాఖా మంత్రి అర్జున్ రామ్ మేఘ్‌వాల్ జ్యోతి ప్రకాశం చేసి ఉత్సవాల్ని ప్రారంభించారు. ఇందులో భాగంగా సాహిత్య అకాడమి ప్రతియేడు ప్రదానం చేసే వార్షిక సాహిత్య పురస్కారాల్ని ఈ సభల్లో భాగంగా ప్రదానం చేశారు. కాగా ఈ ఉత్సవాల్లో అత్యంత విశేషంగా నిలిచిన కార్యక్రమం పదమూడో తేదీన మేఘ్‌దూత్ ఒపెన్ ఎయిర్ థియేటర్‌లో వార్షిక ప్రసంగాల్లో భాగంగా జరిగిన 'సంవత్సర్ లెక్చర్'. గత ముప్పైఎనిమిది యేండ్లుగా అకాడి ఫౌండేషన్ డేలో భాగంగా నిర్వహిస్తున్న వార్షిక ప్రసంగాల పరంపర యిది. అయితే ప్రారంభం నుండి ఇప్పటి వరకు లబ్దప్రతిష్టులైన అనేక మంది విశేష ప్రసంగాలు చేశారు. కాగా ఈ యేడు ఈ ప్రసంగం ప్రముఖ ఉర్దూ కవి, రచయిత, సినీ కవి, దర్శకులు అనేక జాతీయ, అంతర్జాతీయ పురస్కారాలు అందుకున్న గుల్జార్‌ది. 'సాహిత్యం-సినిమా' అంశంపై తన ప్రయాణం మొదలుకుని నేటి వరకు సాగిన పాశ్చాత్య, భారతీయ సినిమా నడకను, భారతీయ సినిమా ప్రారంభం నుండి నేటిదాకా జరిగిన అనేక అంశాలు, సినిమాలుగా మారిన సాహిత్యం వంటి అంశాలపై ఆయన విశేష ప్రసంగం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 'మూకీ సినిమాల కాలంలో సినిమాల్లో ప్రేక్షకులు మాట్లాడే వారని, నేడు టాకీ సినిమా కాలంలో ప్రేక్షకులు మౌనంగా ఉంటున్నారని అన్నారు.

ఈ కార్యక్రమ మరో విశేషం దాదాపు ఆరు, ఏడు రోజులపాటు ఆస్కార్ అవార్డు మొదలుకుని భారతీయ జ్ఞాన పీఠం, సరస్వతీ సమ్మాన్, కాళిదాస్ సమ్మాన్, సాహిత్య అకాడమి పురస్కారం, అనువాద పురస్కారం, బాల సాహిత్య పురస్కారం, యువ పురస్కారం అందుకున్న రెండు వందల మందికి పైగా రచయితలు, కవులు ఒకేచోట చేరడం మరో విశేషం.

భారతీయ సాహిత్యోత్సవ ఇతిహాసంలో ఇది అతి పెద్ద కార్యక్రమం అనదగిన ఇందులో బాల సాహిత్యం మొదలుకుని గ్రాఫిక్ నవలా సాహిత్యం, ది ఐడియా ఆఫ్ ఇండియా, బహుభాషా కవి సమ్మేళనాలు, బహు భాషా కథా సమ్మేళనాలు, మాతృభాషల ప్రాధాన్యత, సాహిత్యానువాదం సాంస్కృతిక అనువాదమా?, ఈశాన్య భారతం మరియు పాశ్చాత్య రచనల గోష్ఠి, ఈశాన్య భారతం మరియు పాశ్చాత్య రచయితల ముఖాముఖి, గిరిజన భాషా కవులు కవిసమ్మేళనం, మట్టిపాట పేర ఏర్పాటైన గిరిజన కవుల కవితా గానం, ఇరవై ఒకటవ శతాబ్దపు ఆంగ్ల సాహిత్యం, ఈ బుక్-ఆడియో బుక్ పుస్తకానికి ప్రత్యామ్నాయంగా మారిందా?, రచయితలు, ప్రచురణ కర్తలు- ముద్రణా హక్కులు, సాహిత్యం-సామాజికోద్యమాలు, ఈశాన్య భారతం- దక్షిణ భారత కవి గానం, నారీ చేతన, మీర్ తక్‌మీర్ త్రిశతాబ్ది సదస్సు, స్వాతంత్రానంతర భారతీయ సాహిత్యం సదస్సు, గిరిజన రచయితల కథా సమ్మేళనం, భారత దేశంలో భక్తి సాహిత్యం, భారతీయ భాషల్లో బాల సాహిత్యం, సాహిత్య అకాడమి అవార్డు గ్రహీతల ముఖాముఖి, దివ్యాంగ రచయితల సమ్మేళనం వంటి దాదాపు నూటా డెబ్బై అయిదు కార్యక్రమాలు ఈ సాహిత్యోత్సవ విభిన్న పార్శ్వాలను, విలక్షణతను తెలుపుతుంది.

ఈ కార్యక్రమ మరో విశేషం దాదాపు ఆరు, ఏడు రోజులపాటు ఆస్కార్ అవార్డు మొదలుకుని భారతీయ జ్ఞాన పీఠం, సరస్వతీ సమ్మాన్, కాళిదాస్ సమ్మాన్, సాహిత్య అకాడమి పురస్కారం, అనువాద పురస్కారం, బాల సాహిత్య పురస్కారం, యువ పురస్కారం అందుకున్న రెండు వందల మందికి పైగా రచయితలు, కవులు ఒకేచోట చేరడం మరో విశేషం. ఇంకా అనేక రకాల ఆలోచనాధారలు, విభిన్న ప్రాంతాలు, సిద్ధాంతాల వ్యక్తులు ఒకచోట చేరి వివిధ అంశాలపై తమదైన మతాల్లో చర్చించడం సాధారణ విషయం కాదు. దాదాపు పదకొండు వందల మంది రచయితల పరిచయాలతో అకాడమి ఈ సందర్భంగా తెచ్చిన పరిచయిక ఒక గొప్ప అనుభూతుల జ్ఞాపిక కూడా. ఇందులో లబ్దప్రతిష్టులైన సాహితీ మూర్తుల సరసన నాలాంటి విద్యార్థులకు అవకాశం దొరికింది. మరో ఐదేండ్లలో సాహిత్య అకాడమి

అనేక రకాల ఆలోచనాధారలు, విభిన్న ప్రాంతాలు, సిద్ధాంతాల వ్యక్తులు ఒకచోట చేరి వివిధ అంశాలపై తమదైన మతాల్లో చర్చించడం సాధారణ విషయం కాదు. దాదాపు పదకొండు వందల మంది రచయితల పరిచయాలతో అకాడమి ఈ సందర్భంగా తెచ్చిన పరిచయిక ఒక గొప్ప అనుభూతుల జ్ఞాపిక కూడా.

వజ్రోత్సవ వేడుకలకు సమాయత్తం కానుంది. ఈలోపు గతంలో యువ పురస్కారాలు నెలకొల్పినట్టు ఇవ్వాళ్ళ సాహిత్య సృజనలో పాల్గొని రచనలు చేస్తున్న బాల బాలికలకు ప్రోత్సాహంగా బహుమతులను అందిస్తే బాగుంటుంది. అది అకాడమి అవార్డులాగా కాకున్న సృజనలో ఆసక్తి కనబరిచిన విద్యార్థులకు సి.సి.ఆర్.టి అందిస్తున్నట్టు చిరు పారితోషకంగా ఉంటే బాగుంటుంది. ఇవ్వాళ్ళ భారతీయ భాషల్లో గతంలో లాగా పిల్లల కోసం పత్రికలు ఎక్కువ సంఖ్యలో రావడం లేదు. ఇది ఆలోచించాల్సిన ముచ్చట. ఈ దిశగా సాహిత్య అకాడమి 'ఇండియన్ లిటరేచర్', 'సమకాలీన భారతీయ సాహిత్య' లాగా 'బాలల పత్రిక' తచ్చినట్టయితే భారతీయ బాలలకు ఇంతకు మించిన బంగారు తాయిలం మరొకటి ఉండదు. సాహిత్య అకాడమి డెబ్బై అయిదేండ్ల పండుగలోగా ఇది సాకారం కావాలని తెలుగు బాలల పక్షాన, భారతీయ బాలల పక్షాన మనసారా పబ్బతివట్టి కోరుకుంటున్న.

సారాంశం

అందంగా దిద్దుకుంటావో
ఆకర్షణీయంగా రుద్దుకుంటావో
ఆహార్యంతో హత్తుకుంటావో
రూపం
నీ మొదటి పాస్ పోర్ట్

కంఠానికి ఆగ్రానద్దుతావో
వస్తువుకు బోర్డర్లు దిద్దుతావో
ఊహను వాచ్యం చేస్తావో
మాట
స్టాంపు పడాల్సిన వీసా



నాలుగు తొవ్వలు తొక్కుతావో
నలుగురి నోళ్లలో నానుతావో
బతుకుదెరువులో మునుగుతావో
బాధల్లో తేల్తావో
నీ చేతనే రూపుదిద్దుకునే నడత మాత్రమే
నీ భవిత

ఏం చెప్పి
ఏం చేస్తావో నీ ఇష్టం
ఎక్కడ మొదలై
ఎక్కడ చేర్తావో నీ స్వేచ్ఛ
నడకను చూడరు
నడతను చూడరు
నీ సారాంశపు నీడను చూస్తారు
దాని మారుపేరు శీలం
అదెత్తే అవతారం కీర్తి

- ఏనుగు నరసింహారెడ్డి,
8978869183

తీపి..చేదు లా సామ..భేద



కాళ్ళకూరి శైలజ, 885401882

'కవిత్వం మహిళకు విలాస వస్తువు కాదు. ఆమె అస్తిత్వాన్ని ప్రకటించే ప్రబల నిదర్శనం' అన్నారు Andre Lorde. Personal is political అని స్త్రీవాదం మొదలై ఉండొచ్చు గాక. ఆధునిక యుగంలో స్త్రీ ప్రయాణం మాత్రం వైయక్తికం నుంచి అస్తిత్వ పరిశోధన దిశగా, కౌటుంబికం నుంచి సామూహిక ఎరుకగా కొత్త దారులు వెదుకుతూ సాగుతోంది. ఫణి మాధవి కన్నోజు కవిత్వ తత్వాన్ని చెరకుగెడ నమిలినట్టు మెల్లగా, సొంతంగా తనలోనికి ఆవాహన చేసుకుంటున్న కొత్త తరం రచయిత.

కవి సంగమంలో శీర్షిక నిర్వహించే పథంలో తనను తాను మలుచుకుంటూ అడుగులు వేస్తున్నారు. 'ఆమె అక్షరాలకు మూలం ఒక దు:ఖం అయితే కొనసాగింపుకు అనేక దు:ఖాలు కారణం' అంటారు మాధవి. అది కేవలం కన్నీళ్ళు పెట్టించేది, నిదురను కలచివేసేది కాదు! 'ఆవేశాన్ని ఎగదోసిన దు:ఖం, ఆగ్రహాన్ని కెరలించిన దు:ఖం, ఆలోచనతో అనునయించిన దు:ఖం' అని దుఃఖపు పలు పార్శ్వాలను అన్వేషించే స్థిర చిత్తం కలవారు ఫణి మాధవి. ఆమె దు:ఖాన్ని ఒక ఆయుధంగా మలచుకున్నారు. ఆధిపత్య భావంపై అక్షర ఆయుధాన్ని సంధించడం అంటే పున్నమి పూట ఎగసిపడే సముద్ర తీరం దగ్గర తన పిల్లలకు ఎగరడం నేర్పే seagull పక్షి మళ్ళీ మళ్ళీ చేసే ప్రయత్నం లాంటిది.

ఈ కవితా సంపుటిలో ఎరుకతో చేసే 'నిరసన' సామోపాయం మెలకువతో చేసే 'ధిక్కారం' భేదోపాయంగా ప్రయోగించారు. కళ్ళెదుట కనబడే నిజాన్ని చూడలేని నిర్లిప్తత, చూసీ చూడనట్టు ఉండిపోయే అశక్తత ఈ రెండింటిని జాగ్రత్తగా గమనించే సంయమనం ఈ కవిలో ఉంది. లింగ వివక్ష, స్త్రీ అణచివేత వీటిని చట్టం అంతో ఇంతో వ్యతిరేకిస్తోంది కదా అని, అవి తమ రూపు రేఖా విలాసాలు ఈ మధ్య మార్చుకుంటున్నాయేమో అనిపిస్తోంది! ఈ 'అత్యంత' ఆధునిక ప్రపంచంలో, 'కొత్త సీసాలో పాత ద్రవం' మాదిరి స్త్రీ పట్ల నిర్లక్ష్యమూ, ఆమె అంగీకారంతోనే ఆమె అస్తిత్వ దుర్వినియోగం మొదలయ్యాయి. సమాజానికి ఉన్న ఈ 'ఊసరవెల్లి' నైజ గుణం గురించి ఫణి మాధవి సునిశితంగా హెచ్చరిస్తున్నారు.

దీన్ని పాఠకులు మెల్లగా తెలుసుకుంటారు. దట్టమైన పొగమంచు సైతం ఏటవాలుగా పడినా, సూర్య కిరణాల కాంతికి కరిగిపోక తప్పదు కదా! ఈ పుస్తకంలో నాకు కనపడిన కొన్ని కొత్త పదబంధాలు సమత తీపి, దహనపు వాసన, అహోష్ణ కుహరం, నువ్వు లేనితనం, చైతన్య వీణ, భ్రామిక, పాదాల ప్రభంజనం, దేహ వేణువు, విఫల యాత్ర, అందమైన నిశ్శబ్దం, మూగశిల తనూ తంత్రులు, పవన వేణువు.... ఇవి కొన్ని.



గాయం అజరం గేయం అమరం కాలం అనంతం... అని చెబుతూనే ఒక జీవిత కాలంలోనే మనిషి ఎదుర్కొనేవి వంచనలు, అనుమానాలు సంహారాలు, సమరాలు ఇలా ఎన్నో ఉంటాయనీ, ఎందుకంటే /కాలమే ఒక వైకుంఠపాళీ... తరతరాలుగా నిజమై బతకటమొహ యాతన/ అని వివరించే తాత్వికత ఫణి మాధవి కలానికి అందిన సత్యం.

ఈమె భావనలు కవిత్వ వాక్య నిర్మాణాన్ని దాటి, పుస్తకంలో పేజీలను దాటి మనో వీణ తంత్రులపై అంతర్లీన కరుణరసార్ద్ర అనుభూతియై మనతో మిగిలి ఉంటుంది... ఎప్పటిదాకా? చిన్ని చిన్ని సంతోషాల అలలపై మనసు తేలే దాకా, పెను విషాదాల సంకెళ్ళ గాయాల సలపరింత మాననక పోయినా సరే మనతో ఉంటుంది. కవి విజయం అదే. ఔను! ఈ రోజుల్లో జాతీయ పతాక మీద ఒక కవిత వస్తే అది ఎలా ఉండాలి? హృదయాన్ని రెపరెపలాడించాలి. ఆ కాలపు త్యాగాలను మళ్ళీ ఒక్కసారి జ్ఞప్తికి తేవాలి. అలా కవి/ భావి యువత చైతన్యాన్ని కలగంటున్నా/ నని చెప్పారు. ఆ జెండా,/ ఉద్వేగంతో, కుహనా వెలుగులను తరిమి సమానత్వ ప్రకాశాన్ని నింపేలా ఉండాలి/ అన్నారు. ఫణి మాధవి చూసినది, ఈ చైతన్య స్వప్న' మే.

ఎవరికైనా మనసు నొచ్చుకున్నప్పుడు కుంగు బాటు ఉంటుంది సహజమే. మహిళల్లో అది అనేక రకాల ఉద్వేగాలుగా మారి, ఒక పొర పై మరొకటిగా పేరుకుపోతాయి. ఒక్కోసారి అసలంత దిగులు ఎందుకు వచ్చిందో కూడా తెలియనంత పేరుకు పోతాయి. చాలామంది స్త్రీలలో మౌనాన్ని ఆశ్రయించడం, తమ వ్యధను పైకి చెప్పుకోలేని సంఘర్షణను అనుభవించడం జరుగుతాయి. ఇలా ఎందుకంటే ఎదుటి వారు తమను అలుసు తీసుకుంటారని, బహుశా కొన్ని భావనలు మరీ తేలిక పాటివిగా కనబడతాయని. నేటి సమాజంలో దాష్టీకాలు, అఘాయిత్యాలు, అవినీతి, అధర్మం వంటి అకృత్యాల్లో ఒక పథకం ప్రకారం స్త్రీ పీడన జరుగుతూనే ఉంది. తెలివిగా, అది మహిళల మానసిక, భావనామయ ప్రపంచంలోకి చొచ్చుకు వచ్చేలా ఆధిపత్య ధోరణి కొనసాగుతోంది. అమ్మ, సోదరి, ప్రేమిక అనే పాత్రల్లో కూడా విలువలు బీటవారే వాతావరణం పెరుగుతోంది. దీన్ని జాగ్రత్తగా గమనించి, నివారణ చర్యలో, లేక ఎదుర్కొనే ప్రతిచర్యలో చేపట్టాలి. ఇందుకు మహిళలు పరస్పర సహకారం పెంచుకుని, సమస్యలను మరొకరితో పంచుకుని హృదయ భారం తగ్గించుకోవాలని మానసిక శాస్త్రవేత్తలు చెబుతున్నారు. అదేమంత తేలికైన విషయం కాదు. ఫణి మాధవి దీనికొక చక్కని పరిష్కారం చూపించారు.

'వెన్ను చూపకు' అంటూ... ఈ కవితలో ఉన్నదంతా అనుభవైక వేద్యమే. ఇలా ప్రబోధిస్తారు /ఈ నొప్పి నువ్వు భరించి తీరాల్సిందే.... నీకు గుడ్డితనం అంట నీయని కిటికీలు ఎన్నుంటే అన్ని, తెరిచే కష్టానికి వెనకాడకు/ అంటారు. స్త్రీ 'సహనాన్ని' ఫణి మాధవి చూసే దృక్కోణం చాలా విలక్షణమైనది. స్త్రీ దేన్నైనా భరించేది సమాజంలో సమతౌల్యత కాపాడడం కోసమే చేస్తోందని గుర్తెరగాలి అని చెబుతున్నారు. పైగా 'సమతౌల్యత నిలిపి ఉంచడం ఇక మీ బాధ్యత' అంటూ సమాజాన్ని హెచ్చరిస్తారు కూడా. ఇప్పుడు కావలసింది ఇదే./ తానే తిరగబడితే.. తన జాతి మొత్తం.. ఒక్కటై వద్దు అనుకుంటే.. మనిషి జాతి జాడేది?/ అనే వాక్యంలో అంతరార్థం మానవాళి విస్మరించకూడని సత్యం. మహిళా సమతౌల్యతను ప్రస్తావించిన ఆమె ప్రకృతి మనసును కూడా ఆవిష్కరించారు. అదే ఓజోన్ పొర స్వగతాన్ని తన గొంతులో ఒక అద్భుత కవితగా మలిచారు. ప్రకృతితో కలిసి నడిస్తేనే మనిషి ఉనికి అనే సత్యాన్ని విన్నపం, బోధన, హెచ్చరిక అనే మూడు విధాలుగా తెలిపి అచ్చమైన అమ్మలా బుజ్జగిస్తూనే రాబోయే తీవ్ర పరిణామాలను గురించి రాశారు.

ఫణి మాధవి భేదోపాయాన్ని ఎక్కడ ఉపయోగించారా? అని నేను పరిశీలించాను. ప్రపంచ దేశాల్లో అత్యంత జనామోదం పొందిన పరిపాలనా విధానం ప్రజాస్వామ్యమే కదా! మన దేశం రెండవ అతిపెద్ద ప్రజాస్వామ్య దేశం కూడానూ. అయితే ఇందులో ప్రజల స్వామ్యం ఎక్కడ ఉంది? ఒకే ఒక్క మాట.. ప్రభుత్వాన్ని తలకిందులు చేయగల 'తిరుగులేని ఆయుధం ఓటు' అన్న మాటను పౌరుడికి తెలియజేస్తే చాలు./ పౌరుడా నువ్వెట్లా ఉండాలంటే.. హక్కుల రెక్కలకు.. గురి చూసి వేలాడే బాణాలపై.. ప్రశ్నల పతాకమై ఎగరాలి/ అని చెప్పి ఆమె నిర్వర్తించినది తన వంతు బాధ్యత. ఫణి మాధవి తన తొలి కవితా సంపుటిలో వ్యక్తపరిచినది మానవులందరిలో సంసిద్ధత ఉండాలని. ఆ సంసిద్ధతే భయాలను, దుఖాన్ని ఎదిరించి సాగే 'నడత' ఇస్తుంది. ఫణి మాధవి కవిగా తనను తాను భవిష్యత్తులో వినూత్నంగా ఆవిష్కరించు కోవాలని మనసారా కోరుకుంటూ.

కవితావేదిక కవితల పోటీ-2024

సాహితీవేత్త డా. నెల్లుట్ల నవీన్ చంద్ర ఆధ్వర్యంలో సాహితీసంస్థ 2024వ ఏడాదికి జాతీయ స్థాయి వచన కవితలపోటీ నిర్వహిస్తోంది. గెలిచిన వారికి ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులు వరుసగా 4,000/-, 2,000/-, 1,000/- వుంటాయి. కవితా వస్తువు కవి ఐచ్ఛికం (కుల, మత, వర్గ, రాజకీయ అంశాలు మినహాయించి). 25 పంక్తులలోపు వర్తమాన, సామాజిక పరిస్థితులను ప్రతిబింబించేలా యూనికోడ్‌లో ఏప్రిల్ 30వ లోపు nakshatra1364@gmail.com కు పంపాలి.

ఉగాది బాలల కథల పోటీ -2014 ఫలితాలు

సుగుణ సాహితి సమితి సిద్దిపేట ఆధ్వర్యంలో నిర్వహించిన జిల్లా స్థాయి ఉగాది బాలల కథల పోటీలు -2024 ఫలితాలను విడుదల చేసారు. ఏప్రిల్ మొదటి వారంలో జరిగే సమావేశంలో విజేతలకు బహుమతి ప్రధానోత్సవము ఉంటుంది. బహుమతులు వరుసగా 'ఉచితం' ఉచితం కాదు - పి.అభిలాష్, 'ప్లాస్టిక్ వలన నష్టాలు' - జి.నిహారిక, 'పట్టుదల' - పి.ఆసీఫా, 'సమానత్వం' -పి.వైష్ణవి, 'బుద్ధి బలం'- జి.ప్రణయ్ చంద్ర, 'ఏది ముఖ్యం' - జే. నిరీక్షిత, 'చరవాణి మహిమ' -వై.శ్రావణి, 'అనాథ బాలుడు' -యు. మాధురి, 'లక్ష్యం'- పి.అభిరామ్, 'అనుభవంతో విద్య' - వై.సహస్ర, 'నిర్లక్ష్యం' - ఎ. శృతి, 'మీరు కూర్చోండి' - బి.దివ్య, 'మంచి మలుపు' - బి.రుచిత్, 'ధైర్యమే జీవితం- యం. వరుణ్ తేజ్, 'ఐకమత్యం' - ఎన్. ప్రణీత, 'ఫోన్ తో జాగ్రత్త' - జి.ఆనంది, 'వేపచెట్టు' - జి.మధుప్రియ, 'ప్లాస్టిక్ నిషేధం' - యం. హారిక, 'జీవనోపాధి', 'కష్టానికి తగిన ఫలితం' -పి.సంజన.

- భైతి దుర్గయ్య, 9959007914

అంబేద్కర్ కవితా పురస్కారం- కవితల పోటీలు -2024

డాక్టర్ బి ఆర్ అంబేద్కర్ 133 వ జయంతి ఉత్సవాల సందర్భంగా డి.ఎచ్.పి.ఎస్, శ్రీ సత్యసాయి జిల్లా రచయితల సంఘం సంయుక్త ఆధ్వర్యంలో అంబేద్కరిజం, దళిత బహుజన తత్వం పై కవితల పోటీలు-2024 నిర్వహిస్తున్నారు. గెలిచిన కవితలకు వరుసగా 5000/-, 3000/-, 2000/- రూ నగదు, ప్రశంసా పత్రం, జ్ఞాపికతో సత్కారం వుంటుంది. అంబేద్కరిజం, దళిత బహుజన వాదంపై 25 పంక్తులకు మించకుండా ఏప్రిల్ 5వ తేదీలోపు డా.శివన్న -9440805955 వ్యాట్సప్‌కు పంపాలి.

- జాబిలి చాంద్ బాషా

ముస్లింలపై వేధింపులు

- హెూలీ పేరుతో రంగులు చల్లి.. జై శ్రీరామ్ అంటూ నినాదాలు
- యూపీలో రెచ్చిపోయిన హిందూత్వ మూకలు..




లక్నో : ఉత్తరప్రదేశ్‌లో హిందూత్వ మూకలు రెచ్చిపోయాయి. హెూలీ పేరుతో ముస్లింలను వేధించిన ఘటన ఒకటి సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. యూపీలోని బిజ్నోర్‌లో జరిగిన ఈ ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. ఈ ఘటనకు సంబంధించి ఒకరిని అదుపులోకి తీసుకున్నామని పోలీసులు తెలిపారు. హెూలీ వేడుకల పేరుతో హిందూత్వ మూకలు ముస్లిం వ్యక్తితో పాటు ఇద్దరు మహిళలను వేధిస్తున్న దృశ్యాలు ఈ వీడియోలు కనిపిస్తున్నాయి.వివరాల ప్ర కారం.. ఇద్దరు మహిళలతో బైక్‌పై వెళుతున్న ముస్లిం వ్యక్తిని హిందూత్వ మూకలు చుట్టుముట్టారు. స్ప్రేయర్‌తో మహిళలపై రంగు నీళ్ల చల్లారు. మహిళలు అరుస్తున్నప్పటికీ వారిని వేధిస్తూనే ఉన్నారు. కొద్దిసేపటి తర్వాత బక్కెట్లతో రంగు నీళ్ల వారిపై పోశారు. కొందరు యువకులు ముస్లిం వ్యక్తితో పాటు ఓ మహిళ ముఖంపై బలవంతంగా రంగు పూశారు. "ఇది 70 ఏండ్లుగా వస్తున్న హిందూ సాంప్రదాయం" అంటూ ఆ మూకలు నినాదాలు చేయడం కనిపిస్తోంది. అనంతరం జైశ్రీరామ్ అంటూ వారిని విడిచిపెట్టారు.వీడియో వైరలైన అనంతరం ఈ ఘటనపై చర్యలు తీసుకోవాల్సిందిగా స్థానిక పోలీసులను బిజ్నోర్ పోలీస్ చీఫ్ నీరజ్ కుమార్ జాదౌన్ ఆదేశించారు. ధాంపూర్ పోలీస్ స్టేషన్ పరిధిలో ఈ ఘటన జరిగిందని, నిందితులను గుర్తించినట్టు పోలీసులు తెలిపారు. అనిరుధ్ అనే వ్యక్తితో పాటు ముగ్గురు మైనర్లను అదుపులోకి తీసుకున్నట్టు వెల్లడించారు.


బీజేపీలో ఐఏఎఫ్ మాజీ చీఫ్ బదౌరియా



న్యూఢిల్లీ : భారత వాయుసేన (ఐఏఎఫ్) మాజీ చీఫ్ ఆర్.కె.ఎస్. బదౌరియా బీజేపీలో చేరారు. ఐఏఎఫ్‌లో బదౌరియా సుదీర్ఘ సేవలందించారని, రక్షణ దళంలో చురుకైన పాత్ర పోషించారని బీజేపీ ప్రధాన కార్యదర్శి వినోద్ తావ్డే ప్రశంసించారు. రాజకీయ రంగంలోనూ క్రియాశీలకంగా వ్యవహరిస్తారని భావిస్తున్నట్లు తెలిపారు. బదౌరియా సుమారు 40 ఏండ్లు ఐఎఎఫ్‌లో గడిపారని, ప్రధాని మోడీ ఆత్మ నిర్భర్ భారత్ కార్యక్రమానికి సహకారం అందించారని బీజేపీ నేత చెప్పారు. ఆయన ఉత్తరప్రదేశ్‌కు చెందినవారు.

మాపై ఎందుకింత కక్ష..

- కేంద్రం ఎన్డీఆర్ఎఫ్ నిధులు విడుదల చేయడం లేదు.: 'సుప్రీం'ను ఆశ్రయించిన కర్నాటక సీఎం సిద్ధరామయ్య



బెంగళూరు: కర్నాటక ముఖ్యమంత్రి సిద్ధరామయ్య సుప్రీంకోర్టును ఆశ్రయించారు. నీటి కొరతతో అల్లాడుతున్న రాష్ట్రానికి కేంద్ర ప్రభుత్వం నుంచి నిధులు రావడంలేదని పేర్కొన్నారు. కేంద్రం నుంచి నేషనల్ డిజాస్టర్ రెస్పాన్స్ ఫండ్ విడుదల చేయాలని రాష్ట్ర ప్రభుత్వం సుప్రీంకోర్టులో పిటిషన్ దాఖలు చేసింది. 'రాష్ట్రానికి కరువు సహాయ నిధుల పంపిణీలో జాప్యంపై కేంద్ర ప్రభుత్వంపై ఈ పిటిషన్ దాఖలు చేశాం' అని సిద్ధరామయ్య తెలిపారు. రాష్ట్రంలో నెలకొన్న కరువు పరిస్థితులపై మంత్రివర్గ బృందం నివేదిక సమర్పించి ఐదు నెలలు గడుస్తున్నా కేంద్రం నిధులు విడుదల చేయలేదని ఆరోపించారు. రాష్ట్రం తీవ్ర కరువుతో అల్లాడుతోందని.. దీంతో జనజీవనం అతలాకుతలమవుతోందని పేర్కొన్నారు.

రాష్ట్రంలోని 236 తాలూకాల్లో 223 తాలూకాలు కరువుగా ప్రకటించారని.. వీరిలో 196 ప్రాంతాలు తీవ్ర కరువు ప్రాంతంగా ప్రకటించినట్లు చెప్పారు. గత 30-40 ఏండ్లలో అత్యంత తీవ్రమైన పరిస్థితి ఉందని.. 48లక్షల హెక్టార్లలో పంటలు దెబ్బతిన్నాయని వివరించారు. నిధులు విడుదల చేయాలని కేంద్రానికి మూడుసార్లు వినతిపత్రాలు ఇచ్చినా ఇప్పటి వరకు ఒక్క పైసా కూడా రాలేదన్నారు. పిటిషన్‌లో ఖరీఫ్ 2023 సీజన్‌లో వ్యవసాయ, ఉద్యానవన పంటలకు కలిపి రూ.35,162 కోట్ల మేర నష్టం జరిగినట్టు పేర్కొన్నారు. ఎన్‌డీఆర్ఎఫ్ కింద కేంద్రం నుంచి రూ.18,171.44కోట్లు సహాయం చేయాలని కోరినట్టు తెలిపారు.నివేదిక వచ్చినా కేంద్రం ఎలాంటి నిర్ణయం తీసుకోలేదని పిటిషన్లో పేర్కొన్నారు. విపత్తు నిర్వహణ చట్టం 2005 ప్రకారం కేంద్రం నుంచి సహాయం పొందే అర్హత రాష్ట్రానికి ఉందని పేర్కొన్నారు. నిబంధనల ప్రకారం.. ఇంటర్ మినిస్టీరియల్ సెంట్రల్ టీమ్ నివేదిక అందిన నెలలోగా ఎన్డీఆర్ఎఫ్ నుంచి రాష్ట్రానికి సహాయం అందించే విషయంలో కేంద్రం తుది నిర్ణయం తీసుకోవాలని పిటిషన్ పేర్కొంది.

గతేడాది అక్టోబర్‌లో కేంద్ర ప్రభుత్వ బృందం రాష్ట్రానికి వచ్చి పరిశీలించిందని సిద్ధరామయ్య తెలిపారు. కరువుపై కేంద్రానికి మంత్రులతో కలిసి ఢిల్లీకి వెళ్లామని.. కానీ కేంద్రమంత్రులు ఎవరూ కలువలేదన్నారు. ఆ తర్వాత మళ్లీ కేంద్ర హెూంశాఖ మంత్రిని కలిసినా ఇంకా నిధులు విడుదల చేయలేదని పేర్కొన్నారు.

ముంబయిలో డ్రగ్స్ మాఫియా

- రూ.3.25 కోట్ల విలువైన డ్రగ్స్ సీజ్.. 12 మంది అరెస్ట్



దాదర్: ముంబయి పోలీస్ డిపార్టుమెంట్‌లోని యాంటీ నార్కోటిక్ విభాగం అధికారులు రూ.3.25 కోట్ల విలువైన 16 కిలో డ్రగ్స్‌ను సీజ్ చేశారు.12 మంది నిందితులను అదుపులోకి తీసుకున్నారు.సహర్ గ్రామం నుంచి ఒకరు, నల్లసోపారా గ్రామం నుంచి ఇద్దరు, శాంటాక్రజ్ నుంచి ముగ్గురు, దక్షిణ ముంబై నుంచి ఇద్దరు, కుర్లా, బైకులా నుంచి ఒక్కొక్కరిని అదుపులోకి తీసుకున్నట్టు నార్కోటిక్ అధికారులు వెల్లడించారు. కుర్లా గ్రామంలో అరెస్టయిన నైజీరియా జాతీయుడి నుంచి రూ.2.24 కోట్ల విలువైన డ్రగ్స్‌ను స్వాధీనం చేసుకున్నారు. అంధేరి నుంచి అరెస్టయిన మరో వ్యక్తి నుంచి 1.02 కోట్ల విలువైన గంజాయిను సీజ్ చేశార

నీటి ఎద్దడిని నివారించాలి

- చేవెళ్ల మండలంలో నిరసన



నవతెలంగాణ చేవెళ్ల

రంగారెడ్డి జిల్లా చేవెళ్ల మండలం ఆలూరు గ్రామంలోని దళిత వాడలో తీవ్ర నీటి ఎద్దడి ఉందని, సమస్యను పరిష్కరించాలని రోడ్డుపై బైటాయించి గ్రామస్తులు నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. గ్రామాల్లో ప్రత్యేక పాలన కొనసాగుతున్నందున ఎవరికి చెప్పాలో తెలియక, అధికారులు అందుబాటులో లేకపోవడంతో ఇబ్బందులు ఎదురవుతున్నాయని అన్నారు. మిషన్ భగీరథ నీళ్లు రాకపోవడంతో తీవ్ర ఇబ్బంది ఎదురైందని తెలిపారు. మార్చి నెలలోనే ఈ విధంగా ఉంటే ఏప్రిల్, మే నెలలో పరిస్థితి ఏంటనీ రాష్ట్ర ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. కాగా, గ్రామస్తుల ఆందోళనతో స్పందించిన ప్రత్యేక అధికారులు.. వారికి ట్యాంకర్ల ద్వారా నీటిని అందజేశారు

రె'ఢీ'..!

- ప్రధాన పార్టీల అభ్యర్థులు ఖరారు
- 'ఆరు' గ్యారంటీలతో రంగంలోకి కాంగ్రెస్
- మోడీ భజన, అభ్యర్థి సెల్ఫ్ డబ్బాతో బీజేపీ ముందుకు..
- గత అభివృద్ధి మాటున బీఆర్ఎస్ ప్రచారం
- 'మల్కాజిగిరి' సెగ్మెంట్‌లో త్రిముఖ పోటీ
- ఏడు నియోజకవర్గాల్లో వేడెక్కిన రాజకీయం



నవతెలంగాణ-సిటీబ్యూరో

మల్కాజిగిరి పార్లమెంట్ సెగ్మెంట్‌లో జెండా ఎగరేయడానికి ప్రధాన పార్టీల అభ్యర్థులు రెఢీ' అవుతున్నారు. బీజేపీ, బీఆర్ఎస్, కాంగ్రెస్ అభ్యర్థులు ఇప్పటికే ప్రచారం మొదలు పెట్టారు. గెలుపే లక్ష్యంగా ముగ్గురూ ఎవరికి వారే ప్రచారంలో ముందుకు సాగుతున్నారు. ఆరు గ్యారంటీల పేరు, వంద రోజుల పాలన పేరుతో కాంగ్రెస్ ప్రచారంలో దూసుకెళ్తుంటే.. బీజేపీ మోడీ భజనతోపాటు అభ్యర్థి సెల్ఫ్ డబ్బాతో ప్రచారం నిర్వహిస్తున్నది. ఇక బీఆర్ఎస్ గతంలో వారి ప్రభుత్వ హయాంలో చేసిన అభివృద్ధిని వివరిస్తూ, వంద రోజుల పాలనలో అధికార కాంగ్రెస్ వైఫల్యాలను ప్రస్తావిస్తూ ప్రచార పర్వం సాగిస్తున్నది. నియోజకవర్గం పరిధిలోని మొత్తం ఏడు అసెంబ్లీ నియోజకవర్గాల్లో రాజకీయం వేడెక్కింది.

సీఎం సిట్టింగ్ స్థానం కావడంతోపాటు మినీ భారత్‌గా పిలువబడే మల్కాజిగిరి పార్లమెంట్ స్థానంపై ప్రధాన పార్టీలు గురి పెట్టాయి. బీజేపీ నుంచి ఈటల రాజేందర్, కాంగ్రెస్ తరపున వికారాబాద్ జెడ్పీ చైర్‌పర్సన్ సునితా మహేందర్‌రెడ్డి, బీఆర్ఎస్ నుంచి రాగిడి లక్ష్మారెడ్డి బరిలో దిగడంతో రాజకీయం వేగంగా వేడెక్కింది. బీజేపీ ఇప్పటికే రోడ్డు షోలు నిర్వహించి ఓటర్లను తమవైపు తిప్పుకునే ప్రయత్నం చేస్తుండగా.. కాంగ్రెస్ విస్తృత స్థాయి సమావేశాలు నిర్వహిస్తూ పార్టీ క్యాడర్‌కు దిశా నిర్దేశం చేస్తోంది. ఇక బీఆర్ఎస్ కూడా తన ఎమ్మెల్యేలతో సంప్రదింపులు జరుపుతూ, క్యాడర్‌ను కదిలించే ప్రయత్నం చేస్తోంది.

రామమందిరం, కేంద్ర పథకాలే అస్త్రాలు..

బీజేపీ అభ్యర్థి ఈటల రాజేందర్ ఇప్పటికే పార్లమెంట్ పరిధిని ఓ సారి చుట్టేశారు. ప్రధాని నరేంద్ర మోడీ భజన చేస్తూ, తన సెల్ఫ్ డబ్బా కొట్టుకుంటూ ముందుకు సాగుతున్నారు. తాను గెలిస్తే ఏం చేస్తారో చెప్పకుండా.. కాంగ్రెస్ తనపై చేసి వ్యాఖ్యలు, గత బీఆర్ఎస్ ప్రభుత్వం వైఫల్యాలను వివరిస్తూ ముందుకు సాగుతున్నారు. అన్ని అసెంబ్లీ స్థానాల్లో ముఖ్య కార్యకర్తల సమావేశాలు, బస్తీలు, పురపాలక సంఘాలు, డివిజన్లు, గ్రామాల వారీగా ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్నారు. ఉదయం మొదలు అర్ధరాత్రి వరకు ప్రచారంలోనే ఉంటున్నారు. కేంద్ర ప్రభుత్వ పథకాలు, అయోధ్యలో రామమందిరమే ఎజెండాగా ఈటల ముందుకు సాగుతున్నారు.

మూడు జిల్లాలు.. ఏడు అసెంబ్లీ స్థానాలు

మల్కాజిగిరి పార్లమెంట్ సెగ్మెంట్ మేడ్చల్-మల్కాజిగిరి జిల్లాలోని మేడ్చల్, మల్కాజిగిరి, కూకట్‌పల్లి, కుత్బుల్లాపూర్, ఉప్పల్ నియోజకవర్గాలతోపాటు రంగారెడ్డి జిల్లాలోని ఎల్బీనగర్, హైదరాబాద్ జిల్లాలోని సికింద్రాబాద్ కంటోన్మెంట్ అసెంబ్లీ స్థానాల్లో విస్తరించి ఉంది. ఇది సీఎం రేవంత్‌రెడ్డి సిట్టింగ్ స్థానం కావడంతో పాటు మినీ భారత్‌గా పేరుండటంతో ప్రాధాన్యత సంచతరించుకుంది. ఈ సెగ్మెంట్‌లో ఏడు నియోజకవర్గాలతో కలిపి 37,28,519 మంది ఓటర్లు ఉన్నారు.

సీఎం రేవంత్‌రెడ్డి స్పెషల్ ఫోకస్

తన సిట్టింగ్ స్థానం కావడంతో 'మల్కాజిగిరి'పై సీఎం రేవంత్‌రెడ్డి స్పెషల్ ఫోకస్ పెట్టారు. ఇప్పటికే మల్కాజిగిరి లోక్‌సభ నియోజకవర్గ కీలక నేతలతో సమావేశమై దిశా నిర్దేశం చేశారు. నియోజకవర్గ ఇన్‌చార్జి మంత్రి తుమ్మల నాగేశ్వరరావు కూడా విస్తృత స్థాయి సమావేశాలు నిర్వహిస్తూ ప్రచారంలో దూకుడు పెంచాలని పార్టీ శ్రేణులకు పిలుపునిస్తున్నారు. ఆరు గ్యారంటీలతోపాటు గత ప్రభుత్వ వైఫల్యాలను వివరిస్తూ, బీజేపీ ఆగడాలను అర్థమయ్యేలా విడమడిచి చెబుతూ మందుకు సాగుతున్నారు.

బీఆర్ఎస్ మందగమనం..

పార్లమెంట్ ఎన్నికల ప్రచారంలో బీఆర్ఎస్ ఇంకా స్పీడ్ అందుకోలేదు. అభ్యర్థి రాగిడి లక్ష్మారెడ్డి ఇప్పటికే మాజీ మంత్రి మల్లారెడ్డి నివాసంలో నియోజకవర్గం పరిధిలోని అందరు ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలతో ప్రత్యేకంగా సమావేశమైనా ప్రచారం మాత్రం మందకొడిగానే సాగుతోంది. ఆరుగురు ఎమ్మెల్యేలూ బీఆర్ఎస్ వారే అయినా సరైన సహకారం లేకపోవడంతో అభ్యర్థి అంతర్మథనంలో పడ్డారు. రానున్న రోజుల్లో మూడు ప్రధాన పార్టీల అభ్యర్థులు హెూరాహెూరీగా ప్రచారం నిర్వహించేందుకు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నట్టు తెలుస్తోంది. చివరికి 'మల్కాజిగిరి' ఎవరిని వరిస్తుందో వేచి చూడాలి..!

కేసీఆర్ హెూలీ శుభాకాంక్షలు

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్



హెూలీ పండుగ సందర్భంగా రాష్ట్ర ప్రజలకు బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ శుభాకాంక్షలు తెలిపారు. నిత్య జీవనంలోని కష్టాలను కాసేపు మరిచి, వయోభేదం లేకుండా అన్ని వర్గాల ప్రజలు కలిసిమెలిసి కేరింతలతో ఆనందో త్సాహాల నడుమ రంగులతో జరుపుకునే ప్రకృతి పండుగ హెూలీ అని తెలిపారు. హెూలీ పండుగ భారతీయ సామాజిక సాంస్కృతిక జీవన ప్రత్యేకతను చాటుతుందని కేసీఆర్ అన్నారు. వసంతాన్ని తమ జీవితాల్లోకి ఆహ్వానిస్తూ జరుపుకునే హెూలీ పర్వదిన సందర్భంగా ఆ ప్రకృతీమాత ప్రజలందరినీ చల్లగా చూడాలని కేసీఆర్ ప్రార్థించారు.

రాష్ట్ర ప్రజలకు తెలంగాణ శాసన మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి హెూలీ పండుగ శుభాకాంక్షలు తెలిపారు. పచ్చని చిగురులతో కొత్తదనం సంతరించుకుని హెూలీ పండుగ స్వాగతం పలుకుతుందని ఆయన అన్నారు. ప్రజలందరూ మోదుగుపూల వంటి సహజసిద్ధమైన రంగులతో హెూలీ పండుగను సంతోషంగా జరుపుకోవాలని గుత్తా సుఖేందర్ రెడ్డి సూచించారు .

విద్యా వ్యవస్థపై నూతన ప్రభుత్వం దృష్టి సారించాలి

యూటీఎఫ్ వ్యవస్థాపకులు అప్పారి వెంకటస్వామి వర్ధంతి సభలో ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అలుగుబెల్లి నర్సిరెడ్డి



నవతెలంగాణ-నల్లగొండటౌన్

విద్యావ్యవస్థ బాగు కోసం నూతన ప్రభుత్వం దృష్టి సారించాలని ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అలుగుబెల్లి నర్సిరెడ్డి అన్నారు. యూటీఎఫ్ సంఘం వ్యవస్థాపకులు అప్పారి వెంకటస్వామి వర్ధంతి సందర్భంగా నల్లగొండ జిల్లా కేంద్రంలోని టీఎస్‌యూటీఎఫ్ కార్యాలయంలో జిల్లా అధ్యక్షులు ఎడ్ల సైదులు అధ్యక్షతన 'ఉపాధ్యాయ ఉద్యమం- నేటి సవాళ్లు' అంశంపై ఆదివారం సదస్సు నిర్వహించారు. ఆ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గత ప్రభుత్వ పదేండ్లకాలంలో పాఠశాల విద్య పూర్తిగా నిర్లక్ష్యానికి గురై ప్రమాణాలు తగ్గిపోయాయని విమర్శించారు. నూతన ప్రభుత్వం విద్యాశాఖపై దృష్టి కేంద్రీకరించి, మెరుగైన విద్య కొరకు విద్యాశాఖను పునర్‌సమీక్షించాలని కోరారు.

అప్పారి వెంకటస్వామి లాంటి నాయకులు నిస్వార్థమైన సేవలందించడం వల్ల నేడు ఉపాధ్యాయులు మెరుగైన వసతులు అనుభవిస్తున్నారని తెలిపారు. టీఎస్ యూటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు కె.జంగయ్య మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వ నూతన విద్యావిధాన పత్రం విద్యను కాషాయీకరించే విధంగా ఉందన్నారు. కవి ఎగ్బాల్, రోమిల్లా థాపర్ రచనలను, భగత్‌సింగ్ లాంటి వీరుల చరిత్రను పాఠ్యపుస్తకాల నుంచి తొలగిస్తున్నారని విమర్శించారు. సభ అనంతరం ప్రాథమిక పాఠశాలలో ఎన్‌రోల్‌మెంట్ పరిస్థితిపై వర్క్‌షాప్ నిర్వహించారు. రానున్న విద్యా సంవత్సరంలో ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్యను పెంచడానికి తీసుకోవాల్సిన కర్తవ్యాలపై చర్చించారు. కార్యక్రమంలో టీఎస్ యూటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శులు ఎం.రాజశేఖర్‌రెడ్డి, జి.నాగమణి, రాష్ట్ర మైనారిటీ గురుకులాల అధ్యక్షులు జి.రాంబాబు, టీఎస్ యూటీఎఫ్ నల్లగొండ జిల్లా ప్రధాన కార్యదర్శి పి.వెంకటేశం, ఉపాధ్యక్షులు శ్రీనివాసచారి, అరుణ, కోశాధికారి శేఖర్‌రెడ్డి, రాష్ట్ర కమిటీ సభ్యులు సీహెచ్.అరుణ, జిల్లా కార్యదర్శులు రామలింగయ్య, శ్రీనివాస్‌రెడ్డి, జి.నర్సింహ, రాజు, విజయలక్ష్మి, మధుసూదన్‌రెడ్డి, సీనియర్ నాయకులు సరళ, గోవర్ధన్, జిల్లా పౌరస్పందన వేదిక అధ్యక్షులు అంజిరెడ్డి, తాప్రా అధ్యక్షులు శ్యాంకుమార్ తదితరులు పాల్గొన్నారు.

రష్యాలో నరమేధం వెనుక..?

- ఐఎస్ హస్తమా..లేక ఎవరు..ఎఫ్ఎస్‌బీ ఆరా




రష్యా రాజధానికి వాయువ్య దిశలో సంగీత ఉత్సవాలకు వేదిక అయిన క్రోకస్ సిటీ హాల్ శుక్రవారం అర్ధరాత్రి టెర్రరిస్టు దాడికి గురైంది. టెర్రరిస్టులు అసాల్ట్ రైఫిల్స్ తో సందర్శకులపై దాడి సంఘటనా స్థలం నుంచి పారిపోయే ముందు టెర్రరిస్టులు భవనంలో పెద్ద ఎత్తున మంటలను సృష్టించారు. నరమేధానికి పాల్పడిన నలుగురు ప్రత్యక్ష టెర్రరిస్టులతో సహా 11 మందిని , పాయింట్-బ్లాంక్ రేంజ్‌లో వారిని కనపడకుండా కాల్చడం జరిగింది. పక్కనే ఉన్న షాపింగ్ మాల్‌ను కూడా టెర్రరిస్టులు లక్ష్యంగా చేసుకుని, దానికి నిప్పంటించారు. శనివారం అదుపులోకి తీసుకున్నట్లు రష్యా ఫెడరల్ సెక్యూరిటీ సర్వీస్ (ఎఫ్ఎస్‌బీ) తెలిపింది. నలుగురు నిందితులు ఉక్రెయిన్‌కు పారిపోయే క్రమంలో పట్టుబడ్డారని ఏజెన్సీ తెలిపింది. దాడిలో మరణించిన వారి సంఖ్య 150కి చేరుకుందని రష్యా ఇన్వెస్టిగేటివ్ కమిటీ తెలిపింది. ఈ టెర్రరిస్టు కాల్పుల్లో 200 మంది గాయపడ్డారు. వారిని ఆస్పత్రిలో చేరారని మాస్కో రీజియన్ అధికారులు చెప్పార

నిందితుల గుర్తింపు గురించి, దాడికి సంబంధించిన పరిస్థితుల గురించి సమాచారం ఇంకా పూర్తిగా వెలువడలేదు. దాడి జాగ్రత్తగా ఒక ప్రణాళిక ప్రకారం చేయబడిందని, ఎక్కువగా ప్రాణనష్టం జరిగేలా చూడటం జరిగిందని ఎఫ్ ఎస్‌బీ పేర్కొంది. ఘటనపై లోతైన విచారణ జరుగుతోంది. ఇప్పటివరకు తెలిసిన విషయాలు ఇలా ఉన్నాయి: నలుగురు ప్రాథమిక అనుమానితులను ఉక్రెయిన్ సరిహద్దులో ఉన్న రష్యాలోని బ్రయాన్స్క్ ప్రాంతంలో శనివారం తెల్లవారుజామున అదుపులోకి తీసుకున్నట్టు ఎఫ్ ఎస్‌బీ ఒక ప్రకటనలో తెలిపింది. తెల్లటి రెనాల్ట్ క్లియో కారులో పారిపోతున్న టెర్రరిస్టులను రష్యన్ లా ఎన్‌ఫోర్స్ మెంట్ అధికారులు కొద్దిసేపు వెంబడించిన తరువాత, అనుమానితులు కారును విడిచిపెట్టారని, వారిలో ఒకరిని అక్కడే అదుపులోకి తీసుకోగా, ఆ తర్వాత మరో ముగ్గురు నిందితులను అదుపులోకి తీసుకుని విచారిస్తున్నట్టు రష్యన్ మీడియా రిపోర్ట్ చేసింది. దాడికి పాల్పడిన నలుగురితో సహా ఈ సంఘటనకు సంబంధించి మొత్తం 11 మందిని అదుపులోకి తీసుకున్నట్టు శనివారం ఎఫ్ ఎస్ బీ ఒక ప్రకటనను విడుదల చేసింది. పట్టుబడిన పదకొండు మంది పేర్లు లేదా జాతీయతలపై రష్యన్ అధికారులు ఎటువంటి డేటాను విడుదల చేయలేదు. ప్రాథమిక అనుమానితుల్లో ఎవరికీ రష్యా పౌరసత్వం లేదని రష్యా అంతర్గత మంత్రిత్వ శాఖ ధ్రువీకరించింది.

అనుమానితులలో ఒకరు "డబ్బు కోసం" నేరానికి పాల్పడ్డానని పేర్కొన్నట్టు లా ఎన్‌ఫోర్స్ మెంట్ అధికారులు అతనిని విచారిస్తున్న సమయంలో చిత్రీకరించిన విడియోలో కనపడింది. ఆ వ్యక్తి తనకు 500,000 రూబిళ్లు (5,418 యూఎస్‌డాలర్లు) ఇస్తానని వాగ్దానం చేశారని, దాడికి ముందు తన డెబిట్ కార్డ్ అకౌంట్‌కు సగం బదిలీ చేశారని పేర్కొన్నాడు. శుక్రవారం నాటి దాడి సూత్రధారులను సంప్రదించడానికి ముందు సుమారు ఒక నెల క్రితం తాను టెలిగ్రామ్‌లో కొంతకాలంగా "ఒక బోధకుడి ద్వారా ఉపన్యాసాలు వింటున్నానని" ఆ అనుమానిత టెర్రరిస్టు చెప్పాడు. బహిరంగంగా జరిగిన ప్రశ్నోత్తరాల సమయంలో అనుమానితుల్లో ఎవరూ ఏ తీవ్రవాద గ్రూపుకు విధేయత చూపలేదు.

రష్యా దర్యాప్తు అధికారులు దాడి వెనుక అనుమానిత సంస్థల పేర్లను పేర్కొనలేదు. ఉక్రెయిన్‌లోకి ప్రవేశించడానికి టెర్రరిస్టులకు ఉపయోగపడిన కొన్ని ఉక్రేనియన్ "పరిచయాలు" మినహా, ప్రాథమిక అనుమానితులకు ఏదైనా తీవ్రవాద సమూహాలతో లేదా బయటి శక్తులతో వారికిగల సంబంధాలపైన ఇంకా స్పష్టత రాలేదని ఎఫ్ ఎస్ బీ తెలిపింది. రాయిటర్స్, సీఎన్ఎన్‌తో సహా కొన్ని పాశ్చాత్య మీడియా సంస్థలు ఇస్లామిక్ స్టేట్ (గతంలో ఐఎస్) దాడికి బాధ్యత వహించినట్టు రిపోర్ట్ చేశాయి. అయితే టెర్రరిస్టులు ఐఎస్ కు అనుబంధంగా ఉన్నారనే వాదనలపై మాస్కో వ్యాఖ్యానించలేదు.



అందెశ్రీ దంపతులకు సీఎం సత్కారం

నవతెలంగాణ-హైదరాబాద్‌బ్యూరో

రాష్ట్ర గీతం జయ జయహే తెలంగాణ గీత రచయిత అందెశ్రీ దంపతులను ముఖ్యమంత్రి శీ రేవంత్‌రెడ్డి దంపతులు సన్మానించారు. జూబ్లీహిల్స్‌లోని సీఎం నివాసంలో ఆదివారం ఈ కార్యక్రమం జరిగింది. అలాగే ముఖ్యమంత్రిని మర్యాదపూర్వకంగా కలిసిన వారిలో ఉస్తాద్ బిస్మిల్లాఖాన్ అవార్డు గ్రహీతలు అందె భాస్కర్ (డప్పు వాయిద్యం), పేరిణి రాజ్‌కుమార్ నాయక్ (పేరిణి నత్యం) ఉన్నారు. ఈ సందర్భంగా సీఎం వారిని అభినందించారు. మరో ప్రముఖ సినీ గేయ రచయిత సుద్దాల అశోక్ తేజ కూడా ముఖ్యమంత్రిని మర్యాదపూర్వకంగా కలిశారు.

పత్తి మిల్లులో భారీ అగ్ని ప్రమాదం

- రూ:8 కోట్ల మేర నష్టం



నవతెలంగాణ -మాగనూర్

షార్ట్ సర్క్యూట్‌తో పత్తి మిల్లు కాలిబూడిదైంది. ఆకస్మికంగా మంటలు చెలరేగడంతో మిల్లులో ఉన్న పత్తి బండిల్స్, జిన్నింగ్ చేయడానికి తీసుకొచ్చిన విత్తనాలు అగ్నికి ఆహుత య్యాయి. ఈ ఘటన నారాయణపేట జిల్లా మాగనూరు మండలం వడ్వాట్ గ్రామ సమీపంలో జరిగింది. మిల్లు యాజమాన్యం తెలిపిన వివరాల ప్రకారం.. రెండేండ్ల కిందట నిర్మించిన వడ్వాట్ గ్రామ సమీపంలోని బసవేశ్వర జిన్నింగ్ కాటన్‌లో శనివారం రాత్రి 11:40 నిమిషాలకు షార్ట్ సర్క్యూట్‌తో మిల్లులో ఆకస్మాత్తుగా మంటలు చెలరేగాయి. గమనించిన పక్కనున్న రైస్ మిల్లు కూలీలు.. మిల్లు యాజమాన్యానికి విషయం తెలిపారు. అలాగే, వారంతా మిల్లు దగ్గరికి చేరుకొని మంటలు ఆర్పేందుకు ప్రయత్నించారు. అక్కడికి చేరుకున్న మిల్లు యజమాని వెంటనే పోలీసులు, ఫైర్ సిబ్బందికి సమాచారం ఇచ్చారు. నారాయణపేట, మక్తల్ నుంచి పెద్ద ఎత్తున ఫైర్ ఇంజన్లు, ఇతర వాటర్ ట్యాంకర్లను రప్పించి మంటలు ఇతర మిల్లులకు వ్యాపించకుండా అదుపు చేశారు. మిల్లుతో పాటు, జిన్నింగ్ కోసం తెచ్చిన విత్తనాలు, పత్తి పూర్తిగా కాలిపోయాయి. దాదాపుగా రూ.8 కోట్ల వరకు నష్టం వాటిల్లినట్టు మిల్లు యాజమాన్యం తెలిపారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు. అదేవిధంగా విషయాన్ని తెలుసుకున్న స్థానిక ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి హుటాహుటిన ఘటనాస్థలికి చేరుకొని పూర్తిగా కాలిపోయిన మిల్లును పరిశీలించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ఇంత పెద్ద మొత్తంలో అగ్నిప్రమాదం జరగడం చాలా దురదృష్టకరమన్నారు. ఈ ప్రమాదంలో బాధితులకు అన్ని రకాలుగా మద్దతుగా ఉంటానని ధైర్యం చెప్పారు.

కాంగ్రెస్‌లో చేరిన బీజేపీ నేత సతీష్ మాదిగ

- కండువా కప్పిన మల్లు రవి

నవతెలంగాణబ్యూరో-హైదరాబాద్

బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు సతీష్ మాదిగ కాంగ్రెస్‌లో చేరారు. ఆయనకు టీపీసీసీ ఉపాధ్యక్షులు మల్లు రవి, నాగర్‌కర్నూల్ ఎంపీ అభ్యర్థి మల్లు రవి ఆయనకు కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. అనంతరం ఆయన మల్లు రవితో కలిసి సీఎం రేవంత్‌రెడ్డిని కలిశారు. ఈ సందర్భంగా సతీష్ మాదిగ విలేకర్లతో మాట్లాడుతూ అసెంబ్లీ ఎన్నికల్లో అచ్చంపేట బీజేపీ అభ్యర్థిగా పోటీ చేశానన్నారు. ఇటీవల బీజేపీ అనుసరిస్తున్న విధానాలు నచ్చక బీజేపీకి రాజీనామా చేసినట్టు తెలిపారు. బీజేపీ మాదిగ వర్గాలకు మేలు చేస్తానంటూ మాయ మాటలు చెబుతున్నారని తెలిపారు. కాకినాడ ఒక ఓటు రెండు రాష్ట్రాలు తీర్మానం చేసిందే కానీ తెలంగాణ ఇవ్వలేదని విమర్శించారు. ఎస్సీవర్గీకరణ మీద కూడా బీజేపీ అదే విధంగా వ్యవహరిస్తున్నదని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎస్సీ, ఎస్టీల కోసం అన్ని విధాల అభివృద్ధి చేసింది కాంగ్రెస్ పార్టీయేనన్నారు. ఎస్సీ వర్గీకరణ సుప్రీం కోర్టు వరకు వచ్చిందంటే అది కాంగ్రెస్ పార్టీ కృషి ఫలితమేనన్నారు. అందు కోసం సీఎం రేవంత్‌రెడ్డి ప్రత్యేకంగా న్యాయవాదులను నియమించి వాదనలు వినిపించారని తెలిపారు. మాదిగల ఓటు బ్యాంకును తమకు అనుకూలంగా మార్చుకోవాలని బీజేపీ ప్రయత్నిస్తున్నదని విమర్శించారు. మందకృష్ణ నిజంగా మాదిగలపై ప్రేమ ఉంటే తాను అచ్చంపేటలో బీజేపీ అభ్యర్థిగా పోటీ చేస్తే ఎందుకు ప్రచారానికి రాలేదని ప్రశ్నించారు. మాల, మాదిగలకు కాంగ్రెస్‌ను శత్రువుగా చూపే ప్రయత్నం మంద కృష్ణ చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. బీజేపీ కోసం సుధీర్ఘంగా పని చేసిన బంగారు శృతికి ఎందుకు ఎంపీ టిక్కెట్ ఇవ్వలేదని ప్రశ్నించారు.

ఇంటర్ విద్యార్థులకు జేఈఈ అనర్హతను ఎత్తివేయాలి

- విద్యార్థి, ప్రజాసంఘాల డిమాండ్

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

జేఈఈ అడ్వాన్స్‌కు 2022 సెప్టెంబర్‌కు ముందు పాసైన వారు అర్హులు కారనే నిబంధనను వెంటనే ఎత్తివేయాలని విద్యార్థి, ప్రజాసంఘాలు డిమాండ్ చేశాయి. ఈ మేరకు భారత విద్యార్థి ఫెడరేషన్ (ఎస్ఎఫ్ఐ) రాష్ట్ర అధ్యక్ష కార్యదర్శులు ఆర్.ఎల్.మూర్తి, టి నాగరాజు, ఏఐఎస్ఎఫ్ నాయకులు మణికంటరెడ్డి, పుట్ట లక్ష్మణ్, ఎం.పర్శరాములు, మహేష్, అనిల్ జాదవ్, విజయ్, పావని, నాగరాజులు ఆదివారం హైదరాబాద్‌లో సంయుక్తంగా ఒక ప్రకటన విడుదల చేశారు. కేంద్రం తాజాగా తీసుకొచ్చిన నిబంధనల వల్ల ఐఐటీ, ఎన్ఐటీ, ట్రిబుల్ ఐటీ మొదలగు జాతీయ విద్యా సంస్థల్లో రెండు తెలుగు రాష్ట్రాలకు చెందిన విద్యార్థులు తీవ్రంగా నష్టపోనున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. అలాగే అన్ని సామాజిక వర్గాలకు చెందిన విద్యార్థులు కనిష్టంగా 75 శాతం మార్కులు రావాలనే నిబంధనను సైతం ఉపసంహరించుకోవాలని వారు డిమాండ్ చేశారు. ప్రభుత్వం అనాలోచితంగా తీసుకున్న నిర్ణయం వల్ల ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ బడుగు, బలహీన వర్గాలకు చెందిన విద్యార్థులకు తీరని అన్యాయం జరగనుందని ఆవేదన వ్యక్తం చేశారు. కేంద్ర ప్రభుత్వం వెంటనే నిర్ణయాన్ని మార్చుకోవాలని సూచించారు.

టెట్ పరీక్ష ఫీజును తగ్గించాలి : ఎస్ఎఫ్ఐ, డివైఎఫ్ఐ

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

ఉపాధ్యాయ అర్హత పరీక్ష(టెట్) ఫీజును తగ్గించాలని (ఎస్ఎఫ్ఐ) రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు ఆర్.ఎల్.మూర్తి, టి నాగరాజు, (డివైఎఫ్ఐ) రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు కోట రమేష్, ఆనగంటి వెంకటేష్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ మేరకు ఆదివారం హైదరాబాద్‌లో వేర్వేరుగా ప్రకటన విడుదల చేశారు. 2011 నుంచి 2021 వరకు రూ.200, 2022లో రూ.300, 2023లో రూ.400 పెంచగా, ఈ ఏడాది ఏకంగా రూ.1, 000 పెంచారని ఆందోళన వ్యక్తం చేశారు. పన్నెండేండ్లలో రెండు సార్లు వంద చొప్పున పెంచిన ప్రభుత్వం ఏకంగా రూ.600 పెంచడం దుర్మార్గపు చర్య అని విమర్శించారు. తక్షణమే టెట్ ఫీజును తగ్గించి పాత ఫీజును కొనసాగించాలని డిమాండ్ చేశారు. పెంచిన ఫీజులుపేద, మధ్య తరగతి విద్యార్థులకు పెను భారంగా మారనున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం వెంటనే ఫీజును తగ్గించాలని రాష్ట్ర ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు.

ప్రభుత్వ విద్యాసంస్థల మూసివేతను ఆపాలి: ఎఐడీఎస్‌వో

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

ప్రభుత్వ విద్యా సంస్థల మూసివేతను వెంటనే ఆపాలని ఆల్ ఇండియా డెమోక్రటిక్ స్టూడెంట్స్ ఆర్గనైజేషన్(ఎఐడీఎస్‌వో) డిమాండ్ చేసింది. పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో ఆదివారం హైదరాబాద్‌లో జరిగిన కార్యక్రమంలో "స్టూడెంట్స్ వాయిస్" పేరుతో ఎలక్షన్ మ్యానిఫెస్టో విడుదల చేశారు. అనంతరం ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షులు మల్లేష్ రాజ్, కార్యదర్శి ఎ. సత్యనారాయణ మాట్లాడుతూ విద్యకు బడ్జెట్‌లో నిధులు పెంచాలనీ, ఉపాధ్యాయ పోస్టులను భర్తీ చేయాలనీ కోరారు. కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన జాతీయ విద్యావిధానం వల్ల విద్యార్థుల సమస్యలు పరిష్కారం కాకపోగా మరిన్ని కొత్త సమస్యలు తలెత్తాయని ఆందోళన వ్యక్తం చేశారు. విద్యార్థులు ఎన్నికల సమయంలో అప్రమత్తంగా ఉండి, మంచి నాయకులను ఎన్నుకునేలా ప్రజలను చైతన్యం చేయాలని సూచించారు.ఈ కార్యక్రమంలో నాయకులు వెంకటేష్, స్వాతి, నితీష్, ప్రతిభ, వినోద్, నాగరాజు, ప్రణవ, నరేష్, మధు, చక్రి, రేణుక తదితరులు పాల్గొన్నారు.

పెండ్లి పేరుతో రూ.70 లక్షల టోకరా

- మ్యాట్రిమోనీలో యువతిని మోసం చేసిన వైనం
- సైబరాబాద్ కమిషనరేట్‌లో బాధితురాలు ఫిర్యాదు
- నిందితుని అరెస్టు, రిమాండ్



నవతెలంగాణ-మియాపూర్

హైదరాబాద్‌లో ఓ మ్యాట్రిమోనీలో పరిచయమైన యువతిని పెండ్లి చూపుల పేరుతో మోసం చేసి ఆమె నుంచి రూ.70 లక్షలు వసూలు చేసిన సైబర్ నేరస్తుడు ద్రోణుల రాజేశ్‌ను సైబరాబాద్ కమిషనరేట్ పోలీసులు అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. మార్చి 16న బాధిత యువతి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్టు సైబరాబాద్ క్రైమ్ ఏసీపీ రవీందర్‌రెడ్డి, ఇన్‌స్పెక్టర్ రవికుమార్ తెలిపారు. వారు తెలిపిన వివరాల ప్రకారం.. ఆంధ్రప్రదేశ్‌లోని కృష్ణా జిల్లాకు చెందిన ద్రోణుల రాజేష్.. ఆర్థికంగా ఇబ్బందులు ఉండటంతో తేలికగా డబ్బులు సంపాదించాలనే ఆలోచనతో పెండ్లి చూపుల పేరుతో మ్యాట్రిమోనీలో తన పేరు నమోదు చేసుకున్నాడు. అందులో మహిళలను పరిచయం చేసుకునేవాడు. తాను గ్లెన్‌మార్క్ కంపెనీలో అసిస్టెంట్ మేనేజర్‌గా పనిచేస్తున్నట్టు నమ్మించేవాడు. అమెరికాకు తీసుకెళతానని, అందుకు తన సిబిల్ స్కోర్ తక్కువగా ఉందని చెప్పి వారి నుంచి డబ్బులు వసూలు చేసేవాడు. అలా బాధితురాలి నమ్మించి ఆమె నుంచి రూ.70లక్షల వరకు వసూలు చేశాడు. తాను మోసపోయానని గ్రహించిన మహిళ రాజేష్‌పై సైబరాబాద్ కమిషరేట్‌లో ఫిర్యాదు చేసింది. బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేసి పోలీసులు నిందితుడిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. కాగా, నిందితుని నుంచి ఆరు పాస్‌బుక్‌లు, 10 డెబిట్ కార్డులు, 3 ఫోన్లు, 4 సిమ్‌కార్డులు స్వాధీనం చేసుకున్నట్టు పోలీసులు తెలిపారు.

భారీగా డీజిల్ అక్రమ రవాణా

- అడ్డుకున్న పౌరసరఫరాలశాఖ
- రూ.15 లక్షల విలువైన 15 వేల లీటర్లు పట్టివేత

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

కర్నాటక నుంచి అక్రమంగా డీజిల్ ను సరఫరా చేసిన ముఠా గుట్టు రట్టయింది. హైదరాబాద్ గచ్చిబౌలి పోలీసులు, ఎస్ఓటీ టీమ్ తో కలిసి పౌరసరఫరాలశాఖ ఎన్‌ఫోర్స్ మెంట్, విజిలెన్స్ అధికారులు మనోహర్ కుమార్ రాథోడ్,బాల సరోజ, మాచన రఘునందన్, రవి నాయక్‌లు డీజిల్ స్మగ్లింగ్ చేస్తున్న ముఠా కార్యకలాపాలకు అడ్డుకట్ట వేశారు. అధికారులు తెలిపిన వివరాల ప్రకారం... క్వారీల్లో వాడే క్రషర్ మిషన్లకు ఈ ఇంధనాన్ని ఉపయోగించేందుకు ముఠా ఇలాంటి కార్యకలాపాలకు పాల్పడుతున్నది. ముఠాలోని ఆరుగురిని అరెస్టు చేసి, పరారీలో ఉన్న మరో నలుగురి కోసం పోలీసులు గాలిస్తున్నారు. కర్నాటక నుంచి డీజిల్‌ను ట్యాంకర్లలో అక్రమంగా తెచ్చి హైదరాబాద్ శివారు ప్రాంతాల్లో అక్రమార్కులు అమ్ముతున్నారు. అక్రమంగా తరలిస్తున్న నిందితుల నుంచి నాలుగు డీజిల్ ట్యాంకర్లను అధికారులు సీజ్ చేశారు. హైదరాబాద్ కు చెందిన రాధాకృష్ణ, జావిద్ బేగ్‌లు కర్నాటక నుంచి డీజిల్‌ను తక్కువ ధరకు తెప్పించి హైదరాబాద్ నగర శివారుల్లోని నాగులపల్లి, కోకాపేట తదితర ప్రాంతాల్లో భవన నిర్మాణ సంస్థలకు, క్రషర్ లకు విక్రయిస్తున్నట్టు విచారణలో తేలింది. గచ్చిబౌలి పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు పౌరసరఫరాశాఖ అధికారులు వెల్లడించారు. ఈ దాడిలో రూ.15 లక్షల విలువైన రూ.15 వేల లీటర్ల డీజిల్ ను పట్టుకున్నట్టు తెలిపారు. ఇలాంటి అక్రమాలకు ఎవరూ పాల్పడిన వదిలేది లేదని అధికారులు హెచ్చరించారు.

కర్నాటకలో డీజిల్ తక్కువ ధర

కర్నాటకలో డీజిల్ లీటర్ ధరకు, తెలంగాణలో డీజిల్ ధరకు రూ.10 తేడా ఉండటంతో అక్రమ సంపాదనకు ముఠాలు ఈ మార్గాన్ని ఎంచుకుంటున్నాయి. తరచూ దాడులు చేస్తున్నప్పటికీ ఇలాంటి అక్రమాలు పదే పదే వెలుగు చూస్తున్నాయి. ధరల్లో భారీ వ్యత్యాసం లేకుండా అన్ని రాష్ట్రాల్లో ఒకే ధరను నిర్ణయిస్తే ఇలాంటి అక్రమాలకు శాశ్వతంగా చెక్ పడుతుందని నిపుణులు సూచిస్తున్నారు. సరిహద్దుల్లో గట్టి నిఘా ఏర్పాటు చేయాలని పలువురు కోరుతున్నారు.

12 సీట్లు..బూత్‌కు 370 ఓట్లు

పోల్‌మేనేజ్‌మెంట్‌పై బీజేపీ కసరత్తు

- కొత్త ఓటర్లపై ప్రత్యేక దృష్టి
- ప్రతి పోలింగ్‌బూత్‌పైనా ప్రత్యేక డ్రైవ్
- ఓటర్లను ఆకట్టుకునేలా ప్రత్యేక ప్రణాళికలు

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

తెలంగాణలో 12 సీట్లు...ప్రతి పోలింగ్ బూత్‌లోనూ 370 ఓట్లే లక్ష్యంగా బీజేపీ ముందుకు వెళ్తున్నది. అందులో భాగంగా పోల్ మేనేజ్‌మెంట్‌పై కసరత్తు చేస్తున్నది. కొత్త ఓటర్లను తమ వైపునకు తిప్పుకునేందుకు ప్రత్యేక దష్టి సారించింది. దీని కోసం ప్రతి బూత్‌లోనూ ఓటర్లను ఆకర్షించేందుకు స్పెషల్ డ్రైవ్ చేస్తున్నది. ప్రతి పోలింగ్ బూత్‌ను బలాన్ని బట్టి ఏ, బీ, సీ, డీలు గుర్తించి ఒక్కో చోట ఒక్కో వ్యూహాన్ని అనుసరించాలనే ఎత్తుగడతో ముందుకెళ్తున్నది. ఓటర్లను ఆకర్షించడం కోసం ప్రత్యేక ప్రణాళికలను రూపొందించి పకడ్బందీగా అమలు చేసేందుకు క్యాడర్‌కు చిన్నచిన్న టార్గెట్లను విధిస్తున్నది. ప్రతి గ్రామంలోనూ ఎంపీ అభ్యర్థి వీలైనంత ఎక్కువ సార్లు పర్యటించేలా ప్రణాళికలు రూపొందిస్తున్నది. దీని కోసం ఆదివారం హైదరాబాద్‌లోని బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో ఆ పార్టీ ఎంపీ అభ్యర్థులు, పదాధికారులు, మోర్చాల బాధ్యులతో బీజేపీ రాష్ట్ర అధ్యక్షులు, కేంద్ర మంత్రి జి.కిషన్‌రెడ్డి, బీజేపీ రాష్ట్ర ఇన్‌చార్జి, జాతీయ కార్యదర్శి సునీల్ బన్సల్, ఓబీసీ మోర్చా జాతీయ అధ్యక్షులు, ఎంపీ డాక్టర్ కె.లక్ష్మణ్ ప్రత్యేకంగా సమావేశమయ్యారు. సుదీర్ఘంగా జరిగిన ఈ సమావేశంలో లోక్‌సభ ఎన్నికల్లో అనుసరించాల్సిన వ్యూహాలపై చర్చించినట్టు తెలిసింది. నామినేషన్ల ప్రక్రియ పూర్తయ్యే వరకు అనగా ఏప్రిల్ 25 వరకు అనుసరించాల్సిన వ్యూహాలపై వారికి దిశానిర్దేశం చేశారు. తొలుత ప్రతి ఎంపీ నియోజవర్గ పరిధిలోని అసెంబ్లీ నియోజకవర్గాలు, మండలాల వారీగా కార్యాలయాలు తెరవాలని నిర్ణయించారు. గ్రామంలో ఓటర్లను మహిళలు, రైతులు, యువకులు, కొత్త ఓటర్లు, ఉద్యోగులు, యువజన సంఘాల బందాలు, సొసైటీలు, సామాజిక తరగతులు వారీగా విభజించి వారి ఓట్లను పొందేందుకు అనుసరించాల్సిన వ్యూహంపై ప్రత్యేకంగా చర్చించినట్టు తెలిసింది. కొత్తవారిని గ్రామ స్థాయి నుంచి రాష్ట్ర స్థాయి వరకు చేర్చుకోవడంపై స్పెషల్ ఫోకస్ పెట్టనున్నది. నామినేషన్ల ప్రక్రియ పూర్తయ్యే సరికి బూత్‌లో ఓటర్ల సంఖ్య ఎంత? ఏ సామాజిక తరగతి వారి ఓట్లు ఎక్కువ ఉన్నాయి? కొత్త ఓటర్లు ఎంత మంది? ఇలా ఓటర్ లిస్టుపై సమగ్ర అవగాహన కలిగి ఉండేలా పార్టీ శ్రేణులు తయార్యేలా కార్యక్రమాలు రూపొందించింది. ప్రతి వంద ఓట్లను నాయకులు పంచుకుని వారిని ఎన్నికలు పూర్తయ్యేసరికి వీలైనన్ని ఎక్కువ సార్లు కలవాలనీ, కనీసం మూడుసార్లయినా ఓటర్లతో విడివిడిగా మాట్లాడుతూనే చిన్నచిన్న టార్గెట్లు పెట్టుకుని ముందుకు సాగాలని దిశానిర్దేశం చేసినట్టు వినికిడి. అదే సమయంలో యువకులు, కొత్త ఓటర్లతో యువమోర్చా, రైతులతో కిసాన్ మోర్చా, ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ మోర్చాల బాధ్యులు ఎక్కడికక్కడ ఓటర్లతో తరుచూ సమావేశం కావాలని నిర్ణయించింది. గ్రామంలోని ఆయా సామాజిక తరగతుల్లోని కుల పెద్దలను మచ్చిక చేసుకోవడం, ఆ ఊరిలోని ప్రభుత్వ, ప్రయివేటు ఉద్యోగులను బీజేపీ వైపు ఆకర్షించేందుకు అనుసరించాల్సిన వ్యూహాలపైనా కసరత్తు చేసింది. కాంగ్రెస్, బీఆర్ఎస్ విధానాలను ఎండగట్టడం లాంటివి చేస్తూనే మోడీ ప్రభుత్వ హయాంలో కట్టిన రామమందిరం, తదితర అంశాలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లాలనీ, దీనికోసం సోషల్ మీడియాను వాడుకోవాలని శ్రేణులకు ఇప్పటికే సూచించింది. అంతిమంగా ప్రతి పోలింగ్ బూత్‌లో ఎలాగైనా 370 ఓట్లు సాధించాలనే లక్ష్యాన్ని శ్రేణులకు విధించారు. బూత్ స్థాయిలో పటిష్టత కోసం బూత్ లెవల్ కో ఆర్డినేటర్లను నియమించుకోనున్నారు. నామినేషన్ల వరకు ప్రతి గ్రామాన్ని ఎంపీ అభ్యర్థి కనీసం ఒక్కసారైనా కలిసేలా ప్రణాళికలు రూపొందించారు. బీజేపీ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా పోలింగ్ బూత్‌ల వారీగా టిఫిన్ సమావేశాలు నిర్వహించనున్నారు. పోలింగ్ బూత్ స్థాయిలో మోడీ ప్రభుత్వం ద్వారా లబ్ది పొందిన వారి ఇండ్ల వద్దకెళ్లి కలిసే కార్యక్రమాన్ని యథావిధిగా కొనసాగించనున్నారు.

'డిలే' ఎంహెచ్‌వో..

విధుల్లో ఖమ్మం జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి తీరని నిర్లక్ష్యం

- డిప్యూటీ డీఎంహెచ్‌వోగా ఉన్నప్పటి నుంచీ అదే తీరు
- నాడు హెచ్‌డీఎస్ నిధులు వెనక్కి.. ఆమె నిర్లక్ష్య ఫలితమే..
- ఒక్కో పీహెచ్‌సీ ఏటా రూ.లక్ష వరకు కోల్పోయిన వైనం
- ఉద్యోగులపై కక్ష సాధింపు చర్యలు..
- కలెక్టర్ ఆర్డర్స్ ఉన్నా ఉద్యోగికి శాలరీ చేయకుండా వేధింపులు?



నవతెలంగాణ - ఖమ్మం ప్రాంతీయ ప్రతినిధి/ఖమ్మం:

ఖమ్మం జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ బి.మాలతి తీరుపై తీవ్ర విమర్శలున్నాయి. విధుల్లో తీరని నిర్లక్ష్యం ప్రదర్శిస్తుంటారనే ఆరోపణలు ఆమెను వెంటాడుతున్నాయి. శాఖకు సంబంధించిన వివిధ ఫైల్స్‌ను రోజుల తరబడి తన దగ్గర అట్టిపెట్టుకుని, వాటిని క్లియర్ చేయకుండా ఉంటారనే అభియోగం ఆమెపై ప్రధానంగా ఉంది. తన పై అధికారులు, మంత్రులు, ప్రజాప్రతినిధులు వివరణలు కోరినా ఏ ఒక్క ఫైల్ కూడా ఆమె నుంచి సకాలంలో అందిన దాఖలాలు లేవు. ఈ నిర్లక్ష్యం ఇప్పటి నుంచి కాదు... తాను డిప్యూటీ డీఎంహెచ్‌వోగా పనిచేస్తున్న కాలం (2015-2019) నుంచీ కొనసాగుతోందనే ప్రచారం ఉంది. ఆమె నిర్లక్ష్య ఫలితంగా జిల్లాలో దాదాపు 32 పీహెచ్‌సీలకు చెందిన హాస్పిటల్ డెవలప్‌మెంట్ సర్వీస్ (హెచ్‌డీఎస్) నిధులు నాలుగేండ్ల పాటు వెనక్కి వెళ్లాయి. ఒక్కో పీహెచ్‌సీకి ఏటా రూ.లక్ష వరకు ఈ నిధులు వస్తాయి. ఒక ఏడాది ఆ నిధులను సద్వినియోగం చేసుకుంటేనే మరుసటి ఏడాది కూడా అవి మంజూరవుతాయి. కానీ నాటి డిప్యూటీ డీఎంహెచ్‌వో నిర్లక్ష్య ఫలితంగా ఆ నిధులను ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు పొందలేకపోయాయి. అలాగే కొందరు ఉద్యోగుల పట్ల కూడా ఆమె కక్షపూరితంగా వ్యవహరిస్తారనే ఆరోపణలున్నాయి. ఇటీవల దాదాపు రెండునెలల పాటు సెలవుల్లో ఉన్న డీఎంహెచ్‌వో గత సోమవారమే తిరిగి విధుల్లో చేరారు. ఆమె సెలవులో ఉన్నప్పుడు డీఎంహెచ్‌వోగా పనిచేసిన రామునాయక్, సుబ్బారావు తీసుకున్న నిర్ణయాలను ఈమె తుంగలో తొక్కి ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నట్టు తెలుస్తోంది.

హెచ్‌డీఎస్ కమిటీ తీర్మానం చేసినా.. వెంటాడిన నిర్లక్ష్యం..

ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల కోసం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నుంచి హాస్పిటల్ డెవలప్‌మెంట్ సర్వీసెస్ నిధులు వస్తాయి. వీటిని సద్వినియోగం చేసుకోవడానికి ఓ కమిటీ ఉంటుంది. ఈ కమిటీకి డిప్యూటీ డీఎంహెచ్‌వో, తహసీల్దార్, ఎంపీడీవో, పీహెచ్‌సీ డాక్టర్, స్థానిక సర్పంచ్ తదితరులు ప్రాతినిధ్యం వహిస్తారు. సమావేశాలు నిర్వహించి ఆరోగ్య కేంద్రం అభివృద్ధికి కావాల్సిన తీర్మానాలు చేస్తారు. సంబంధిత ఫైల్‌పై డిప్యూటీ డీఎంహెచ్‌వో కచ్చితంగా సంతకం చేయాల్సి ఉంటుంది. కానీ మాలతి డిప్యూటీ డీఎంహెచ్‌వోగా ఉన్న కాలంలో సంబంధిత నిధుల ఫైల్‌పై సంతకాలు చేసిన దాఖలాలు లేవనే ఆరోపణలున్నాయి. తద్వారా ఆ నిధులు డ్రా చేసుకునే అవకాశం లేకుండా పోయింది. ఏటా ఒక్కో పీహెచ్‌సీకి మంజూరయ్యే రూ.లక్ష హెచ్‌డీఎస్ నిధులను మెడిసిన్, పీహెచ్‌సీల మరమ్మతులు, ఇతరత్ర సౌకర్యాల కల్పన కోసం ఉపయోగించాలి.

కానీ నాటి డిప్యూటీ డీఎంహెచ్‌వో మాలతి పీహెచ్‌సీల తీర్మానాలపై సంతకం చేయకపోవడంతో ఆ నిధులు వెనక్కు వెళ్లాయి. ఒక ఏడాది ఉపయోగించుకోని కారణంగా మరుసటి సంవత్సరం కూడా మంజూరు కాకుండా పోయాయి. ఇప్పుడు డీఎంహెచ్‌వో ఆఫీస్‌లోనూ ఇదే తంతు కొనసాగుతోంది. ఆఫీస్ అదర్ ఎక్స్‌పెండేచర్ (ఓఓఎక్స్) నిధుల్లో ఒక్క పైసా కూడా కార్యాలయ నిర్వహణకు వెచ్చించడం లేదనే ఆరోపణలున్నాయి. ఫలితంగా గుండు పిన్ నుంచి కాగితాలు, ఇతర స్టేషనరీ సామగ్రి, చివరకు కంప్యూటర్ రిపేర్ వచ్చినా ఉద్యోగులు సొంత డబ్బులనే వెచ్చిస్తున్నారు. రూ.లక్షల్లో వచ్చే ఓఓఎక్స్ నిధులు దుర్వినియోగం అవుతున్నట్టు ఉద్యోగ వర్గాల ఆరోపణ.

ఉద్యోగులపై కక్ష సాధింపు..

డీఎంహెచ్‌వో మాలతి ఇటీవల సెలవుల్లో ఉన్నారు. దీనికి ముందే ఆఫీస్‌లో ఈ3 సెక్షన్‌ఎంపీహెచ్ఎస్ (మేల్) ఎండీ ఖలీద్‌బిన్ సయ్యద్ నకిలీ వైకల్య సర్టిఫికెట్లతో ఉద్యోగం చేస్తున్నారనే ఆరోపణలు వచ్చాయి. దీనిపై ఆ సెక్షన్‌కు ఇన్‌చార్జిగా ఉన్న సీనియర్ అసిస్టెంట్ జె.ఇందిరారాణిని రిపోర్టు ఇవ్వాల్సిందిగా డీఎంహెచ్‌వో మాలతి ఆదేశించారు. ఈమేరకు సీనియర్ అసిస్టెంట్ నివేదిక పనిలో ఉన్నారు. దీనిపై ఖలీద్ వ్యూహాత్మకంగా సీనియర్ అసిస్టెంట్‌పై తన భార్య సాధియా బేగంతో తెలంగాణ స్టేట్ మైనార్టీస్ కమిషన్‌కు ఫిర్యాదు చేయించారు. తద్వారా నకిలీ వైకల్య ధ్రువీకరణపత్రాలపై జరగాల్సిన విచారణ పక్కదోవ పట్టింది. సీనియర్ అసిస్టెంట్, ఎంపీహెచ్ఎస్ (మేల్) భార్య మధ్య వివాదం పేరుతో విచారణ కొనసాగింది.

ఇప్పుడా విచారణ ముగిసి దాదాపు 20 రోజులకు పైగా అవుతుంది. ఈ వివాదంపై 'నవతెలంగాణ' పత్రికలో వార్తలు వచ్చాయి. అదే క్రమంలో డీఎంహెచ్‌వో మాలతి 'అమ్మ పేరుతో అద్దె కారు' నిర్వహిస్తున్న తీరుపైనా పత్రికలో కథనం ప్రచురితమైంది. తనపై వస్తున్న వార్తల వెనుక ఆఫీసులోని కొందరు ఉద్యోగులు ఉన్నట్టు కలెక్టర్ మొదలు హెల్త్ డైరెక్టరేట్ వరకు డీఎంహెచ్‌వో చిత్రీకరించారనే ఆరోపణలున్నాయి.

తాను డిప్యూటీ డీఎంహెచ్‌వోగా పనిచేస్తుండగా అప్పట్లో డీఎంహెచ్‌వోగా ఉన్న అధికారిపై సైతం తప్పుడు ఆరోపణలు చేసి ఆర్ఎంవోగా బదిలీ చేయించారనే అభియోగం మాలతిపై ఉంది. ఇప్పుడు తన సీటుకు కూడా అదే విధంగా ఎసరు తెచ్చేందుకే ఈ విధమైన వార్తలు రాయిస్తున్నారనే దురాభిప్రాయంతో ఉన్న డీఎంహెచ్‌వో కొందరు ఉద్యోగులపై కక్షపూరితంగా వ్యవహరిస్తున్నారనే ఆరోపణలున్నాయి. దీనిలో భాగంగానే బదిలీలు, శాలరీల పేరుతో కొందర్ని ఇబ్బందులకు గురిచేస్తున్నట్టు సమాచారం. ఓవైపు నిర్లక్ష్యం.. మరోవైపు కక్షపూరిత వైఖరి.. నిధులు, అధికార దుర్వినియోగం తదితర చర్యల వల్ల డీఎంహెచ్‌వో కార్యాలయ పాలన తీరు గాడితప్పుతున్నట్టు పలువురు పేర్కొంటున్నారు.

నిబంధనల ప్రకారమే నడవడిక..

నిబంధనల ప్రకారమే నడుచుకుంటున్నాను. నాలుగేండ్లకు పైగా అయింది కదా.. హెచ్‌డీఎస్ నిధుల విషయం గుర్తులేదు. పీహెచ్‌సీలకు వచ్చే ఆ నిధులను సద్వినియోగం చేసుకున్నట్టే గుర్తుంది. ఉద్యోగులు, బదిలీలు, వేతనాల విషయంలో ప్రొసీజర్ ప్రకారమే నడుచుకుంటున్నా.

- బి.మాలతి, డీఎంహెచ్‌వో, ఖమ్మం

చారిత్రక వక్రీకరణ చిత్రం 'రజాకార్'

ఎస్వీకే వెబినార్‌లో వక్తలు

నవతెలంగాణ-హైదరాబాద్‌బ్యూరో



తెలంగాణ సాయుధ రైతాంగ పోరాట వాస్తవ చరిత్రను వక్రీకరిస్తూ 'రజాకార్' చిత్రాన్ని తీసారని పలువులు వక్తలు అభిప్రాయపడ్డారు. సుందరయ్య విజ్ఞాన కేంద్రం (ఎస్వీకే) ఆధ్వర్యంలో 'ముస్లింలపై ద్వేషం రెచ్చగొట్టడానికేనా రజాకార్ సినిమా' అంశంపై ఆదివారం జరిగిన వెబినార్‌లో ఆలిండియా కిసాన్‌సభ ఉపాధ్యక్షులు సారంపల్లి మల్లారెడ్డి, ఢిల్లీ యూనివర్సిటీ చరిత్ర విభాగం విశ్రాంత ప్రొఫెసర్ ఐ తిరుమలి మాట్లాడారు. ఎస్వీకే మేనేజింగ్ కమిటీ కార్యదర్శి ఎస్ వినయకుమార్ అధ్యక్షత వహించారు. సంఘ్‌పరివార్ శక్తులు ముస్లింలకు వ్యతిరేకంగా హిందువులను రెచ్చగొట్టడం, తెలంగాణ సాయుధ రైతాంగ పోరాటం అర్థాన్ని మార్చి, దాన్ని హిందూ, ముస్లిం ఘర్షణగా చరిత్రను వక్రీకరించే ప్రయత్నం చేస్తున్నాయని చెప్పారు. అనేక అవాస్తవాలు ఈ సినిమాలో ఉన్నాయనీ, పార్లమెంటు ఎన్నికలకు ముందు కేవలం ఓట్‌బ్యాంక్ రాజకీయం కోసమే ఈ సినిమా నిర్మాణం జరిగిందన్నారు. సినిమాలో తెలంగాణ విముక్తి అనే పదాన్ని పదేపదే వాడారని అభ్యంతరం వ్యక్తం చేశారు. నిజాంపై జరిగింది అక్షరాలా వర్గ పోరాటమేననీ, దానిలో అన్ని కులాలు, మతాలు ఏకమై పీడిత ప్రజలుగా జమీందారీ, పెట్టుబడిదారీ విధానంపై పోరాడారని విశ్లేషించారు. నిజాం రాచరిక పాలనకు వ్యతిరేకంగా 5 ఏండ్ల 3 నెలలు ఈ పోరాటం జరిగిందన్నారు. అందువల్లే 1947 ఆగస్టు 15న దేశానికి స్వాతంత్ర్యం వచ్చినా, 1948 సెప్టెంబర్ 18 వరకు నిజా సర్కారే ఇక్కడ రాజ్యాన్ని పాలించిందని వివరించారు. తెలంగాణలో ఐదుకోట్ల ఎకరాల భూమి ఉంటే 3 కోట్ల ఎకరాలు రైతాంగ పట్టా భూమి, (దివానీ) 1.5 కోట్ల ఎకరాల భూమి జమీందారులకు, 55 లక్షల ఎకరాలు నిజాంకు (సర్ఫ్‌కాజ్) భూములు ఉన్నాయన్నారు. కానీ ఈ మొత్తం భూముల్లో జమీందారుల ఆధీనంలోనే వ్యవసాయం జరిగేదనీ, శిస్తు కట్టలేక రైతులు భూములు వదిలేస్తే, వారిని వెతికి పట్టుకొచ్చి బలవంతంగా శిస్తులు వసూలు చేసేవారని చరిత్రను గుర్తుచేశారు. జుట్టు పెంచుకుంటే, మగపిల్లాడు పుడితే పన్ను వంటి అనేక విషయాలను ప్రస్తావించారు. నిజాం భూములు, జమీందారుల భూములు దున్నాకే రైతులు సొంత భూములు దున్నుకోవాలనీ, అప్పటికి వర్షాకాలం వెళ్లిపోయేదని చెప్పారు. వెట్టిచాకిరీ అన్ని కుటుంబాలకు ఉండేదనీ, ప్రజలు బానిసత్వంలో ఉండేవారనీ, మహిళలు జమీందారుల ఇండ్లలో దాసీలుగా ఉండేవారని చారిత్రక సత్యాలను వెల్లడించారు. ఏఏ జమీందారులకు ఎన్నెన్ని వేల ఎకరాల భూములు ఉండేవో అంకెలతోసహా వివరించారు. ఊళ్లో గుడి, బడి లేకున్నా, గడీ మాత్రం ఉండేదనీ, ప్రతి 10 ఊళ్లకు ఒక దొర ఉండేవారనీ, పండిన పంట పన్నుల కింద జమ చేసుకొనేవారని చెప్పారు కరువు వచ్చినప్పుడు అడవుల్లోకి వెళ్లి గడ్డలు తవ్వకొని పొట్టనింపుకొనే దుస్థితిలో ఆనాటి ప్రజానీకం ఉండేదన్నారు. 7వ నిజాం హయాంలో అరాచకాలు పెచ్చరిల్లాయి. ఖాసీం రజ్వీ సైన్యం. నిజాం సైన్యం. జమీందార్ల సైన్యం కలిసి గ్రామాలపై అరాచకాలు సృష్టించాయన్నారు. ఆంధ్ర మహాసభ ఆధ్వర్యంలో తాడిత, పీడిత ప్రజలంతా కులమతాలకు అతీతంగా ఏకమై సాయుధ పోరాటంలో భాగస్వాములు అయ్యి, 3వేల గ్రామాల్లో గ్రామ స్వరాజ్యాలు ఏర్పాటు చేసుకున్నారని తెలిపారు. ఆ తర్వాత దేశానికి స్వాతంత్ర్యం వచ్చినా, తెలంగాణలో మాత్రం నిజాం సర్కార్ పాలనే కొనసాగిందన్నారు. ఇక్కడి పోరాటాలను అణచివేయాలనే ఉద్దేశ్యంతో భారతసైన్యం వచ్చాక, నిజాం బొల్లారంలో లొంగిపోయారనీ, దాన్నే విముక్తి, విమోచనం అంటున్నారన్నారు. విలీనం చేస్తే సైన్యం వెళ్లిపోవాలనీ...కానీ అలా జరగలేదని వివరణ ఇచ్చారు. భారతసైన్యం ఇక్కడి కమ్యూనిస్టులను పట్టుకొని కాల్చిచంపింది, ఆ సమయంలో 1,500 మంది కమ్యూనిస్టులు సైన్యం చేతిలో మరణించారని ఉదహరించారు. సైన్యాన్ని విమర్శించకూడదని అంటారనీ, కానీ పటేల్ ఆధ్వర్యంలో జరిగింది విలీనమో, విద్రోహమో అనుభవించినవాళ్లకు తెలుస్తుందని అన్నారు. విలీనం తర్వాత భారతసైన్యం అనేక విపరీత దాష్టీకాలకు పాల్పడిందనీ, కాన్సన్‌ట్రేషన్ క్యాంపులు పెట్టి గ్రామాల్లో ప్రజల్ని హింసలకు గురిచేశారని చెప్పారు. రజాకార్ సినిమాలో సెప్టెంబర్ 18 వరకే చూపించారనీ, ఆ తర్వాత చరిత్రను ఎందుకు చూపలేదని ప్రశ్నించారు. నెహ్రూ ఆధ్వర్యంలోని భారత ప్రభుత్వం నిజాంను రాజ్‌ప్రముఖ్‌గా ప్రకటించిందనీ, ఖాసీం రిజ్వీని రక్షించారని చెప్పారు. నిజాం తన డబ్బును ప్రభుత్వానికి చెప్పే, ఇంగ్లండ్‌కు తరలించుకెళ్లారనీ, దానికి భారత ప్రభుత్వం పూర్తిగా సహకరించిందని వివరించారు. నిజాం రాజ్యం భారతదేశంలో విలీనం అయ్యాక కూడా 1951 వరకు తెలంగాణ ప్రజలపై నిర్బంధం కొనసా గిందనీ, భారత సైన్యం వచ్చాక విద్రోహమే జరిగింది తప్ప, ఎలాంటి. మార్పు రాలేదన్నారు. అప్పటి ప్రధాని నెహ్రూ రక్షిత కౌలుదారీ చట్టాన్ని ప్రకటిం చాకే కమ్యూనిస్టులు పోరాటం విరమించారని గుర్తుచేశారు. చరిత్ర తెలిసిన వాళ్లు రజాకార్ సినిమాను అసహ్యించుకుంటున్నారనీ, గాంధీని తీసేసి, ఆస్థానంలో వీర సావర్కర్‌ను పెడుతు న్నారనీ, పిరికిపంద సావర్కర్ వీరుడు ఎలా అవుతాడని ప్రశ్నించారు. సాయుధ రైతాంగ పోరాట విరమణ రోజే ఆర్ఎస్ఎస్ ఆవిర్భవించిందనీ, ఆ తర్వాత జన్‌సంఘ్‌గా మారి, ఆటు తర్వాత జనతా పార్టీగా రూపాంతరం చెందిందని విశ్లేషించా రు. వీరెవరూ నిజాం పోరాటంలో పాల్గొన్నవారు కాదనీ, చాకలి ఐలమ్మ వేషాభాషల్ని సినిమాలో వక్రీకరించా రన్నారు. అప్పటి కేంద్ర మంత్రివర్గం నిర్ణయం తీసుకున్నాకే సర్దార్ పటేల్ హైదరాబాద్‌కు వచ్చారే తప్ప, ఆయన ఒక్కడి నిర్ణయం కాదని స్పష్టం చేశారు. నిజాం ఇండియన్ ఆర్మీని వ్యతిరే కించద లుచుకోలేదనీ, ఆ శక్తి తనకు లేదని అప్పటికే ఆయన గ్రహించారని విశ్లేషించారు. రజాకార్ సినిమా థియేటర్లలో 20, 30 మందికన్నా పెద్దగా జనం ఎవరూ లేరనీ, వారు కూడా చారిత్రక వక్రీకరణల్ని చూసి నవ్వుకుంటున్నారని అన్నారు.

మల్లన్నను దర్శించుకున్న మంత్రి పొన్నం ప్రభాకర్

- పట్నం వేసి మొక్కులు చెల్లించుకున్న మంత్రి

నవతెలంగాణ-కొమురవెల్లి



కొమురవెల్లి మల్లికార్జున స్వామిని రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ గౌడ్ కుటుంబ సమేతంగా ఆదివారం దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆయనకు ఆలయ అధికారులు ఘన స్వాగతం పలికారు. బోనాలు చెల్లించి ఆలయ ముఖ మండపంలో పట్నాలు వేసి మొక్కులు చెల్లించుకున్నారు. కుటుంబ సభ్యులతో కలిసి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా అర్చకులు ఆయనకు మల్లన్న ప్రతిమ, తీర్థ ప్రసాదాలు అందజేశారు. అనంతరం గెస్ట్ హౌస్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కొమురవెల్లి మల్లన్న తమ కుటుంబ ఇలవేల్పుగా కొలుస్తామని, ప్రతేడాది బోనాలు చెల్లించి పట్నాలు వేసి మొక్కులు తీర్చుకుంటామన్నారు. అసెంబ్లీ ఎన్నికలకు ముందు మల్లన్న ఆలయానికి వచ్చి తాను ఎమ్మెల్యేగా గెలవాలని, రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావాలని మొక్కుకున్నానన్నారు. ఆ కోరికలు నెరవేరిన సందర్భంగా ఆలయంలో ప్రత్యేక పూజలు చేసి మొక్కులు చెల్లించుకున్నానని తెలిపారు. రాష్ట్రంలో సకాలంలో వర్షాలు కురిసి పాడిపంటలతో రైతులు సుఖసంతోషాలతో ఉండాలని కోరుకున్నట్టు చెప్పారు. ఆయన వెంట మాజీ ఎమ్మెల్సీ నాగపురి రాజలింగం, ఆలయ పునరుద్ధరణ కమిటీ చైర్మెన్ పర్పాటకం లక్ష్మారెడ్డి, కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

తెలంగాణలో 12 సీట్లల్లో గెలుపే లక్ష్యం

- రాహుల్‌గాంధీ జన్మలో ప్రధాని కాలేరు :

బీజేపీ రాష్ట్ర అధ్యక్షులు, కేంద్ర మంత్రి జి.కిషన్‌రెడ్డి

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

తెలంగాణలో 12 సీట్లలో గెలుపే లక్ష్యంగా తమ పార్టీ ముందుకెళ్తున్నదని బీజేపీ రాష్ట్ర అధ్యక్షులు, కేంద్ర మంత్రి జి.కిషన్‌రెడ్డి తెలిపారు. ఆదివారం హైదరాబాద్‌లోని బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో పదాధికారుల సమావేశం జరిగింది. అందులో బీజేపీ రాష్ట్ర ఇన్‌చార్జి సునిల్ బన్సల్, ఓబీసీ మోర్చా జాతీయ అధ్యక్షులు, ఎంపీ డాక్టర్ కె.లక్ష్మణ్, ఆ పార్టీ వ్యవస్థాగత ప్రధాన కార్యదర్శి చంద్రశేఖర్, బీజేపీఎల్పీ నేత మహేశ్వర్‌రెడ్డి, లోక్‌సభ అభ్యర్థులు, పదాధికారులు పాల్గొన్నారు. అంతకు ముందు మహబూబ్‌నగర్, నల్లగొండ జిల్లాలకు చెందిన పలువురు నేతలు, కార్యకర్తలు బీజేపీలో చేరారు. వారికి కిషన్‌రెడ్డి, జాతీయ ఉపాధ్యక్షులు, మహబూబ్‌నగర్ అభ్యర్థి డీకే అరుణ కండువాలను కప్పి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..తెలంగాణలో బీజేపీకి వాతావరణం అనుకూలంగా ఉందనీ, ప్రతి ఇంటికీ వెళ్లి దాన్ని అనుకూలంగా మార్చుకోవాల్సిన బాధ్యత పార్టీ శ్రేణులపైనే ఉందన్నారు. సభలు, సమావేశాల కంటే ప్రజలను కన్విన్స్ చేయడమే కీలకమని చెప్పారు. బూతులవారీగా బలోపేతంపై దృష్టి సారించాలనీ, ఆ తర్వాత అగ్రనేతల సభలు, ర్యాలీలుంటాయని అన్నారు. 17 సీట్లలో గెలిచి రాహుల్ పీఎం అయితేనే ఆరు గ్యారంటీలను అమలు చేస్తామని సీఎం రేవంత్‌రెడ్డి చెబుతున్నారనీ, అయితే, జన్మలో కూడా రాహుల్‌గాంధీ ప్రధాని కారని చెప్పారు. కాంగ్రెస్‌ను నమ్మి ఓట్లేసిన ప్రజలు ఇబ్బంది పడుతున్నారన్నారు.

తీర ప్రాంతంలో మైనింగ్‌పై అదనపు నిఘా

న్యూఢిల్లీ : దేశంలో సముద్ర తీరం వెంబడి మైనింగ్ కార్యకలాపాలు నిర్వహిస్తున్న విదేశీ సంస్థలు, కాంట్రాక్టర్లు, నౌకలపై గట్టి నిఘా వేసి ఉంచడానికి కేంద్రం కొత్తగా నిబంధనలు రూపొందిస్తోంది. దేశ భద్రత దృష్ట్యా నిఘాను కట్టుదిట్టం చేయాల్సి వస్తోందని ప్రభుత్వం తెలిపింది. నూతన నిబంధనల ప్రకారం ఇకపై తీరం వెంబడి మైనింగ్ కార్యకలాపాలు నిర్వహించాలంటే కేంద్ర హోం శాఖ నుండి ముందస్తు అనుమతి పొందాల్సి ఉంటుంది. విదేశీ సిబ్బందిని, పరికరాలను ఉపయోగించుకోవాలంటే ఆ ప్రణాళికలను గురించి తెలిసిన ఇద్దరు వ్యక్తులను నియమించాలి.

ఈ నియామకాలకు హోం శాఖ అనుమతి తప్పనిసరి.

నూతన నిబంధనలను గనుల శాఖ ఖరారు చేసే పనిలో ఉంది. సముద్ర తీరంలో అపారమైన ఖనిజ వనరులను అన్వేషించి, ఉత్పత్తి చేయడానికి వీలుగా మైనింగ్ కార్యకలాపాలలో ప్రైవేటు సంస్థలను ప్రభుత్వం అనుమతించింది. దేశంలోని 7,517 కిలోమీటర్ల పొడవైన సముద్ర తీరం వెంబడి వెలికితీయని 79 మిలియన్ టన్నుల భారీ ఖనిజాలు ఉన్నాయని అంచనా. తీర ప్రాంతంలోని అధిక భాగం రక్షణ సంస్థల పహారాలో ఉన్నదని, కాబట్టి ఈ ఆయా ప్రాంతాలలో మైనింగ్ చేయడానికి అదనపు భద్రత అవసరమని ఓ అధికారి తెలిపారు.

ఇద్దరు సిట్టింగ్‌లకు దక్కని చోటు

- జేడీయు అభ్యర్థుల జాబితా విడుదల

పాట్నా : బీహార్‌లో జెడియు పోటీ చేయనున్న 16 స్థానాలకు ఆ పార్టీ ఆదివారం నాడు అభ్యర్థుల జాబితాను విడుదల చేసింది. పాట్నాలో జరిగిన కార్యక్రమంలో జెడి(యు) అధ్యక్షులు, బీహార్ ముఖ్యమంత్రి నితీష్‌కుమార్ ఈ జాబితాను విడుదల చేశారు.

ఇద్దరు సిట్టింగ్ ఎంపీలు..కవితా సింగ్ (సివాన్), సునీల్ కుమార్ పింటు (సీతామర్హి)లకు ఈ జాబితాలో చోటు దక్కలేదు. వారి స్థానంలో సితామర్హి స్థానం నుంచి ప్రస్తుత శాసన మండలి చైర్మన్ దేవేశ్ చంద్ర ఠాకూర్‌ను, సివాన్‌లో విజయ లక్ష్మి కుష్వాహను బరిలో నిలిపారు.

రాష్ట్రీయ లోక్ మోర్చా రాష్ట్ర అధ్యక్షులు రామేష్ సింగ్ కుష్వాహ భార్య అయిన విజయ లక్ష్మి శనివారమే జెడియులో చేరగా..ఆదివారం ఆమెకు టికెట్ ఖరారు చేయడం గమనార్హం. కాగా, మిగిలిన 14 స్థానాలకు ప్రస్తుత సిటింగ్ ఎంపిలనే జెడియు తన అభ్యర్థులుగా ప్రకటించింది. గత లోక్‌సభ ఎన్నికల్లో జెడియు మొత్తం 17 స్థానాల్లో పోటీ చేసింది.

ఇటీవల ఎన్‌డిఎ పక్షాల మధ్య కుదిరిన సీట్ల సర్దుబాటులో జెడియుకు 16 స్థానాలు కేటాయించిన సంగతి తెలిసిందే.

లఢఖ్‌కు రాష్ట్ర హోదా ఇవ్వండి

కార్గిల్‌లో నిరాహార దీక్షలు

కార్గిల్ : కేంద్ర ప్రభుత్వ తీరుపై కార్గిల్‌లో ప్రజానీకం నిరసన గళమెత్తారు. లఢఖ్‌కు రాష్ట్ర హోదా ఇవ్వాలని, రాజ్యాంగంలోని ఆరో షెడ్యూలులో చేర్చాలని డిమాండ్ చేస్తూ కార్గిల్ డెమొక్రటిక్ అలయన్స్ (కెడిఎ) ఆధ్వర్యంలో ఆదివారం ఇక్కడ నిరాహార దీక్షలు ప్రారంభయ్యాయి. మూడు రోజుల పాటు ఈ దీక్షలు కొనసాగుతాయని కెడిఎ నేతలు తెలిపారు. దీక్షలకు మద్దతుగా వివిధ సామాజిక తరగతులకు చెందిన ప్రజలు నిరసన ప్రదర్శనలు నిర్వహించారు. మరోవైపు సామాజిక కార్యకర్త సోనం వాంగ్‌చుక్ చేపట్టిన నిరాహార దీక్ష ఆదివారం నాటికి 19వ రోజుకు చేరుకుంది. కేంద్ర ప్రభుత్వ పెద్దలతో లేహ్‌కు చెందిన వివిధ సంఘాల ప్రతినిధులు కేంద్ర హోంమంత్రి అమిత్ షా సమక్షంలో చర్చలు జరిగినా..అవి ఏ కోశాన ముందుకు సాగడం లేదని ఆయన అసంతృప్తి వ్యక్తం చేశారు. కేంద్ర ప్రభుత్వ ఏకపక్ష ధోరణిని వ్యతిరేకిస్తూ నిరాహారదీక్ష చేపట్టారు. అమిత్ షాతో జరిగిన చర్చల్లో కెడిఎ నుంచి కూడా ప్రతినిధులు హాజరయ్యారు.



స్థానిక యువతకు ఉపాధి అవకాశాలు కల్పించాలని, ఒక రాజసభ స్థానం ఇవ్వాలని కూడా వీరంతా డిమాండ్ చేస్తున్నారు. జమ్ముకాశ్మీర్ స్వయం ప్రతిపత్తిని రద్దు చేసి రెండు ముక్కలుగా విడగొట్టిన తర్వాత లఢఖ్‌ను కేంద్ర పాలిత ప్రాంతంగా ప్రకటించిన సంగతి తెలిసిందే. అప్పటి నుంచి జమ్ముకాశ్మీర్‌లోనూ, లఢఖ్‌లోనూ ఆందోళనలు కొనసాగుతూనేవున్నాయి. బిజెపి, దాని భజనపరులు చెబుతున్నట్లుగా అక్కడేమీ శాంతిసమీరాలు వీయడం లేదు. నిత్యం నిరసనలు కొనసాగుతూనేవున్నాయి. సైనిక ఆంక్షల మధ్యన జనం నలిగిపోతూనేవున్నారు.

సాయుధల చెర నుంచి సురక్షితంగా..

- నైజీరియాలో 300 మంది చిన్నారులకు విముక్తి
- రెండు వారాల నిర్భంధం తరువాత విడుదల

అబుజా : ఆఫ్రికా దేశమైన నైజీరియాలో దాదాపు 300 మంది విద్యార్థుల అపహరణ వ్యవహారం సుఖాంతమైంది. రెండు వారాల నిర్బంధం తర్వాత కిడ్నాపర్లు వారిని సురక్షితంగా విడుదల చేసినట్లు స్థానిక ప్రభుత్వ అధికారులు ఆదివారం తెలిపారు. భద్రతా బలగాల సమన్వయం, వ్యూహరచనతో ఇది సాధ్యమైందని స్థానిక గవర్నరు పేర్కొన్నారు. చిన్నారులను క్షేమంగా వెనక్కి తీసుకురావడంలో దేశాధ్యక్షులు బోలా టినుబు చొరవ చూపారని తెలిపారు.

వాయువ్య నైజీరియాలోని కదునా రాష్ట్రంలోని కురిగా పట్టణంలో ఒక పాఠశాల నుంచి ఈ 7న దాదాపు 300 మంది విద్యార్థులను సాయుధ దుండగులు అపహరించుకుపోయారు. అడ్డుకునేందుకు యత్నించిన ఒక పౌరుడిని దుండగులు కాల్చి చంపేశారు. ఈ ఘటన ప్రపంచవ్యాప్తంగా దిగ్భ్రాంతికి గురి చేసింది. నైజీరియాలో చిన్నారుల అపహరణ సాధారణ విషయమే అయినా పెద్ద సంఖ్యలో విద్యార్థులను అపహరించడం ఆందోళనకు దారితీసింది. విద్యార్థులను సాయుధులు సమీపంలోని అటవీ ప్రాంతంలోకి తీసుకెళ్లిపోయారు. విద్యార్థుల్లో 12 ఏళ్ల లోపు చిన్నారులే 100 మంది పైగా ఉన్నారు. వారిని విడుదల చేసేందుకు రూ.5 కోట్లు ఇవ్వాలని, లేదంటే చంపేస్తామని సాయుధులు బెదిరించారు.

అయితే సాయుధులకు ఒక్క పైసా కూడా చెల్లించకుండా చిన్నారులను రక్షించడంలో అధ్యక్షులు టినుబు నిర్దేశాలు సత్ఫలితాలు ఇచ్చాయని గవర్నరు తెలిపారు. ఈ క్రమంలో విద్యార్థులంతా సురక్షితంగా విడుదల కావడంతో స్థానిక ప్రజలు ఊపిరి పీల్చుకున్నారు. 2014లోనూ బోర్నో రాష్ట్రంలోని చిబోక్ గ్రామం నుంచి 200 మందికి పైగా పాఠశాల బాలికలు అపహరణకు గురయ్యారు. ఆ తర్వాత ఇప్పటి వరకు 1400 మంది విద్యార్థులు అపహరణకు గురయ్యారు.

నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
7
ఎల్బీనగర్ - మహేశ్వరం
సోమవారం | మార్చి 25, 2024 | www.navatelangana.com



నాగోల్ డివిజన్ బండ్లగూడ లోని కంతమహేశ్వర శివ పంచాయతన వన మైసమ్మ దేవాలయం ప్రథమ వార్షికోత్సవం సందర్భంగా రాష్ట్ర పర్యాటక అభివృద్ధి సంస్థ మాజీ చైర్మన్, అంతర్జాతీయ వైశ్య ఫెడరేషన్ జాతీయ నిర్వాహక అధ్యక్షుడు ఉప్పల శ్రీనివాస గుప్త ఆదివారం దేవాలయాన్ని దర్శించుకున్నారు. తర్వాత ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆయన వెంట అధ్యక్షుడు చెరుకు జంగయ్య గౌడ్, మెట్టు శంకరయ్య గౌడ్ ఉపాధ్యక్షుడు, రుద్రగోని పాండు గౌడ్ లక్ష్మీబాయి గౌడ్, సుర్వీ ప్రమీల గౌడ్, చెరుకు బాలయ్య గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

నవతెలంగాణ -నాగోల్

'పిడమర్తి రవికి కంటోన్మెంట్ టికెట్ కేటాయించాలి'



నవతెలంగాణ - చైతన్యపురి

తెలంగాణ రాష్ట్ర ఏర్పాటులో ముఖ్యపాత్ర పోషించిన విద్యార్థి ఉద్యమ నాయకుడు డా.పిడమర్తి రవికి కాంగ్రెస్ ప్రభుత్వం తగిన గౌరవం ఇవ్వాలని, మాదిగలకు జనాభా ప్రాతిపాదికన రెండు పార్లమెంట్ టికెట్స్ కేటాయిస్తూ హైదరాబాద్‌లోని కంటోన్మెంట్ ఎమ్మెల్యే టికెట్‌ను డాక్టర్ పిడమర్తి రవికి కేటాయించాలని మాదిగ జేఏసీ యువజన విభాగం రాష్ట్ర అధ్యక్షులు నక్క మహేష్ అన్నారు. ఈ మేరకు ఆదివారం ఆయన మాట్లాడుతూ తెలంగాణలో మాదిగలకు కాంగ్రెస్ పార్టీ తీవ్రమైన అన్యాయం చేస్తుందని ఆవేదన వ్యక్తం చేశారు. ఎస్సీలో మాదిగలు 80 లక్షలు ఉన్నారని అని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం వస్తే న్యాయం జరుగుతుందని నమ్మి కాంగ్రెస్ గెలుపునకు ఎంతో కృషి చేశామన్నారు. కానీ ఈ పార్లమెంట్ ఎన్నికల్లో మాదిగలకు స్థానం కలిపించకపోవడంతో కాంగ్రెస్ పార్టీ యొక్క ఉద్దేశం మాదిగలపై ఎలా ఉందో అర్థమవుతుందని వాపోయారు. పెద్దపల్లి పార్లమెంట్ విషయంలో కాంగ్రెస్ పునరాలోచన చేసి మాదిగలకు కేటాయించాలని డిమాండ్ చేశారు. లేనిచో రాష్ట్ర మాదిగ జేఏసీ యువజన విభాగం రాష్ట్ర అధ్యక్షులు ఆధ్వర్యంలో అన్ని నియోజకవర్గాల్లో సమావేశాలు నిర్వహిస్తామని హెచ్చరించారు.



కాంగ్రెస్‌లో చేరిన బీఆర్ఎస్ కౌన్సిలర్లు

నవతెలంగాణ - తుర్కయంజాల్

కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి, భువనగిరి పార్లమెంట్ అభ్యర్థి గెలుపునకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్ రెడ్డి రంగారెడ్డి కోరారు. ఈ మేరకు ఆదివారం ఎమ్మెల్యే రంగారెడ్డి సమక్షంలో తుర్కయంజాల్ మున్సిపాలిటీకి చెందిన బీఆర్ఎస్ కౌన్సిలర్లు పుల్లగుర్రం కీర్తనా విజయానంద్ రెడ్డి, మర్రి మాధవి మహేందర్ రెడ్డి, ఇంజాపూర్ సీనియర్ నాయకులు, మాజీ జెడ్పీటీసీ నోముల కృష్ణ గౌడ్‌లు కాంగ్రెస్ తీర్థం పుచ్చుకున్నారు.

ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ సీఎం రేవంత్ రెడ్డి సారథ్యంలో రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ తిరుగులేని విజయం సాధించిందని హర్షం వ్యక్తం చేశారు. కాంగ్రెస్ అధికారం చేపట్టిన తర్వాత ప్రజలకు అనేక సంక్షేమ పథకాలు అందిస్తున్నట్లు తెలిపారు. తాము అందిస్తున్న పథకాలకు ఆకర్షితులై రాష్ట్రంలో అనేక మంది బీఆర్ఎస్ నాయకులు కాంగ్రెస్‌లో చేరేందుకు ముందుకువస్తున్నట్లు పేర్కొన్నారు.

ఇబ్రహీంపట్నంలోని ప్రజాప్రతినిధులు, నాయకులు కాంగ్రెస్‌లో చేరుతున్నట్లు చెప్పారు. కాంగ్రెస్‌లోని సీనియర్లకు ఇబ్బంది కలగకుండా కొత్త వారిని కలుపుకొని ముందుకు వెళ్తామన్నారు. కాంగ్రెస్‌లోని సీనియర్లకు తగిన న్యాయం చేస్తామని అన్నారు. పాత, కొత్త వారి కలయికతో ముందుకెళ్తామని చెప్పారు. తుర్కయంజాల్ మున్సిపాలిటీని రాష్ట్రంలోనే ఆదర్శంగా తీర్చిదిద్దుతామని అన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ సీనియర్ నాయకులు మల్ రెడ్డి రాంరెడ్డి, కౌన్సిలర్లు నారని కవిత శేఖర్ గౌడ్, కుంట ఉదయశ్రీ గోపాల్ రెడ్డి, నాయకులు తాడిచెట్టు అశోక్ గౌడ్, దాసరి సుధాకర్ రెడ్డి, పూజారి శశిధర్ గౌడ్, మేతరి దర్శన్, గుండా ధనరాజ్, కొంతం వెంకట్ రెడ్డి, నక్క రమేష్ గౌడ్, వంగేటి గోపాల్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

బీఆర్ఎస్ అభ్యర్థి జ్ఞానేశ్వర్‌ను మెజార్టీతో గెలిపించాలి

- ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి
- చేవెళ్ల పార్లమెంట్ నియోజకవర్గ బీఆర్ఎస్ ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఎమ్మెల్యేలు



నవతెలంగాణ - మీర్ పేట్

చేవెళ్ల పార్లమెంట్ బీఆర్ఎస్ అభ్యర్థి కాసాని జ్ఞానేశ్వర్ ముదిరాజ్‌ను అత్యధిక మెజార్టీతో గెలిపించాలని మాజీ మంత్రి, మహేశ్వరం నియోజకవర్గ ఎమ్మెల్యే పి. సబితా ఇంద్రారెడ్డి కోరారు. మీర్‌పేట్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని ఓ కన్వెన్షన్ హాల్లో చేవెళ్ల పార్లమెంటు ఎన్నికల సన్నాహక సమావేశాన్ని ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి అధ్యక్షతన ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కాసాని జ్ఞానేశ్వర్ ముదిరాజ్‌ను భారీ మెజార్టీతో గెలిపించాలని పిలుపునిచ్చారు. ప్రజలతో మమేకమైన ఒక మంచి వ్యక్తి, జడ్పీ చైర్మన్, ఎమ్మెల్సీగా ఈ ప్రాంతానికి సేవ చేశారని, బడుగు, బలహీన వర్గాల గొంతుకగా జ్ఞానేశ్వర్ పని చేశారని తెలిపారు. 96 కులాల బీసీ ఐక్య వేదికను ఏర్పాటు చేసి అందరీ ఐక్యతకు పాటు పడ్డారని కొనియాడారు. నేడు రాష్ట్రంలో బీఆర్ఎస్ ప్రభుత్వం అధికారం కోల్పోతే ప్రస్తుత ఎంపీ రంజిత్ రెడ్డి స్వలాభం కోసం కష్టకాలంలో పార్టీని వదిలి వెళ్లారని, నాడు ఈ ప్రాంత ప్రజలకు తెలియని రంజిత్ రెడ్డిని కేసీఆర్ చెప్పారని ఎంపీగా గెలిపించుకున్నామని గుర్తు చేశారు. రెండు సార్లు బీఆర్ఎస్ కారు గుర్తుతో గెలిచిన అభ్యర్థులు ఇప్పుడు ప్రత్యర్థులుగా పోటీ చేస్తున్నారని, ఈ ప్రాంత ప్రజలు ఓటుతో సమాధానం చెప్పటానికి సిద్ధంగా ఉన్నారన్నారు.



'చేవెళ్ల పార్లమెంట్‌ను కేసీఆర్‌కు బహుమతిగా ఇద్దాం...

బైరాముల్‌గూడ ఫ్లై ఓవర్, ఇతర ఫ్లై ఓవర్లు లేకుండా చేస్తారా? కాళేశ్వరం కూలుస్తారా..? రైతు బంధు, రైతు బీమా బంద్ చేస్తారా అని ప్రశ్నించారు. చేవెళ్ల పార్లమెంట్‌లో బీఆర్ఎస్ పార్టీని గెలిపించి, కేసీఆర్ కు బహుమతిగా ఇద్దాం అని ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి అన్నారు. ఎమ్మెల్యేగా వచ్చిన మెజార్టీ కన్నా రెట్టింపుతో గెలిపించడానికి నలుగురు ఎమ్మెల్యేలు సిద్ధంగా ఉన్నామన్నారు. బీజేపీ, కాంగ్రెస్ పార్టీలు అసత్య వాగ్దానాలు చేస్తూ ప్రజలను మోసం చేస్తున్నాయన్నారు. ఇరు పార్టీలు గ్యారెంటీలతో సాధ్యం కానీ హామీలు ఇస్తున్నాయని పేర్కొన్నారు.

సేవ చేసే అవకాశం కల్పించండి..

బీఆర్ఎస్ పార్టీ చేవెళ్ల పార్లమెంట్ అభ్యర్థి కాసాని జ్ఞానేశ్వర్ మాట్లాడుతూ రానున్న ఎన్నికల్లో అందరీ సహాయ సహకారాలు కావాలన్నారు. ఎంపీగా గెలిపించి, సేవ చేసే అవకాశం కల్పించాలని కోరారు. ఎంతో కాలంగా ఈ ప్రాంత ప్రజలతో సన్నిహిత సంబంధాలు ఉన్నాయన్నారు. మీలో ఒకరిగా ఉంటూ చేవెళ్ల పార్లమెంట్ సమగ్రాభివృద్ధికి కృషి చేస్తానని భరోసా ఇచ్చారు. ఈ సమావేశంలో రాజేంద్రనగర్, చేవెళ్ల ఎమ్మెల్యేలు ప్రకాష్ గౌడ్, కాలే యాదయ్య, ఎమ్మెల్సీలు సురభి వాణీదేవి, యెగ్గే మల్లేశం, దయనంద్ గుప్తా, డీసీఎంఎస్ చైర్మన్ కృష్ణారెడ్డి, మేయర్ దుర్గా దీప్ లాల్ చౌహన్, డిప్యూటీ మేయర్ తీగల విక్రమ్ రెడ్డి, అధ్యక్షుడు అర్కల కామేష్ రెడ్డి నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

భారత్ ఆర్ట్స్ అకాడమీ నిర్వహణలో
నంది అవార్డ్స్ ప్రదానం



నవతెలంగాణ-కల్చరల్

భారత్ ఆర్ట్స్ అకాడమీ నిర్వహణలో రవీంద్ర భారతి ప్రధాన వేదికపై శివరాత్రిని పురస్కరించుకొని స్వర్ణ నంది అవార్డ్స్ ప్రదానోత్సవం సభ జరిగింది. ముఖ్య అతిథిగా పోలీస్ హౌసింగ్ కార్పొరేషన్ పూర్వ చైర్మెన్ కొలేటీ దామోదర్ పాల్గొని మాట్లాడుతూ.. భారతీయ నృత్యం సంగీతం ఆధ్యాత్మిక మూలాలన్నారు. పలువురు నాట్య గురువులకు వారి ప్రతిభ గుర్తించి అవార్డ్స్ ను బహూకరించటం ముదా వహమన్నారు. భాషా సాంస్కృతిక శాఖ సంచాలకుడు డాక్టర్ మామిడి హరికృష్ణ మాట్లాడుతూ భారత్ ఆర్ట్స్ అకాడమీ సంగీత నృత్య కళల పరిపోషణలో విశేష కృషి చేస్తున్నారని ప్రశంసించారు. లలితా రావు స్వాగతం పలికిన సభలో భారత్ వరల్డ్ రికార్డ్స్ ప్రతినిధి రమ ణారావు అధ్యక్షత వహించారు. బుల్లి తెర నటి జ్యోతి రెడ్డి, విష్ణు ప్రియ సిద్దార్థ తదితరులకు స్వర్ణనంది అవార్డు బహూకరించారు. కార్యక్రమానికి తొలుత పలువురు కళాకారులు నృత్య అంశాలు నర్తించారు.

6 కిలోల గంజాయి పట్టివేత



నవతెలంగాణ - సంతోష్‌నగర్

ఎన్నికల కోడ్ సందర్భంగా కే.ఏ.బి శాస్త్రి డిప్యూటీ కమిషనర్ ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ హైదరాబాద్ జిల్లా, అనిల్ కుమార్ రెడ్డి అసిస్టెంట్ కమిషనర్ ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ హైదరాబాద్ జిల్లా ఆదేశాల మేరకు సిహెచ్ విజయ్ జిల్లా ప్రొహిబిషన్, ఎక్సైజ్ అధికారి హైదరాబాద్ సూచనల మేరకు చార్మినార్ ఎక్సైజ్ స్టేషన్ అధికారులు, సిబ్బంది సిటీ కళాశాల ఆవరణలో పేట్ల బురుజు నుండి ముస్లిం జంగ్ పూల్ వైపు వెళ్లే వాహనాలను ఆదివారం తనిఖీ చేశారు. ఓ వ్యక్తి ట్రావెల్ బ్యాగులో 6 కిలోల గంజాయిని ఒరిస్సాలోని బరంపురం నుండి హైదరాబాదులోని ధూల్ పేట్ ప్రాంతానికి ట్రాన్స్పోర్ట్ చేస్తూ పట్టుబడినట్టు చార్మినార్ ఎక్సైజ్ సీఐ జి. శ్రీనివాసరావు తెలిపారు. గంజాయిని బరంపురంలో రూ.10 వేలకు 1 కిలో చొప్పున కొని ధూల్‌పేట్ ప్రాంతంలో 15 వేలకు కిలో చొప్పున అమ్మడానికి తీసుకొచ్చాడని విచారణలో తేలిందని వెల్లడించారు. ఈ తనిఖీల్లో ఎక్సైజ్ ఎస్ఐ ఎండీ. సలీమ్, ఎక్సైజ్ ఎస్ఐ చార్మినార్ కె.శ్వేత కుమారి, అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

మహిళలపై
జరుగుతున్న దాడులను అరికట్టాలి

- టీఎస్‌యూటీఫ్ రంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు గోపాల్ నాయక్

నవతెలంగాణ - మీర్‌పేట్

మహిళలపై జరుగుతున్న దాడులను ప్రభుత్వం అరికట్టాలని టీఎస్ యూటీఫ్ రంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు గోపాల్ నాయక్ కోరారు. భగత్ సింగ్ వర్ధంతి సందర్భంగా మీర్‌పేట్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని గాయత్రీ నగర్‌లో టీఎస్‌యూటీఫ్ రంగారెడ్డి జిల్లా మహిళా కమిటీ ఆధ్వర్యంలో జిల్లా ఉపాధ్యక్షురాలు కల్పన అధ్యక్షతన ఆదివారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా గోపాల్ నాయక్ మాట్లాడుతూ భారత దేశ స్వాతంత్ర ఆవేశం ఎంతో మంది యువతకు స్ఫూర్తిని ఇస్తూనే ఉంటుందని తెలిపారు. గొప్ప విప్లవ కారుడిగా, స్వాతంత్ర సమర యోధుడిగా చరిత్రలో నిలిచి పోయిన వీరుడు భగత్ సింగ్ అని కొనియాడారు.



మహిళలుగా, ఉపాధ్యాయులుగా ప్రస్తుత సమాజంలో మహిళల పట్ల జరుగుతున్న వివక్షను ఎత్తి చూపాల్సిన అవసరం ఉందన్నారు. పురుషులతో సమానంగా మహిళలకు ప్రతి దాంట్లో అవకాశం కల్పించాలని అందుకు ప్రభుత్వాలే చొరవ చూపాలని కోరారు. ఈ కార్యక్రమంలో పోరాటంలో ఎందరో మహానుభావులు తమ జీవితాలను అర్పించారన్నారు. వారిలో ఎప్పటికీ గుర్తుండిపోయే మహానుభావుడు భగత్‌సింగ్ ఒకరు అని చెప్పారు. ఆయన పేరు వింటేనే యువత రక్తం ఉద్రేకంతో, గర్వంతో ఉప్పొంగుతుందన్నారు. ఆయన ఆశయాలు, ఆలోచనలు జిల్లా కోశాధికారి జగన్నాథ్ శర్మ, రాష్ట్ర కమిటీ సభ్యులు సుగంధ, జిల్లా మహిళా కార్యదర్శులు శ్యామల, భువనేశ్వరి, జిల్లా కమిటీ సభ్యులు శ్యామల, నాగమణి, హేమలత, లావణ్య, సుజాత, సుమలత, మంజుల, ఉదయలక్ష్మి, షీలా భాయి పాల్గొన్నారు.

తెలుగు భాషోద్ధారకుడు సీపీ బ్రౌన్



నవతెలంగాణ-కల్చరల్

తెలుగు భాష వ్యాకరణముకు మార్గం చూపిన బ్రౌన్ తెలుగు భాషోద్ధారకుడు అని రాష్ట్ర పోలీస్ హౌసింగ్ కార్పొరేషన్ పూర్వ చైర్మన్ కోలెటి దామోదర్ అన్నారు. ఆంగ్ల జాతీయుడు ఇన బ్రౌన్ తెలుగు భాషా పండితులను తెలుగు నిఘంటువు రూపకల్పన సమైక్య పరచి బ్రౌన్ నిఘంటువును వెలుగులోకి తెచ్చారని అన్నారు. శ్రీ త్యాగరాయ గాన సభలోని కళా సుబ్బారావు కళా వేదిక పై గాన సభ నిర్వహణ లో జరుగుతున్న శతాబ్ది పూర్వ మహనీయులు యాదిలో భాగంగా సి.పి.బ్రౌన్ సంస్మరణ సమావేశం జరిగింది. ముఖ్య అతిథిగా దామోదర్ పాల్గొని మాట్లాడుతూ వేమన పద్యాలు అర్థ సహిత తాత్పర్యంతో తెలుగు జాతికి అందించిన మహనీయుడు బ్రౌన్ అని కొనియాడారు.

గాన సభ అధ్యక్షుడు కళా జనార్దన మూర్తి అధ్యక్షత వహించిన సభలో సాహితీ కిరణం సంపాదకుడు పొత్తూరి సుబ్బారావు, కళా బిమాని గుదిబండి వెంకట రెడ్డి గాయకుడు సుబ్రహ్మణ్యం పాల్గొన్నారు.

ఉద్యమకారులకు న్యాయం చేయాలి

- టీయూఎఫ్ రాష్ట్ర కన్వీనర్ కందాల బలదేవ రెడ్డి

నవతెలంగాణ - తుర్కయంజాల్

తెలంగాణ ఉద్యమకారులకు కాంగ్రెస్ ప్రభుత్వం న్యాయం చేయాల్సిన అవసరం ఉందని టీయూఎఫ్ రాష్ట్ర కన్వీనర్ కందాల బలదేవ రెడ్డి అన్నారు. తుర్కయంజాల్ మున్సిపాలిటీ పరిధి కోహెడలోని టీయూఎఫ్ కార్యాలయంలో బీఆర్ఎస్ పార్టీ ఫ్లోర్ లీడర్, కౌన్సిలర్ రమావత్ కళ్యాణ్ నాయక్, మహిళా విభాగం అధ్యక్షురాలు అశ్విని, మాజీ ఉపసర్పంచ్ అబ్దుల్లాపూర్‌మెట్ సీనియర్ ఉద్యమ నాయకులు తూర్పునూరి ప్రవీణ్ కుమార్ గౌడ్ అనుచరులతో తెలంగాణ ఉద్యమకారుల ఫోరంలో ఆదివారం సభ్యత్వం తీసుకున్నారు. ఈ సందర్భంగా బలదేవరెడ్డి మాట్లాడుతూ ఉద్యమకారుల సంక్షేమమే లక్ష్యంగా టీయూఎఫ్ పని చేస్తుందన్నారు. ఉద్యమ కారులకు ప్రభుత్వం ఇచ్చిన హామీలు నెరవేర్చాలని కోరారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిలుగా రంగారెడ్డి జిల్లా మహిళా అధ్యక్షురాలు దుగ్గాని శ్యామల, దక్షిణ తెలంగాణ కన్వీనర్ గుర్జని వెంకటేశం గౌడ్, రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రెటరీ కారింగుల నరేందర్ గౌడ్, రాష్ట్ర సెక్రెటరీ పల్లె నర్సింహా గౌడ్, సీనియర్ ఉద్యమకారులు ఎలిగొపెల్లి కృష్ణ, ఎసూరి జంగయ్య తదితరులు పాల్గొన్నారు.



మహిళలను గౌరవించడం ఉత్తమ సంప్రదాయం



నవతెలంగాణ-కల్చరల్

మహిళలను గౌరవించడం ఉత్తమ సంప్రదాయం అని అవార్డ్ రివార్డ్‌ల కన్నా వారి శ్రమకు కృషికి గుర్తింపు చిన్న మెప్పు అవసరం అని రాష్ట్ర బ్రాహ్మణ సంక్షేమ పరిషత్ పూర్వ చైర్మన్ డాక్టర్ కెవి రమణ అన్నారు. ఆకాంక్ష చారిటబుల్ ట్రస్ట్ ఆరవ వార్షిక వేడుకల సందర్భంగా వివిధ రంగాల ప్రతిభా మహిళలకు ధాత్రి పురస్కారాలు పత్రికా విలేకరులకు సత్కార కార్యక్రమం మసబ్ టాంక్ వద్దనున్న డాక్టర్ రమణ నివాస కార్యాలయంలో జరిగింది. ముఖ్య అతిథిగా డాక్టర్ రమణ పాల్గొని ధాత్రి పురస్కారాలు కార్టూనిస్ట్ పద్మకు, సృజనాత్మక రంగంలో దివ్య తేజస్వి, ఈత లో క్వీన్ విక్టోరియా, బాల్కనీ మేకర్ హేమ లత, వీడియో జర్నలిస్ట్ మల్లీశ్వరిలకు బహూకరించి మాట్లాడారు. పది మందిలో గుర్తింపు పొందిన వారు మరింతగా ఎదిగేందుకు ఆత్మ విశ్వాసంతో కృషి చేస్తారని చెప్పారు.

అధ్యక్షత వహించిన సీనియర్ జర్నలిస్ట్ గుండు వల్లీశ్వర్ మాట్లాడుతూ మహిళా దినోత్సవం ప్రత్యేకంగా మన దేశ సంస్కృతిలో లేదని ప్రతి రోజూ మహిళలను తల్లిగా, చెల్లిగా, భార్యగా గౌరవించాలని మన ధర్మం బోధిస్తుందనీ అన్నారు. సంస్థ స్థాపకులు పాలపర్తి సంధ్య రాణి స్వాగతం పలికిన సభలో మిమిక్రీ ఆర్టిస్ట్ మోహన కృష్ణ వ్యాఖ్యానం చేయగా మాధవీలత పాల్గొన్నారు.

పేద ముస్లింలకు నిత్యావసర సరుకులు పంపిణీ



నవతెలంగాణ-కాప్రా

డాక్టర్ ఏఎస్ రావు నగర్‌లోని జామా మజిద్‌లో లయన్ మహమ్మద్ రియాజ్ ఏర్పాటు చేసిన నిత్యావసర సరుకుల పంపిణీ కార్యక్రమానికి ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా 500 పేద ముస్లిం కుటుంబాలకు ఎమ్మెల్యే సరుకులను పంపిణీ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. ముస్లింలు 30 రోజులు కఠిన ఉపవాస దీక్షలు చేస్తూ ఎంతో నిష్టగా రంజాన్ మాసాన్ని జరుపుకుంటారని తెలిపారు. ముస్లింలకు రంజాన్ మాసం శుభాకాంక్షలు తెలిజేయశారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ కొత్త రామారావు, మైనార్టీ అధ్యక్షుడు బద్రుద్దీన్, డివిజన్ ప్రెసిడెంట్ కాసం మహిపాల్ రెడ్డి, ఎస్.ఏ.రహీమ్, గిరిబాబు, మహేష్‌గౌడ్, కాలనీవాసులు ఉన్నారు.



అల్వాల్ సర్కిల్ మచ్చ బొల్లారం డివిజన్ అరవింద్ ఎన్‌క్లేవ్‌లో గల గెట్ ఫిట్ షటిల్ కోర్టు యజమాని నాగేంద్ర ఏర్పాటు చేసిన షటిల్ టోర్నమెంట్‌లో గెలుపొందిన అఖిల్, శ్రీనివాస్‌లకు అరవింద్ ఎన్‌క్లేవ్ ప్రెసిడెంట్ సంతోష్‌రెడ్డి ఆదివారం బహుమతులు ప్రదానం చేశారు. -నవతెలంగాణ,అల్వాల్

కేజ్రీవాల్ అరెస్టుకు వ్యతిరేకంగా సీపీఐ ధర్నా



నవతెలంగాణ-కాప్రా

ఢిల్లీ సీఎం కేజ్రీవాల్ అరెస్టుకు వ్యతిరేకంగా సీపీఐ కాప్రా శాఖ ఆధ్వర్యంలో ఈసీఐఎల్ చౌరస్తాలో ఆదివారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు వీ.ఎస్.బోస్ మాట్లాడుతూ.. ఎస్‌బీఐ బాండ్ల సమాచారం బయటికి వచ్చాక మోడీ ఓటమి భయంతో ప్రతిపక్ష నాయకులను అరెస్ట్ చేస్తూ ప్రజాస్వామ్యాన్ని నీరుగారుస్తున్నారని దుయ్యబట్టారు. ఎలక్టోరల్ బాండ్లు ఇచ్చిన 33 కంపెనీలకు రూ.3.7 లక్షల కోట్లు విలువగల కాంట్రాక్టులు దక్కాయని తెలిపారు. ఈడీ, సీబీఐ, ఐటీ దాడులు ఎదుర్కొన్న 41 కంపెనీలు బీజేపీ కి రూ.2,471 కోట్లు బాండ్ల రూపంలో ఇచ్చాయని పేర్కొన్నారు. మరో 30 సెల్ కంపెనీలు రూ.143 కోట్లు విరాళంగా అందజేశాయని చెప్పారు. బీజేపీ బాండ్ల రూపంలో రూ.580 కోట్లు ఇచ్చిన సంస్థలకు రూ.62,000 కోట్ల కాంట్రాక్టులు దక్కాయని ఆరోపించారు. దేశంలోనే అతి పెద్ద కుంభకోణమైన ఎలక్టోరల్ బాండ్లుపై స్వతంత్ర సిట్ దర్యాప్తు చేయాలని డిమాండ్ చేశారు. ఈ భారీ కుంభకోణానికి కేంద్ర ప్రభుత్వంలోని పెద్దలేనన్నారు. వారేమైన నీతిమంతులా అని ప్రశ్నించారు. మరి వాళ్లను ఏ జైళ్లలో పెట్టాలో వచ్చే ఎన్నికల్లో ప్రజలే నిర్ణయిస్తారని చెప్పారు. రాజకీయ కక్షతో ఈడీని జేబు సంస్థగా చేసుకుని అరాచకాలు సృష్టిస్తున్న మోడీ ప్రభుత్వం అతి తొందరలోనే మూల్యం చెల్లించుకుంటుందన్నారు. ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు ఎస్.శంకరరావు, ఈసీఐఎల్ యూనియన్ మాజీ కార్యదర్శులు ఎన్.నర్సింహ, జోషి, శ్రీనారాయణ, ఎం.నరసింహారావు, నాగేశ్వరరావు, సాంబశివరావు, సోమరాజు, సుధీర్‌రాజు, లక్ష్మీనారాయణ పాల్గొన్నారు.

రె'ఢీ'..!

- ప్రధాన పార్టీల అభ్యర్థులు ఖరారు
- 'ఆరు' గ్యారంటీలతో రంగంలోకి కాంగ్రెస్
- మోడీ భజన, అభ్యర్థి సెల్ఫ్ డబ్బాతో బీజేపీ
- గత అభివృద్ధి మాటున బీఆర్ఎస్ ప్రచారం
- 'మల్కాజిగిరి' సెగ్మెంట్‌లో త్రిముఖ పోటీ
- ఏడు నియోజకవర్గాల్లో వేడెక్కిన రాజకీయం







నవతెలంగాణ-సిటీబ్యూరో

మల్కాజిగిరి పార్లమెంట్ సెగ్మెంట్‌లో జెండా ఎగరేయడానికి ప్రధాన పార్టీల అభ్యర్థులు రె'ఢీ' అవుతున్నారు. బీజేపీ, బీఆర్ఎస్, కాంగ్రెస్ అభ్యర్థులు ఇప్పటికే ప్రచారం మొదలు పెట్టారు. గెలుపే లక్ష్యంగా ముగ్గురూ ఎవరికి వారే ప్రచారంలో ముందుకు సాగుతున్నారు. ఆరు గ్యారంటీల పేరు, వంద రోజుల పాలన పేరుతో కాంగ్రెస్ ప్రచారంలో దూసుకెళ్తుంటే.. బీజేపీ మోడీ భజనతోపాటు అభ్యర్థి సెల్ఫ్ డబ్బాతో ప్రచారం నిర్వహిస్తున్నారు. ఇక బీఆర్ఎస్ గతంలో వారి ప్రభుత్వ హయాంలో చేసిన అభివృద్ధిని వివరిస్తూ, వంద రోజుల పాలనలో అధికార కాంగ్రెస్ వైఫల్యాలను ప్రస్తావిస్తూ ప్రచార పర్వం సాగిస్తున్నారు. మొత్తం ఏడు అసెంబ్లీ నియోజకవర్గాల్లో రాజకీయం వేడెక్కింది.

సీఎం సిట్టింగ్ స్థానం కావడం, మినీ భారత్‌గా పిలువబడే మల్కాజిగిరి పార్లమెంట్ స్థానంపై ప్రధాన పార్టీలు గురి పెట్టాయి. బీజేపీ నుంచి ఈటల రాజేందర్, కాంగ్రెస్ తరుపున వికారాబాద్ జెడ్పీ చైర్‌పర్సన్ సునీతా మహేందర్‌రెడ్డి, బీఆర్ఎస్ నుంచి రాగిడి లక్ష్మారెడ్డి బరిలో దిగడంతో రాజకీయం వేగంగా వేడెక్కింది. బీజేపీ ఇప్పటికే రోడ్డు షోలు నిర్వహించి ఓటర్లను తమవైపు తిప్పుకునే ప్రయత్నం చేస్తుండగా.. కాంగ్రెస్ విస్తృత స్థాయి సమావేశాలు నిర్వహిస్తూ పార్టీ క్యాడర్‌కు దిశా నిర్దేశం చేస్తోంది. ఇక బీఆర్ఎస్ కూడా ప్రచారం చేస్తుంది.

మూడు జిల్లాలు.. ఏడు అసెంబ్లీ స్థానాలు

మల్కాజిగిరి పార్లమెంట్ సెగ్మెంట్ మేడ్చల్-మల్కాజిగిరి జిల్లాలోని మేడ్చల్, మల్కాజిగిరి, కూకట్‌పల్లి, కుత్బుల్లాపూర్, ఉప్పల్ నియోజకవర్గాలతో పాటు రంగారెడ్డి జిల్లాలోని ఎల్బీనగర్, హైదరాబాద్ జిల్లాలోని సికింద్రాబాద్ కంటోన్మెంట్ అసెంబ్లీ స్థానాల్లో విస్తరించి ఉంది. ఈ సెగ్మెంట్‌కు సీఎం రేవంత్‌రెడ్డి ప్రాతినిధ్యం వహించడంతో పాటు మినీ భారత్‌గా పేరుండటంతో ప్రాధాన్యత సంతరించుకుంది. ఈ సెగ్మెంట్ పరిధిలోని ఏడు నియోజకవర్గాలతో కలిపి 37,28,519 మంది ఓటర్లు ఉన్నారు.

సీఎం రేవంత్‌రెడ్డి స్పెషల్ ఫోకస్

తన సిట్టింగ్ స్థానం కావడంతో 'మల్కాజిగిరి'పై సీఎం రేవంత్‌రెడ్డి స్పెషల్ ఫోకస్ పెట్టారు. ఇప్పటికే మల్కాజిగిరి లోక్‌సభ నియోజకవర్గ కీలక నేతలతో సమావేశమై దిశా నిర్దేశం చేశారు. నియోజకవర్గ ఇన్‌చార్జి మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు కూడా విస్తృత స్థాయి మీటింగ్‌లు నిర్వహిస్తూ ప్రచారంలో దూకుడు పెంచాలని పార్టీ శ్రేణులకు పిలుపునిస్తున్నారు. ఆరు గ్యారంటీలతో పాటు గత ప్రభుత్వ వైఫల్యాలను వివరిస్తూ, బీజేపీ ఆగడాలను అర్థమయ్యేలా విడమడిచి చెబుతూ మందుకు సాగుతున్నారు.

రామమందిరం, కేంద్ర పథకాలే అస్త్రాలు

బీజేపీ అభ్యర్థి ఈటల రాజేందర్ ఇప్పటికే పార్లమెంట్ పరిధిని ఓ సారి చుట్టేశారు. ప్రధాని నరేంద్ర మోడీ భజన చేస్తూ, తన సెల్ఫ్ డబ్బా కొట్టుకుంటూ ముందుకు సాగుతున్నారు. తాను గెలిస్తే ఏం చేస్తారో చెప్పకుండా.. కాంగ్రెస్ తనపై చేసి వ్యాఖ్యలు, గత బీఆర్ఎస్ ప్రభుత్వం వైఫల్యాను వివరిస్తూ ముందుకు సాగుతున్నారు. అన్ని అసెంబ్లీ స్థానాల్లో ముఖ్య కార్యకర్తల సమావేశాలు, బస్తీలు, పురపాలక సంఘాలు, డివిజన్లు, గ్రామాల వారీగా ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్నారు. ఉదయం మొదలు అర్ధరాత్రి వరకు ప్రచారంలోనే ఉంటున్నారు. కేంద్ర ప్రభుత్వ పథకాలు, అయోధ్యలో రామమందిరమే ఎజెండాగా ఈటల ముందుకు సాగుతున్నారు.

బీఆర్ఎస్ మందగమనం..

పార్లమెంట్ ఎన్నికల ప్రచారంలో బీఆర్ఎస్ ఇంకా స్పీడ్ అందుకోలేదు. అభ్యర్థి రాగిడి లక్ష్మారెడ్డి ఇప్పటికే మాజీ మంత్రి మల్లారెడ్డి నివాసంలో నియోజకవర్గం పరిధిలోని అందరు ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలతో ప్రత్యేకంగా సమావేశమైనా ప్రచారం మాత్రం మందకొడిగానే సాగుతోంది. ఆరుగురు ఎమ్మెల్యేలూ బీఆర్ఎస్ వారే అయినా సరైన సహకారం లేకపోవడంతో అభ్యర్థి అంతర్మథనంలో పడ్డారు. రానున్న రోజులో పార్టీల అభ్యర్థులు హెూరాహెూరీగా ప్రచారం నిర్వహించేందుకు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నట్టు తెలుస్తోంది. చివరికి 'మల్కాజిగిరి' ఎవరిని వరిస్తుందో చూడాలి..!

ఆయా అసెంబ్లీ నియోజకవర్గాల్లో ఓటర్లు ఇలా..

క్రస	నియోజకవర్గం	ఓటర్లు
1.	మేడ్చల్	6,58,190
2.	మల్కాజిగిరి	4,99,536
3.	కుత్బుల్లాపూర్	7,12,759
4.	కూకట్‌పల్లి	4,71,878
5.	ఉప్పల్	5,33,544
6.	కంటోన్మెంట్	2,52,060
7.	ఎల్బీ నగర్	6,00,450
	మొత్తం	37,28,417

95వ వారానికి చేరిన జ్ఞానమాల కార్యక్రమం



నవతెలంగాణ-కాప్రా

జమ్మిగడ్డ బీజేఆర్ కాలనీలో చేపట్టిన జ్ఞానమాల కార్యక్రమం ఆదివారంతో 95వ వారానికి చేరింది. ఈ సందర్భంగా మహాత్మా జ్యోతిరావు పూలే, డాక్టర్ బీఆర్ అంబేద్కర్, బాబు జగ్జీవన్ రామ్ విగ్రహాలకు జ్ఞానమాల టీం సభ్యులు నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో జ్ఞానమాల టీం ఆర్గనైజర్ తాడూరి గగన్ కుమార్, బీజేఆర్ కాలనీ అధ్యక్షుడు ఎస్.ఏ.రహీం, నర్సింహ్మాచారి, నరేందర్‌రావు, రవి నాయక్, దయానంద్, మెకానిక్ కొండల్, నాగేష్, రాజు, తదితరులు పాల్గొన్నారు.

కరాటే బెల్టులు అందజేసిన ఎమ్మెల్యే బండారి



నవతెలంగాణ-కాప్రా

మల్లాపూర్ డివిజన్‌లో భవానీ షోటోకన్ కరాటే అసోసియేషన్ వారు ఏర్పాటు చేసిన కరాటే బెల్టుల పంపిణీ కార్యాక్రమానికి ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి ముఖ్యతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా కరాటే పోటీలో గెలుపొందిన వారికి కరాటే బెల్టులను అందజేశారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. పిల్లలకు చదువులతో పాటు కరాటే నేర్చుకోవడంతో ఆత్మరక్షణ పొందవచ్చన్నారు. ఆడపిల్లలు కరాటే నేర్చుకోవడం ద్వారా శారీరకంగా, మానసికంగా ధృఢంగా ఉంటారని చెప్పారు. ఈ కార్యక్రమంలో మల్లాపూర్ డివిజన్ కార్పొరేటర్ దేవేందర్‌రెడ్డి, హౌసింగ్ బోర్డ్ కార్పొరేటర్ ప్రభుదాస్, కత్తుల రాజ్‌కుమార్, పృథ్వీకుమార్, బాలరాజు, సాయి, ఉన్నారు.

సీఎస్ఐఆర్-ఐఐసీటీతో అనురాగ్ యూనివర్సిటీ అవగాహన ఒప్పందం



నవతెలంగాణ-ఘట్కేసర్

మండల పరిధిలోని వెంకటాపూర్‌లో ఉన్న అనురాగ్ యూనివర్సిటీ సీఎస్ఐఆర్-ఐఐసీటీతో అవగాహన ఒప్పందం కుదుర్చుకుంది. అనురాగ్ యూనివర్శిటీ చైర్మెన్ డాక్టర్ పల్లా రాజేశ్వర్ రెడ్డి, సీఈవో నీలిమ సూచన మేరకు సీఎస్ఐఆర్-ఐఐసీటీతో అనురాగ్ యూనివర్శిటీకి మధ్య ఎంఓయూ కుదిరినట్లు నిర్వాహకులు తెలిపారు. ఈ మేరకు సీఎస్ఐఆర్ ఐఐసీటీ డైరెక్టర్ డాక్టర్ డి.శ్రీనివాస్‌రెడ్డి, సీఎస్ఐఆర్ చీఫ్ సైంటిస్ట్, కిమ్స్ అధినేత డాక్టర్ రాజేంద్రరెడ్డి, అనురాగ్ యూనివర్సిటీ ప్రతినిధులు డాక్టర్ బాలాజీ ఉట్ల, రిజిస్ట్రార్, డా. వసుధ బక్షి, డీన్ స్కూల్ ఆఫ్ ఫార్మసీ, డాక్టర్. లింగయ్య నాగరపు, సవితా బెల్వాల్ అనురాగ్ యూనివర్సిటీ, సీఎస్ఐఆర్ పరిశోధనా సంస్థ సభ్యు టలు ఐఐసీటీ మధ్య అవగాహన ఒప్పందం ఎంఓయూ సంతకం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఈ ఒప్పందంతో పరిశోధన, అభివృద్ధిలో సహకార ప్రయత్నాలను ప్రోత్సహించడంలో ముందడుగు సూచిస్తుందన్నారు. రెండు సంస్థల మధ్య భాగస్వామ్యాన్ని అధికారికం చేయడమే కాకుండా శాస్త్రీయ పరిజ్ఞానాన్ని పెంపొందించడానికి, ఆవిష్కరణలను పెంపొందించడానికి ప్రతిబింబిస్తుందన్నారు. అంతేకాకుండా, ఎంఓయూ ఫ్యాకల్టీ సభ్యులు కోసం అవకాశాలను తెస్తుందని పేర్కొన్నారు. అనురాగ్ విశ్వవిద్యాలయంలోని విద్యార్థులు ఐఐసీటీ శాస్త్రవేత్తలతో సహకార పరిశోధన ప్రాజెక్టుల్లో నిమగ్నమైయ్యే అవకాశం ఉంటుందన్నారు.

కాంగ్రెస్ గెలుపే లక్ష్యంగా పనిచేయాలి



- మంత్రి తుమ్మల నాగేశ్వరరావు

నవతెలంగాణ-శామీర్‌పేట

మల్కాజిగిరి పార్లమెంట్ నియోజకవర్గ కాంగ్రెస్ అభ్యర్థి గెలుపే లక్ష్యం గా పని చేయాలని మంత్రి తుమ్మల నాగేశ్వరరావు కాంగ్రెస్ శ్రేణులకు పిలుపునిచ్చారు. లోక్‌సభ ఎన్నికల్లో భాగంగా ఆదివారం మేడ్చల్ నియోజకవర్గం ఇన్‌చార్జి తోటకూర వజ్రేష్ యాదవ్ అధ్యక్షతన తూంకుంట మున్సిపాలిటీలోని మొగుళ్ల వెంకట్‌రెడ్డి గార్డెన్స్‌లో మేడ్చల్ నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ కార్యకర్తల విస్తృతస్థాయి సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా మల్కాజిగిరి పార్లమెంట్ ఇన్‌చార్జి, రాష్ట్ర మంత్రివర్యులు తుమ్మల నాగేశ్వర్ రావు హాజరయ్యారు. ఈ సందర్భంగా వజ్రేష్ యాదవ్ మాట్లాడుతూ.. ప్రతీ కార్యకర్తను గుండెల్లో పెట్టుకొని చూసుకునే బాధ్యత తనదేనని భరోసా ఇచ్చారు. ప్రతీ బూత్ స్థాయిలో ప్రతి కార్యకర్త పని చేయాలని సూచించారు. రానున్న ఎన్నికల్లో సునీత మహేందర్ రెడ్డిని భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. సమన్వయంతో పనిచేస్తే ప్రతి కార్యకర్తకు పదవులు వస్తాయని, ఎవరూ నిరాశ పడరాదని సూచించారు. ఈ కార్యక్రమంలో మల్కాజిగిరి పార్లమెంట్ అభ్యర్థి శ్రీమతి సునీత మహేందర్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హనుమంత్ రావు, డీసీసీ అధ్యక్షులు హరివర్ధన్ రెడ్డి, మాజీ ఎమ్మెల్యే సుధీర్ రెడ్డి, జిల్లా పరిషత్ చైర్మెన్ చంద్రారెడ్డి, నాయకులు నక్క ప్రభాకర్‌గౌడ్, మేడ్చల్ నియోజకవర్గ బ్లాక్ అధ్యక్షులు, మండల, మున్సిపల్, కార్పొరేషన్ అధ్యక్షులు, ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ సెల్ అధ్యక్షులు, ఎంపీటీసీలు, మాజీ సర్పంచులు, కార్పొరేటర్లు, కౌన్సిలర్లు, వైస్ ఎంపీపీలు, మహిళా అధ్యక్షురాలు, ఐఎన్‌టీయూసీ, యూత్ కాంగ్రెస్, ఎన్ఎస్‌యూఐ నాయకులు పాల్గొన్నారు.

కాంగ్రెస్, బీఆర్ఎస్‌కు ఓటేస్తే మోరీలో వేసినట్టే

- బీజేపీ ఎంపీ అభ్యర్థి ఈటల రాజేందర్
- సామితారెడ్డి ఆధ్వర్యంలో 100మంది చేరిక



నవతెలంగాణ-మేడ్చల్

పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీలకు ఓటు వేస్తే మోరీలో వేసినట్టేనని మల్కాజిగిరి బీజేపీ ఎంపీ అభ్యర్థి ఈటల రాజేందర్ అన్నారు. మేడ్చల్ పట్టణంలోని కేఎల్ఆర్ వెంచర్‌లో బీజేపీ విజయ సంకల్ప సభ నిర్వహించారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్ జిల్లా రైతు సమన్వయ సమితి అధ్యక్షుడు నా రెడ్డి నందారెడ్డి, మాజీ వైస్ ఎంపీపీ, పూడూరు గ్రామ మాజీ సర్పంచ్ ఎన్.నర్సింహారెడ్డి, మాజీ సర్పంచ్ మురళీధర్ గుప్తాలకు పార్టీ జెండా కప్పి ఆహ్వానించారు. మండల పరిధిలోని పూడూరు గ్రామ యువ నాయకుడు ఎన్ సౌమిత్‌రెడ్డి ఆధ్వర్యంలో 100 మంది యువకులు బీజేపీలో చేరారు. మేడ్చల్ పట్టణంలోని మార్వాడీ మంచ్ నాయకులు, ఎల్లంపేట్ గ్రామం నుంచి ముదిరాజ్ సంఘం నాయకులు, అత్వెల్లితో పాటు వివిధ గ్రామాల నుంచి 500 వందల మంది ఈటల రాజేందర్ సమక్షంలో బీజేపీలో చేరారు. ఈ సందర్భంగా ఈటల రాజేందర్ మాట్లాడుతూ.. సీఎం రేవంత్ రెడ్డి ఈటల రాజేందర్‌కు మల్కాజిగిరికి ఏం సంబంధం అని అడుగుతున్నాడని, నాకు ఈ ప్రాంతంతో 30 ఏండ్ల అనుబంధం ఉందని గుర్తు చేశారు. ప్రశ్నించే గొంతుక అని ఎంపీగా గెలిపిస్తే నియోజకవర్గానికి చేసావో సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో మేడ్చల్ జిల్లా బీజేపీ అధ్యక్షులు విక్రమ్ రెడ్డి,మాజీ ఎమ్మెల్యే బోడిగ శోభ,కార్పొరేటర్ హంసారాణి జిల్లా ఉపాధ్యక్షులు గౌరారం జగన్ గౌడ్, ప్రభాకర్ రెడ్డి, మండల అధ్యక్షుడు నరేందర్ రెడ్డి, రామన్న గారి శ్రీనివాస్ గౌడ్,చెరువుకొమ్ము శ్రీనివాస్ గౌడ్,పాతూరి సుధాకర్ రెడ్డి,కృష్ణ గౌడ్,బచ్చు కృష్ణప్రియ మల్లారెడ్డి,మున్సిపల్,మండల నాయకులు తదితరులు పాల్గొన్నారు.



బతుకమ్మ పార్కులో అల్వాల్ హిల్స్, సాయిబాబా నగర్ కాలనీ, మంజీరా కాలనీ, గంగపుత్ర కాలనీ వాసు లుతో బీజేపీ మల్కాజిగిరి ఎంపీ అభ్యర్థి ఈటల రాజేం దర్ సమావేశం అయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. 32 ఏండ్ల నుంచి సుపరిచితునిగా మీలో ఒకడిగా ఉన్నాని తెలిపారు. ఎంపీ ఎన్నికల్లో మీ మద్దతు అవసరమని కోరారు. ఆయన వెంట చొప్ప దండి మాజీ ఎమ్మెల్యే బొడిగ శోభ, మహేందర్‌రెడ్డి, సుధాకర్‌రెడ్డి, తిరుపతి రెడ్డి, మహిపాల్‌రెడ్డి, శ్రీధర్‌రెడ్డి, భూపాల్‌రెడ్డి, పద్మిని, సుజాత తదితరులు పాల్గొన్నారు -నవతెలంగాణ-అల్వాల్

ద్వారకామయి భజన మండలి ఆధ్వర్యంలో అన్నదానం



నవతెలంగాణ-నేరేడ్‌మెట్

వినాయక నగర్ డివిజన్ పరిధిలోని ద్వారకామయి భజన మండలి సభ్యులు ఆదివారం మహారాష్ట్రలోని షిరిడీలో అన్నదాన కార్యక్రమం నిర్వహిం చారు. భజన మండలి వ్యవస్థాపకురాలు షీలా శంకర్ జ్ఞాపకార్థం భజన మండలి నిర్వాహకులు వినాయకనగర్ నుంచి షిరిడికి వెళ్లి, అక్కడ అన్నదానం చేశారు. ఈ అన్నదానం 1000 మంది భక్తులకు పాల్గొన్నారని నిర్వాహకులు రామిడి శంకర్ తెలిపారు. అనంతరం 10వ వార్షిక పర్యటనలో భాగంగా షిరిడి ప్రధాన ఆలయం చుట్టూ సంకీర్తనలతో పల్లకి సేవ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో శ్యాంసుందర్, రాధాకృష్ణ, బాలరాజు, సత్యనారాయణ, కన్నెగుండ్ల రాజు, అశోక్, వెంకటేష్ పాల్గొన్నారు.

కాంగ్రెస్ పార్టీకే బీసీల మద్దతు : సంఘ వీరప్ప మేరు



నవతెలంగాణ- నేరేడ్‌మెట్

బీసీలకు అండగా నిలుస్తున్న కాంగ్రెస్ పార్టీకే బీసీల సంపూర్ణ మద్దతు ఉంటుందని తెలంగాణ బీసీ ఫెడరేషన్ కులాల సమితి మల్కాజిగిరి పార్లమెంట్ నియోజకవర్గం కన్వీనర్ సంఘ వీరప్ప మేరు తెలిపారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ..తనను మల్కాజిగిరి పార్లమెంట్ ఇన్‌చార్జిగా ప్రకటించిన రాష్ట్ర అధ్యక్షులు బెల్లపు దుర్గారావు, ప్రధాన కార్యదర్శి కీర్తి యుగంధర్‌లకు కృతజ్ఞతలు తెలిపా రు. కాంగ్రెస్ ప్రభుత్వం హయంలో 16 కార్పొరేషన్లు ఏర్పాటు చేయ డాన్ని స్వాగతిస్తున్నామని తెలిపారు. ఈ సందర్భంగా సీఎం రేవంత్ రెడ్డికి, మంత్రి పొన్నం ప్రభాకర్‌కు కృతజ్ఞత లు తెలిపారు. పాలకమండలి ఏర్పాటు చేసి, బడ్జెట్ కేటాయించాలని ఆయన ప్రభుత్వాన్ని కోరారు.

ఉత్తమ శిక్షణతోనే ఉన్నతమైన చదువులు



- విద్యార్థి కఠోర శ్రమతోనే విప్లవాత్మకమైన మార్పులు
- టీపీసీసీ రాష్ట్ర అధికార ప్రతినిధి రియాజ్
- దేశ వ్యాప్తంగా నిర్వహించిన సైనిక్, ఆర్ఎంఎస్ పరీక్షల్లో క్రాంతికీన్ విద్యార్థుల హవా..

నవతెలంగాణ-జవహర్‌నగర్

ఉత్తమ శిక్షణతోనే ఉన్నతమైన చదువుల్లో రాణిస్తారని, దేశ మనుగడలో సైనిక్, ఆర్ఎంఎస్ సూల్స్ విద్యార్థులు ప్రత్యేకత కనబర్చుతారని, క్రాంతికీన్ అకాడమీ శిక్షణ అభినందనీయమని టీపీసీసీ రాష్ట్ర అధికారప్రతినిధి డాక్టర్ రియాజ్ అన్నారు. దేశ వ్యాప్తంగా నిర్వహించిన సైనిక్, ఆర్ఎంఎస్ పరీక్షల్లో ఉత్తమ ర్యాంకులు సాధించిన క్రాంతి కీన్ అకడామీ విద్యార్థులకు దమ్మాయిగూలోని క్రాంతికీన్ అకాడమీలో డైరెక్టర్ శ్రీనివాస్ రెడ్డి, సెక్రటరీ లావణ్య ఆధ్వర్యంలో సన్మానం చేసి బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా టీపీసీసీ రాష్ట్ర అధికార ప్రతినిధి డాక్టర్ రియాజ్, డీఆర్డీవో పద్మజారాణి, ఎన్సీఈఆర్టీ మెంబర్ సీహెచ్ ఉమాలు హాజరై విద్యార్థులను అభినందించారు. ఈ సందర్భంగా రియాజ్ మాట్లాడుతూ విద్యార్థి దశే జీవిత దశ అవుతుందని, ఆధునిక కాలంలో నైపుణ్యంతో కూడిన చదువుల్లో విద్యార్థులు ప్రతిభ కనబర్చాలని సూచించారు. సైనిక్, ఆర్ఎంఎస్ పాఠశాల్లో విద్యార్థులు చదువుతోపాటు, క్రీడలు, సమాజం పై పూర్తి అవగాహన కలుగుతుందని, దేశ పరిపాలన విభాగంలో విద్యార్థులే కీలకం అవుతున్నారని అన్నారు. విద్యార్థులు విషయాన్ని అర్థం చేసుకొని చదివే విధానం అలవాటు చేసుకోవాలని, చదువే విద్యార్థికి మూలమని పేర్కొన్నారు. క్రాంతికీన్ పాఠశాలలో చదవిన విద్యార్థులు పోటీ పరీక్షల్లో మంచి ర్యాంకులు సాధిస్తున్నారని పాఠశాల డైరెక్టర్ శ్రీనివాస్ రెడ్డి, సెక్రటరీ లావణ్య, ప్రిన్సిపల్ కళ్యాణి అన్నారు. దేశవ్యాప్తంగా నిర్వహించిన సైనిక్ స్కూల్ ప్రవేశ పరీక్ష లో 44వ ర్యాంకు, తెలుగు రాష్ట్రాల్లో మూడో ర్యాంకు అద్వైత్ రెడ్డి సాధించారని, అభిరాంరెడ్డి, విజయ్ విహాన్, విజేత ఉత్తమ ర్యాంకులు సాధించారు. 32 మంది విద్యార్థులు 5వేల ర్యాంకులు సాధించారని తెలిపారు. సైనిక్, ఆర్ఎంఎస్ పోటీ పరీక్షల్లో ఉత్తమ శిక్షణను అందించి విద్యార్థులను ఉత్తమ ర్యాంకులు సాధించేలా ప్రోత్సాహించిన క్రాంతికీన్ పాఠశాల బృందాన్ని విద్యార్థుల తల్లిదండ్రులు అభినందించారు. జేఈఈ మెయిన్స్ లో 98.6 శాతం మార్కులు క్రాంతికీన్ అకడామీ పూర్వ విద్యార్థి సృజన్ రెడ్డిని అభినందించారు. అనంతరం క్రాంతికీన్ అకాడమీలో విద్యార్థులు ఉత్తమ ర్యాంకులు సాధించినందుకు సన్మానం చేసి బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో వెంకటేష్, విద్యార్థులు తల్లిదండ్రులుపాల్గొన్నారు.



9

నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
కూకట్‌పల్లి - కుత్బుల్లాపూర్
సోమవారం | మార్చి 25, 2024 | www.navatelangana.com

ఆర్యవైశ్య ప్రొఫెషనల్స్ ఆధ్వర్యంలో చలివేంద్రం



నవతెలంగాణ-కూకట్‌పల్లి

ఆర్యవైశ్య అఫీషియల్స్ అండ్ ప్రొఫెషనల్స్ మేడ్చల్ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో ఆదివారం కూకట్ పల్లి సర్కిల్, ఆల్విన్ కాలనీ ప్రధాన రహదారిలోని ఫేస్ వన్ బస్ స్టాప్ వద్ద కమిటీ సభ్యులు చలివేంద్రాన్ని ప్రారంభించారు. వేసవిలో బాటసారులకు మంచి నీటిని అందిస్తూ దాహార్తిని తీర్చాలనే లక్ష్యంతో చలివేంద్రాన్ని ఏర్పాటు చేసినట్లు సభ్యులు తెలిపారు. ఈ కార్యక్రమంలో అవోప మేడ్చల్ జిల్లా అధ్యక్షుడు కట్టా రవికుమార్, ప్రధాన కార్యదర్శి నాగరాజు, సభ్యుల గురు ప్రసాద్, సతీష్ ,సాయి రాఘవేంద్ర, అనిల్ కుమార్, జై కుమార్ గుప్త, పాల్గొన్నారు.



రేవంత్ రెడ్డి ఆధ్వర్యంలోని కాంగ్రెస్ ప్రభుత్వం 16 కార్పొరేషన్ల ఏర్పాటుకు తీసుకున్న నిర్ణయం చరిత్రాత్మకమని అన్నారు. ఇందిరమ్మ స్ఫూర్తితో పాలనలో అన్ని వర్గాలకు సమన్యాయం, మంత్రిమండలిలో 16 కార్పొరేషన్లు ప్రకటించిన తెలంగాణ కాంగ్రెస్ ప్రభుత్వానికి, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి, శాసనసభ మంత్రి మండలిలో ఉన్న మంత్రులందరికి అందరికీ, ప్రిన్సిపల్ సెక్రెటరీలకు ప్రత్యేక ధన్యవాదాలు కృతజ్ఞతలు తెలియజేశారు. జూబ్లీహిల్స్‌లోని ఎంపీ, ఎమ్మెల్యే క్వార్టర్స్‌లో ఉన్న ఫారెస్ట్, ఎన్విరాన్మెంట్, ఎండోమెంట్ శాఖల మంత్రి, కొండ సురేఖ మురళి నివాసంలోని ఆమె కార్యాలయంలో కలిసి శాలువాతో సత్కరించి, శుభాకాంక్షలు, ధన్యవాదాలు తెలియజేసిన తెలంగాణ రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ ఓబీసీ వర్కింగ్ చైర్మెన్ తూము వినయ్ కుమార్, మేడ్చల్ జిల్లా బీసీ సంఘం అధ్యక్షులు తెల్ల హరికృష్ణ, వారితోపాటు సందీప్ వివేక్, బాణాల వెంకటేష్, అవినాష్, సంతోష్, చారి పాల్గొన్నారు.

నవతెలంగాణ-కూకట్‌పల్లి

దేశ,సమాజాభివృద్ధిలో విద్యార్థుల పాత్ర కీలకం



- మేడ్చల్ జిల్లా ట్రస్మ అధ్యక్షులు లయన్ కే.రామేశ్వర్ రెడ్డి
- బ్రైట్ పాఠశాలలో మోడల్ జీ 20 శిఖరాగ్ర సదస్సు 2024 వేడుకలు
- విద్యార్థుల ప్రతిభ అదరహో

నవతెలంగాణ-జగద్గిరిగుట్ట

దేశ, సమాజాభివృద్ధిలో విద్యార్థుల పాత్ర ఎంతో కీలకమని చిన్ననాటి నుంచే విద్యతోపాటు, సామాజిక, శాస్త్ర సాంకేతిక రంగాలలో ఆలోచన విధానంపై పట్టు కనబరిస్తే భవిష్యత్తులో ఉన్నతులుగా ఎదుగుతారని మేడ్చల్ జిల్లా ట్రస్మ అధ్యక్షులు, పరిశీలకులు లయన్ కె.రామేశ్వర్ రెడ్డి ఆకాంక్షించారు. భారత్ (గత సంవత్సరం 2023 జీ 20 అధ్యక్ష హోదాలో సదస్సును) నిర్వహించింది. అటువంటి సదస్సు యొక్క ప్రాముఖ్యతను ఆదివారం కుత్బుల్లాపూర్ నియోజకవర్గం రంగారెడ్డినగర్ డివిజన్ పరిధి, రంగారెడ్డినగర్‌లోని బ్రైట్ కాన్సెప్ట్ ఉన్నత పాఠశాలలో (మాడల్ " జీ 20 శిఖరాగ్ర సదస్సు-2024) ను నిర్వహించారు. ఈ సదస్సులో 4 వ తరగతి నుంచి 9వ తరగతి వరకు 71 విద్యార్థులు వారి నైపుణ్యతను ప్రదర్శించారు. వివిధ దేశాల ప్రధానులుగా,సెక్రెటరీ జనరల్ గా,విద్యార్థులు పాత్రలు పోషించి అదరహో అనిపించారు. ఈ సదస్సుకు ప్రముఖ వ్యాపారవేత్త ప్రసాద్, బ్రైట్ పాఠశాల, ప్రిన్సిపల్, కరస్పాండెంట్ లయన్ వినోద్ జాదవ్‌లు పాల్గొని జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇటువంటి కార్యక్రమాలు నిర్వహించడం వల్ల సమాజానికి మేము ఏదైనా చేయాలని ఆకాంక్ష విద్యార్థుల్లో పెరుగుతుందని ఆ దిశగా తల్లిదండ్రులు,ఉపాధ్యాయులు ప్రోత్సహించాలని సూచించారు. ఇటువంటి సామాజిక కార్యక్రమాలను ఏర్పాటు చేసిన పాఠశాల ప్రిన్సిపల్, కరస్పాండెంట్ వినోద్ జాదవ్‌ను, అధ్యాపక బృందాన్ని ఆయన ప్రత్యేకంగా అభినందించారు."బ్రైట్ స్టూడెంట్స్..అబౌట్ బ్రైట్ ఫ్యూచర్"అని ఆశీర్వదించారు.పాఠశాల ప్రిన్సిపల్ కరెస్పాండెంట్ వినోద్ జాదవ్ మాట్లాడుతూ ప్రతి విద్యార్థి పై ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటూ వారిలోని సృజనాత్మకమైన ప్రతిభను వెలికి తీస్తూ తల్లిదండ్రుల ప్రోత్సాహంతో సమాజాభివృద్ధిలో భాగస్వాములయ్యే విధంగా విద్యార్థులను తీర్చిదిద్దుతున్నామన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల పాలన విధానం, ఉన్నత విద్య ఉద్యోగాల కల్పన, పెట్టుబడులు, వంటివి పాఠశాల దశ నుంచి తెలిసే విధంగా పలు కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. ఈ సదస్సులో పాల్గొన్న విద్యార్థులు ఇంగ్లీషులో, హిందీ భాషల్లో అనర్గళంగా మాట్లాడి పాత్రలకు తగినట్లు చర్చించి, అన్ని దేశాల నేతలు పాల్గొని వారి అభివృద్ధి, వారి సమస్యలు ఎలా పరిష్కరించుకుంటారో కండ్లకు కట్టినట్లు చూపించి ఆకట్టుకున్నారు. గతంలో పాఠశాలలో "మాక్ పార్లమెంట్"సదస్సు నిర్వహించడం జరిగిందని ఢిల్లీ పార్లమెంటు నుంచి అభినందన ప్రశంసా పత్రాలు పొందడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఇన్‌చార్జి ఆయేషా, సదస్సు నిర్మాణ కర్త ప్రభు, ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.

నిమ్స్ విస్తరణ ప్రాజెక్టు పనులపై కలెక్టర్ సమీక్ష



నవతెలంగాణ-సిటీబ్యూరో

నిజాం ఇనిస్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్(నిమ్స్) విస్తరణలో చేపట్టానున్న పనుల పూర్తి సమాచారం ఇవ్వాలని జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి అధికారులను ఆదేశించారు. శుక్రవారం హైదరా బాద్ పంజాగుట్టలోని నిమ్స్ ఆస్పత్రిలో నిమ్స్ విస్తరణ ప్రాజెక్టులో చేపట్టినున్న పనుల అంచనాల వివరాలు, పనుల పురోగతిపై ఆయన సమక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ నిమ్స్ విస్తా రణ ప్రాజెక్ట్‌లో చేపడుతున్న పనులకు సంబంధించిన పూర్తిస్థాయి అంచనాల పూర్తి రిపోర్ట్‌తో బుధవారం జరుగనున్న సమావేశానికి రావాలని ఆర్అండ్‌బీ అధికారులను ఆదేశించారు. ఈ సమా వేశంలో నిమ్స్ డైరెక్టర్ డాక్టర్ బీరప్ప, డాక్టర్ శాంతి వీర్, డాక్టర్ సల్మాన్, ఈఈ ఆర్ అండ్ బి, తాసిల్దార్, ఇంజినీరింగ్ అధికారులు తదితరులు పాల్గొన్నారు.



శ్రీ సాయి తపస్య ప్లే స్కూల్ ప్రథమ వార్షికోత్సవం



నవతెలంగాణ-కూకట్‌పల్లి

కూకట్‌పల్లి పటేల్ కుంట పార్క్ సమీపంలోని శుభోదయ కాలనీలో ఉన్నటువంటి, శ్రీ సాయి తపస్య డే కేర్ ఆండ్ ప్లే స్కూల్ మొదటి వార్షికోత్సవం వేడుకలు కూకట్‌పల్లిలోని ఏటీసీ హెూటల్‌లో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ముందుగా స్కూల్ కరెస్పాండెంట్ కోడూరి మాధవి సురేష్ వేదికపై జ్యోతి ప్రజ్వలన చేసి వార్షికోత్సవ వేడుకలు ప్రారంభించారు. ఈ వేడుకలకు చిన్నారుల తల్లిదండ్రులే ముఖ్య అతిథులుగా హాజరై వారి చిన్నారులు అభినయించిన సాంస్కృతిక కార్యక్రమాలు తిలకించారు. ప్లే స్కూల్ విద్యార్థులు భరత నాట్యం, కూచిపూడి నృత్యాలతో పాటు,రామాయణంలోని రాముడు, సీత వంటి ఏకపాత్రాభినయం చూపరులను అలరించింది. ఈ సందర్భంగా స్కూల్ కరస్పాండెంట్ కోడూరి మాధవి సురేష్ మాట్లాడుతూ...విద్యార్థులకు విద్యతో పాటుగా క్రీడలు, సాంస్కృతిక కార్యక్రమాలు, వంటి కార్యక్రమాలలో ప్రోత్సహించడం మా పాఠశాల ముఖ్య ఉద్దేశ్యం అని తెలిపారు. ఈ వార్షికోత్సవ వేడుకలకు సహకరించిన పాఠశాల స్టాఫ్‌కు, చిన్నారుల తల్లిదండ్రులకు అభినందిస్తూ కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం చిన్నారులకు బహుమతులు అందజేశారు.

ఒత్తిడి లేకుండా నేర్చుకోవడాన్ని ఆస్వాదించాలి



- యూపీఎస్సీ మాజీ చైర్మెన్ ప్రొఫెసర్ డీపీ అగర్వాల్

నవతెలంగాణ-సిటీబ్యూరో

యూపీఎస్సీ పరీక్షలకు సిద్ధమవుతూ, శిక్షణ పొందుతున్న విద్యార్థులంతా నిజాయితీ, చిత్తశుద్ధి, సమైక్య భావాలను పెంపొందించుకోవాలనీ, ఏమాత్రం ఒత్తిడి లేకుండా నేర్చుకోవడాన్ని ఆస్వాదించాలని యూపీఎస్సీ మాజీ చైర్మెన్ ప్రొఫెసర్ డీపీ అగర్వాల్ సూచించారు. కృష్ణప్రదీప్ ట్వంటీఫస్ట్ సెంచరీ ఐఏఎస్ అకాడమీకి ఆయన ముఖ్య అతిథిగా విచ్చేసి, విద్యార్థులకు మార్గదర్శనం చేశారు. శిక్షణలో చెప్పే అంశాలను మనస్సుకు ఎక్కించుకుని, ఆస్వాదిస్తూ నేర్చుకోవాలి తప్ప మూస పద్ధతిలో కష్టపడటం వల్ల అంత మంచి ఫలితాలు రావన్నారు. ముందుగా, విద్యార్థులు నేరుగా కళాశాలల నుంచే వచ్చారా, లేదా ఇంతకు ముందు ఏదైనా పోటీ పరీక్షకు హాజరయ్యారా అని ప్రశ్నించారు. యూనివర్సిటీ పరీక్షలకు, పోటీ పరీక్షల కు కొంత తేడా ఉంటుందని తెలిపారు. పోటీ పరీక్షలకు సిద్ధపడేవారు అది ఏ పరీక్ష అయినా, తమ వ్యక్తిత్వాన్ని రూపొందించుకోవాలని సూచించారు. ప్రొఫెసర్ అగర్వాల్ గతంలో యూపీఎస్సీలో అనేక సంస్కరణలకు ఆద్యుడని, ఆయన చెప్పిన విషయాలను సువర్ణాక్షరాలుగా భావించి విద్యార్థులు ఆయన నుంచి స్ఫూర్తి పొందాలని అకాడమీ డైరెక్టర్లు కృష్ణ ప్రదీప్, డాక్టర్ భవానీశంకర్ సూచించారు. సుమారు 200 మందికి పైగా విద్యార్థులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. ప్రశ్నోత్తరాల అనంతరం అకాడమీ నిర్వాహకులు ప్రొఫెసర్ డీపీ అగర్వాల్‌ను ఘనంగా సత్కరించారు.

కాంగ్రెస్‌లోనే ప్రతీ కార్యకర్తకు గౌరవం



- కాంగ్రెస్ ఇన్‌చార్జి బండి రమేష్

నవతెలంగాణ-బాలానగర్

కష్టపడి పని చేసే ప్రతి కార్యకర్తకు, నాయకుడికి కాంగ్రెస్ పార్టీలో సముచిత స్థానం గౌరవం ఉంటాయని కూకట్‌పల్లి నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి బండి రమేష్ అన్నారు. ఆదివారం బాలానగర్ కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో బండి రమేష్ మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీని నమ్ముకుని ఇతర పార్టీల నుంచి వచ్చిన కార్యకర్తలను సైతం కలుపుకుని పార్టీ పటిష్టానికి కృషి చేస్తామని ఆయన పేర్కొన్నారు. కేపీహెచ్‌బీ కాలనీ 114 డివిజన్‌కు చెందిన మహిళా నాయకురాలు నాగమణి ఆధ్వర్యంలో కేపీహెచ్‌బీ డివిజన్‌కి చెందిన గంగా శివకుమారి ప్రధాన కార్యదర్శి, పుష్పారాణి, సంధ్య వారి అనుచరులు 30 మంది మహిళలు కూకట్‌పల్లి కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి బండి రమేష్ సమక్షంలో బీజేపీ, బీఆర్ఎస్‌కు చెందిన సుమారు వందమంది కార్యకర్తలు కాంగ్రెస్ తీర్థం పుచ్చుకున్నారు. వారందరికీ బండిరమేష్ కాంగ్రెస్ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రపంచ దేశాల్లో ఏ పార్టీకి లేని విధంగా 136 సంవత్సరాల ఘనచరిత్ర ఉన్న పార్టీ కాంగ్రెస్ పార్టీలో పని చేయడం ప్రతి కార్యకర్త అదృష్టంగా భావించాలన్నారు. కాంగ్రెస్ అంటేనే కార్యకర్తల కలయిక అన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలను కేసులతో ఎన్ని ఇబ్బందులు పెట్టినా మొక్కవోని దీక్షతో పార్టీ విజయానికి కృషి చేసిన కార్యకర్తలు అభినందనీయుల న్నారు. ప్రభుత్వ కార్యక్రమాలలో కార్యకర్తలకు పెద్దపీట వేస్తామన్నారు. మల్కాజిగిరి పార్లమెంటు సీటును మొదటిసారిగా ఓ మహిళకు కేటాయించడం అభినందనీయమని బండి రమేష్ పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో బి బ్లాక్ అధ్యక్షులు తూము వేణు, ప్రతాప్ రెడ్డి, కొప్పిశెట్టి దినేష్ కుమార్, పుష్పారెడ్డి, కర్క పెంటయ్య, రాజేందర్ తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ పార్టీ పార్లమెంట్ ఎన్నికల సన్నాహక సమావేశం



నవతెలంగాణ-దుండిగల్

కుత్బుల్లాపూర్ నియోజవర్గం బాచుపల్లిలో ఈనెల 26వ తేదీ కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో కుత్బుల్లాపూర్ నియోజవర్గంలో జరగబోయే పార్లమెంట్ ఎన్నికల సన్నాహక సమావేశానికి ముఖ్య అతిథిగా మల్కాజిగిరి పార్లమెంట్ ఎన్నికల ఇన్‌చార్జి మంత్రి రాష్ట్ర వ్యవసాయ, చేనేత, జౌళి, మార్కెటింగ్ శాఖల మంత్రివర్యులు తుమ్మల నాగేశ్వరరావు, కాంగ్రెస్ పార్టీ ఎంపీ అభ్యర్థి పట్నం సునీమహేందర్ రెడ్డి హాజరుకానున్నారు. ఈ సమావేశం విజయవంతం చేయడం కోసం కుత్బుల్లాపూర్ ముఖ్యనాయకుల సమావేశం కుత్బుల్లాపూర్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి కొలన్ హన్మంత్ రెడ్డి నిర్వహించారు. ఈ సందర్భంగా హన్మంత్ రెడ్డి మాట్లాడుతూ 26న జరగబోయే పార్లమెంట్ ఎన్నికల సన్నాహక సమావేశానికి నియోజకవర్గంలో ప్రతీ ఒక్కరు హాజరయ్యేలా నాయకులు సమన్వయం చేసుకోవాలని అన్నారు. ఈ కార్యక్రమంలో మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు ఆర్.లక్ష్మి, కుత్బుల్లాపూర్ నియోజకవర్గ బి బ్లాక్ అధ్యక్షులు బొంగునూరి శ్రీనివాస్ రెడ్డి, సీనియర్ కాంగ్రెస్ నాయకులు అవిజె జేమ్స్, డీసీసీ వైస్ ప్రెసిడెంట్ శ్రావణ్ కుమార్, ఎస్ఎంసి ప్రెసిడెంట్ కొలన్ రాజశేఖర్ రెడ్డి, దుండిగల్ ప్రెసిడెంట్ నవీన్ రెడ్డి, బాచుపల్లి కార్పొరేటర్ కొలన్ వీరేందర్ రెడ్డి, కృష్ణ రెడ్డి పాల్గొన్నారు.

ప్రధాని మోడీ పాలన ప్రపంచ దేశాలు మెచ్చాయి



- మల్కాజిగిరి పార్లమెంట్ అభ్యర్థి ఈటెల రాజేందర్

నవతెలంగాణ-జగద్గిరిగుట్ట

దేశ ప్రధాని నరేంద్ర మోడీ పరిపాలన విధానాన్ని ప్రపంచ దేశాలు నచ్చాయని 2024లో కేంద్రంలో బీజేపీ సర్కారే రానుందని మల్కాజిగిరి పార్లమెంట్ ఎంపీ.అభ్యర్థి ఈటల రాజేందర్ భరోసా ఇచ్చారు. కుత్బుల్లాపూర్ మాజీ ఎమ్మెల్యే, బీజేపీ రాష్ట్ర నాయకులు కూన శ్రీశైలం గౌడ్ కలిసి కుత్బుల్లాపూర్ నియోజకవర్గంలోని చింతల్ డివిజన్ స్థానిక హెచ్ఎంటి మైదానంలో వాకర్స్‌తో సమావేశమయ్యారు. రాబోయే పార్లమెంట్ ఎన్నికల్లో బీజేపీ పార్టీకి మద్దతు ఇచ్చి, తనను ఎంపీగా గెలిపించాలని వారిని అభ్యర్థించారు. దేశంలోని అన్ని రాష్ట్రాల సమగ్ర అభివృద్ధికి మోడీ సర్కార్ ఎంతో కృషి చేసిందని తెలిపారు. కుత్బుల్లాపూర్ ప్రజలు భాగస్వాములు కావాలని ఈటల కోరారు. ఈ కార్యక్రమంలో చొప్పదండి మాజీ ఎమ్మెల్యే బొడిగె శోభ, హెచ్ఏఎల్ మాజీ బోర్డు సభ్యులు డాక్టర్ సింగిరెడ్డి మల్లారెడ్డి, బీజేపీ అసెంబ్లీ కన్వీనర్ బుచ్చిరెడ్డి, పార్లమెంట్ విస్తారక్ రానా ప్రతాప్, నాయకులు గిరివర్ధన్ రెడ్డి, బక్క శంకర్ రెడ్డి, భరత్ సింహ రెడ్డి, జేకే. శేఖర్ యాదవ్ యువకులు,మహిళలు పాల్గొన్నారు.



పార్లమెంట్ ఎన్నికల సందర్భంగా మల్కాజిగిరి పార్లమెంట్ కుత్బుల్లాపూర్ నియోజకవర్గం 132 జీడిమెట్ల డివిజన్ పరిధిలో సాటిలైట్ టౌన్షిప్ అపార్ట్‌మెంట్స్‌లో, సాటిలైట్ టౌన్షిప్,లక్ష్మి గంగా ఎంక్లేవ్, దుర్గ విహార్ అపార్ట్‌మెంట్స్, కాలనీ వాసులతో ఎన్నికల ప్రచారంలో భాగంగా బీజేపీ మల్కాజిగిరి పార్లమెంట్ అభ్యర్థి శ్రీ ఈటెల రాజేందర్ ఎన్నికల ప్రచారంలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర మాజీ ఉపాధ్యక్షులు డా.ఎస్.మల్లారెడ్డి, బీజేపీ మేడ్చల్ అర్బన్ జిల్లా కార్యదర్శి చెరుకుపల్లి భరత్ సింహ రెడ్డి, సాటిలైట్ టౌన్షిప్ అధ్యక్షులు శ్రీకాంత్, లక్ష్మి గంగా ఎంక్లేవ్ అధ్యక్షులు శ్రీనివాస్ కాలనీ వాసులు, అపార్ట్‌మెంట్ వాసులు తదితరులు పాల్గొన్నారు.

నవతెలంగాణ-కుత్బుల్లాపూర్

అన్ని ప్రధాన పార్టీలకూ యాదవులు ఓట్లేయొద్దు

- రాష్ట్ర యాదవ మహాసభ అధ్యక్షుడు యల్లావుల చక్రధర్ యాదవ్

నవతెలంగాణ-సిటీబ్యూరో

రానున్న పార్లమెంట్ ఎన్నికల్లో ప్రధాన రాజకీయ పార్టీలైన కాంగ్రెస్, బీజేపీ, బీఆరెఎస్ యాదవులకు ఒక్క పార్లమెంట్ సీటు కూడా ఇవ్వని కారణంగా యాదవ సోదర, సోదరీమణులు ఆయా పార్టీలకు ఓట్లేయొద్దని రాష్ట్ర యాదవ మహాసభ అధ్యక్షుడు యల్లావుల చక్రధర్ యాదవ్ విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు ఆదివారం ఒక ప్రకటన విడుదల చేశారు. యాదవులెవరైనా పోటీ చేయాలనే కోరిక ఉంటే పోటీ చేయాలనీ, ఓడిపోయినా పర్వాలేదన్నారు. ఈ ప్రధాన పార్టీల అభ్యర్థులను ఓడించగలిగితే తాము గెలిచినట్టుగా అర్థం చేసుకోవాలన్నారు. యాదవులు, బీసీలు, మైనార్టీలు అంటే ఈ అగ్రకులాలు కేవలం ఓటు బ్యాంకుగా మాత్రమే చూస్తున్నాయన్నారు. ఓసీలు, పాలకులకు గుణపాఠం నేర్పాలన్నారు. యాదవులు ఏదో ఒక పార్టీకి అనుకూలంగా ఓటు వేసుకుంటూ పోతుంటే రాజకీయంగా వాడుకుంటున్నారనీ, యాదవుల ఆలోచనా విధానం మారాలని సూచించారు. ప్రత్యేక రాష్ట్రం ఏర్పడ్డాక అప్పటి ప్రభుత్వం యాదవులకు ఐదు ఎమ్మెల్యేలు, ఒక మంత్రి, ఒక రాజ్యసభ సభ, మూడు కార్పొరేషన్ చైర్మెన్లు, ఒక వైస్ ఛాన్సలర్ పదవులు ఇచ్చినట్టు తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం మరీ దారుణం అనీ, ఒక్క రాజ్యసభ సభ్యుడు పదవి మాత్రమే ఇచ్చారనీ, మంత్రి పదవి లేదనీ, 37 కార్పొరేషన్ పదవులు, ప్రభుత్వ సలహాదారుల్లో ఒక్కటి కూడా ఇవ్వలేదన్నారు. ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వానికి గుణపాఠం నేర్పకపోతే యాదవుల రాజకీయ బతుకులు మరీ దారుణం తయారవుతాయని చెప్పారు. యాదవులు ఈ ప్రధాన రాజకీయ పార్టీల అభ్యర్థులను ఓడించాలని పిలుపునిచ్చారు.

రోడ్డు సమస్యను పరిష్కరిస్తాం



- మాజీ డీసీసీ అధ్యక్షులు కే.యం ప్రతాప్

నవతెలంగాణ-కుత్బుల్లాపూర్

131 కుత్బుల్లాపూర్ డివిజన్ పరిధిలోని, శ్రీ ముద్దాపురం కాలనీలో, కాలనీ వాసులు కుత్బుల్లాపూర్ మెయిన్ రోడ్ వరకు రోడ్డును వేయించమని, రోడ్డు సమస్యను పరిష్కరించమని రంగారెడ్డి జిల్లా మాజీ డీసీసీ అధ్యక్షులు, పెద్దలు శ్రీ కె.యం.ప్రతాప్ ని కోరిన, శ్రీ ముద్దాపురం కాలనీ రెసిడెన్షియల్ వెల్ఫేర్ కమిటీ సభ్యులు కోరారు. ఈ సందర్భంగా ప్రతాప్ మాట్లాడుతూ, సంబంధిత అధికారులతో చర్చించి, ప్రజా సౌకర్యార్థం త్వరలో రోడ్డును వేయిస్తానన్నారు. కాలనీవాసులు ఎదుర్కొంటున్న రోడ్డు సమస్యను, పరిష్కరిస్తానన్నారు. ఈ కార్యక్రమంలో ముద్దాపురం కాలనీ రెసిడెన్షియల్ వెల్ఫేర్ కమిటీ సలహాదారులు కృష్ణారెడ్డి, ప్రధాన సలహాదారులు వెంకటేష్, అధ్యక్షులు జంగయ్య గౌడ్, ఉపాధ్యక్షులు ప్రతాప్, ప్రధాన కార్యదర్శి ధనంజెయుడు, ఉప ప్రధాన కార్యదర్శి శ్రీరామ్, వెంకటేశ్వరరావు ముఖ్య కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

అలరించడానికి వెన్నెల కిషోర్ రెడీ

నవతెలంగాణ-సిటీబ్యూరో

ఐపీఎల్-2024 డబుల్ హెడర్ సందర్భంగా స్టార్ స్పోర్ట్స్ తెలుగులో కామెంటరీతో క్రికెట్ అభిమానులను అలరించడానికి వెన్నెల కిషోర్ సిద్ధమయ్యారు. స్టార్ స్పోర్ట్స్ తెలుగు నిపుణులతో అయన చేరనున్నారు. ఆంధ్రప్రదేశ్, తెలంగాణలోని ఐపీఎల్ అభిమానులకు ఆదివారం ఆర్ఆర్ వర్సెస్ ఎల్ఎస్‌జీ, జీటీ వర్సెస్ ఎంఐ మ్యాచ్‌లతో కూడిన డబుల్ హెడర్‌లో తెలుగు కామెంటరీ బాక్స్‌కి తన ప్రత్యేకమైన హాస్యాన్ని, పరిజ్ఞానాన్ని వెన్నెల కిషోర్ అందించడంతో ప్రత్యేకంగా మలచనున్నారు. సమిష్టిగా 10 ఐపీఎల్ టైటిళ్లను సాధించిన క్రికెట్ లెజెండ్‌ల ప్యానెల్‌లో చేరిన వెన్నెల కిషోర్, అభిమానులను తమ సీట్ల అంచున నిలిచునేలా శక్తివంతమైన కామెంటరీ అనుభవాన్ని అందిస్తానని హామీనిచ్చారు.

డీసీసీ ఉపాధ్యక్షులుగా కతారి మహేష్



నవతెలంగాణ-బేగంపేట్

సికింద్రాబాద్ జిల్లా కాంగ్రెస్ పార్టీ ఉపాధ్యక్షులుగా రాంగోపాల్‌పేట్ డివిజన్‌కు చెందిన కతారి మహేష్ కుమార్ ని యమి తులయ్యారు. ఈ మేరకు జిల్లా అధ్యక్షులు అనిల్ కుమార్ యాదవ్ నియామకపు ఉత్తర్వులు జారీ చేశారు. మహేష్ కుమార్ మాట్లాడుతూ తనపై ఎంతో నమ్మకంతో పార్టీ బాధ్యతలు అప్పగించిన అనిల్‌కుమార్ యాదవ్‌తో పాటు ఏఐసీసీ అధ్యక్షులు మల్లికార్జున్ ఖర్గే, మాజీ అధ్యక్షులు రాహుల్ గాంధీ, ఏఐసీసీ ఇన్‌చార్జి పాదాస్ మున్షి, రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిలకు ఆయన ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. పార్టీని మరింత బలోపితం చేసేందుకు, యువ తను పార్టీ వైపు నడిపించేందుకు తన వంతు కృషి చేస్తా నని చెప్పారు. రాబోయే పార్లమెంటు ఎన్నికల్లో సికింద్రాబాద్ పార్లమె ంటు అభ్యర్థి విజయానికి శక్తి వంచన లేకుండా కృషి చేస్తామని చెప్పారు.

పోలీసులు ప్రత్యేక నిఘా

- ముమ్మరంగా తనిఖీలు

నవతెలంగాణ-ఆదిభట్ల

పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో పోలీసులు ప్రత్యేక నిఘా పెట్టారు. ఆదిభట్ల మున్సిపల్ పరిధిలోని బొంగు లూరు గెట్ సమీపంలో చెక్ పోస్ట్ ఏర్పాటు చేశారు. స్టాటిస్టిక్ సర్వే లెన్స్ టీం ఆధ్వర్యంలో ఆదివారం తనిఖీ లు చేపట్టారు. అనుమానం వచ్చిన ప్రతి వాహనాన్నీ చెక్ చేస్తు న్నారు. ఎన్నికల నేపథ్యంలో ఈ తనిఖీలు చేపడుతున్నారు. డబ్బు, మద్యం రవాణాపై ప్రత్యేక దృష్టి సారించారు. ప్రజలు తప్పకుండా ఎన్నికల నిబంధనలు పాటించాలని అధికారులు సూచించారు. ఈ కార్యక్రమంలో ఏఈ మల్లికార్జున్, హెడ్ కానిస్టేబుల్ ఎం.రాజు, రజిత పాల్గొన్నారు.

రక్తదానం మరొకరికి ప్రాణదానం



● **ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్**

నవతెలంగాణ-బేగంపేట్

రక్తదానం మరొకరికి ప్రాణదానం అవుతుందని మాజీమంత్రి, సనత్‌నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ అన్నారు. భగత్ సింగ్ వర్ధంతి సందర్భంగా ఆదివారం ఆదయ్యనగర్‌లో నిర్వహి ంచిన రక్తదాన శిబిరాన్ని ఆయన ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా భగత్‌సింగ్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘ నంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడు తూ నేటి యువతకు భగత్ సింగ్ స్ఫూర్తిగా నిలుస్తారన్నారు. రక్త దానం చేసేం దుకు ముందుకొచ్చిన వారిని అభినందించారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు తలసాని స్కైలాబ్ యాదవ్, నాగులు, ఆకుల హరికృష్ణ, రాములు, జయరాజ్, నిర్వహకులు నరేస్, శివ, ప్రమోద్, చరణ్, రోహన్, శ్రవణ్ తదితరులు పాల్గొన్నారు.

న్యూ గాంధీనగర్‌లో పర్యటించిన శ్రీగణేష్



నవతెలంగాణ-కంటోన్మెంట్

కంటోన్మెంట్ నియోజకవర్గం 7వ వార్డు న్యూ గాంధీనగర్‌లో కాంగ్రెస్ పార్టీ నాయకులు శ్రీ గణేష్ ఆదివారం పర్యటించారు. ఈ సందర్భంగా కాలనీవాసులను కలిసి వారి సమస్యలను అడిగి తెలు సుకున్నారు. ఈ సందర్భంగా శ్రీగణేష్ మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలో ముఖ్యమంత్రి రేవం త్ రెడ్డి నాయకత్వంలో ప్రవేశపెట్టిన 6గ్యారెంటీలపై వివరించారు. అనంతరం రానున్న సార్వత్రిక ఎన్నికలలో కాంగ్రెస్ పార్టీ మల్కాజ్‌గిరి పార్లమెంట్ అభ్యర్థి పట్నం సునీత మహేందర్‌రెడ్డి కంటో న్మెంట్ అసెంబ్లీ బై ఎలక్షన్‌లో ఎమ్మెల్యే అభ్యర్థిని అత్యధిక మెజారిటీతో గెలిపించాలని కోరారు. కంటోన్మెంట్ నియోజకవర్గంలో ప్రతి సమస్యపైన అవగాహన తనకు ఉందని, కం టోన్మెంట్ అభివృద్ధి కోసం కృషి చేస్తానని ఈ సందర్భంగా ఈ గణేష్ అన్నారు. కార్యక్రమ చివరిలో స్థానిక కాలనీ వాసులు శ్రీగణేష్‌ని ఘనంగా సన్మానించారు.

మైనంపల్లి నివాసంలో మల్కాజిగిరి పార్లమెంట్ నాయకుల సమావేశం



నవతెలంగాణ-కంటోన్మెంట్

ఎమ్మెల్యే సీనియర్ కాంగ్రెస్ నాయకుడు మైనంపల్లి హను మంతరావు ఆదివారం తన నివా సంలో మల్కాజగిరి పార్లమెంటరీ కాంగ్రెస్ కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమం లో మల్కాజిగిరి పార్లమెంటు అభ్యర్థి సునీతరెడ్డి, కంటోన్మెంట్ కాంగ్రెస్ నాయకుడు శ్రీగణేష్‌తో పాటు పలువురు సీనియర్ నాయకులు పాల్గొ న్నారు.ఈ సందర్భంగా హనుమంతరావు మాట్లాడుతూ ఈసారి ఎన్నికలలో మల్కాజిగిరి అభ్యర్థిగా సునీత రెడ్డిని గెలిపించాలని కోరారు. పార్లమెంట్ ఎన్నికల లో కూడా కాంగ్రెస్ ప్రభంజనం వీస్తుందన్నారు.కార్యక్రమంలో పలువు సీనియర్ నాయకులు అల్వాల్ మల్కాజగిరి కంటోన్మెంట్ ప్రాంతాలకు చెందిన కార్యకర్తలు నాయకులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే తీగుల్ల పద్మారావుగౌడ్‌ను కలిసిన ఎమ్మెల్యేలు



నవతెలంగాణ-బంజారాహిల్స్

సికింద్రాబాద్ పార్లమెంట్ బీఆర్ఎస్ పార్టీ అభ్యర్థిగా ఎంపికైన మాజీ డిప్యూటీ స్పీకర్, సికింద్రాబాద్ ఎమ్మెల్యే తీగుల్ల పద్మారావు గౌడ్‌ను పార్లమెంట్ నియోజకవర్గం పరిధిలోని బీఆర్ఎస్ పార్టీ ఎమ్మెల్యేలు, ముఖ్య నేతలు ఆదివారం అయన నివాసంలో కలుసు కు న్నారు. ఈ సందర్భంగా ఖైరతాబాద్ నియోజకవర్గ బీఆర్ ఎస్ పార్టీ ఇన్‌చార్జి గోవర్ధన్‌రెడ్డి, వెంకటేశ్వర డివిజన్ కార్పొరేటర్ మన్నె కవిత గోవర్ధన్‌రెడ్డి, సనత్ నగర్ ఎమ్మెల్యే, మాజీ మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్, జూబ్లీహిల్స్ ఎమ్మెల్యే మాగంటి గోపీనాథ్ అంబర్‌పేట ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్ బీఆర్ఎస్ పార్టీ నాయకులు కార్యకర్తలు మర్యాదపూర్వకంగా కలిశారు.

ఖానాపూర్ చర్చిలో మట్టల కార్యక్రమం

నవతెలంగాణ-గండిపేట్

ప్రజలందరూ సుఖ సంతోషాలతో ఉండాలంటూ దైవ సేవకుడైన యేసు బోధనలతో ముం దుకెళ్లాలని బాప్టిస్ట్ చర్చి అధ్యక్షులు రామేశ్వరం నరసింహ, ప్రధాన కార్యదర్శి పెద్దపులి కృష్ణ అన్నారు. ఆదివారం నార్సింగ్ మున్సిపాలి టీలోని ఖానాపూర్ గ్రామం బాప్టిస్ట్ చర్చిలో మట్టల వేడుక కార్యక్రమాన్ని నిర్వ హించారు. మట్టల కార్యక్రమంలో భాగంగా చర్చిలో మట్టలను ప్రజలం దరూ శాంతిని కోరుకోవాలని కోరారు. ప్రత్యేక ప్రార్థనలు, ఏసు బోధనలు, కీర్తనలు ఆటపాటలు ఆలపించారు. చర్చిలో కేక్ కట్ చేసి కానుకలను సమర్పిం చుకున్నారు. ఈ కార్యక్రమంలో క్రైస్తవ సోదరులు, సంఘ పెద్దలు, యువకు లు, గ్రామస్తులు, తదితరులు పాల్గొన్నారు.

హోలీ రంగులతో జాగ్రత్త..

● **ఎల్వీ ప్రసాద్ డాక్టర్ స్వప్నా షానభాగ్**



ఎంతో ఉత్సాహంగా జరుపుకునే హోలీ రంగులతో జాగ్రత్తగా ఉండాలని ఎల్వీ ప్రసాద్ ఐ ఇనిస్టిట్యూట్ కన్సల్టెంట్ నేత్ర వైద్యులు డాక్టర్ స్వప్నా షానభాగ్ తెలిపారు. హోలీని పురస్కరించుకొని ఆదివారం ఒక ప్రకటన విడుదల చేశారు. హోలీ రంగులలో సీసం, క్రోమియం, పాదరసం తదితర హానికరమైన పదార్థాలను ఉం టాయన్నారు. ఈ పదార్థాలు కళ్లకు చికాకు కలిగిస్తాయన్నారు. కళ్లు ఎరుపుగా మారు తాయని తెలిపారు. దీంతో కార్నియా దెబ్బ తిం టుందన్నారు. కళ్లను సురక్షితంగా కాపాడుకోవాలన్నారు. అందుకు సురక్షిత రం గులను వాడాలన్నారు. కంటి చికాకు నివారించాలంటే సేంద్రీయ రంగులు ఉత్తమమన్నారు. కళ్లను బలమైన స్ప్లాష్‌ల నుంచి రక్షించుకోవడానికి సన్ గ్లాసెస్ ధరించాలన్నారు. హోలీ రంగులు జల్లుకునేటప్పుడు కళ్లకు హాని కలిగకుండా ఉండేందుకు లెన్స్‌లను ధరిం చవద్దన్నారు. నీటి బెలూన్‌లతో నేరుగా కొట్టడం వల్ల కంటికి గాయాలు కావచ్చన్నారు. తగి నంత నీరు తాగి కళ్లను తేమగా ఉం చు కోవాలన్నారు. కళ్లలోకి రంగులు వెళ్ల కుండా జాగ్రత్తగా ఆడా లన్నారు. ఒక వేళ వెళ్తే వెంటనే గోరువెచ్చని నీటితో శుభ్రం చేసుకో వాలని తెలి పారు. కంటికి అలసట, అసౌకర్యం కలగకుం డా చూ సుకోవాలన్నారు. సూర్యరశ్మి తగ లకుండా నీడ ఉన్న ప్రాంతాలలో ఉండాల న్నారు. ఈ జాగ్రత్తలు తీసుకుటూ హోలీని ఆనందభరితంగా జరుకోవాలని ఆమె పలు సూచనలు చేశారు.



Dr Swapna Shanbhag
...sultant Ophthalmolo...
...Prasad Eye Inst...

ముగిసిన మెడిటెక్ 2కె, 24



● **ఆరోగ్య సంరక్షణలో సాంకేతిక పరిజ్ఞానంతో ముందుకు పోవాలి : ఐఏఎస్ జయేష్ రంజన్**

నవతెలంగాణ-ఓయూ

ఆరోగ్య సంరక్షణలో సాంకేతికను జోడించి ముం దుకెళ్లాలని తెలంగాణ ప్రభుత్వ ముఖ్య కార్యదర్శి ఐఏఎస్ జయేష్ రంజన్ సూచి ంచారు. ఓయూ బయోమెడికల్ ఇంజనీరింగ్ విద్యార్థులు ఏర్పాటు చేసిన మెడిటెక్-2024 ముగింపు సందర్భంగా అయిన ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు. జయేష్ రంజన్ ముఖ్య అతిథిగా మా ట్లాడుతూ ఈ కార్యక్రమాన్ని నిర్వహించినందుకు విద్యార్థు లను అభినందించడమే కాకుండా విద్యార్థులు ప్రదర్శిం చిన ప్రతి ప్రాజెక్ట్‌ను సందర్శించి కొనియాడారు. జయేష్ రంజన్ విద్యార్థులు ప్రదర్శించిన వినూత్న ప్రాజెక్ట్‌ల పట్ల సంతృప్తి వ్యక్తం చేశారు. ఆరోగ్య సంరక్షణలో సాంకేతిక పురోగతిని ప్రోత్సహించడంలో వారి పాత్రను వివరి ంచారు. ప్రాజెక్ట్‌లలో ముఖ్యంగా చూపుల నియంత్రిత వీల్‌చైర్ ప్రత్యే క ఆదర్శంగా నిలిచింది. ఈ వీల్‌చైర్‌ను తెలంగాణ ప్రభుత్వం ఆధ్వరంలో సెంటర్ ఫర్ అసిటివ్ టెక్నాలజీస్ ద్వారా సహాయం అందజేయడానికి తను కృషి చేస్తా రన్నారు. ముగింపులో విద్యార్థులు నిర్వహిం చిన సాంస్కృతిక కార్య క్రమాలు ఎంతగానో ఆకట్టుకు న్నాయి. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ ప్రొ.చంద్రశేఖర్,హెడ్ ప్రొ.మాలిని, ఫ్యాకల్టీ కో ఆర్డినేటర్ డా.డి.సు మన్, డా.మేడి శ్రీనివాస్, డా.విద్యా సాగర్, విద్యార్థి నిర్వాహకులు సందీప్,జశ్వంత్, సరయు విద్యార్థులు, ఉద్యోగులు పాల్గొన్నారు.

విద్యతోనే సమానత్వం



పాఠశాల ఫౌండర్ చైర్మన్ ప్రసాద్ గార పాట

నవతెలంగాణ-బంజరాహిల్స్

ర్యాంపుపై అదరగొట్టిన మై స్కూల్ ఇటలి చిన్నారులు ఒక వైపు పిల్లలు,మరో వైపు తల్లులు ర్యాంప్‌పై నిర్వహిస్తున్న సందర్భంగా పాఠశాల ఫౌండర్ చైర్మన్ ప్రసాద్ గార పాటి తెలిపారు. జూబ్లీహిల్స్ రోడ్ నెం. 25లోని మై స్కూల్ ఇటలీ ది న్యూరో సైంటిఫిక్ యూరో పియన్ ప్రీ స్కూల్‌లో ఆదివారం ఘనంగా మహిళా దినోత్సవ వేడుకలను నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల ఆవరణలో కిడ్స్ విత్ మామ్స్ అనే కాన్సెప్ట్‌తో ఏర్పాటు చేసిన ఫ్యాషన్ షో ఆకట్టుకుంది. చిన్నారులు తమ తల్లితో కలిసి ధైర్యంగా, హుషారుగా ర్యాంపుపై నడుస్తూ ఉత్సాహంగా గడిపారు. స్టేజీ విద్యార్థుల భయం పోగొట్టడంలో, ధైర్యంగా ఉండటంతో గురువు పాత్ర ఎంత ఉందో తల్లి పాత్ర కూడా అంతే ఉంది అనే కాన్సెప్ట్‌తో ఈ కార్యక్రమం నిర్విహించినట్లు ఆయన మాట్లా డుతూ వివరించారు.ఈ సందర్భంగా పాఠశాలలోని సుమారు 60మందికి పైగా చిన్నారులు, పాఠశాల ఎండి అపర్ణ వల్లూరి, నవాబ్ రౌనక్ యార్ ఖాన్ తదితరులు పాల్గొన్నారు.





హోలీ పండగ సంబరాలు ఖైరతాబాద్ నియోజక వర్గంలోని అన్ని డివిజన్ల పరిధి లో రాజకీయాలకు అతీతంగా నిర్వహించారు. బంజా రాహిల్స్ డివిజన్ ఎన్బీటినగర్‌లో నగర మీరు గద్వాల విజయలక్ష్మి ఆధ్వర్యంలో ప్రత్యేక కామదహనం కార్యక్ర మం హోలీ పండుగను సందడిగా నిర్వహించారు. మేయర్ కూడా స్థానికులతో కలిసి రంగుల పూసుకొని సరదాగా గడిపారు. అయితే నగర ప్రజలకు ఆమె ఓ హెచ్చరిక జారీ చేశారు. సాధార ణమైన నాన్ కెమికల్ రంగులనే వాడాలి కెమికల్ వాడి కంటి వంటి సమస్యలు చర్మ సమస్యలు కొని తెచ్చుకొవద్దని అలాగే కొందరు కోడి గుడ్లు పగలగొట్టి ఈ పండగను మారుస్తున్నారు. అది ఎంతవరకు సమంజసం కాదన్నారు. రంగుల పండుగను రంగుల తోనే సరదాగా గడపాలని ఇష్టంలేని వారికి బలవంతంగా పోలి ఆడాలని రంగులు వేయడం చేయవద్దని హితవు పలికారు.

నవతెలంగాణ-బంజారాహిల్స్

ఎస్సీలకు 4 కార్పొరేషన్స్ కావాలి : చింతల రాజలింగం



నవతెలంగాణ-ఓయూ

ఎస్సి 57 ఉపకులల ఐక్యవేదిక రాష్ట్ర అధ్యక్షుడు చింతల రాజలింగం ఆధ్వర్యంలో ఆదివారం రాష్ట్ర ప్రభు త్వ సలహాదారుడు వెం నరేందర్‌రెడ్డికి వినతిపత్రం అందజేశారు. మాదిగ ఉపకులాలకు ప్రత్యేక ఫైనాన్స్ కార్పొరే షన్ ఏర్పాటు, మాదిగ కులానికి ప్రత్యేక ఫై నాన్స్ కార్పోరే షన్ ఏర్పాటు చేయాలని, మాల కులానికి, మాల ఉపకు లాని వేరు వేరుగా కార్పొరేషన్ ఏర్పాటు చేయాలని రాజ లింగం కోరారు. వారికి ప్రత్యేక కార్పొ రేషన్స్ ఏర్పాటు చేస్తే దళితుల్లో ఉన్న కులాలు అభివృద్ధి చెం దుతాయన్నారు.గత 20 సంవత్సరాలుగా ఉప కులాలకు ప్రత్యేక ఫైనా న్స్ కార్పొరేషన్ ఏర్పాటు చే యాలని ఉద్యమం చేస్తున్నట్లు చెప్పారు. రాష్ట్ర ప్రభుత్వం ఈ విషయం లో స్పందించిన తగు న్యాయం చేయాలని కోరారు. స్వతంత్ర వచ్చిననాటి నుండి బెడ బుడిగా జం గం, డక్కలి, బైండ్ల, మెచి, సమగర మెచి, చిందు, పంబల, మస్తీన్ ,బెగారి, మాదిగ దాస్, దోం బర, మాదిగ జంగం, వాలియ దాసరి, ఇలాంటి 57 ఉప కులాలను ఏ ప్రభుత్వాలు గుర్తించలేదని, వీరి కనీస హక్కులు కోల్పో యిన ఆర్థికంగా, రాజకీయంగా, వెనుక బడి పోయారని ఆవేదన వ్యక్తం చేశారు. కాంగ్రెస్ పార్టీ చేవెళ్ల సభలో ఎస్సీ ఉపకు లాలకు ప్రత్యేక ఫైనాన్స్ కార్పొరేషన్ ఏర్పాటు చేస్తామని నాటి పీసీసీ అధ్యక్షుడు నేటి సీఎం రేవంత్ రెడ్డి ఇచ్చిన హామీని నిలబెట్టుకోవాలని సూచించారు.ఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు మేడి పాపయ్య, ఉప కులాల ప్రధాన కార్యదర్శి బాణాల మంగేష్, ఉపాధ్యక్షుడు ఏర్పుల యాదయ్య, కోశాధికారి కొండూరు రవి, కర్నె ముత్యాలు, చింతల శ్రీధర్ గాంధీ, రాజ్ దశారథ్, గణేష్ పాల్గొన్నారు.

టెట్ పరీక్ష ఫీజులను తగ్గించాలి

● **సీఎం రేవంత్ రెడ్డికి బహిరంగ లేఖ**

● **బీసీనేత బొల్లేపల్లి స్వామి గౌడ్**

నవతెలంగాణ-ఓయూ



టీచర్ ఎలిజభులిటీ టెస్ట్ ఫీజులను ఒక్కొక్క పేపర్‌కు రూ.200 రూపాయల నుండిరూ.1000లకు పెంచుతూ రాష్ట్ర విద్యాశాఖ శుక్రవారం విడుదల చేసిన టెట్ సమగ్ర నోటిఫికేషన్‌లో పేర్కొన్న నేపథ్యంలో టెట్ పరీక్ష ఫీజులను తగ్గించాలని కోరుతూ బీసీ విద్యార్థి సంఘం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ బొల్లేపల్లి స్వామి గౌడ్ ఆదివారం ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి, విద్యా శాఖ డైరెక్టర్ దేవసేనకి బహిరంగ లేఖలను పంపారు. అధిక ఫీజులు లేకుండా పోటీ పరీక్షలు నిర్వహి స్తామని కాంగ్రెస్ ఎన్నికల మేనిఫెస్టోలో పేర్కొని ఇప్పుడు ఉపాధ్యాయ అర్హత పరీక్షకు పోటీపడే అభ్యర్థులకు ఫీజులు పెంచడం ద్వారా రాష్ట్ర ంలోని లక్షలాది మంది నిరుద్యోగులకు భారమవుతుందని, నిరుద్యో గుల ప్రయోజనాల దృష్ట్యా టెట్ పరీక్ష ఫీజులను తగ్గించేలా చర్యలు తీసుకోవాలని బొల్లే పల్లి స్వామి గౌడ్ లేఖలో పేర్కొన్నట్లు తెలిపారు.

అభ్యర్థులపై భారం లేకుండా ప్రభుత్వం ఫీజు తగ్గించాలి

బీఆర్ఎస్వీ రాష్ట్ర కార్యదర్శి జంగయ్య డిమాండ్



టెట్ పరీక్ష ఫీజులను పెంచడం వల్ల నిరుపేద అభ్యర్థులపై భారం పడుతుందని తక్షణమే ఫీజు లేకుం డా అప్లికేషన్ తీసుకోవా లని బీఆర్ ఎస్వీ రాష్ట్ర కార్యదర్శి జంగయ్య డిమాండ్ చేశారు. లేని పక్షంలో ఆం దోళనలు ఉధృతం చేస్తామని జం గయ్య హెచ్చరించారు.

ప్రమాదవశాత్తు కింద పడి మహిళ మృతి

నవతెలంగాణ-ఓయూ



శనివారం రాత్రి పూట 9 గంటల సమయంలో తార్నా కలోని పెట్రోల్ పంపు ఒక మహి ళా(50) మృతి చెందిన ఘటన డివిజన్ పరిధిలో చో టు చేసు కుంది. తార్నాకలో రోడ్డు దాటు తుండుగా ఆర్టీసీ బస్సు సమీపంగా వస్తున్నదని వెనక్కి జరుగు తున్న క్రమంలో ఆమె అదుపు తప్పి క్రింద పడిపోవడంతో ఆమెకు తలకు గాయమయినట్లు పలువురు స్థానికులు తెలిపారు. ఆమె స్పృహ కోల్పోయినది. సమీ పంలో స్థానికులు 8 అంబులెన్స్‌కు సమాచా రమివ్వగా ఆమెను గాం ధీ ఆసుపత్రి తరలించారు. ఆమె చికిత్స పొందుతూ ఆదివారం తెల్లవారుజామున గంటలకు మృతిచెందిన ట్లు డాక్టర్లు ధ్రువీ కరించారు.ఆమె మృత దేహాన్ని గాంధీ ఆసుపత్రి మార్చురీ ఉంచినట్లు లాలగూడా స్టేషన్ హౌస్ ఆఫీసర్ పల్లె పద్మ ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి గడ్డం రంజిత్ రెడ్డిని గెలిపించాలి

కాంగ్రెస్ జిల్లా ఎస్సీ సెల్ చైర్మెన్ కోటపల్లీ రాజు



నవతెలంగాణ-బంట్వారం

చేవెళ్ల పార్లమెంట్ ఎంపీగా డాక్టర్ గడ్డం రంజిత్ రెడ్డి చేవెళ్ల ప్రాంతాన్ని ఎంతో అభివృద్ధి చేశారని కాబట్టి చేవెళ్ల పార్లమెంట్ కాంగ్రెస్ అభ్యర్థి డాక్టర్ గడ్డం రంజిత్ రెడ్డిని మరోసారి భారీ మెజార్టీతో గెలిపించాలని జిల్లా కాంగ్రెస్ ఎస్సీ సెల్ చైర్మెన్ కోటపల్లి రాజు అన్నారు. ఎంపీగా గెలిపిస్తే చేవెళ్ల పరిధిలో ఉన్న వికారాబాద్, తాండూర్, పరిగి, కొడంగల్ ప్రాంతాలని ఎంతగానో అభివృద్ధి చేస్తారన్నారు.

'తెలంగాణ ఫిషరీస్ కోఆపరేటివ్ సొసైటీ ఫెడరేషన్ చైర్మెన్‌కు బ్రహ్మోత్సవాల ఆహ్వాన పత్రిక'



నవతెలంగాణ-తలకొండపల్లి

మండల పరిధిలోని ఆదివారం దేవుని పడకల్ గ్రామంలో ఆదివారం 24వ తేదీ నుంచి 31 తేదీ వరకు ప్రారంభం కానున్న శ్రీ వేంకటేశ్వర స్వామి వారి బ్రహ్మోత్సవాలకు రావాల్సిందిగా గ్రామ మాజీ సర్పంచ్ కడమోని శ్రీశైలం తన అనుచరులతో తెలంగాణ ఫిషరీస్ కోఆపరేటివ్ సొసైటీ ఫెడరేషన్ చైర్మెన్ మెట్టు సాయి కుమార్ మర్యాద పూర్వకంగా కలిసి సన్మానించి ఆహ్వాన పత్రిక అందజేశారు. కార్యక్రమంలో అంబటి భిక్షపతి తదితరులు పాల్గొన్నారు.

'డబుల్ ' కల నెరవేరేదెప్పుడు..?

- 10 ఏండ్లుగా ఎదురు చూపులు
- నిర్మాణానికి 8 ఏండ్లు పట్టిన వైనం
- గ్రామ సభల్లో డ్రా పద్ధతిన లబ్ధిదారుల ఎంపిక
- ఎంపికై 6 నెలలు గడిచినా గృహప్రవేశానికి నోచుకోని లబ్ధిదారులు
- గృహప్రవేశానికి వెంటనే చర్యలు తీసుకోవాలి



పేదింటి కల 'డబుల్ బెడ్రూం'. రంగారెడ్డి జిల్లా, మంచాల మండలం, నోముల రెవెన్యూ పరిధి సర్వే నంబర్ 101లో లింగంపల్లి గేటు వద్ద 96 డబుల్ బెడ్‌రూమ్ ఇండ్లు నిర్మాణం చేశారు. సొంతింటి కోసం పదేండ్లుగా ఎదిరిచూస్తున్న వైనం. నిర్మాణానికి ఏండ్లు పట్టినా.. లబ్ధిదారులను ఎంపికచేసి ఆరు నెలలు కావస్తున్నా ..గృహప్రవేశానికి మాత్రం లబ్ధిదారులు నోచుకోవట్లేదు. వెంటనే సంబంధిత అధికారులు స్పందించి డబుల్ బెడ్ రూమ్ ఇండ్ల గృహ ప్రవేశానికి చర్యలు చేపట్టాలని కోరుతున్నారు.

నవతెలంగాణ-మంచాల

రంగారెడ్డి జిల్లా, మంచాల మండలం, నోముల రెవెన్యూ పరిధి సర్వే నంబర్ 101లో లింగంపల్లి గేటు వద్ద 96 డబుల్ బెడ్‌రూమ్ ఇండ్లు నిర్మాణం చేశారు. ఆ ఇండ్లను నోముల, లింగం పల్లి, మంచాల గ్రామాలకు చెందిన వారికి గ్రామ సభల్లో డ్రా పద్ధతిన లబ్ధిదారులను ఎంపిక చేశారు. ఎంపిక జరిగి 6 నెలలు గడిచినా గృహ ప్రవేశానికి మాత్రం నోచుకోని వైనం. వెంటనే గృహ ప్రవేశానికి చర్యలు తీసుకోవాలని లబ్ధి దారులు కోరుకుంటున్నారు. ముఖ్యంగా 8 ఏండ్ల కింద మండలంలోని నోముల రెవెన్యూ పరిధి సర్వే నంబర్ 101లో 96 ఇండ్ల నిర్మాణం చేపట్టారు. అవి నిర్మాణం పూర్తి కావడానికి 8 ఏండ్లు పట్టింది. ఆ 96 ఇండ్లను నోముల, లింగంపల్లి, మంచాల గ్రామాలకు చెందిన ధరఖాస్తు చేసుకున్న వారి ఇండ్ల వద్దకు వెళ్లి అధికారులు సర్వే చేసి లబ్ధి లిస్టును తయ్యారు చేయగా అర్హుల లిస్టు ఎక్కువ కావడంతో 3 గ్రామాల్లో గ్రామ సభల్లో డ్రా పద్ధతిన లబ్ధి దారులను ఎంపి క చేశారు. వారికి ఇండ్లను కూడ కేటాయించారు. కానీ లబ్ధిదారులు గృహప్రవేశానికి నోచుకోలేదు. 10 ఏండ్లుగా డబుల్ బెడ్ రూమ్ ఇల్ల కోసం ఎదురు చూస్తున్న కల కొంతమందికి నెరవేరినా ఎంపికైన లబ్ధిదారులు గృహ ప్రవేశం కోసం ఎదురు చూస్తున్నారు. ఎంపికై 6 నెలలు గడించినా గృహప్రవేశానికి నోచుకోలేదు. కాబట్టి గృహ ప్రవేశానికి వెంటనే చర్యలు తీసుకోవాలని లబ్ధి దారులు కోరుకుంటున్నారు.

చాలా ఇబ్బందులు ఎదుర్కొంటున్నాం



మాకు చిన్న పెంకుటిల్లు ఉంది. గోడలు శిథిలావస్థలో ఉన్నాయి. వర్షం వస్తే మొత్తం కురుస్తుంది. ఎప్పుడు కూలిపోతోందో అనే భయం కూడా ఉంది. డబుల్ బెడ్ ఇండ్లకు ఎంపిక కావడం సంతోషంగా ఉంది. కానీ ఇంకా గృహప్రవేశానికి అనుమతి ఇవ్వకపోవడంతో చాల ఇబ్బందులు ఎదుర్కొంటున్నాం. అధికారులు వెంటనే స్పందించి గృహ ప్రవేశానికి చర్యలు తీసుకోవాలి.

గడ్డం మంజుల, మంచాల గ్రామం

వెంటనే గృహ ప్రవేశానికి చర్యలు చేపట్టాలి



మాకు ఇల్లు లేదు. మా అత్త మామ ఉండే చిన్న పెంకుటిల్లులో మూడు కుటుంబాల వారం ఉంటున్నాం. ఆ చిన్న ఇల్లు ఇరుకుగా ఉండటంతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నాం. కూలీ పని చేసుకుని జీవనం కొనసాగిస్తున్నాం. డబుల్ బెడ్ రూమ్ ఇల్లు రావడం ఆనందంగా ఉంది. కానీ లబ్ధి దారురలుగా ఎంపికై 6 నెలలు గడిచినా గృహప్రవేశానికి చర్యలు తీసుకోక పోవడం వల్ల చాల ఇబ్బందిగా ఉంది. కాబట్టి సంబంధిత అధికారులు వెంటనే స్పందించి డబుల్ బెడ్ రూం ఇండ్లకు గృహ ప్రవేశ చర్యలు చేపట్టాలి.

అనంగల్ల సంతోష, నోముల గ్రామం

లబ్ధిదారులకు న్యాయం చేయాలి



నోముల రెవెన్యూ పరిధి సర్వే నంబర్ 101లో నిర్మించిన 96 డబుల్ బెడ్ రూమ్ ఇండ్లను ఎంపికైన లబ్ధిదారులకు గృహప్రవేశ చర్యలు చేపట్టాలి. వారు చాల రోజులగా ఇండ్లు లేక చాలా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. సంబంధిత అధికారులు వెంటనే స్పందించి డబుల్ బెడ్ రూమ్ ఇండ్ల గృహ ప్రవేశ చర్యలు చేపట్టాలి.

సిలివేరు రాజు, సీపీఐ(ఎం) మండల కార్యదర్శివర్గ సభ్యులు

రైతులు వాణిజ్య పంటలను పండించాలి



జిల్లా ఉద్యాన పట్టు పరిశ్రమశాఖ అధికారి సిరాజ్ గాంధీ

నవతెలంగాణ-కందుకూరు

రైతులు వాణిజ్య పంటలను పండించాలని జిల్లా ఉద్యానపట్టు పరిశ్రమశాఖ అధికారి సిరాజ్ గాంధీ రైతులకు సూచించారు. శనివారం సాయంత్రం కందుకూరు మండల సరస్వతి గూడలో శ్రీనివాస్ రెడ్డి రైతు ఖర్జూరపుతోట, మల్బరీ తోటలను పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడు తూ..ప్రతి ఒక రైతు ఖర్జూరపుతోట మల్బరీ తోటల పెంపకానికి ప్రాధాన్యత ఇవ్వాలి అన్నారు. ప్ర భుత్వం నుండి సహా సహకారాలు అందజేస్తున్నారు. కార్యక్రమంలో ఏడీహెచ్ సంజయ్ కుమార్, మండల ఉద్యాన అధికారి స్వామ్య పాల్గొన్నారు.

ఘనంగా ఫామ్ సండే



నవతెలంగాణ-షాబాద్

మండల పరిధిలోని మరియాపురం గ్రామంలో ఘనంగా ఫామ్ సండేను జరుపుకున్నారు. ఉదయం గ్రామంలోని చర్చిలో ప్రత్యేక ప్రార్థనలు చేసిన అనంతరం గ్రామంలో తాటి కొమ్మలతో తిరిగారు. ఈ సందర్భంగా పలువురు ఫాదర్లు మాట్లాడుతూ...క్రైస్తవ సాంప్రదా యంలో పవిత్ర ఈస్టర్ ముందు ఆదివారం ఫామ్ డేను జరుపుకుం టామన్నారు. ఫామ్ సండే అనేది తాటి కొమ్మలు లేదా ఇతర స్థానిక చెట్ల కొమ్మలను ఆశీర్వదించడం, పంపిణీ చేస్తామన్నారు. కార్యక్రమంలో గ్రామస్తులు పాల్గొన్నారు.

మల్లు రవి సమక్షంలో చేరికలు



నవతెలంగాణ-ఆమనగల్

ఆమనగల్ మాజీ సర్పంచ్ గుర్రం కేశవులు ఆధ్వర్యంలో డాక్టర్ మల్లు రవి సమక్షంలో ఆదివారం వివిధ పార్టీలకు చెందిన నాయకులు పలువురు కాంగ్రెస్‌లో చేరారు. ఆమనగల్ మున్సిపాలిటీ పరిధిలోని చంద్రాన్‌పల్లి తాండాకు చెందిన శ్రీను నాయక్‌తో పాటు పలువురు తాండా వాసులను హైదరాబాద్‌లోని తన నివాసంలో మల్లు రవి కాంగ్రెస్ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ..గతంలో మల్లు రవి చేపట్టిన పలు అభివృద్ధి కార్యక్రమాలకు ఆకర్షితులై కాంగ్రెస్‌లో చేరుతున్నట్టు తెలిపారు. కార్యక్రమంలో గిరిజన నాయకులు రాగ్యానాయక్, హర్యానాయక్, శ్రీధర్‌నాయక్, గోపాల్‌నాయక్, రమేష్‌నాయక్, మల్లేష్‌నాయక్, రవినాయక్ తదితరులు పాల్గొన్నారు.

మల్లన్న స్వామి కల్యాణ మహెూత్సవంలో ఎమ్మెల్యే గాంధీ

నవతెలంగాణ-చందానగర్



చందానగర్ డివిజన్ పరిధిలోని గంగారాంలోని మల్లికార్జున స్వామి దేవాలయంలో జరిగిన మల్లన్న స్వామి వారి కల్యాణ మహెూత్సవం కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా ప్రత్యేక పూజలు చేసిన ఎమ్మెల్యే ఆరికెపూడి గాంధీ పాల్గొన్నారు. కార్యక్రమంలో హఫీజ్పేట్ డివిజన్ బీఆర్ఎస్ అధ్యక్షులు గౌతమ్‌గౌడ్, హఫీజ్పేట్ డివిజన్ బీఆర్ఎస్ అధ్యక్షులు వాలా హరీష్‌రావు బీఆర్ఎస్ నాయకులు మిద్దెల మల్లారెడ్డి, బాబు మోహన్ మల్లేష్, ఆలయ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

క్రీడల్లోనూ యువత రాణించాలి

- బీఆర్ఎస్ నాయకులు రేవంత్ రెడ్డి

నవతెలంగాణ-కందుకూరు



క్రీడల్లో యువత రాణించాలని బీఆర్ఎస్ నాయకులు మాజీ ఉపసర్పంచ్ రేవంత్ రెడ్డి అన్నారు. కందుకూరు మండలం అగర్మి యాగూడ గ్రామంలో ఏపీఎల్ క్రికెట్ టోర్నమెంట్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..శరీరక, మానసిక ఉల్లాసం క్రీడల వల్ల కలుగుతుందన్నారు. చదువుతోపాటు క్రీడల్లో రాణించాలని కోరారు. యువత చెడు వ్యసనాలకు బానిస కాకుండా చదువుపై, క్రీడలపై శ్రద్ధ వహిం చాలని కోరారు. గ్రామ, మండల, జిల్లా స్థాయిలో క్రీడల్లో రాణించాలన్నారు. కార్యక్రమంలో జగన్‌రెడ్డి, కిరణ్ కుమార్ రెడ్డి, రవి, ప్రవీణ్ యాదవ్, అంజయ్య యాదవ్ గ్రామస్తులు పాల్గొన్నారు.

ఫైనాన్స్, చిట్ ఫండ్స్, వడ్డీ వ్యాపారులపైన చర్యలు తీసుకోవాలి

- సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి ఆర్ మైపాల్

నవతెలంగాణ-వికారాబాద్ రూరల్



తాండూరు పట్టణంలో బాలయ్య అనే ఆటో డ్రైవర్‌ను ఇంటికి పిలిచి అధిక వడ్డీ ఇవ్వనందుకు దాడి చేసి చంపేందుకు ప్రయత్నించిన వడ్డీ వ్యాపారి రవిని అరెస్టు చేయాలి. సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి ఆర్ మహిపాల్ ప్రభుత్వా నికి డిమాండ్ చేశారు. వికారాబాద్ జిల్లా లోని గ్రామాలో పట్టణాల్లో ఎటువంటి లైసెన్సు లేకుండా ఫైనాన్స్ అధిక వడ్డీ వ్యాపారంతో చిట్ ఫండ్స్‌లతో పేద ప్రజలకు కార్మికులకు ఇబ్బందులకు గురి చేస్తున్నా వారిపై చట్టరీత్య చర్యలు తీసుకోవాలన్నారు. జిల్లాలో పర్మిషన్ లేని ఫైనాన్స్‌లపై చట్టపరంగా చర్యలు తీసుకోవాలని జిల్లా పోలీసులకు జిల్లా కలెక్టర్‌లకు, భారత కమ్యూనిస్టు పార్టీ వికారాబాద్ జిల్లా కమిటీ కోరుతుంది.

నేటి తరానికి ఆదర్శప్రాయుడు భగత్‌సింగ్

- జపాల్‌లో భగత్‌సింగ్ వర్ధంతి
- డీవైఎఫ్ఐ జపాల్ గ్రామాధ్యక్ష, కార్యదర్శులు ఆవుల వినోద్ కుమార్, యాట సత్యం



నవతెలంగాణ-మంచాల

నేటి తరానికి ఆదర్శప్రాయుడు భగత్‌సింగ్ అని పలువురు అభిప్రాయపడ్డారు. మండల పరిధిలోని జపాల్ గ్రామంలో శనివారం రాత్రి డీవైఎఫ్ఐ గ్రామ కమిటీ అధ్వర్యంలో స్వతంత్ర సమర యోధులు భగత్‌సింగ్, రాజ్‌గురు, సుఖ దేవ్‌ల 103వ వర్ధంతి నిర్వహించారని డీవైఎఫ్ఐ గ్రామాధ్యక్ష, కార్యదర్శులు ఆవుల వినోద్, యాట సత్యంలు తెలిపారు. కార్యక్రమంలో ఎంపీటీడీ లట్టుపల్లి చంద్రశేఖర్ రెడ్డి, సీపీఐ(ఎం) గ్రామ కమిటీ కన్వీనర్ యాట పాండు, గ్రామ శాఖ కార్య దర్శిలు ఆంజనేయులు, నోముల హరికృష్ణ, మం డల కమిటీ సభ్యులు లెనిన్, హాఫిజ్ పాషా, గ్రామ పంచాయతీ కో ఆప్షన్ సభ్యులు ఓరుగంటి భాస్క ర్ గౌడ్, మాజీ ఎంపీటీసీ యాట జగన్ పార్టీ సభ్యులు, నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

ప్రజా సమస్యల పరిష్కారానికి నిరంతరం కృషి

- ఎమ్మెల్యే కాలేరు వెంకటేశ్



నవతెలంగాణ-అంబర్‌పేట:

ప్రజా సమస్యల పరిష్కారానికి నిరంతరం కృషి చేస్తున్నానని అంబర్‌పేట ఎమ్మెల్యే కాలేరు వెంకటేశ్ అన్నారు. ఆదివారం గోల్నాక డివిజన్ పరిధిలోని కమల నగర్, న్యూ కమలానగర్ ప్రాంతా లలో పాదయాత్ర నిర్వహించి సందర్భంగా స్థానిక ప్రజలతో సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా బస్తీవాసులు ప్రజాపాలనలో దరఖాస్తు చేసుకున్న ఉచిత సిలిండర్, ఉచిత విద్యుత్తు పింఛన్లు సరిగ్గా రావడంలేదని విద్యుత్ లైట్లు వెలగడం లేదని ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లగా ఈ సందర్భంగా ఎమ్మెల్యే కాలేరు వెంకటేశ్ మాట్లాడుతూ ప్రజల సమస్యలపై అధికారుల దృష్టికి తీసుకెళ్లి సాధ్యమైనంత త్వరలో ప్రజా సమస్యలు పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. స్థానిక నాయకులు సంతోష్, కిషన్ సింగ్, బక్కయ్య, మహేష్, రాజు, యాదగిరి, జగన్, శ్రీను తదితర నాయకులు పాల్గొన్నారు.

హెూలీ పండుగ సందర్భంగా చాత్రినాక మిత్ర యువజన సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కామదహనంలో పాల్గొన్న సంఘం ప్రధాన కార్యదర్శి ఎస్.పి.క్రాంతి కుమార్, ప్రతినిదులు బి.కొటేష్, ఎస్.వేణు గోపాల్, బి.నితిన్ చారి, బి.వెంకటేష్, సుందర్ ఇయ్యేంగార్, కే.అనిరుధ్, సుషిరిత్ తదితరులు

నవతెలంగాణ-ధూల్‌పేట్





మత సామరస్యాన్ని చాటిచెప్పేందుకు శక్తివంతమైన వేదిక ఇఫ్తార్



నవతెలంగాణ-ధూల్‌పేట్

టోలీచౌకీ ఇస్లామిక్ సెంటర్ మసీద్ మహిళల ఇఫ్తార్ పార్టీకి వేదిక య్యింది. ఈ ఇఫ్తార్ విం దులో సుమారు 100మంది మహిళలు పాల్గొన్నారు. ఎంతో మంది స్త్రీలు మొదటిసారి హాజరైన ఈ రంజాన్ ఇఫ్తార్‌ను జీవితంలో చిరస్మరణీయమైన సందర్భమని తెలిపారు. ఈ ఇఫ్తార్ మత విద్వేషాలపై పోరాడేందుకు, మత సామరస్యాన్ని చాటిచెప్పేందుకు శక్తివంతమైన వేదిక అని పలువురు మహిళా నాయకులు కితాబిచ్చారు. ఈ ఇఫ్తార్‌ని నిర్వహించిన నసీమ్ సుల్తానా జమాఅతె ఇస్లామీహింద్ మహిళా విభాగం నాయకురాలు ఒకే వరుసలో కూర్చొని, ఒకే సమయానికి తినడం ఒక్కటేనని చాటి చెప్పామన్నారు. కులమతాల కతీతంగా పాల్గొన్న ఈ ఇఫ్తార్ విందులు మత సామరస్యాన్ని పెంపొందిస్తాయని నసీమ్ సుల్తానా పేర్కొన్నారు. సహపంక్తి భోజనం చేయడం, సెల్ఫీలు దిగడం, కానుకలు ఇచ్చిపుచ్చుకోవడం లాంటి ఆహ్లాదక రమైన వాతావరణంలో జరిగిన ఈ ఇఫ్తార్ హిందూ-ముస్లిం ఐక్యతకు నిదర్శ నంగా నిలిచిందన్నారు. రంజాన్ మాసంలో ఉపవాసం యొక్క ప్రాముఖ్యత గురించి జె.ఐ.హెచ్. ఉమెన్స్ వింగ్ సీనియర్ మెంబర్ ఆయిషా సుల్తానా వివరించారు. ఈ మాసంలో ఆధ్యాత్మిక వాతావరణంలో ఉపవాసం ఉండడం వల్ల మానసిక ప్రశాంతతతోపాటు అద్వితీయమైన ఆహ్లాదకరమైన అనుభూతి కలుగుతుందని పలువురు మహిళలు అభిప్రాయపడ్డారు. మతపరమైన రాజకీయాలను తిప్పికొట్టేందుకు ఇలాంటి ఇఫ్తార్ లు మరిన్ని జరగాలనీ ఆకాంక్షించారు.

కుష్టు వ్యాధి నిర్మూలనే లక్ష్యం



నవతెలంగాణ-సుల్తాన్ బజార్

కుష్టి వ్యాధి నిర్మూల లక్ష్యంగా కృషి చేస్తున్నామని బేగంబజార్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పీహెచ్ఎన్ నాగేశ్వరమ్మ తెలిపారు. ఆదివారం మాట్లాడుతూ.. బేగంబజార్ ప్రాథమిక ఆరోగ్య కేంద్ర పరిధిలోని అన్ని ప్రాంతాల్లో కుష్టు వ్యాధి నివారణ ప్రోగ్రాం ఆధ్వర్యంలో ఇంటింటికి వెళ్లి కుష్టి వ్యాధి గుర్తింపు సర్వే కార్యక్రమం నిర్వహిస్తున్నామన్నారు. అనుమానితులను గుర్తించి పరీక్షలు నిర్వహిస్తున్నామని చెప్పారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ వనిత, డిపిఎంఓ గణేష్, ఏఎన్ఎంలు శ్యామల, నలిని, వందన, సునీత, తదితరులు పాల్గొన్నారు.

మెపా రాష్ట్ర సోషల్ మీడియా ఇన్‌చార్జీలుగా మహేందర్, శ్రీనాథ్ ముదిరాజ్



నవతెలంగాణ-సుల్తాన్ బజార్

మెపా కేంద్ర కార్యాలయంలో జరిగిన మెపా (ముదిరాజ్ ఎంప్లాయిస్ అండ్ ప్రొఫెషనల్స్ అసోసియేషన్ తెలంగాణ) రాష్ట్ర కార్యవర్గ సమావేశంలో వరంగల్ జిల్లా నర్సంపేట మండలం, మేడపల్లి గ్రామానికి చెందిన సంకేంఢ్ల మహేందర్ ముదిరాజ్‌ను మహబూబాబాద్ జిల్లా కేసముద్రం మండలం అర్పనపల్లి గ్రామానికి చెందిన చెన్నబోయిన శ్రీనాథ్ ముదిరాజ్‌లను మెపా తెలంగాణ రాష్ట్ర సోషల్ మీడియా ఇన్‌చార్జీలుగా రాష్ట్ర అధ్యక్షుడు పులి దేవేందర్ ముదిరాజ్, ప్రధాన కార్యదర్శి బోట్లపల్లి సంజీవన్ కుమార్ ముదిరాజ్, గౌరవ అధ్యక్షులు డా.బోయిని జగన్ మోహన్ ముదిరాజ్‌లు ఆదివారం ఇరువురికి నియామక పత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా మహేందర్, శ్రీనాథ్ ముదిరాజ్‌లు మాట్లాడుతూ.. జాతి అభివృద్ధి ఐక్యత కోసం అందరినీ కలుపుకుని ముందుకు వెళ్తామని అలాగే ముదిరాజ్‌ల రిజర్వేషన్ సాధన కోసం కలిసికట్టుగా ఐక్య ఉద్యమాలు చేస్తామన్నారు. మెపా అభివృద్ధి కోసం సోషల్ మీడియా పాత్రను దిగ్విజయం చేస్తామన్నారు. మాపై నమ్మకంతో మాకు ఈ పదవి ఇచ్చినందుకు రాష్ట్ర కమిటీ సభ్యులకు, రాష్ట్ర అధ్యక్షులు పులి దేవేందర్ ,ప్రధాన కార్యదర్శి సంజీవన్ కుమార్, గౌరవ అధ్యక్షులు డా. జగన్ మోహన్ ముదిరాజ్ లతో పాటు అన్ని జిల్లాల అధ్యక్ష ప్రధాన కార్యదర్శులకు, వివిధ మండలాల, గ్రామాల మెపా బాధ్యులు ధన్యవాదాలు తెలిపారు.

స్కై ఫౌండేషన్ ఆధ్వర్యంలో 249వ అన్నదానం



నవతెలంగాణ-ముషీరాబాద్

ఆకలితో అలమటిస్తూ రోడ్ల పక్కన ఫుట్‌పాత్‌ల మీదనే దయ నీయస్థితులలో జీవనం సాగిస్తున్నా రు. ఈ అభాగ్యులందరికీ ఆశ్రయం కల్పించి ఆహారం వైద్యం అందించి స్వయం ఉపాధి కల్పించాలని ప్రభు త్వానికి విజ్ఞప్తి చేస్తూ స్కై ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఆకలితో ఉన్న అనాథలు, నిరాశ్రయులకు 249వ అన్న దాన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ప్రెసిడెంట్ వై. సంజీవ కుమార్, వైస్ ప్రెసిడెంట్ పావని.ఓ, సభ్యులు కీర్తి, కుషికోమల్, మానస, హరీష్ కుమార్, అఖిల్ తదితరులు పాల్గొన్నారు.



సికింద్రాబాద్ ఎమ్మెల్యే పార్లమెంటు అభ్యర్థి పద్మారావు గౌడ్‌ని మర్యాద పూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలియజేసిన అంబర్‌పేట కార్పొరేటర్ ఇ. విజయ్ కుమార్ గౌడ్, సీనియర్ నాయకులు దేవేందర్,మహేష్ ముదిరాజ్, సంతోష్ చారి,రుద్ర తదితరులు పాల్గొన్నారు. నవతెలంగాణ-అంబర్‌పేట

పీసీఓఎస్, మెటబాలిక్ సిండ్రోమ్‌పై అవగాహన ముఖ్యం

- మన దేశంలో ప్రతి ఐదుగురిలో ఒకరికి ఈ సమస్య
- యుక్త వయస్సు నుంచి మెనోపాజ్ దశ వరకు అందరికీ..
- సమస్యను గుర్తించి సరైన పరిష్కారం అందించాలి
- వైద్యులకు జాతీయ, అంతర్జాతీయ నిపుణుల సూచన
- కిమ్స్ ఆస్పత్రిలో ఒక్కరోజు సదస్సు
- కశ్మీర్ నుంచి కన్యాకుమారి వరకు వైద్యుల హాజరు



నవతెలంగాణ-సిటీబ్యూరో

పీసీఓఎస్, మెటబాలిక్ సిండ్రోమ్‌పై వైద్య రంగంలోని వారికి అవగాహన అవసరం అని యూనివర్సిటీ కాలేజ్ లండన్ హాస్పిటల్స్‌కు చెందిన ప్రొఫెసర్ గెరార్డ్ కాన్వే, డాక్టర్ ఎఫియా యాసిమ్ సూచించారు. మెటబాలిక్ సిండ్రోమ్ ఇన్ పీసీఓఎస్ అనే అంశంపై నగరంలోని కిమ్స్ ఆస్పత్రిలో ఆదివారం జరిగిన సదస్సులో వారు పాల్గొని మాట్లాడారు. పీసీఓఎస్ సొసైటీ ఆఫ్ ఇండియా, కిమ్స్ ఫెర్టిలిటీ సెంటర్ సంయుక్త ఆధ్వర్యంలో జరిగిన ఈ సదస్సుకు దేశం నలుమూలల నుంచి 400 మందికిపైగా వైద్యులు హాజరయ్యారు. ఈ సందర్భంగా సదస్సుకు కన్వీనర్‌గా వ్యవహరించిన సంతాన సాఫల్య నిపుణురాలు, కిమ్స్ ఫెర్టిలిటీ విభాగాధిపతి డాక్టర్ ఎస్.వైజయంతి మాట్లాడుతూ "మన దేశంలో దాదాపు 20 శాతం మహిళల్లో పీసీఓఎస్ సంబంధిత సమస్యలు ఉంటున్నాయి. ఇది యువతుల నుంచి గర్భం దాల్చే వయస్సు ఉన్న వారు, చివరకు మెనోపాజ్ దశలో ఉన్న వారికి సైతం ఉండొచ్చు. ఒక్కో వయస్సులో ఒక్కో తరహా సమస్యలు దీనివల్ల వస్తాయి. ఈ సమస్య ఉన్నవారికి గర్భం రావడం అనేది ఒక సవాలుతో కూడుకున్నది. మా దగ్గరికి వచ్చినప్పుడు ముందుగానే మెటబాలిక్ సమస్యలు ఉన్నాయో లేదో అనే విషయాన్ని ముందుగానే గుర్తిస్తాము. ముగ్గురిలో ఒకరికి ఈ సమస్యలు వస్తున్నాయని నివేదికలు చెబుతున్నాయి. పీసీఓఎస్‌లో ఉండే మెటబాలిక్ సిండ్రోమ్‌పై వైద్యనిపుణులు దృష్టిసారించాల్సిన అవసరం, అవగాహన పొందాల్సిన అవసరం ఉన్నాయి. పీసీఓఎస్ ఉన్న మహిళల్లో 70శాతం మందికి ఊబకాయం ఉంటోంది. వాళ్లు కనీసం 5-10శాతం బరువు తగ్గినా చాలా ప్రయోజనం ఉంటుంది. ఎవరైనా మహిళలు పీసీఓఎస్ లక్షణాలతో వస్తే, వారికి మధుమేహం, అధిక రక్తపోటు, కొలెస్ట్రాల్ (లిపిడ్ ప్రొఫైల్) కూడా పరీక్షించి, వారిలో మెటబాలిక్ సిండ్రోమ్ ఉందేమో కూడా చూడాలి. పీసీఓఎస్ ఉన్న ప్రతి ముగ్గురిలో ఒకరికి ఈ సమస్యలు ఉంటున్నాయి. అలా గుర్తించగలిగితే చాలావరకు సమస్యలు తగ్గిపోతాయి" అని తెలిపారు. పీసీఓఎస్ సొసైటీ ఆఫ్ ఇండియా వ్యవస్థాపక అధ్యక్షురాలు డాక్టర్ దురు షా మాట్లాడుతూ "పీసీఓఎస్ అనే సమస్య ఒకటి ఉంటుందన్న విషయాన్ని వైద్యరంగంలో ఉన్న ప్రతి ఒక్కరూ గుర్తించాలి. దాని లక్షణాలేంటో తెలుసుకోవాలి. దాన్ని ఎలా గుర్తించాలో అవగాహన పొందాలి. అది ఉంటే ఎలా నివారించాలి, అందుకు తరుణోపాయాలేంటో తెలియాలి. ప్రధానంగా జీవనశైలి మార్పులతోనే దీన్ని చాలావరకు నయం చేయొచ్చు. ఆహారపు అలవాట్లు మార్చడం, శరీర బరువు తగ్గడానికి కాస్త వ్యాయామం లాంటివాటితో ఇది నియంత్రణలోకి వస్తుంది. ఈ సమస్య గురించి దేశవ్యాప్తంగా ఉన్న వైద్యులకు అవగాహన కల్పించేందుకే పీసీఓఎస్ సొసైటీని ఏర్పాటు చేశాం" అని చెప్పారు. ఈ సదస్సులో ఇంకా, పీసీఓఎస్ సొసైటీ ఆఫ్ ఇండియా ఉపాధ్యక్షుడు, పద్మశ్రీ అవార్డు గ్రహీత డాక్టర్ శశాంక్ ఆర్.జోషి, సదస్సు కో-కన్వీనర్ డాక్టర్ కాంతి బన్సల్, కర్ణాటకకు చెందిన ప్రముఖ వైద్య నిపుణురాలు డాక్టర్ శోభనా పట్టేడ్, ప్రముఖ ఎండోక్రినాలజిస్టులు డాక్టర్ ప్రసూన్ దేవ్, డాక్టర్ హరికుమార్, డాక్టర్ స్మితా నల్లా, డాక్టర్ లీనతా జక్కిడి, డాక్టర్ కవితా శాఖమూరి, డాక్టర్ కిశోర్ బన్సే, సీనియర్ కార్డియాలజిస్టు డాక్టర్ దయాసాగర్ రావు, పలువురు న్యూట్రిషనిస్టులు పాల్గొని తమ తమ విభాగాల్లో పీసీఓఎస్ గుర్తింపు, నివారణ గురించి చెప్పారు.

దేశం నలుమూలల నుంచి వైద్యులు

జాతీయ స్థాయిలో పీసీఓఎస్‌పై తొలిసారి నిర్వహించిన ఈ సదస్సుకు కశ్మీర్ నుంచి సేలం వరకు, కోల్‌కతా నుంచి మహారాష్ట్ర, గుజరాత్, రాజస్థాన్, మధ్యప్రదేశ్, ఉత్తర్‌ప్రదేశ్, బిహార్, ఛత్తీస్‌గఢ్.. ఇలా అనేక రాష్ట్రాల నుంచి 150 మంది వైద్యులు హాజరయ్యారు. ఆంధ్రప్రదేశ్, తెలంగాణల నుంచి మరో 250 మంది.. మొత్తం 400 మంది వైద్య నిపుణులు పాల్గొని, వివిధ అంశాలపై తమ సందేహాలను నివత్తి చేసుకున్నారు.

టీబీ వ్యాధి నివారణపై అవగాహన ర్యాలీ



నవతెలంగాణ-అంబర్‌పేట

టీబీ (క్షయ) వ్యాధిని ప్రాథమిక దశలోనే గుర్తించి సరైన వైద్యం అందిస్తే తొందరగా నిరయత్రించవచ్చని హైకోర్టు మాజీ న్యాయమూర్తి, ఏపీ ట్రిబ్యునల్ కోర్టు మాజీ చైర్మన్ జస్టిస్ వామన్ రావు అన్నారు. తెలంగాణ సిటిజన్ కౌన్సిల్ ఆధ్వర్యంలో ఆదివారం బర్కత్‌పూరలో రాజా బహదూర్ వెంకట్రామరెడ్డి మహిళా కళాశాల ఎన్‌ఎస్‌ఎస్ విద్యార్థులు ప్రపంచ క్షయ వ్యాధి నివారణ దినోత్సవం సందర్భంగా అవగాహన ర్యాలీ నిర్వహించారు. భయంకరమైన అంటూ వ్యాధి క్షయ దేశంలో ప్రతి సెకనుకు ఒకరికి సోకుతుందని, ప్రతి రోజు దేశవ్యాప్తంగా 1000 మంది క్షయ వ్యాధితో మరణిస్తున్నారని ప్రపంచ ఆరోగ్య సంస్థ ప్రకటించిందన్నారు. స్వచ్ఛంద సేవా సంస్థలు, యువజన సంఘాలు, మహిళా సంఘాలు గ్రామీణ ప్రాంతాలలో నగరంలోని మురికివాడలలో క్షయ వ్యాధి పట్ల ప్రజలకు అవగాహన కల్పించి రోగ రహిత సమాజం కోరకు కృషి చేయాలని ఆయన పిలుపునిచ్చారు. కార్యక్రమంలో తెలంగాణ సిటిజన్ కౌన్సిల్ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ రాజ్నారాయణ ముదిరాజ్, డాక్టర్ బోయిని జగన్మోహన్, డాక్టర్ కటకం భాస్కర్ గుప్తా, డాక్టర్ రుమీల సీతారాం కుమార్, బత్తుల హేమంత్, ఎస్.నవ్య, వి.సంజన తదితరులు పాల్గొన్నారు.

హెూలీ పండగ ఇరు రాష్ట్ర ప్రజల జీవితాల్లో కొత్త వెలుగులు తేవాలి

- టీవైజేఏఫ్ రాష్ట్ర అధ్యక్షులు, సీనియర్ జర్నలిస్ట్, డాక్టర్ తనుగుల జితేందర్ రావు



నవతెలంగాణ-ముషీరాబాద్

హెూలీ పండగ భారతదేశ ప్రజలకు, ఇరు రాష్ట్ర తెలుగు ప్రజల జీవితాల్లో కొత్త వెలుగులు తేవాలని టీవైజేఏఫ్ రాష్ట్ర అధ్యక్షులు, సీనియర్ జర్నలిస్ట్, డాక్టర్ తనుగుల జితేందర్ రావు అన్నారు. తెలంగాణ యూత్, జర్నలిస్ట్, ఫెడరేషన్ యూనియన్ నాయకులకు, సభ్యులకు, సోదర, సోదరీమణులకు, ఆనంద భాయ్ గ్రూపు సభ్యులకు, టీజేఆర్ గ్రూప్ సభ్యులకు ఇతర గ్రూప్ సభ్యులకు హెూలీ పండగ శుభాకాంక్షలను ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షులు, సీనియర్ జర్నలిస్ట్ డాక్టర్ తనుగుల జితేందర్ రావు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నో రకాల రంగులతో చిన్న పెద్ద, ఆడా మగ అనే తేడా లేకుండా ప్రజలు ఎంతో ఆనందంగా జరుపుకునే హెూలీ పండుగ సందర్భంగా ప్రజలందరి జీవితాల్లో కొత్త వెలుగులు తెస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. రసాయనాలతో తయారు చేసే రంగులు వాడకుండా సహజ సిద్ధమైన రంగులు వాడి హెూలీ పండుగను జరుపుకోవాలని సూచించారు. ప్రస్తుత పరిస్థితుల్లో అంతర్జాలం విస్తరించడంతో ఇప్పటితరం వ్యవస్థ పండగల ప్రాముఖ్యాన్ని విస్మరిస్తూ రాబోయే తరాల వారికి పండగల గొప్పతనాన్ని వివరించాల్సిన అవసరం ఎంతో ఉందని తెలిపారు. భారతదేశ సంస్కృతిని ప్రపంచ దేశాలు ఎంతో గౌరవిస్తున్నాయనీ కొత్త పోకడలకు అలవాటు పడిన భారతీయులు మన సంస్కృతి సాంప్రదాయాలను మరుగున పడేసే దిశగా సాగుతున్నారన్నారు. ఇది వచ్చేతరాలకు శుభ సూచికం కాదన్నారు.

హైదరాబాద్ ఎంపీ అసదుద్దీన్ కారుపై భారీగా పెండింగ్ చలాన్లు



నవతెలంగాణ-ధూల్‌పేట్

హైదరాబాద్ ఎంపీ అసదుద్దీన్ వినియోగిస్తున్న కారుపై భారీగా పెండింగ్ చలాన్లు ఉన్నాయి. ఈ టీఎస్ 11 ఈవి 9922 నంబర్ కారుపై సుమారు రూ.10,485 చలాన్లు డిఫెండర్ వాహనంపై 2021 నుంచి ఇప్పటి వరకు ఉన్నాయి. అప్పటినుంచి ట్రాఫిక్ పోలీసులు రెండుసార్లు పెండింగ్ చలాన్లపై భారీ డిస్కౌంట్ అవకాశం కల్పించినా ఇవి చెల్లించలేదు. ఇందులో చాలా చలాన్లు ఓఆర్ఆర్‌పై ఓవర్ స్పీడుతో వెళ్లడంతోనే పడ్డట్లు సమాచారం.

ఎక్కువగా ఓఆర్ఆర్ పైనే..

నగరం శివార్లలోని ఓఆర్ఆర్ పై ఓవర్ స్పీడ్ డ్రైవింగ్ చాలన్లు ఎక్కువగా ఉన్నాయి. సోషల్ మీడియాలో చక్కర్లతో చూసి ప్రజా ప్రతినిధులు ఇలా ఓవర్ స్పీడ్‌గా వెళ్లితే సామాన్యుల పరిస్థితి ఏంటి అని ప్రజలు వాపోతున్నారు. ఇన్ని చాలన్లు ఉన్న పోలీసులు ఎందుకు పట్టించుకోవడం లేదని అంటున్నారు.

కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులను పర్మినెంట్ చేయాలి

- బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షులు, ఎంపీ ఆర్.కృష్ణయ్య



నవతెలంగాణ-ముషీరాబాద్

వివిధ ప్రభుత్వ శాఖలలో ముఖ్యంగా యూనివర్సిటీలలో విద్యాశాఖ, వైద్య, ఆరోగ్యశాఖ, వ్యవసాయ శాఖ, దేవాదాయ ధర్మదయ శాఖ, మున్సిపల్ కార్పొరేషన్లు, బీసీ, ఎస్సీ, ఎస్టీ సంక్షేమ శాఖలలో పనిచేస్తున్న ఒక లక్ష 50 వేలమంది కాంట్రాక్టు ఔట్ సోర్సింగ్ ఉద్యోగులను పర్మినెంట్ చేయాలని రాజ్యసభ సభ్యులు, జాతీయ బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షులు ఆర్.కృష్ణయ్య డిమాండ్ చేశారు. ఆదివారం విద్యానగర్ బీసీ భవన్‌లో కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగుల సమావేశం జరిగింది. ఈ సమావేశానికి ఎంపీ ఆర్ కృష్ణయ్య హాజరై మాట్లాడుతూ గత రెండు నెలలుగా యూనివర్సిటీ మున్సిపల్, వైద్యఆరోగ్యశాఖలోని ఏఎన్ఎం ఉద్యోగులు, మత్స్యశాఖ, విద్యాశాఖలోని సర్వ శిక్ష అభియాన్ ఉద్యోగులు పెద్ద ఎత్తులో ఆందోళన చేస్తున్నారు. వీరి ఉద్యమాలకు ముఖ్యమంత్రి స్పందించాలని కోరారు. తాత్కాలిక ఉద్యోగులకు కూడా రెగ్యులర్ ఉద్యోగులకు ఉండే అన్నీ అర్హతలు యున్నవి. అన్నీ అంశాలను పరిగణలోకి తీసుకొని వీరిని పర్మినెంట్ చేయాలని విజ్ఞప్తి చేశారు. తాత్కాలిక ఉద్యోగుల ఉద్యోగాలకు రెగ్యులర్ ఉద్యోగాలకు ఉండే విధంగా అన్ని అర్హతలు ఉంటే పర్మనెంట్ చేయాలని సుప్రీంకోర్టు రాజస్థాన్ కేసులో తీర్పు చెప్పింది. సమాన పనికి సమాన వేతనం చెల్లించాలని కూడా సుప్రీం కోర్టు తీర్పు చెప్పింది. ఈ తీర్పును అమలు చేయాలని కోరారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి చొరవ తీసుకోవాలని ఒక విధాన నిర్ణయం తీసుకోవాలని కోరారు.ఈ సమావేశానికి రమేష్, , గుజ్జ కృష్ణ, భరత్ నీల వెంకటేష్, పి. సుధాకర్ , వెంకటేష్, నందగోపాల్, జేఆర్ రామ్మోహన్ జి. ఉదయ్ నేత, మోదీ రాందేవ్, నిఖిల్, వంశీ, బురన్న, శంకరయ్య, శివ ముదిరాజు, మణిమ్మ, మంగమ్మ, జ్యోతి, వాణి తదితరులు పాల్గొన్నారు.

పార్లమెంట్ ఎన్నికల్లో ఏకం సనాతన్ భారత్ దళ్ పోటీ



- ఏకం సనాతన్ భారత్ దళ్ పార్టీ

నవతెలంగాణ-హిమాయత్ నగర్

రాబోయే పార్లమెంట్ ఎన్నికల్లో ఏకం సనాతన్ భారత్ దళ్ పార్టీ తెలంగాణలోని అన్ని స్థానాలకు పోటీ చేస్తున్నట్లు ఆ పార్టీ రాష్ట్ర అధ్యక్షులు రాజీవ్ షా, ప్రధాన కార్యదర్శి ఎస్.కె.చతుర్వేదిలు తెలిపారు. ఈ మేరకు ఆదివారం బషీర్‌బాగ్ ప్రెస్ క్లబ్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో పార్టీ రూపొందించిన మ్యానిఫెస్టోను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తమ పార్టీ సనాతన, హిందూ స్నేహపూర్వక అభ్యర్థులకు తెలంగాణలో స్వాగతం పలుకుతుందని, రాష్ట్రంలో సనాతన హిందూ అభ్యర్థుల రాకతో తమ పార్టీ మరింత బలపడిందని పేర్కొన్నారు. ఏకం సనాతన్ భారత్ దళ్ నుండి పోటీ చేస్తున్న అభ్యర్థులను తెలంగాణ ప్రజలు ఆశీర్వదించి, భారీ మెజార్టీతో గెలిపించి పార్లమెంటుకు పంపాలని కోరారు.తమ పార్టీకి ఎన్నికల కమిషన్ పిల్లనగ్రోవి గుర్తును కేటాయించిందన్నారు. ఈ గుర్తుపైనే దేశవ్యాప్తంగా ఏకం సనాతన్ భరత్ అభ్యర్థులు పోటీ చేస్తున్నారని వారు పేర్కొన్నారు.ఈ సమావేశంలో పార్టీ నాయకులు వినయ్ శర్మ, భగత్ సింగ్, బాలకృష్ణ భట్, శాంతా కుమారి తదితరులు పాల్గొన్నారు.

మూఢనమ్మకాన్ని నిర్మూలించి శాస్త్రీయ విజ్ఞానం వైపు విద్యార్థులు ప్రయాణించాలి

- ప్రముఖ జ్యోతిష్య శాస్త్రవేత్త జాల సోమనాథ్ శాస్త్రీ
- జ్యోతిష్య శాస్త్ర విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం



నవతెలంగాణ-ముషీరాబాద్

జ్యోతిష్యం అనేది మూఢనమ్మకం కాదని సైన్స్‌తో కూడిన విజ్ఞానమని ప్రముఖ జ్యోతిష్య శాస్త్రవేత్త జాల సోమనాథ శాస్త్రీ అన్నారు. ఆదివారం సాయంత్రం బాగ్‌లింగంపల్లి సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో ఆత్మీయ సమ్మేళనం జరిగింది. తంగినపల్లి నరసింహ చారి కల్పన కృష్ణప్రియ ఆధ్వర్యంలో జరిగిన ఈ సమ్మేళనానికి పలువురు జ్యోతిష్య శాస్త్ర విద్యార్థులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా సోమనాథ శాస్త్రీ మాట్లాడుతూ విద్యార్థులతో దాగివున్న విజ్ఞానాన్ని వెలికి తీయడానికి జ్యోతిష్య శాస్త్రం దోహదపడుతుందన్నారు. జ్యోతిష్య శాస్త్రం మూఢనమ్మకాలను ప్రోత్సహించదని సైన్స్‌తో కూడిన విజ్ఞానాన్ని విద్యార్థులకు అందిస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో ప్రముఖ జ్యోతిష్య శాస్త్రవేత్తలు డాక్టర్ ప్రతిభ, డాక్టర్ అనురాధ, డాక్టర్ విజయలక్ష్మి, డాక్టర్ తంగిరాల శ్రీదేవి, డాక్టర్ వరలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

కిషన్ రెడ్డితోనే సికింద్రాబాద్ అభివృద్ధి

- బీజేపీ నేత కేశబోయిన శ్రీధర్



నవతెలంగాణ-అంబర్‌పేట

కిషన్ రెడ్డిని మళ్లీ గెలిపించుకోని సికింద్రాబాద్ పార్ల మెంట్ అభివృద్ధికి మరింత పాటుపడాలని ఓబీసీ మోర్చా హైదరాబాద్ సెంట్రల్ జిల్లా ప్రధాన కార్యదర్శి కేశబోయిన శ్రీధర్ పిలుపునిచ్చారు. కేంద్రమంత్రి కిషన్ రెడ్డి చొరవతో ఇప్పటికే సికింద్రాబాద్ రైల్వే స్టేషన్ సుందరీకరణ కోసం కోట్ల రూపాయలను కేంద్ర ప్రభుత్వం విడుదల చేసిందని ఆయన గుర్తు చేశారు. సికింద్రాబాద్ అభివృద్ధి కేవలం బీజేపీ ద్వారానే సాధ్యం అవుతుందని కేశబోయిన శ్రీధర్ అన్నారు. అభివృద్ధిని కోరుకునే ప్రజలంతా బీజేపీని ఆశీర్వదించాలని కేశబో యిన శ్రీధర్ కోరారు. ఉస్మానియా విశ్వవిద్యా లయంలో డిజిటల్ లైటింగ్ ను, సంజీవయ్య పార్క్ లో డిజిటల్ లైటింగ్ ను ఏర్పాటు చేశారని ఆయన తెలిపారు. నియోజకవర్గాన్ని అన్ని రంగాలలో అభివృద్ధి చేసిన ఘనత కిషన్ రెడ్డి సొంతమని నిరంతరం ప్రజల మధ్యనే ఉండే నేత కిషన్ రెడ్డి అని ఆయన కొనియాడారు.

ఓదెల నూతన కోర్టు ఏర్పాటుకు జీవో జారీ

- హైకోర్టు న్యాయవాది పొలాస శంకర్



నవతెలంగాణ-హిమాయత్ నగర్

ఓదెల మండలానికి నూతన కోర్టు ఏర్పాటుకు రాష్ట్ర ప్రభుత్వం చర్యలు ప్రారంభించిందని, అందుకు జీవో జారీ చేసినట్లు హైకోర్టు న్యాయవాది పొలాస శంకర్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఓదెలలో జూనియర్ సివిల్ జడ్జి కోర్టు ఏర్పాటు చేయాలని గత కొంత కాలంగా రాష్ట్ర ప్రభుత్వం, న్యాయ శాఖ మంత్రి, హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి, రిజిస్టర్ జనరల్, న్యాయ శాఖ కార్యదర్శిలకు అనేక పర్యాయాలు వినతి పత్రాలు అందజేసి, ఓదెల ప్రజల ఇబ్బందులను వారికి విన్నవించినట్లు ఆయన వివరించారు. ఓదెలలో కోర్టు ఏర్పాటుకు సానుకూలంగా స్పందించిన గత న్యాయ శాఖ మంత్రి కోర్టు ఏర్పాటుకు వెంటనే చర్యలు చేపట్టాలని న్యాయ శాఖ కార్యదర్శికి సిఫారసు చేసినట్లు ఆయన పేర్కొన్నారు. ఓదెలలో కోర్టు ఏర్పాటు వల్ల కేసులు సత్వరమే పరిష్కారం జరిగి ప్రజలకు ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని ఆయన చెప్పారు.



సికింద్రాబాద్ పార్లమెంట్ అభ్యర్థి పద్మారావు గౌడ్‌ని వారి నివాసంలో కలిసి శుభాకాంక్షలు తెలియజేస్తున్న బీఆర్ఎస్ యువనాయకుడు ముఠా జయసింహ ముషీరాబాద్ నియోజకవర్గ బీఆర్ఎస్ కార్యకర్తలు, మాజీ హెూం శాఖ మంత్రివర్యులు మహమూద్ అలీ, ఎమ్మెల్యేలు కాలేరు వెంకటేష్, మాగంటి గోపీనాథ్, తదితరులు

నవతెలంగాణ-ముషీరాబాద్

జ్యోతిష్య దైవజ్ఞరత్న జ్యోతిష్య బ్రహ్మజ్ఞాని గురు మాతశ్రీ దివ్య భవాని నీ కలిసి ఆమెను సత్కరించిన ప్రజా ఏక్తా పార్టీ జాతీయ అధ్యక్షులు బోనాల శ్రీనివాస్ అనంతరం హైదరాబాద్ పార్లమెంట్ ఎన్నికలపై చర్చించినట్లు తెలిపారు.



నవతెలంగాణ-సుల్తాన్‌బజార్

ఇవ్వడంలో ఆనందముంది



13 ఏండ్ల వయసులోనే టైప్ 1 డయాబెటిస్‌తో బాధపడే పిల్లల కోసం 'ప్రాజెక్ట్ సూర్య'ను స్థాపించింది. దీని ఆధ్వర్యంలో వేల మంది పిల్లలకు డయాబెటిస్‌పై అవగాహన కల్పించడంతో పాటు వారికి అవసరమైన సహాయ సహకారాలు అందించేందుకు ముందుకొచ్చింది. ఆమె చేసిన ఈ కృషికి అంతర్జాతీయ ప్రశంసలు సైతం అందుకుంటోంది. ఆమే కర్ణాటకాకు చెందిన **దివా ఉత్కర్ష**. అంత చిన్న వయసులో ఇంత పెద్ద ఆశయాన్ని భుజానికెత్తుకోవల్సిన అవసరం ఆమెకు ఎందుకు వచ్చిందో... ఆ ప్రాజెక్ట్ విశేషాలేంటో ఆమె ద్వారానే తెలుసుకుందాం...



ఈ ప్రాజెక్ట్ ప్రారంభించాలనే ఆలోచన మీకు ఎలా వచ్చింది?

కరోనా సమయంలో అంటే 2020లో నేనూ, నా తొమ్మిదేండ్ల తమ్ముడు సూర్య ఇంట్లోనే ఉండి చదువుకునే వాళ్ళం. అప్పుడే సూర్యకు టైప్ 1 డయాబిటిస్ ఉందని తెలిసింది. ఆ వ్యాధి పెద్ద వాళ్ళకు కదా వచ్చేది చిన్న పిల్లలకు ఎందుకు వచ్చిందనా ప్రశ్న నాలో మొదలయింది. మా అమ్మానాన్న ఇద్దరూ డాక్టర్లే. అయినా తమ్ముడి పరిస్థితి చూసి కంగారు పడ్డారు. చిన్నవాడైన తమ్ముడి పరిస్థితి మరీ దారుణం. ఫుడ్ కంట్రోల్ చేసుకోవాల్సి వచ్చింది. తనకు ఎంత చెప్పినా అర్థమయ్యే వయసు కాదు. అమ్మా, నాన్న చాలా జాగ్రత్తగా సూర్యకు ట్రైనింగ్ ఇచ్చారు. మెల్లగా తన జీవన శైలిని మార్చుకున్నాడు. అప్పట్లో తమ్ముడితో పాటు నేనూ ఆస్పత్రికి వెళుతుండేదాన్ని. ఈ వ్యాధి గురించి డాక్టర్లను ఎన్నో ప్రశ్నలు అడిగేదాన్ని. దీని గురించి ఇంకా తెలుసుకోవాలని పుస్తకాలు చదవడం మొదలుపెట్టాను.

ఈ అధ్యయనంలో మీరు గుర్తించిన అంశాలు..?

డయాబెటిస్ మానసికంగా చాలా ఇబ్బంది కలిగిస్తుందని నా అధ్యయనంలో తెలుసుకున్నాను. కొన్ని నివేదికల ప్రకారం మన దేశంలో టైప్ 1 డయాబెటిస్ బారిన పడిన పిల్లలు సుమారు 96 వేల మంది ఉన్నారని తెలుసుకుని ఆశ్చర్యపోయాను. పైగా ఈ సంఖ్య ప్రతి ఏడాది పెరిగిపోతూ ఉంది. వాళ్ళు జీవితాంతం ఇన్సులిన్‌తో పాటు ఇతర వైద్యం తీసుకోవల్సిన అవసరం వుంటుంది. జీవించినన్ని రోజులు ఫుడ్ కంట్రోల్‌లో ఉంచుకోవాలి. ఆర్థికంగా కాస్త ఉన్నవారైతే ఇబ్బంది లేదు కానీ నిరుపేద పిల్లలకు ఈ వ్యాధి వస్తే ఏంటి పరిస్థితి అనే సందేహం వచ్చింది. అందుకే నిస్సహాయులైన అలాంటి వారికి నా వంతుగా సాయం చేయాలనుకున్నాను. అదే 2021లో ప్రాజెక్ట్ సూర్యగా అవతరించింది.

మీరు ఎదుర్కొన్న ప్రధాన సవాళ్లు?

ప్రధానమైనది ఏమిటంటే నా వయసు. మాకు అవసరమైన సహకారం కోసం కొన్ని సంస్థల వద్దకు వెళ్ళినప్పుడు చిన్న పిల్లలం కాబట్టి మా సామర్థ్యాన్ని తక్కువగా అంచనా వేసేవారు. దాంతో ముందు వారి వద్ద మా సామర్థ్యం ఏమిటో నిరూపించుకోవల్సి వచ్చేది. కొన్నిసార్లు ఎదురుదెబ్బలు, వైఫల్యాలను కూడా ఎదుర్కొన్నాం. కానీ ఈ అనుభవాల నుండి చాలా నేర్చుకుంటున్నాం. అలాగే గత ఏడాది నేను పదో తరగతి పూర్తి చేశాను. అప్పుడు చదువు, ప్రాజెక్ట్ పనులు సమన్వయం చేసుకోవడం చాలా కష్టంగా ఉండేది. అయినా మా అమ్మానాన్న, ఫ్రెండ్స్ నాకెంతో సపోర్ట్ చేశారు. 'టచ్, మూవ్ అండ్ ఇన్స్పైర్' అనేది మా అమ్మ నాకు నేర్పింది.


ఈ ప్రాజెక్ట్ లక్ష్యం ఏమిటీ..?

డయాబెటిస్‌కు గురైన పిల్లలకు, వారి కుటుంబాలకు ఆ వ్యాధి పట్ల అవగాహన కల్పించడం, అవసరమైన సహాయం అందించడం మా లక్ష్యం. దీని కోసం నా కుటుంబంతో పాటు స్నేహితులు, బంధువుల సాయం తీసుకున్నాను. డయాబెటిస్ వచ్చిన పిల్లల ఇండ్లకు వెళ్ళి అవసరమైన జాగ్రత్తలు చెబుదాం. సదస్సులు ఏర్పాటు చేసి వారిని ఆహ్వానిస్తాం. వైద్యులు, డైటీషియన్లతో సూచనలు ఇప్పిస్తాం. అలాగే దీనివల్ల మానసిక సమస్యలు ఎదుర్కొంటున్న వారికి కూడా అవసరమైన వైద్య సహాయం అందిస్తున్నాం. దీని కోసం అవసరమైన నిధుల కోసం క్రౌడ్ ఫండింగ్ చేస్తుంటాం. అలాగే వివిధ కార్యక్రమాలు ఏర్పాటు చేసి నిధులు సేకరిస్తున్నాం. ఇన్సులిన్, గ్లూకోజ్ స్ట్రిప్స్, సిరెంజిలు కూడా చాలా మంది మాకు విరాళంగా ఇస్తుంటారు.

అంతర్జాతీయ అవార్డులు సైతం అందుకున్నట్టున్నారు..?

అవును, ఇప్పుడు మా ప్రాజెక్ట్‌ను మన దేశంలోనే కాక విదేశాలకు చెందిన ప్రముఖులు కూడా ఎంతో మెచ్చుకుంటున్నారు. 2023 జూలైలో 'డయానా అవార్డు' అందుకున్నాను. ఈ అవార్డు నా బాధ్యతను మరింత పెంచింది. గత నవంబర్‌లో న్యూయార్క్‌లోని ఐక్యరాజ్యసమితి కేంద్ర కార్యాలయంలో జరిగిన '1ఎం1బి - యాక్టివ్ యూత్ సమ్మిట్'లో నా ప్రాజెక్ట్ గురించి వివరించే అవకాశం వచ్చింది. ఇప్పుడే ప్రాజెక్ట్ సూర్యను దేశమంతటా విస్తరింపజేసేందుకు కృషి చేస్తున్నాను.





ఈ ప్రయాణంలో మీకు ఆనందాన్ని ఇచ్చిన అంశాలు ఏమిటి?

మేము నిర్వహించే ప్రతి సెషన్‌కు పిల్లల నుండి మాకు విపరీతమైన స్పందనలు వస్తాయి. ఇది నాకు కన్నీళ్లు తెప్పిస్తుంది. 'అక్కా, నేను నీలా మారాలనుకుంటున్నాను' ఇలాంటి మాటలు ఈ పిల్లలకు పెద్ద కలలు కనే ఆత్మవిశ్వాసాన్ని అందించడం నా కర్తవ్యమని నాకు గుర్తు చేస్తాయి. కొన్నిసార్లు వందలాది మంది పిల్లలు మా వద్దకు వస్తారు. నన్ను ఆప్యాయంగా కౌగిలించుకొని హై ఫైవ్‌లు ఇస్తుంటారు. అప్పుడు మేము పొందే ఆనందానికి అవధులు ఉండవు. వారు చాలా ఆశతో మా వద్దకు వస్తారు. వారి ఆశను సజీవంగా ఉంచడం, వారు అభివృద్ధి చెందడానికి అవసరమైన చిన్నపాటి సహాయం చేయడం నాకు గొప్ప ఆనందాన్ని ఇస్తుంది. మారుమూల గ్రామాల నుండి వచ్చిన ఈ పిల్లలు అనేక ప్రాణాంతక సవాళ్లను అధిగమిస్తూ నాలో స్ఫూర్తినింపుతున్నారు.

మిమ్మల్ని కొనసాగించేలా చేస్తున్నది ఏమిటి?

నా తమ్ముడు సూర్య ప్రయాణం స్ఫూర్తితో ప్రాజెక్ట్ సూర్య ప్రారంభించాను. అతనే నా అతిపెద్ద ప్రేరణ. ఈ పిల్లల ముఖాల్లో చిరునవ్వు, వారి కళ్ళు వారి తల్లిదండ్రుల హృదయపూర్వక కృతజ్ఞతతో పాటు ఆనందంతో మెరుస్తూ ఉండటం నన్ను కొనసాగించేలా చేస్తుంది. వారు తమను తాము విశ్వసించడాన్ని చూడటం కంటే మరేదీ నాకు ఆనందాన్ని ఇవ్వదు. ఉత్సాహభరితమైన నా బృందం సభ్యులు, నిత్యం నాకు అండగా నిలబడుతున్న నా తల్లిదండ్రులు నన్ను సానుకూల ఆలోచనల వైపు తీసుకెళుతున్నారు. ఇదే నన్ను కొనసాగించేలా చేస్తుంది.

మీలాంటి యువతకు మీరిచ్చే సందేశం?

మీరు ప్రపంచంలో చూడాలనుకుంటున్న మార్పుగా ఉండండి. చిన్నదైనా, పెద్దదైనా మీకు ఇష్టమైన విషయాల వైపు ఈరోజే ఒక అడుగు వేయండి. ఇవ్వడం వల్ల మీరు పొందే ఆనందం అసమానమైనది. మంచిని నమ్మండి, మానవత్వాన్ని సజీవంగా ఉంచండి.

- సలీమ.

రంగుల హోలీలో జర జాగ్రత్త...

రంగుల పండుగ హోలీని ఎంతో ఉత్సాహంగా.. ఉల్లాసంగా జరుపుకుంటాం. అంతా రంగులు, రంగుల నీళ్ల చల్లుకుంటూ ఎంజాయ్ చేస్తారు. ఈ సందర్భంలో జుట్టు, చర్మాన్ని జాగ్రత్తగా చూసుకోవడం కూడా చాలా ముఖ్యం. మార్కెట్‌లోని అసహజ రంగులు చర్మానికి హాని కలిగించడమే కాకుండా కండ్లను కూడా దెబ్బతీస్తాయి. హోలీ అడే సందర్భంలో అనుసరించాల్సిన కొన్ని సూచనలు, సలహాలను నిపుణులు అందిస్తున్నారు. వాటి గురించి తెలుసుకుందాం..

ప్రస్తుతం మార్కెట్లో సైతం సేంద్రీయ, సహజ రంగులు అందుబాటులోకి వచ్చాయి. వాటినే కొనుక్కోవాలి. రసాయనాలతో నిండిన రంగులను వాడకపోవటమే మంచిది. ఎందుకంటే వాటి వల్ల చర్మం, కళ్ళు, జుట్టుకు హాని కలుగుతుంది. గోరింటాకులతో ఆకుపచ్చని రంగు ద్రావణాన్ని, బీట్ రూట్‌తో గులాబి రంగు ద్రావణాన్ని తయారు చేసుకోవచ్చు. పసుపు కొమ్ములను దంచి నీళ్లలో



నానబెట్టి పసుపు రంగు వాటర్‌ను ఇలా చెట్ల ఆకులు, పూలతోనే ఇంట్లోనే సహజంగా రంగుల ద్రావణాలు తయారు చేసుకోవటం మంచిది.

హోలీ ఆడే ముందు మీ శరీర చర్మానికి, వెంట్రుకలకు నూనె రాసుకోవటం మంచిది. ఎవరైనా రసాయనాలతో నిండిన రంగులను ఉపయోగిస్తే, ఆ నూనె మీ చర్మానికి రక్షణ పొరలా పనిచేస్తుంది. నూనె జుట్టు , చర్మంపై జిడ్డుగల రక్షణ పొరను సృష్టిస్తుంది. ఈ పొర జుట్టు, మన చర్మం యొక్క ఫోలికల్స్‌లో రంగులు చొరబడకుండా అడ్డంకిగా పనిచేస్తాయి. ఆయిల్ ఆధారిత లేయర్‌ను హోలీ వేడుకల తర్వాత రంగును సులభంగా కడుక్కోవడానికి వీలుంటుంది. మీ చర్మాన్ని కొబ్బరి, ఆలివ్, బాదం, ఇతర నూనెల నుండి ఎంచుకోవటం మంచిది. ఈ నూనెలు మీ చర్మాన్ని రక్షించడమే కాకుండా పోషణ , హైడ్రేట్‌గా పని చేస్తాయి.

హోలీ తర్వాత, సహజ సబ్బులతో స్నానం చేయటం మంచిది. ఎందుకంటే హెర్బల్ సబ్బులు రంగును సున్నితంగా తొలగించడమే కాకుండా చర్మానికి పోషణను అందిస్తాయి. గంధం, పసుపుతో చేసిన సబ్బులు, యాక్టివేటెడ్ చార్‌కోల్, తేనె , బాదం నూనెతో చేసిన సబ్బులు హోలీ తర్వాత ఉపయోగించడానికి ఉత్తమమైన సబ్బులు. అవి మీ చర్మాన్ని పునరుజ్జీవింపజేస్తాయి.

కళ్లల్లోకి రంగు వెళ్లకుండా ఏదైనా అద్దాలు ధరించాలి. లేనిపక్షంలో కళ్లల్లోకి రంగు వెళ్లి కంటి చూపుపై సైతం ప్రభావం చూపే అవకాశాలు లేకపోలేదు. చర్మ సంబంధమైన చికిత్స చేయించుకున్న వారు రంగుల జోలికి వెళ్లకూడదు. దానివల్ల చర్మంపై ప్రతికూల ప్రభావం కనిపించవచ్చు. కొన్నిసార్లు దీర్ఘకాలిక సమస్యల బారిన పడతారు.

ముందుగా ఇది సమ్మర్ కాబట్టి సెలబ్రేషన్‌ను ఉదయం లేదా సాయంత్రం పూటల్లో జరుపుకుంటే మంచిది. ఒక పక్క ఎండ, మరో పక్క రంగుల దెబ్బకు చర్మం మరింత ఎక్కువ పాడవుతుంది. ఎండకు డీహైడ్రేషన్ కూడా అవ్వొచ్చు. ■

31న ఇండియా ఫోరం మెగా ర్యాలీ

నవతెలంగాణ-న్యూఢిల్లీ బ్యూరో

లోక్‌సభ ఎన్నికలకు ముందు ప్రతిపక్షాల ఐక్యత, బలం బలోపేతం లక్ష్యంతో ఇండియా ఫోరం 31న ఢిల్లీలోని రాంలీలా మైదాన్‌లో 'మహా ర్యాలీ' నిర్వహించనుంది. ప్రతిపక్షాలపై కేంద్రం దాడికి వ్యతిరేకంగా, కేజ్రీవాల్‌కు మద్దతుగా ఈ ర్యాలీలో ఇండియా ఫోరం జాతీయ నేతలు పాల్గొన్నారు. ఈ మేరకు ఆదివారం నాడిక్కడ ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆప్ మంత్రులు గోపాల్ రాయ్, అతిషి, సౌరభ్ భరద్వాజ్, ఢిల్లీ కాంగ్రెస్ చీఫ్ అరవిందర్ సింగ్ లవ్లీ, సీపీఐ(ఎం) ఢిల్లీ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు రాజీవ్ కున్వార్ మాట్లాడారు. తొలుత ఢిల్లీ మంత్రి గోపాల్ రాయ్ మాట్లాడుతూ బీజేపీ నియంతృత్వ ధోరణితో వ్యవహరిస్తోందని, 31 ఉదయం 10 గంటలకు జరిపే ర్యాలీలో పాల్గొనాలని దేశ ప్రజలకు విజ్ఞప్తి చేశారు. ప్రధాని మోడీ కేంద్ర దర్యాప్తు సంస్థలను దుర్వినియోగం చేస్తున్నారని విమర్శించారు. కేజ్రీవాల్‌ను అరెస్ట్ చేసిన తీరును దేశ వ్యాప్తంగా రాజ్యాంగాన్ని ప్రేమించే, గౌరవించే వారందరూ వ్యతిరేకిస్తున్నారు. ఇది కేవలం కేజ్రీవాల్ గురించి మాత్రమే కాదు. మొత్తం ప్రతిపక్షాన్ని తుడిచిపెట్టడానికి మోడీ కేంద్ర ఏజెన్సీలను దుర్వినియోగం చేస్తున్నారు. ఎమ్మెల్యేలను కొనుగోలు చేస్తున్నారు. అమ్ముడుపోవడానికి, తలవంచడానికి సిద్ధంగా లేని వారిపై కేసులు నమోదు చేసి.. జైళ్లో వేస్తున్నారు. ఈ నియంతృత్వానికి వ్యతిరేకంగా పోరాటాన్ని బలోపేతం చేయడానికి, విస్తరించడానికి రాంలీలా మైదాన్‌లో ర్యాలీ నిర్వహించనున్నాం. ఇది ఇండియా ఫోరం మహా ర్యాలీ అవుతుంది. ఢిల్లీ ప్రజలే కాదు దేశ ప్రజలందరూ.. రాజ్యాంగాన్ని, ప్రజాస్వామ్యాన్ని విశ్వసించే వారు రాంలీలా మైదానానికి రావాలని విన్నవిస్తున్నాం"అని అన్నారు.

ప్రజాస్వామ్యాన్ని కాపాడేందుకే ర్యాలీ: అతిషి

'మహా ర్యాలీ' కేజ్రీవాల్‌ను రక్షించడానికి కాదు, ప్రజాస్వామ్యాన్ని రక్షించడానికి అని ఢిల్లీ మంత్రి అతిషి అన్నారు. "ఇండియా ఫోరం 'మహా ర్యాలీ' అరవింద్ కేజ్రీవాల్‌ను రక్షించడానికి కాదు, ప్రజాస్వామ్యాన్ని రక్షించడానికి. ప్రతిపక్షంపై బీజేపీ ఏకపక్ష దాడులు చేస్తోంది" అని ఆమె విమర్శించారు. 'దేశంలో ప్రజాస్వామ్యం అపాయంలో ఉంది. ప్రజాస్వామ్యాన్ని కాపాడాల్సిన అవసరం ఉంది. నియంతృత్వాన్ని పారదోలాల్సిన సమయం వచ్చింది. ఢిల్లీ ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్‌ను అక్రమంగా అరెస్ట్ చేశారు. భారత రాజ్యాంగాన్ని, ప్రజాస్వామ్యాన్ని గౌరవించి, అభిమానించే ప్రతి ఒక్కరిని వేధిస్తున్నారు. వ్యవస్థలను ప్రధాని మోడీ తప్పుదోవ పట్టిస్తున్నారు. ప్రతిపక్ష నేతలపై తప్పుడు కేసులు పెట్టిస్తున్నారు' అని మండిపడ్డారు.31వ తేదీన చేపట్టే మహా ర్యాలీ రాజకీయాలకు అతీతం అని ఢిల్లీ కాంగ్రెస్ అధ్యక్షుడు అరవిందర్ సింగ్ లవ్లీ స్పష్టం చేశారు. ఇది ప్రజాస్వామ్యమా? అని ప్రశ్నించారు. ఎన్నికైన ముఖ్యమంత్రులను అరెస్టు చేస్తున్నారని, రాజకీయ పార్టీ ఖాతాలను స్వాధీనం చేసుకుంటున్నారని దుయ్యబట్టారు. ప్రజాస్వామ్యాన్ని పరిరక్షించేందుకు ర్యాలీ చేపడుతున్నామని వివరించారు. కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా గొంతు వినిపిస్తామని అన్నారు. 31న 'ఇండియా' బ్లాక్‌కు చెందిన మిత్రపక్షాల నేతలు ఏకతాటిపైకి వస్తారని సీపీఐ(ఎం) ఢిల్లీ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు రాజీవ్ కున్వార్ తెలిపారు. ప్రజాస్వామ్యంపై దాడులను తాము సహించబోమని అన్నారు. దీనిపై పోరాడుతామని స్పష్టం చేశారు.

జైలు నుంచే కేజ్రీవాల్ పాలన

(మొదటిపేజీ తరువాయి)

నుంచి క్రేజీవాల్ విడుదల చేసిన తొలి ఉత్తర్వులు ఇవే. శనివారం అర్ధరాత్రి తరువాత ఈ ఆదేశాలు తమకు అందినట్లు ఆదివారం విలేకరుల సమావేశంలో మంత్రి అతిషి తెలిపారు. జైలులో ఉన్నప్పటికీ కేజ్రీవాల్ ఢిల్లీ ప్రజలపై శ్రద్ధ చూపడం తనకు కన్నీళ్లు తెప్పించిందని ఆమె చెప్పారు. వేసవి కాలం సమీపిస్తున్న నేపథ్యంలో నీటి సరఫరాను పటిష్టం చేయాలని, నీటి కొరత ఎదుర్కొంటున్న ప్రాంతాలకు తగినన్ని నీటి ట్యాంకర్లను తరలించాలని ముఖ్యమంత్రి కేజ్రీవాల్ ఆదేశించినట్లు మంత్రి తెలిపారు. ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి, ఇతర అధికారులకు తగిన ఆదేశాలు జారీ చేయాలని కేజ్రీవాల్ నిర్దేశించారని చెప్పారు. అవసరమైతే లెఫ్టినెంట్ గవర్నర్ వికె సక్సేనా సహాయాన్ని కూడా తీసుకోవాలని ముఖ్యమంత్రి సూచించారని, లెఫ్టినెంట్ గవర్నర్ అన్ని విధాలా సహాయ సహకారాలు అందిస్తారని ఆశిస్తున్నట్లు మంత్రి అతిషి తెలిపారు.

లష్కర్‌లో పోరు రసవత్తరం..!

(మొదటిపేజీ తరువాయి)

గెలిచారు. వారిలో ఖైరతాబాద్ నుంచి గెలిచిన దానం నాగేందర్ ఇప్పుడు సికింద్రాబాద్ లోక్‌సభకు కాంగ్రెస్ నుంచి పోటీ చేస్తున్నారు. నగర పరిధిలో అంతా బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు ఉండటం ఈ ఎన్నికల్లో పద్మారావుకు కలిసొచ్చే అంశమే. కానీ ప్రస్తుత ఎమ్మెల్యేలు ఏ మేరకు పద్మారావుకు సహకరిస్తారోనని అప్పుడే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఒకవైపు సీఎం రేవంత్ ఆపరేషన్ ఆకర్ష్ నేపథ్యంలో ఎన్నికల నాటికి బీఆర్ఎస్ ఎమ్మెల్యేల్లో ఎవరూ ఉంటారో.. ఎవరు ఉండరో.. తెలియని అయోమయ పరిస్థితి నెలకొని ఉంది. మొత్తానికి ఒకటి రెండు రోజుల్లో సికింద్రాబాద్ జనరల్ బాడీ మీటింగ్ పెట్టుకొని ప్రజల్లోకి వెళ్తామని ఆదివారం పద్మారావు గౌడ్ నివాసంలో గ్రేటర్ మంత్రులు, ఎమ్మెల్యేలతో జరిగిన సమావేశంలో నిర్ణయం తీసుకున్నారు.

బస్తీ బాటతో ప్రజల్లోకి బీజేపీ

అన్ని పార్టీల కంటే ముందుగానే సికింద్రాబాద్ బీజేపీ అభ్యర్థిగా కిషన్ రెడ్డి పేరు ఆ పార్టీ ప్రకటించింది. దీంతో ఆయన పార్టీ అగ్రనేతల ఆదేశాలతో సభలు, సమావేశాలతో సంబంధం లేకుండా బస్తీల్లో పర్యటనలు చేపడుతున్నారు. నిత్యం కాలనీల్లో పర్యటిస్తూ.. జనంతో మమేకమవుతున్నారు. ఇప్పటికే అంబర్‌పేట్, సనత్‌నగర్, సికింద్రాబాద్ ప్రాంతాల్లో మహిళలు, పుర ప్రముఖులు, కాలనీ పెద్దలు, అపార్ట్‌మెంట్ వాసులతో కలిసి అభివృద్ధి పనులు, సమస్యలపై చర్చిస్తున్నారు. కానీ సికింద్రాబాద్ ఎంపీగా గెలిచిన ఈ ఐదేండ్లలో ఆ ప్రాంతవాసులు ఆశించిన స్థాయిలో ఆయన అభివృద్ధి చేయలేదనే చర్చ నడుస్తోంది. దాంతో బస్తీల్లో పర్యటనల సందర్భంగా ఎవరైనా అభివృద్ధి గురించి మాట్లాడితే.. సికింద్రాబాద్, కాచిగూడ రైల్వేల అభివృద్ధి, రామప్ప, రామమందిరం దేవాలయాల గురించి మాట్లాడుతున్నారని చెబుతున్నారు.

నేటి సమాజానికి భగత్‌సింగ్‌లే అవసరం

(మొదటిపేజీ తరువాయి)

సందర్భంగా ఎమ్మెల్సీ మాట్లాడుతూ.. రాష్ట్రంలోని విద్యాసంస్థల్లో గంజాయి, డ్రగ్స్ అమ్మకాలు జరగకుండా రాష్ట్ర ప్రభుత్వం పటిష్టమైన చర్యలు తీసుకుంటుందని తెలిపారు. భగత్‌సింగ్ ఆశయాలు చాలా గొప్పవని, ఆయన ఆలోచనలు విద్యార్థులు అనుసరిస్తూనే సమాజంలోకి పోవడానికి కృషి చేయాలన్నారు. భగత్‌సింగ్, రాజ్‌గురు, సుఖ్‌దేవ్ వర్ధంతిని విద్యార్థుల్లోకి తీసుకెళ్లుతున్న ఎస్ఎఫ్ఐ-డీవైఎఫ్ఐను అభినందించారు. శివారెడ్డి మాట్లాడుతూ.. సమాజాన్ని పక్కదోవ పట్టించే అంశాలపై నేటి యువత కేంద్రీకరిస్తూ కుటుంబం, దేశం గురించి ఆలోచించడం లేదన్నారు. డ్రగ్స్, గంజాయి లాంటి వాటికి దూరంగా ఉంటూ దేశం కోసం యువత ఆలోచించాలన్నారు. ప్రభుత్వ జూనియర్ కళాశాల లెక్చరర్స్ అసోసియేషన్ అధ్యక్షులు మధుసూదన్ రెడ్డి మాట్లాడుతూ.. యువకులు భగత్ సింగ్‌ను ఆదర్శంగా తీసుకొని సమస్యలపై పోరాడాలని సూచించారు. భగత్‌సింగ్ పేరుతో యువజనోత్సవాలు నిర్వహించిన ఎస్ఎఫ్ఐ-డీవైఎఫ్ఐ పాత్ర అద్వితీయం అని కొనియాడారు. ప్రతేడాది ఇలానే యువజన ఉత్సవాలు నిర్వహించి విద్యార్థులు, యువతలో చైతన్య నింపాలని కోరారు. అనంతరం ఎస్ఎఫ్ఐ, డీవైఎఫ్ఐ రాష్ట్ర ప్రధాన కార్యదర్శులు నాగరాజు, వెంకటేష్ మాట్లాడుతూ.. భగత్ సింగ్, రాజుగురు, సుఖ్‌దేవ్ 93వ వర్ధంతి సందర్భంగా ఎస్ఎఫ్ఐ, డీవైఎఫ్ఐ ఆలోచనలను రాష్ట్రవ్యాప్తంగా ప్రచారం చేస్తున్నామన్నారు. నేటి సమాజంలో భగత్‌సింగ్ ఆలోచన విధానం చాలా అవసరమని తెలిపారు. భగత్ సింగ్ తన చిన్నతనం నుండే జాతీయోద్యమంలో పాల్గొని, సమాజంలోని అసమానతలు, మత విద్వేషాలు, వివక్షతలకు వ్యతిరేకంగా ఉద్యమించారని గుర్తుచేశారు. అలాంటి అమరవీరుల ఆశయాలకు అనుగుణంగా నేడు యువత కూడా పోరాడాలని తెలిపారు.ఎస్ఎఫ్ఐ రాష్ట్ర కమిటీ సభ్యులు పవిత్ర, జిల్లా ఉపాధ్యక్షులు స్టాలిన్, వీరేందర్, కవిత, నాయకులు అభిమన్యు, విగ్నేష్, చరణ్ శ్రీ, అజయ్, శివ గణేష్, దాసు, సాయి, విద్యార్థులు పాల్గొన్నారు.

అంతా ఆయనే..

(మొదటిపేజీ తరువాయి)

రెండ్రోజుల ముందే మాజీ ఐజీ ప్రభాకర్‌రావు, మాజీ డీసీపీ రాధాకిషన్‌రావు, ఒక ప్రయివేటు ఛానెల్ సీఈఓ శ్రవణ్‌కుమార్‌లు ఇక్కడి నుంచి చెన్నైకి వెళ్లి, అక్కడి నుంచి అమెరికాకు వెళ్లినట్టు దర్యాప్తు అధికారులు గుర్తించారు. దీంతో ఈ ముగ్గురి కోసం వేటను ప్రారంభించిన దర్యాప్తు అధికారులు..లుక్‌అవుట్ నోటీసులను జారీ చేశారు. అంతేగాక, ఈ ముగ్గురిని తీసుకురావటానికి ఇంటర్‌పోల్ సహాయాన్ని కూడా తీసుకుంటామని దర్యాప్తును పర్యవేక్షిస్తున్న ఒక సీనియర్ పోలీసు అధికారి తెలిపారు.

రేవంత్‌రెడ్డి నివాసం సమీపంలో పరికరాలు అమర్చుకొని..

రాజకీయ ప్రముఖుల ఫోన్‌ట్యాపింగ్ వ్యవహారాన్ని అప్పటి ఎస్ఐబీ ఓఎస్డీగా ఉన్న ఐజీ ప్రభాకర్‌రావు ఆదేశాల మేరకే నిర్వహించినట్టు ప్రణీత్‌రావుతో పాటు అదనపు ఎస్పీలు బుజంగరావు, తిరుపతన్నలు తెలిపినట్టు కోర్టుకు సమర్పించిన రిమాండ్ రిపోర్ట్‌లో దర్యాప్తు అధికారులు పేర్కొన్నారు. ముఖ్యంగా, ప్రభాకర్‌రావు ఇచ్చిన అనేక ఫోన్ నెంబర్లను తాము ట్యాపింగ్ చేసినట్టు ప్రణీత్‌రావు వెల్లడించాడు. ముఖ్యంగా, జూబ్లీహిల్స్‌లోని ప్రస్తుత సీఎం రేవంత్‌రెడ్డి నివాసం సమీపంలోని ఒక భవనంలో ఫోన్ ట్యాపింగ్‌కు సంబంధించిన పరికరాలను అమర్చుకొనీ, ఆయన ఎన్నికల సమయంలో ఎవరెవరితో మాట్లాడేది, ఆయన రాజకీయ ఎత్తుగడలను ట్యాపింగ్ చేసి ప్రభాకర్‌రావుకు అందజేసేవారమని తెలిపాడు.

కాంగ్రెస్‌తో పాటు ఇతర రాజకీయ నాయకులపై ఫోకస్

ఆ విధంగా, కాంగ్రెస్‌తో పాటు ఇతర రాజకీయ ప్రముఖులు, కాంగ్రెస్‌కు నిధులు అందజేస్తున్న వ్యాపారులు, రియల్ ఎస్టేట్ వ్యాపారుల ఫోన్లనూ ట్యాపింగ్ చేసి అందజేసేవారమని ప్రణీత్‌రావు తన వాంగ్మూలంలో పేర్కొన్నాడు. అలాగే, బుజంగరావు, తిరుపతన్నలు ఇచ్చిన ఫోన్ నెంబర్లను కూడా ట్యాపింగ్ చేసి ఇచ్చేవాడినని తెలిపాడు. ప్రధానంగా, ఉప ఎన్నికలు మొదలుకొని అసెంబ్లీ ఎన్నికల వరకు, రేవంత్‌రెడ్డి మొదలుకొని కాంగ్రెస్ ప్రముఖుల వరకు ఫోన్ నెంబర్లను ట్యాపింగ్ చేసి సమాచారమిచ్చేవాడినని చెప్పాడు. ఈ ట్యాపింగ్ వ్యవహారం పూర్తిగా ప్రభాకర్‌రావు పర్యవేక్షణలోనే జరిగేదని వివరించాడు. ఉప ఎన్నికల నుంచి అసెంబ్లీ ఎన్నికల వరకు కాంగ్రెస్ పార్టీ తరపున జరిగే డబ్బుల పంపిణీని ఫోన్ ట్యాపింగ్ ద్వారా కనిపెట్టి, అవి పట్టుబడేలా సమాచారమందజేసేవాడినని తెలిపాడు.

'అప్పటి రాజకీయ ప్రముఖుల ప్రేరణ మేరకే'

అధికార పార్టీకి చెందిన కొందరు రాజకీయ ప్రముఖుల ప్రేరణ మేరకు తాము ఫోన్ ట్యాపింగ్‌లకు పాల్పడినట్టు బుజంగరావు, తిరుపతన్నలు తెలిపినట్టు రిమాండ్ రిపోర్ట్‌లో దర్యాప్తు అధికారులు పేర్కొన్నారు. ఆ ప్రముఖుల



పేర్లను దర్యాప్తులో భాగంగా రహస్యంగా ఉంచారు. కాగా, కాంగ్రెస్ అధికారంలోకి వస్తుందన్న సమాచారంతో.. ఫోన్ ట్యాపింగ్‌కు సంబంధించిన హార్డ్ డిస్కులు, ఇతర సాంకేతిక పరికరాలను ధ్వంసం చేయాలని ప్రభాకర్‌రావు ఆదేశాలిచ్చారని ప్రణీత్‌రావు తెలిపాడు. ఆ మేరకు కటింగ్‌ప్లేయర్లతో హార్డ్ డిస్కులు, సాంకేతిక పరికరాలను ముక్కలుగా కట్ చేసి మూసీ నదిలో పారేసినట్టు ప్రణీత్‌రావు చెప్పాడు. ఈ పరికరాలను సమీకరించిన జూబ్లీహిల్స్ ఏసీపీ వెంకటగిరి నేతృత్వంలోని దర్యాప్తు బృందం అందులోని సమాచారాన్ని వెలికి తీయటానికిగానూ ఫోరెన్సిక్ సైన్స్ ల్యాబ్ (ఎఫ్ఎస్-ఎల్) కు అందజేశారు.ఎఫ్ఎస్ఎల్ నుంచి అందే సమాచారాన్ని ఆధారంగా చేసుకొని కేసును ముందుకు నడిపించటానికి అధికారులు పూనుకున్నారు. అదేసమయంలో, అమెరికాలో ఉన్న ప్రభాకర్‌రావు, రాధాకిషన్‌రావు, శ్రవణ్‌లను కూడా అదుపులోకి తీసుకొని విచారించటం ద్వారా ఈ ఫోన్ ట్యాపింగ్ వ్యవహారం వెనక ఉన్న అప్పటి అధికార రాజకీయ ప్రముఖుల గుట్టును కూడా బయటపెడ్తామని దర్యాప్తు వర్గాలు పేర్కొన్నాయి.

ప్రశాంతంగా సెనగల్ అధ్యక్ష ఎన్నికలు

- బరిలో 17 మంది అభ్యర్థులు

దాకర్ : పశ్చిమ ఆఫ్రికా దేశమైన సెనగల్‌లో ఆదివారం అధ్యక్ష ఎన్నికలు ప్రశాంతంగా జరిగాయి. దేశవ్యాప్తంగా సుమారు 70 లక్షల మంది ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. 17 మంది అభ్యర్థులు పోటీలో ఉన్నారు. అభ్యర్థులు ఎక్కువగా ఉన్నందున ఫలితాల వెల్లడికి ఎక్కువ రోజుల సమయం పడుతుందని అధికారులు అంచనా వేస్తున్నారు. అలాగే రెండో రౌండ్ జరిగే అవకాశం ఉందని కూడా భావిస్తున్నారు. సెనగల్ అధ్యక్షుడిగా ఎన్నికవ్వాలంటే కనీసం 50 శాతం కంటే ఎక్కువ ఓట్లు రావాలి. వాస్తవానికి ఈ అధ్యక్ష ఎన్నికలు గత నెలలో జరగాలి. ఈ ఎన్నికల్లో ప్రస్తుత అధ్యక్షులు మాకీ సాల్ కూడా ప్రధానంగా పోటీలో ఉన్నారు. ఇప్పటికే మాకీ సాల్ రెండు పర్యాయాలు అధ్యక్షుడిగా పనిచేశారు. బిబివై కూటమి అభ్యర్థిగా మాజీ ప్రధాని, 62 ఏళ్ల అమడౌ బా పోటీ చేశారు. ఈ ఎన్నికల్లో మాకీ సాల్‌కు గట్టి పోటీ 44 ఏళ్ల బస్సిరౌ డియోమాయే ఫాయే నుంచి ఎదురవుతుందని భావిస్తున్నారు. గతవారమే ఫాయే జైలు నుంచి విడుదలయ్యారు. తిరుగుబాటు ఆరోపణలతో గత ఏడాది ఏప్రిల్ నుంచి ఫాయే నిర్బంధంలో ఉన్నారు. తనపై ఆరోపణలు రాజకీయ ప్రేరితమైనవని ఫాయే ఆరోపిస్తున్నారు. కాగా, ఈ ఎన్నికలతో దశాబ్దకాలం తరువాత తొలిసారిగా ఒక మహిళా పోటీ చేస్తున్నారు. ఎఆర్‌సి పార్టీ నుంచి 40 ఏళ్ల బాబాకర్ న్గోమ్ బరిలో ఉన్నారు.

యూట్యూబ్ ఛానళ్లపై క్రిమినల్ కేసులు పెడతాం : కేటీఆర్



నవతెలంగాణ-హైదరాబాద్‌బ్యూరో

కుట్రపూరితంగా అసత్యాలను ప్రచారం చేస్తూ, పరువునష్టం కలిగిస్తున్న యూట్యూబ్ ఛానళ్లపై క్రిమినల్ కేసులు పెడతామని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కే తారకరామారావు హెచ్చరించారు. కచ్చితంగా అలాంటి ఛానళ్లపై పరువు నష్టం దావాలు వేస్తామన్నారు. వ్యక్తిగతంగా తనను, తమ పార్టీని దెబ్బతీయాలన్న కుట్రతోనే కొన్ని యూట్యూబ్ ఛానళ్ల వ్యవహరిస్తున్నాయనీ, ఇలాంటి వాటిపై అధికారికంగా గూగుల్‌కి కూడా ఫిర్యాదు చేస్తామన్నారు. ప్రజలు ఇలాంటి ఛానళ్ల ప్రచారంపై జాగ్రత్త వహించాలని చెప్పారు. ఈ మేరకు ఆదివారంనాడొక పత్రికా ప్రకటన విడుదల చేశారు. బాధ్యతాయుతంగా వ్యవహరించాల్సిన యూట్యూబ్ ఛానళ్ల కొన్ని, ఏలాంటి ఆధారాలు లేకుండా అడ్డగోలుగా, అసత్యాలను పదేపదే ప్రసారం చేస్తున్నాయని చెప్పారు. ప్రజలను తప్పుతోవ పట్టించేలా థంబ్ నెయిల్స్ పెడుతూ, వార్తల పేరుతో అబద్దాలను చూపిస్తున్నాయని మండిపడ్డారు. గుడ్డి వ్యతిరేకతో... అధికార పార్టీ ఇచ్చే డబ్బులకు ఆశపడో ఇలాంటి నేరపూరితమైన, చట్టవిరుద్ధమైన వీడియోలను, ఫేక్ న్యూస్‌లను ప్రచారం చేస్తున్నాయన్నారు.

రైతుల్ని కాపాడండి : బీఆర్ఎస్ నేతల విజ్ఞప్తి

రాష్ట్రంలో కరువు పరిస్థితులు ఏర్పడ్డాయనీ, ప్రభుత్వం రైతుల్ని ఆదుకోవాలని బీఆర్ఎస్ ప్రజాప్రతినిధులు ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. ఆదివారంనాడిక్కడి తెలంగాణ భవన్‌లో జరిగిన విలేకరుల సమావేశంలో మాజీ మంత్రి జీ జగదీశ్‌రెడ్డి, నల్గొండ అభ్యర్థి కంచర్ల కృష్ణారెడ్డి, భువనగిరి అభ్యర్థి క్యామ మల్లేష్, మాజీ ఎమ్మెల్యేలు కంచర్ల భూపాల్‌రెడ్డి, మల్లికార్జున్‌రెడ్డి తదితరులు మాట్లాడారు. బ్యాంకులు అప్పులు ఇవ్వకపోయినా, రైతులు రూ.25 వేల నుంచి రూ.30 వేల వరకు ప్రయివేటు అప్పులు తెచ్చుకుంటున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. లక్షలాది ఎకరాల పంట పొలాలు నీళ్లు లేక ఎండిపోతున్నాయనీ, కాళేశ్వరం నుంచి 100 టీఎంసీల నీరు లిఫ్ట్ చేసుకునే అవకాశం ఉన్నా చేయలేదనీ, కుంగిన పిల్లర్ల పేర్లు చెప్పి రాజకీయం చేస్తున్నారని విమర్శించారు. దేశరాజధాని ఢిల్లీ ఎన్నికల్లో తరచూ ఓడిపోతున్నామనే మోడీ ప్రభుత్వం ఆ రాష్ట్ర ముఖ్యమంత్రి కేజ్రీవాల్‌ను అరెస్టు చేసిందనీ, రెండేండ్లు విచారించిన కేంద్ర దర్యాప్తు సంస్థలు ఒక్క ఆధారం సంపాదించలేకపోయాయని అన్నారు. ఎమ్మెల్సీ కవితపై పెట్టిన కేసు రాజకీయ ప్రేరేపితమేననీ, అది వీగిపోతుందనే విశ్వాసం తమకు ఉందన్నారు.



టైటాన్స్ తడాఖా

- ముంబయిపై గుజరాత్ గెలుపు
- గుజరాత్ 168/6, ముంబయి 162/9



నవతెలంగాణ-అహ్మదాబాద్ :
ముంబయి ఇండియన్స్‌కు గుజరాత్ టైటాన్స్ స్ట్రోక్ ఇచ్చింది. సీజన్ తొలి మ్యాచ్‌లో ముంబయిపై 6 పరుగుల తేడాతో ఉత్కంఠ విజయం సాధించింది. 169 పరుగుల ఛేదనలో డెవిడ్ బ్రెవిస్ (46, 38 బంతుల్లో 2 ఫోర్లు, 3 సిక్స్‌లు), రోహిత్ శర్మ (43, 29 బంతుల్లో 7 ఫోర్లు, 1 సిక్స్) రాణించినా ముంబయికి ఓటమి తప్పలేదు. తిలక్ వర్మ (25), టిమ్ డెవిడ్ (11) ఆఖర్లో వికెట్ కోల్పోవటంతో మ్యాచ్‌పై టైటాన్స్ పట్టు బిగించింది. ఆఖరు ఓవర్లో 19 పరుగులు అవసరం కాగా.. హార్దిక్ పాండ్య (11) 6, 4తో ఉత్కంఠ రేపాడు. కానీ ఉమేశ్ యాదవ్ వరుస వికెట్లతో ముంబయి ఆశలను ఆవిరి చేశాడు. 20 ఓవర్లలో 9 వికెట్లకు ముంబయి 162 పరుగులే చేసింది. తొలుత బ్యాటింగ్ చేసిన గుజరాత్ టైటాన్స్ 20 ఓవర్లలో 6 వికెట్లకు 168 పరుగులు చేసింది. సాయి సుదర్శన్ (45, 39 బంతుల్లో 3 ఫోర్లు, 1 సిక్స్), శుభ్‌మన్ గిల్ (31, 22 బంతుల్లో 3 ఫోర్లు, 1 సిక్స్), రాహుల్ తెవాటియ (22) రాణించారు.

రాణించిన సుదర్శన్
టాస్ నెగ్గిన ముంబయి ఇండియన్స్ తొలుత బౌలింగ్ ఎంచుకుంది. గుజరాత్ టైటాన్స్‌కు ఛేదనలో ఉన్న రికార్డు దృష్ట్యా హార్దిక్ పాండ్య ఈ నిర్ణయం తీసుకున్నాడు. ఓపెనర్లు వృద్ధిమాన్ సాహా (19), శుభ్‌మన్ గిల్ (31) శుభారంభం చేశారు. తొలి వికెట్‌కు 31 పరుగులు జోడించారు. సహా నాలుగు బౌండరీలతో మెరువగా.. గిల్ మూడు ఫోర్లు, ఓ సిక్సర్‌తో ఆకట్టుకున్నాడు. మంచి ఆరంభాలను ఓపెనర్లు సద్వినియోగం చేసుకోలేదు. సాహాను బుమ్రా, గిల్‌ను చావ్లా అవుట్ చేయటంతో.. సాయి సుదర్శన్ (45, 39 బంతుల్లో 3 ఫోర్లు, 1 సిక్స్), అజ్మతుల్లా ఓమర్‌జాయ్ (17) జతకట్టారు. నెమ్మదిగా ఆడినా.. ఈ జోడీ ఇన్నింగ్స్‌ను గాడిలో పెట్టింది. క్రీజులో కుదురుకున్న సాయిసుదర్శన్, ప్రమాదకర హిట్టర్ డెవిడ్ మిల్లర్ (12)ను బుమ్రా సాగనంపటంతో టైటాన్స్ భారీ స్కోరు ఆశలు ఆవిరయ్యాయి. చివర్లో రాహుల్ తెవాటియ (22) విలువైన పరుగులు జోడించాడు. రషీద్ ఖాన్ (4 నాటౌట్), విజయ్ శంకర్ (6 నాటౌట్) ఆశించిన ముగింపు ఇవ్వలేదు. ముంబయి ఇండియన్స్ బౌలర్లలో హార్దిక్ పాండ్య, లూక్ వుడ్, శామ్స్ ములాని, నమన్ ధిర్‌లకు వికెట్లు దక్కలేదు. బుమ్రా, కోయేట్జి మెరువగా.. పియూశ్ చావ్లా పరుగుల పొదుపు పాటించలేదు.

శ్రీకాంత్ పరాజయం

స్విస్ ఓపెన్ బ్యాడ్మింటన్

బసెల్ (స్విట్జర్లాండ్) : భారత సీనియర్ షట్లర్, ప్రపంచ మాజీ నం.1 ఆటగాడు కిదాంబి శ్రీకాంత్ పోరాటానికి తెరపడింది. సుమారు 16 నెలల సుదీర్ఘ విరామం అనంతరం ఓ బిడబ్ల్యూఎఫ్ టోర్నమెంట్ సెమీఫైనల్స్‌కు చేరుకున్న తెలుగు తేజం.. ఫైనల్ ముంగిట తడబడ్డాడు. పురుషుల సింగిల్స్ సెమీఫైనల్లో చైనీస్ తైపీ షట్లర్ లిన్ చున్ చేతిలో 21-15, 9-21, 18-21తో పరాజయం పాలయ్యాడు. స్విస్ ఓపెన్ సూపర్ 300 టోర్నీ నుంచి నిష్క్రమించాడు. గంటకు పైగా సాగిన సెమీఫైనల్ పోరులో కిదాంబి శ్రీకాంత్ తొలి గేమ్‌లో ఆకట్టుకున్నాడు. 1-0తో ఆధిక్యంలో నిలిచాడు. కానీ రెండో గేమ్‌లో శ్రీకాంత్ తేలిపోయాడు. కనీస పోటీ ఇవ్వకుండా నిరాశపరిచాడు. నిర్ణయాత్మక మూడో గేమ్‌లో 16-15తో శ్రీకాంత్ ముందంజ వేసినా.. ఆ తర్వాత లయ తప్పాడు. 16-16తో స్కోరు



సమం చేసిన చైనీస్ తైపీ షట్లర్ వరుస పాయింట్లతో 19-16తో ఆధిక్యం సాధించాడు. శ్రీకాంత్ పాయింట్ల వేట కొనసాగించినా.. అప్పటికే నష్టం జరిగిపోయింది. మహిళల సింగిల్స్‌లో పి.వి సింధు, పురుషుల డబుల్స్‌లో సాత్విక్, చిరాగ్, మహిళల డబుల్స్‌లో ట్రెసా జాలి, గాయత్రి పుల్లెల ఇప్పటికే ఓటమి పాలవగా స్విస్ ఓపెన్‌లో భారత షట్లర్ల టైటిల్ వేటకు తెరపడింది.

రాజస్థాన్ రాయల్స్ రాజసం చూపించింది. ఐపీఎల్ 17 సీజన్ తొలి మ్యాచ్‌లో లక్నో సూపర్‌జెయింట్స్‌పై అలవోక విజయం సాధించింది. సంజు శాంసన్ (82 నాటౌట్) కెప్టెన్సీ ఇన్నింగ్స్‌తో మెరిశాడు. వరుసగా ఐదో సీజన్లో తొలి మ్యాచ్‌లోనే అర్థ సెంచరీ సాధించి అరుదైన రికార్డును సాధించాడు. 194 పరుగుల ఛేదనలో నికోలస్ పూరన్ (64 నాటౌట్), కెఎల్ రాహుల్ (58) అర్థ సెంచరీలో సరిపోలేదు. 20 పరుగుల తేడాతో లక్నో సూపర్‌జెయింట్స్‌పై రాజస్థాన్ రాయల్స్ గెలుపొందింది.

సూపర్ సంజు!

- రాయల్స్ కెప్టెన్ అర్థ సెంచరీ
- ఛేదనలో పూరన్ పోరాటం వృథా
- లక్నోపై రాజస్థాన్ గెలుపు
- రాజస్థాన్ 193/4, లక్నో 173/6



నవతెలంగాణ-జైపూర్
సంజు శాంసన్ (82 నాటౌట్, 52 బంతుల్లో 3 ఫోర్లు, 6 సిక్స్‌లు) సూపర్ అనిపించాడు. ఇండియన్ ప్రీమియర్ లీగ్ (ఐపీఎల్)లో వరుసగా ఐదో సీజన్‌లో తొలి మ్యాచ్‌లో అర్థ సెంచరీ సాధించిన రికార్డును ఖాతాలో వేసుకున్నాడు. సొంతగడ్డపై లక్నో సూపర్‌జెయింట్స్‌తో జరిగిన మ్యాచ్‌లో కెప్టెన్సీ ఇన్నింగ్స్ ఆడిన సంజు శాంసన్ రాజస్థాన్ రాయల్స్‌కు అలవోక విజయాన్ని కట్టబెట్టాడు. సంజు శాంసన్‌కు తోడు రియాన్ పరాగ్ (43, 29 బంతుల్లో 1 ఫోర్, 3 సిక్స్‌లు), ధ్రువ్ జురెల్ (20 నాటౌట్, 12 బంతుల్లో 1 ఫోర్, 1 సిక్స్) రాణించారు. తొలుత బ్యాటింగ్ చేసిన రాజస్థాన్ రాయల్స్ 20 ఓవర్లలో 4 వికెట్లకు 193 పరుగులు చేసింది. ఛేదనలో లక్నో సూపర్‌జెయింట్స్ చతికిల పడింది. కెప్టెన్ కెఎల్ రాహుల్ (58, 44 బంతుల్లో 4 ఫోర్లు, 2 సిక్స్‌లు), నికోలస్ పూరన్ (64 నాటౌట్, 41 బంతుల్లో 4 ఫోర్లు, 4 సిక్స్‌లు) అర్థ సెంచరీలు సాధించినా.. లక్నోను ఓటమి నుంచి గట్టెక్కించలేదు. సంజు శాంసన్ 'ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్'గా నిలిచాడు.

ఇద్దరు మెరిసినా..
లక్నో లక్ష్యం 194 పరుగులు. సవాయ్ మాన్‌సింగ్ స్టేడియంలో ఇది కష్టమేమీ కాదు. రాజస్థాన్ పేసర్లు ట్రెంట్ బౌల్ట్, బర్గర్‌లు పవర్‌ప్లేలో నిప్పులు చెరిగారు. క్వింటన్ డికాక్ (4), దేవదత్ పడిక్కల్ (0), ఆయుశ్ బదాని (1) విఫలమయ్యారు. 11/3తో లక్నో సూపర్‌జెయింట్స్ టాప్ ఆర్డర్ కకావికలైంది. ఈ దశలో ఇంపాక్ట్ ఆటగాడు దీపక్ హుడా (26)తో కలిసి కెఎల్ రాహుల్ ఇన్నింగ్స్‌ను నిలబెట్టాడు. ఈ క్రమంలో లక్నో రన్‌రేట్ బాగా పడిపోయింది. హుడా అవుటయ్యే సమయానికి లక్నో 7.3 ఓవర్లలో 60/4తో నిలిచింది. ఓ ఎండ్‌లో కెప్టెన్ రాహుల్ నెమ్మదిగా ఆడినా.. నికోలస్ పూరన్ (64) దంచికొట్టాడు. నాలుగు ఫోర్లు, నాలుగు సిక్సర్లతో దండెత్తాడు. రాహుల్, పూరన్ క్రీజులో ఉండగా లక్నో 24 బంతుల్లో 49 పరుగులు చేయాల్సిన స్థితిలో నిలిచింది. కానీ ఇక్కడే రాయల్స్ బౌలర్లు మ్యాజిక్ చేశారు. రాహుల్ వికెట్‌తో పూరన్‌పై ఒత్తిడి రెట్టింపు అయ్యింది. మార్కస్ స్టోయినిస్ (3), కృనాల్ పాండ్య (3 నాటౌట్, 5 బంతుల్లో) నిరాశపరిచారు. దీంతో 20 ఓవర్లలో 6 వికెట్లకు లక్నో సూపర్‌జెయింట్స్ 173 పరుగులే చేసింది. 20 పరుగుల తేడాతో రాజస్థాన్ రాయల్స్ విజయం సాధించింది. రాయల్స్ బౌలర్లలో ట్రెంట్ బౌల్ట్ (2/35), బర్గర్ (1/30), అశ్విన్ (1/35), సందీప్ శర్మ (1/22) రాణించారు.

చెలరేగిన శాంసన్
టాస్ నెగ్గి బ్యాటింగ్ ఎంచుకున్న రాజస్థాన్ రాయల్స్‌కు ఆశించిన ఆరంభం దక్కలేదు. జోశ్ బట్లర్ (11) రెండో ఓవర్లోనే అవుటయ్యాడు. యశస్వి జైస్వాల్ (24, 12



బంతుల్లో 3 ఫోర్లు, 1 సిక్స్) తనదైన శైలి ఇన్నింగ్స్‌తో విరుచుకుపడినా.. వికెట్ కాపాడుకోలేదు. కెప్టెన్ సంజు శాంసన్ (82 నాటౌట్) పవర్‌ప్లేలోనే క్రీజులోకి వచ్చినా ఆఖరు వరకు ఆడాడు. రియాన్ పరాగ్ (43) తోడుగా రాయల్స్‌కు భారీ స్కోరు అందించాడు. సంజు, పరాగ్‌లు మూడో వికెట్‌కు 59 బంతుల్లోనే 93 పరుగులు జత చేశారు. శాంసన్ రెండు ఫోర్లు, నాలుగు సిక్సర్లతో 33 బంతుల్లో అర్థ సెంచరీ సాధించాడు. ఐపీఎల్‌లో వరుసగా ఐదో సీజన్‌ల్లో తొలి మ్యాచ్‌లోనే ఈ ఘనత సాధించాడు. పరాగ్ మూడు సిక్సర్లు, ఓ బౌండరీతో మెరిశాడు. పరాగ్‌తో పాటు హెట్‌మయర్ (5) నిష్క్రమించినా.. ధ్రువ్ జురెల్ (20 నాటౌట్) తోడుగా ఇన్నింగ్స్‌కు అదిరే ముగింపు అందించాడు సంజు. లక్నో సూపర్‌జెయింట్స్ బౌలర్లలో నవీన్ ఉల్ హక్ (2/41), మోషిన్ ఖాన్ (1/45), రవి బిష్ణోయ్ (1/38) రాణించారు.

స్కోరు వివరాలు :
రాజస్థాన్ రాయల్స్ ఇన్నింగ్స్ : యశస్వి జైస్వాల్ (సి) హార్దిక్ (బి) మోషిన్ ఖాన్ 24, జోశ్ బట్లర్ (సి) రాహుల్ (బి) నవీన్ హక్ 11, సంజు శాంసన్ నాటౌట్ 82, రియాన్ పరాగ్ (సి) దీపక్ హుడా (బి) నవీన్ హక్ 43, షిమ్రోన్ హెట్‌మయర్ (సి) రాహుల్ (బి) రవి బిష్ణోయ్ 5, ధ్రువ్ జురెల్ నాటౌట్ 20, ఎక్స్‌ట్రాలు : 8, **మొత్తం : (20 ఓవర్లలో 4 వికెట్లకు) 193.**
వికెట్ల పతనం : 1-13, 2-49, 3-142, 4-150.
బౌలింగ్ : మోషిన్ ఖాన్ 4-0-45-1, నవీన్ ఉల్ హక్ 4-0-41-2, కృనాల్ పాండ్య 4-0-19-0, రవి బిష్ణోయ్ 4-0-38-1, యశ్ ఠాకూర్ 3-0-43-0, ఆయుశ్ బదాని 1-0-6-0.
లక్నో సూపర్‌జెయింట్స్ ఇన్నింగ్స్ : క్వింటన్ డికాక్ (బి) బర్గర్ (బి) బౌల్ట్ 4, కెఎల్ రాహుల్ (సి) జురెల్ (బి) సందీప్ శర్మ 58, దేవదత్ పడిక్కల్ (బి) బౌల్ట్ 0, ఆయుశ్ బదాని (సి) బట్లర్ (బి) బర్గర్ 1, నికోలస్ పూరన్ నాటౌట్ 64, మార్కస్ స్టోయినిస్ (సి) జురెల్ (బి) అశ్విన్ 3, కృనాల్ పాండ్య నాటౌట్ 3, ఎక్స్‌ట్రాలు : 14, **మొత్తం : (20 ఓవర్లలో 6 వికెట్లకు) 173.**
వికెట్ల పతనం : 1-4, 2-10, 3-11, 4-60, 5-145, 6-154.
బౌలింగ్ : ట్రెంట్ బౌల్ట్ 4-0-35-2, బర్గర్ 3-0-30-1, రవిచంద్రన్ అశ్విన్ 4-0-35-1, అవేశ్ ఖాన్ 3-0-21-0, యుజ్వేంద్ర చాహల్ 3-0-25-1, సందీప్ శర్మ 3-0-22-1.

నవచిత్రం

మదర్ సెంటిమెంటూ మెప్పిస్తుంది


రమా కాంత్ రెడ్డి

నాని మూవీ వర్క్స్, రామా క్రియేషన్స్ ఆధ్వర్యంలో విశ్వ కార్తికేయ, ఆయుషి పటేల్ హీరో, హీరోయిన్లుగా నటించిన చిత్రం 'కలియుగం పట్టణంలో'. డిఫరెంట్ కాన్సెప్ట్‌తో రాబోతున్న ఈ మూవీకి కథ, డైలాగ్స్ ,స్క్రీన్ ప్లే, దర్శకత్వం ఇలా అన్ని రమాకాంత్ రెడ్డి చూసుకున్నారు. డాక్టర్ కందుల చంద్ర ఓబుల్ రెడ్డి, జి.మహేశ్వరరెడ్డి, కాటం రమేష్‌లు నిర్మించిన ఈ చిత్రం ఈనెల 29న రానుంది. ఈ నేపథ్యంలో దర్శకుడు రమాకాంత్ రెడ్డి మీడియాతో పలు విశేషాలను షేర్ చేసుకున్నారు.

- కలియుగం పట్టణంలో అంటే ఊరిపేరు కాదు. మనం కలియుగంలో ఉన్నాం. కలియుగంలో మనుషులు ఎలా ఉన్నారు?, ఏంటి అనేదే ఈ కథ. ఓ పట్టణంలోని మనుషుల గురించి చూపించే సినిమా ఇది. టైటిల్‌లో మస్కిటో కాయిల్స్, రెంచ్ కనిపిస్తున్నాయి. వాటికి సినిమాలో కథకి లింక్ ఉంటుంది. వాటితో స్టోరీ నడుస్తుంది. అలాగే ఈ సినిమా చిత్రీకరణను నంద్యాలలో చేయటానికి కారణం ఏంటంటే, నంద్యాల దగ్గర్లోనే నల్లమల ఫారెస్ట్ ఉంది. కథలో ఫారెస్ట్‌కి, ఔషధ మొక్కలకు లింక్ ఉంది. ఆ లింక్ ఏమిటనేది మాటల్లో కంటే స్క్రీన్‌పై చూస్తేనే బాగుంటుంది.
- ఈ సినిమాలో సస్పెన్స్, థ్రిల్లర్‌తో పాటు ముఖ్యంగా మదర్ సెంటిమెంట్ ఉంటుంది. అలాగే లవ్, యాక్షన్, ఒక మెసేజ్ కూడా ఉంటుంది. బయట చాలామంది తండ్రులు సోషియో ఫోబియాతో ఉన్నారు. నా కొడుకు ఇలా ఉండాలి?, ఇది చేయాలి? సమాజం ఏం అంటుందో అనే ఆలోచిస్తారు. పిల్లల ఫీలింగ్స్ పట్టించుకోరు. వాటికి తగ్గట్టు కథలో ఆ పాయింట్ కూడా ఉంటుంది.
- గతంలో నేను జాబ్ చేసేటప్పుడు బెంగుళూరు నుంచి బస్సులో ఊరికి వస్తుంటే ఓ ప్రెగ్నెంట్ లేడీ సైకాలజీకి చెందిన బుక్ చదువుతుంది. ఈ సమయంలో ఇలాంటివి చదవకూడదు అని చెప్తే, మేం ఏం చేయాలో మాకు తెలుసు అంది. ట్రావెలింగ్ మొత్తం ఆమె ఆ బుక్ చదువుతుంది. అప్పుడే ఈ కథ ఆలోచన వచ్చింది.
- హీరో విశ్వ ఈ కథ విని ధైర్యంగా చేస్తా అని చెప్పాడు. గత సినిమాల్లో చాలా సాఫ్ట్‌గా కనిపిస్తాడు. ఈ సినిమా వాటికి పూర్తి భిన్నంగా ఉంటుంది. ఈ సినిమా విశ్వ కెరీర్‌లో ఒక మార్క్‌గా నిలిచిపోతుంది. ఈ సినిమా తర్వాత కలియుగం కార్తికేయ అని పిలుస్తారు. ఆయుషి పటేల్ తెలుగమ్మాయి. గ్లామర్ పరంగా కాకుండా సినిమాలో కీ రోల్ ప్లే చేస్తుంది. ఇంకో హీరోయిన్ చిత్ర శుక్ల కూడా ఉంది. పోలీస్ రోల్‌లో కనిపిస్తుంది.
- ఒక ప్రొడ్యూసర్ మా కజిన్ మహేష్. ఆ తర్వాత కథ నచ్చి ఓబుల్ రెడ్డి, రమేష్ కలిశారు. ఇదే కాంబోలో దీనికి సీక్వెల్‌గా 'కలియుగ నగరంలో' అని తీస్తున్నాం.


మృణాల్ ఠాకూర్, విజయ్ దేవరకొండ

మధురము కదా.. ఈ క్షణం

హీరో విజయ్ దేవరకొండ నటిస్తున్న 'ఫ్యామిలీ స్టార్' సినిమా నుంచి థర్డ్ సింగిల్ 'మధురము కదా..' రిలీజ్‌కు డేట్ ఫిక్స్ చేశారు మేకర్స్. నేడు (సోమవారం) ఈ లిరికల్ సాంగ్ రిలీజ్ చేయబోతున్నారు. ఈ పాట రిలీజ్ డేట్ అనౌన్స్‌మెంట్ సందర్భంగా కొత్త పోస్టర్ విడుదల చేశారు. ఆర్కిటెక్ట్‌గా విజయ్ దేవరకొండ తను వర్క్ చేస్తున్న బిల్డింగ్ దగ్గర మృణాల్ ఠాకూర్‌తో కలిసి కూర్చుని మాట్లాడుతున్న స్టిల్‌తో ఈ పోస్టర్‌ని డిజైన్ చేశారు. ఈ లిరికల్ సాంగ్ విజయ్, మృణాల్ లవ్ సాంగ్‌గా ఉంటుందని తెలుస్తోంది. ఈ పాటకు శ్రీమణి లిరిక్స్ అందించగా, శ్రేయా ఘోషల్ పాడారు. విడుదల చేస్తున్న ఒక్కో పాటతో ఈ సినిమా మ్యూజికల్ బ్లాక్ బస్టర్‌గా మారుతోంది. ఫస్ట్ సింగిల్ 'నందనందనా.', సెకండ్ సింగిల్ 'కళ్యాణి వచ్చా వచ్చా..' ఛాట్ బస్టర్స్ అయ్యాయి. ఇప్పుడీ థర్డ్ సాంగ్ పై మ్యూజిక్ లవర్స్‌లో మంచి ఎక్స్‌పెక్టేషన్స్ ఏర్పడుతున్నాయి. ఈ చిత్ర ట్రైలర్‌ను ఈ నెల 28న రిలీజ్ చేయబోతున్నారు.
శ్రీ వెంకటేశ్వర క్రియేషన్స్ బ్యానర్‌లో దిల్ రాజు, శిరీష్ నిర్మిస్తున్నారు. పక్కా ఎంటర్‌టైనర్‌గా డైరెక్టర్ పరశురామ్ పెట్ల దీన్ని రూపొందిస్తున్నారు. క్రియేటివ్ ప్రొడ్యూసర్‌గా వాసు వర్మ వ్యవహరిస్తున్న ఈ సినిమాను ఏప్రిల్ 5వ తేదీన తెలుగు, తమిళ, హిందీ భాషల్లో గ్రాండ్ థియేట్రికల్ రిలీజ్ చేసేందుకు రంగం సిద్ధం చేస్తున్నారు.

అదృష్టంగా భావిస్తున్నా : సూర్య

"**క**ంగువ' లాంటి గొప్ప సినిమాలో నటించే అవకాశం దక్కడం అదృష్టంగా భావిస్తున్నాను' అని హీరో సూర్య చెపాప్పరు. ఆయన నటించిన ఈ మూవీ త్వరలో వరల్డ్ వైడ్‌గా గ్రాండ్ థియేట్రికల్ రిలీజ్‌కు రెడీ అవుతోంది. భారీ పీరియాడిక్ యాక్షన్ ఫిల్మ్‌గా దర్శకుడు శివ దీన్ని తెరకెక్కిస్తున్నారు.
దిశా పటానీ, బాబీ డియోల్ కీలక పాత్రల్లో నటిస్తున్న ఈ సినిమాను స్టూడియో గ్రీన్, యూవీ క్రియేషన్స్ బ్యానర్స్ పై కేఈ జ్ఞానవేల్ రాజా, వంశీ, ప్రమోద్ నిర్మిస్తున్నారు. పది భాషల్లో రూపొందుతున్న ఈ సినిమా త్రీడీలోనూ ప్రేక్షకుల ముందుకు రానుంది. అలాగే పలు అంతర్జాతీయ భాషల్లోనూ ఈ సినిమాను రిలీజ్ చేసేందుకు మేకర్స్ సన్నాహాలు చేస్తున్నారు. తాజాగా ముంబయిలో ఈచిత్ర గ్లింప్స్ రిలీజ్ ఈవెంట్ జరిగింది.
ఈ సందర్భంగా హీరో సూర్య మాట్లాడుతూ, 'ఈ సినిమా చిత్రీకరణ నుంచి రోజు రోజుకూ మూవీ మరింత బిగ్ ప్రాజెక్ట్‌గా మారుతూ వచ్చింది. అందుకు మా డైరెక్టర్ శివకు థ్యాంక్స్ చెప్పాలి. ఇలాంటి ప్రతిష్టాత్మక ప్రాజెక్ట్ చేయాలని కలగన్న మా ప్రొడ్యూసర్ జ్ఞానవేల్ రాజా, సినిమాటోగ్రాఫర్ వెట్రి, మ్యూజిక్ డైరెక్టర్ దేవిశ్రీ ప్రసాద్ లేకుండా ఈ మూవీ ఇంత బాగా వచ్చేది కాదు' అని తెలిపారు.


సూర్య


చైతన్య రావు, కిశోరి ధాత్రక్

నా నల్లా కలువా పువ్వా..

చైతన్య రావు, అర్జున్ అంబటి హీరోలుగా, కిశోరి ధాత్రక్ హీరోయిన్‌గా రవిశంకర్ ప్రధాన పాత్రలో నటించిన చిత్రం 'తెప్ప సముద్రం'. సతీష్ రాపోలు దర్శకత్వంలో బేబీ వైష్ణవి సమర్పణలో శ్రీమణి ఎంటర్టైన్మెంట్స్ పతాకంపై నీరుకంటి మంజులా రాఘవేందర్ గౌడ్ ఈ చిత్రాన్ని నిర్మించారు.
ఈ చిత్రానికి పి.ఆర్ సంగీత దర్శకుడు. చిత్రీకరణ పూర్తి చేసుకుని ఈ సినిమా ఏప్రిల్ 12న ప్రేక్షకుల ముందు రాబోతుంది. ఈ చిత్రం నుండి పెంచల్ దాస్ రాసి, పాడిన 'నా నల్లా కలువా పువ్వా' సాంగ్ ఎంఆర్‌టీ మ్యూజిక్ ద్వారా విడుదల చేసారు. కొంతమంది మృగాల చేతిలో అమ్మాయిలు ఎలా బలైపోతున్నారో, వారికోసం కుటుంబం పడుతున్న బాధలు, రోదనలు ఈపాటలో మనసుని కదిలించేలా చూపించారు. సాంగ్ ఆద్యంతం చాలా ఎమోషనల్‌గా సాగింది.
నిర్మాత రాఘవేందర్ గౌడ్ మాట్లాడుతూ, 'దర్శకుడు సతీష్ చెప్పిన కథ నన్ను ఎంతగానో ఆకట్టుకుంది. సినిమా అవుట్ పుట్ చూసాను. చాలా బాగా వచ్చింది' అని తెలిపారు. 'మా నిర్మాత రాఘవేందర్ ఎక్కడా కంప్రమైజ్ కాకుండా ఈ చిత్రాన్ని నిర్మించారు. ప్రేక్షకులు నచ్చే మంచి కమర్షియల్ చిత్రం అవుతుంది' అని దర్శకుడు సతీష్ రాపోలు చెప్పారు.

దెయ్యాన్ని ప్రేమించాలనుకునే కుర్రాడి కథ

ఆశిష్, వైష్ణవి చైతన్య హీరో, హీరోయిన్లుగా శిరీష్ సమర్పణలో దిల్ రాజు ప్రొడక్షన్స్ బ్యానర్ పై హర్షిత్ రెడ్డి, హన్షిత, నాగ మల్లిడి నిర్మిస్తున్న చిత్రం 'లవ్ మీ'. ఇఫ్ యు డేర్' అనేది ఉప శీర్షిక. అరుణ్ భీమవరపు దర్శకుడు. ఇటీవల రిలీజైన ఈ చిత్ర టీజర్‌కు మంచి రెస్పాన్స్ రావటమే కాకుండా సినిమాపై ఉన్న అంచనాలు నెక్స్ట్ రేంజ్‌కు చేరుకున్నాయి.
లవ్ మీ- ఇఫ్ యు డేర్' టీజర్‌ను గమనిస్తే కట్టిపడేసే కథనంతో పాటు వెన్నులో భయాన్ని కలిగించే హర్రర్ ఎలిమెంట్స్ ఉన్నాయనే విషయం స్పష్టమవుతుంది. ఇది ప్రేక్షకులకు మరచిపోలేని సినిమాటిక్ ఎక్స్‌పీరియెన్స్‌నిస్తుందని టీజర్ చూసిన వారందరూ అంటున్నారు.
'బలగం' వంటి సెన్సేషనల్ బ్లాక్ బస్టర్ తర్వాత ఓ కుర్రాడు, దెయ్యాన్ని ప్రేమించాలనుకుంటే ఎలా ఉంటుంది.. ఏమవుతుంది.. ఇలాంటి ఓ డిఫరెంట్ కాన్సెప్ట్‌తో రూపొందుతున్న ఈ సినిమా ఎప్పుడు రిలీజ్ అవుతుందా అనే క్యూరియాసిటీ అందరిలోనూ క్రియేట్ అయ్యింది. ఈ నేపథ్యంలో మేకర్స్ ఈ హర్రర్ థ్రిల్లర్‌ను ప్రపంచ వ్యాప్తంగా ఏప్రిల్ 25న రిలీజ్ చేస్తున్నట్లు తెలిపారు.
ఎం.ఎం.కీరవాణి సంగీతాన్ని అందిస్తుండగా, పి.సి.శ్రీరామ్ సినిమాటోగ్రాఫర్‌గా బాధ్యతల్ని నిర్వర్తిస్తున్నారు.


వైష్ణవి చైతన్య, ఆశిష్

ఆ హత్యలు చేస్తుంది ఎవరు?

నవీన్ చంద్ర లీడ్ రోల్‌లో నటిస్తున్న వెబ్ సిరీస్ 'ఇన్స్‌పెక్టర్ రిషి'. సునైన, కన్నా రవి, శ్రీకృష్ణ దయాల్, మాలినీ జీవరత్నం, కుమార్ వేల్ ఇతర కీలక పాత్రల్లో నటిస్తున్నారు.
హర్రర్ క్రైమ్ కథతో ఈ వెబ్ సిరీస్‌ను డైరెక్టర్ నందిని రూపొందించారు. జె.ఎస్. మేక్ బిలీవ్ ప్రొడక్షన్స్ పై సుఖ్ దేవ్ లాహిరి నిర్మించారు. అమెజాన్ తమిళ్ ఒరిజినల్‌గా 'ఇన్స్‌పెక్టర్ రిషి' ఈ నెల 29వ తేదీ నుంచి స్ట్రీమింగ్‌కు రాబోతోంది.
కాజల్ అగర్వాల్, నవీన్ చంద్ర 'సత్యాభామ' సినిమాలో పెయిర్‌గా నటిస్తున్నారు. ఈ సినిమా సెట్‌లో ఈ వెబ్ సిరీస్ ట్రైలర్‌ను చూసి ఇంప్రెస్ అయిన కాజల్ అగర్వాల్ ట్రైలర్‌ను సోషల్ మీడియాలో షేర్ చేశారు. తీన్ కాడు అనే ప్రాంతంలోని అడవిలో వరుస హత్యలు జరుగుతుంటాయి. జంతువుల కళేబరాలకు పట్టినట్లే మనుషుల శవాలకు పురుగుల గూడు అల్లుకుని ఉంటుంది. అడవిలో తిరిగే రాట్చి అనే దెయ్యమే ఈ హత్యలు చేస్తోందని ఊరి జనం చెబుతుంటారు. సీబీ సీఐడీకి కేసు ఇన్వెస్టిగేషన్ చేరుతుంది. ఈ హత్యలకు కారణాలు తెలుసుకునేందుకు ఆ ఊరికి వస్తాడు కొత్త ఇన్స్‌పెక్టర్ రిషి. ఊరి జనం మాటలు నమ్మని రిషి సైంటిఫిక్‌గా ఇన్వెస్టిగేషన్ చేస్తుంటాడు. ఈ క్రమంలో రిషి, అతని టీమ్ షాక్ అయ్యే విషయాలు తెలుస్తుంటాయి. తీన్ కాడు ప్రాంత వరుస హత్యలకు దెయ్యమే కారణమైతే అందుకు పరిష్కారాన్ని ఇన్స్‌పెక్టర్ రిషి ఎలా కనుక్కున్నాడు అనే అంశాలతో ట్రైలర్ ఆసక్తికరంగా సాగింది.


నవీన్ చంద్ర, కాజల్ అగర్వాల్

Printed and Published by Nandayala Narsimha Reddy On behalf Of Navatelangna Printers Private Limited, Printed At M.H Bhavan, 1st Floor, Plot No. 21/1, Azamabad Near Rtc Kalyana Mandapam, Baghlingampally, Hyderabad-500020,Telangana State,
Published at Navatelangana Printers Private Limited, M.H Bhavan,1st Floor No.21/1, Azamabad, Near Rtc Kalyana Mandapam, Baghlingampally, Hyderabad-500020, Telangana State, Editor : R.Sudha Bhaskar TELTEL/2014/59462.